మొదటి యూనిట్

# 1. శ్రీలు పొంగిన జీవగడ్డ

– రాయప్రోలు సుబ్బారావు

**ఆలోచించండి – మాట్లాడండి :**



ఏ దేశమేగినా ఎందు కాలిడినా
ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా
పొగడరా నీ తల్లిభూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవము

**ప్రశ్నలు :**

1. పై మాటలు దేనిగురించి చెప్తున్నాయి?
2. దేశంపట్ల ఎటువంటి భావనతో ఉండాలి?
3. జాతిగౌరవం నిలపడం అంటే మీరు ఏమనుకుంటున్నారు?
4. ఈ గేయాన్ని ఎవరు రచించారు?

© SCERT not to be republished


**నేపథ్యం :**

ప్రాచీన కాలంనుంచి భారతదేశం అనేక సంస్కృతి సంప్రదాయాలకు నిలయం. సిరిసంపదలకు, పాడిపంటలకు ప్రసిద్ధి పొందింది. ఎందరో మహనీయులకు ఇది పుట్టినిల్లు. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన సమైక్య దేశం మన భారతదేశం. మన దేశగౌరవాన్ని దశదిశలా చాటడం మన కర్తవ్యం. మన దేశ పౌరుషాన్ని నిలబెట్టడం మన బాధ్యత. ఈ భావాలను ప్రజలలో ఎలా ప్రేరేపించిందో ఈ గేయం చదివి తెలుసుకుందాం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు–అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



శ్రీలు పొంగిన జీవగడ్డయి
పాలు పారిన భాగ్యసీమయి
వరలినది యీ భరతఖండము
భక్తి పాడర తమ్ముడా!

వేదశాఖలు వెలిసె నిచ్చట
ఆదికావ్యం బలరె నిచ్చట
బాదరాయణ పరమ ఋషులకు
పాదు సుమ్మిది చెల్లెలా!

విపిన బంధుర వృక్షవాటిక
ఉపనిషన్మధు వొలికె నిచ్చట
విపుల తత్త్వము విస్తరించిన
విమల తల మిదె తమ్ముడా!



సూత్రయుగముల శుద్ధవాసన
క్షాత్రయుగముల శౌర్యచండిమ
చిత్రదాస్యముచే చరిత్రల
చెఱిగిపోయెను చెల్లెలా!



మేలికిన్నెర మేళవించే
రాలు కరగగ రాగమెత్తీ
పాలతీయని భావిభారత
పదము పాడర తమ్ముడా!



SCERT
to be republished

నవరసమ్ములు నాట్యమాడగ
చివురు పలుకులు చెవుల విందుగ
కవితలల్లిన క్రాంతహృదయుల
గారవింపవె చెల్లెలా!



దేశగర్వము దీప్తిచెందగ
దేశచరితము తేజరిల్లగ
దేశమరసిన ధీరపురుషుల
తెలిసి పాడర తమ్ముడా!

పాండవేయుల పదును కత్తులు
మండి మెఱసిన మహిత రణకథ
కండగల చిక్కని తెలుంగుల
కలసి పాడవె చెల్లెలా!



లోకమంతకు కాకపెట్టిన
కాకతీయుల కదన పాండితి
చీకిపోవని చేవపదముల
చేర్చి పాడర తమ్ముడా!

తుంగభద్రాభంగములతో
పొంగి నింగిని పొడిచి త్రుళ్ళి
భంగపడని తెలుగునాథుల
పాట పాడవె చెల్లెలా!



**భావం :**

కవి మనదేశపు గౌరవాన్ని, గొప్పతనాన్ని చాటిచెప్పేవిధంగా, ప్రతివారూ పాడుకొనేందుకు వీలుగా ఈ కింది విషయాలను చెప్పారు. ఆయన భారతదేశ ప్రజలను తమ్ముడా! చెల్లెలా! అని సంబోధించారు.

1. మన భారతదేశం సిరులు పొంగిన, జీవమున్న భూమి. ఇది పాడిపంటలుగల భాగ్యదేశం. అలాంటి ఈ భారతదేశాన్ని గూర్చి భక్తితో పాడాలి.
2. వేదాలు, వేదాంగాలు ఈ దేశంలో వెలిశాయి. ఆదికావ్యమైన రామాయణం ఇక్కడే పుట్టింది. మహాభారత, భాగవతాలను రచించిన వేదవ్యాసుడు మొదలైన ఎందరో మునులనుగన్న పుణ్యభూమి ఇది.
3. ఈ దేశంలో దట్టమైన చెట్లతో కూడిన విస్తారమైన అరణ్యాలున్నాయి. మధురమైన భావసారంగల ఉపనిషత్తులు ఇక్కడే పుట్టాయి. వివరాలతో కూడిన తత్త్వబోధన విస్తరించిన పవిత్రమైన భూమి ఇది.
4. సూత్రాలను చెప్పిన కాలంనాటి గొప్పతనం, ప్రచండ పరాక్రమమున్న రాజుల కాలంనాటి, పరాక్రమ చరిత్రలన్నీ పరదేశీయుల కింద బానిసతనం వల్ల అంతరించిపోయాయి.
5. కిన్నెర వాద్యాన్ని మీటుతూ, రాళ్ళను కూడా కరగించగల రాగంతో, బిగ్గరగా, భావి భారతదేశ భాగ్యాన్ని గురించి పాడుకోవాలి.
6. నవరసాలతో నిండిన, తేటతెలుగు మాటలతో చెవులకింపుగా కవిత్వాన్ని చెప్పిన ప్రగతిశీల కవులను గౌరవించాలి.
7. దేశగౌరవం ప్రకాశించేటట్లుగా, దేశచరిత్ర విస్తరించేటట్లుగా, దేశాన్ని కాపాడిన వీరపురుషులను గురించి తెలుసుకొని కీర్తించాలి.
8. పాండవుల కత్తుల పదునుతో తళతళలాడిన కురుక్షేత్ర యుద్ధాన్ని గురించి చక్కని తెలుగుపదాలతో అందరూ కలసి పాడుకోవాలి.
9. ప్రపంచాన్నే వేడెక్కించిన కాకతీయరాజుల యుద్ధనైపుణ్యాన్ని కలకాలం నిలిచే మాటలతో మెచ్చుకోవాలి.
10. తుంగభద్రానది అలలతో పాటుగా పొంగి ఆకాశాన్నంటినా చెక్కుచెదరని ధైర్యంగల తెలుగు రాజుల చరిత్రలను గానంచేయాలి.

**కవి పరిచయం**



| | | |
|---|---|---|
| కవి | : | **రాయప్రోలు సుబ్బారావు** |
| జననం, మరణం | : | మార్చి 13, 1892 – జూన్ 30, 1984 |
| జన్మస్థలం | : | గార్లపాడు, బాపట్ల తాలూకా, గుంటూరు జిల్లా. |
| రచనలు | : | తృణకంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్నకుమార మొదలయినవి భావకవిత్వంలో ప్రసిద్ధి పొందిన కావ్యాలు. ఆంధ్రావని, జడకుచ్చులు, వనమాల, ప్రసిద్ధమైన ఖండకావ్యాలు. రమ్యాలోకం, మాధురీదర్శనం పద్యరూపంలోని లక్షణగ్రంథాలు. |

© SCERT not to be republished



# ఇవి చేయండి




## I. వినడం-మాట్లాడడం



1. ఈ గేయం దేన్ని గురించి చెప్తోంది?
2. ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడండి.
3. భారతదేశాన్ని పుణ్యభూమి అని ఎందుకన్నారు?
4. దేశగౌరవం ప్రకాశింపజేసిన మీకు తెలిసిన భారతీయ వీరుల గురించి చెప్పండి.
5. గేయం విన్నారు కదా! దీనిలో దేశభక్తికి సంబంధించిన విషయాలు ఏమేమి ఉన్నాయి?

## II. చదవడం - రాయడం



1. **ఈ గేయంలో మన భారతదేశం అని తెలిపే పదాలను గుర్తించండి.**
2. **ఈ కింది మాటలక్రమాన్ని సరిచేస్తే గేయంలోని పాదాలుగా అవుతాయి. సరిచేసి రాయండి. భావం చెప్పండి.**

దీప్తి దేశ చెందగ గర్వము  
చరితము దేశ తేజరిల్లగా  
ధీర దేశ పురుషుల మరసిన  
తమ్ముడా! పాడర తెలిసి.

3. **ఈ కింది భావం వచ్చే వాక్యాలు గేయంలో ఎక్కడ ఉన్నాయో చూసి రాయండి.**

అ. మన దేశం వేదాలకు పుట్టినిల్లు.

____________________________

ఆ. కాకతీయుల యుద్ధ నైపుణ్యం

____________________________




ఇ. లేత మాటలు చెవుల కింపుగ.

____________________________

ఈ. ఉపనిషత్తులు ఇక్కడే పుట్టాయి.

____________________________

4. **ఈ కింది ప్రశ్నలకు గేయం ఆధారంగా జవాబులు రాయండి.**



అ. పాఠానికి తగిన శీర్షికను నిర్ణయించండి.

ఆ. మన దేశం పవిత్ర భూమి ఎందుకయింది?

ఇ. భావి భారతపదాన్ని ఏ విధంగా పాడాలి?

ఈ. మనదేశం దేనికి నిలయం?

ఉ. మన దేశాన్ని పుణ్యభూమి అని ఎందుకు అంటారు?

ఊ. గేయంలో వేటిని గురించి పాడాలని అన్నారు?

© SCERT not to be republished

## III. స్వీయరచన



**1. ఈ కింది ప్రశ్నలకు 5 పంక్తులలో సమాధానాలు రాయండి.**

అ. మీకు తెలిసిన కొందరు ప్రాచీన, ఆధునిక తెలుగు కవులను గురించి తెలపండి.

ఆ. భారతదేశాన్ని కాపాడిన కొందరు వీరపురుషులను గురించి తెలపండి.

ఇ. ఎవరైనా యుద్ధాలు ఎందుకు చేస్తారు? యుద్ధాలవల్ల లాభమా? నష్టమా?ఎందువల్ల?

ఈ. "బానిసతనం" అంటే ఏమిటి?

ఉ. "భరత ఖండం" భాగ్యసీమ అనటానికి గల కారణాలు తెలపండి.

ఊ. మనదేశపు గొప్పతనం ఏమిటి?


**2. ఈ కింది ప్రశ్నలకు 10 పంక్తులలో సమాధానం రాయండి.**

అ. గేయభావాన్ని మీ సొంతమాటలలో రాయండి.

ఆ. భారతదేశం గొప్పతనాన్ని ఎందుకు తెలుసుకోవాలి?

ఇ. "రాయప్రోలు సుబ్బారావు" గారి ఈ గేయం ఎలా ఉంది! ఈ గేయం ఆధారంగా కవిని గురించి, ఈ గేయాన్ని గురించి మీ అభిప్రాయాలు తెలపండి.

## IV. పదజాలం



**1. ఈ కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సమానార్థాన్నిచ్చే పదాలను గేయంనుంచి తీసి రాయండి.**

అ. అధిక సంపదలు కలిగినవారికంటే గుణవంతులే గొప్ప.

ఆ. మనదేశం చాలా సంవత్సరాలు బ్రిటిష్‌వారి కింద బానిసతనంలో మగ్గిపోయింది.

ఇ. మంచివారిని, గొప్పవారిని గౌరవించాలి.

ఈ. వేసవికాలం ఎండ వేడిగా ఉంటుంది.

ఉ. వ్యాసుడు సంస్కృతంలో భారత, భాగవతాలు రాశాడు.

**2. ఈ కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు వికృతి పదాలు రాయండి.**

కోయిల మామిడి చిగుళ్ళను తింటుంది. కోయిల కూతలతో పరవశించి కవులు కవితలల్లుతారు. మంచి కవితలు వింటే హృదయం ఉప్పొంగిపోతుంది. ఎందరో గొప్పకవులు ఉండటం మన దేశ భాగ్యం.

**3. ఈ కింది వాక్యాలలో ఒకే అర్థాన్నిచ్చే పదాలు ఉన్నాయి. వాటిని గుర్తించండి, రాయండి.**

అ. విపినాలలో క్రూర జంతువులుంటాయి. అరణ్యాలలో మునులు నివసిస్తారు.

ఆ. ఈ ధరణిలో ఎందరో వీరులు జన్మించారు. ఈ గడ్డమీద పుట్టిన ప్రతివారూ పౌరుషవంతులే.

ఇ. గొప్పవారి సేవలు కలకాలం చిరస్థాయిగా ఉంటాయి. అందుకోసం వారిని ఎల్లప్పుడూ గుర్తించాలి.

ఈ. విశాలమైన మన దేశంలో విస్తారమైన అడవులున్నాయి.

© SCERT not to be republished

4. **ఈ కింది వాక్యాలను వ్యతిరేకార్థమిచ్చే వాక్యాలుగా మార్చి రాయండి.**

అ. కమల పుస్తకం చదువుతూంది.

ఆ. వర్షం జోరుగా కురుస్తూంది.

ఇ. ఈ నది చాలా వేగంగా ప్రవహిస్తూంది.

ఈ. ఆ చెట్టు కొమ్మలు చాలా పెద్దవి.

ఉ. లీల సంగీతం వింటూంది.

5. **కింది వాక్యాలు చదవండి. గీత గీసిన పదాల అర్థాలు రాయండి. వాటితో సొంత వాక్యాలు రాయండి.**

అ. పౌర్ణమి రోజున సముద్రంలో భంగాలు ఎత్తుగా లేస్తాయి. (          )

ఆ. సైనికులకు చేవ ఉండాలి. (          )

ఇ. ఋషులు, మునులు విపినాలలో తపస్సు చేస్తూంటారు. (          )


ఈ. మనందరం భూతలంమీద నివసిస్తున్నాము. (          )

ఉ. ఉగాది పచ్చడి ఆరు రుచుల మేళవింపు. (          )

ఊ. తేనెటీగలు మధువును ఇస్తాయి. (          )

ఎ. నేటి బాలలే భావి భారతపౌరులు. (          )


## V. సృజనాత్మకత



అ. ఈ గేయాన్ని భారతమాత ఆత్మకథగా రాయండి.

ఆ. గేయాన్ని అభినయిస్తూ పాడండి. (బృందగానం)

ఇ. మన దేశంలాగే మనం పుట్టిన ఊరు కన్నతల్లి వంటిది. మీ ఊరిని గురించి పొగుడుతూ ఒక గేయం రాయండి.



## VI. ప్రశంస



అ. ఇతర భాషలలోని దేశభక్తి గేయాలను నేర్చుకొని పాడండి.

ఆ. భారతదేశపు ఔన్నత్యాన్ని తెలుసుకోండి.

ఇ. దేశగౌరవం నిలబెట్టటానికి ఏమేమి చెయ్యాలో తెలుసుకోండి.

## VII. ప్రాజెక్టు పని



అ. భారతమాతను స్తుతించే గేయాలను సేకరించండి.

ఆ. ఈ కవి రాసిన ఇతర గేయాలను నేర్చుకోండి.

ఇ. ప్రముఖులైన దేశభక్తుల చిత్రాలను సేకరించండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



**అ. కింది పదాలు కలిపి రాయండి.**

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | విశ్వద | + అభిరామ | = | (అ + అ = ఆ) | = | విశ్వదాభిరామ |
| 1. | సోమన | + అద్రి | = | .................. | = | ................. |
| 2. | రవి | + ఇంద్రుడు | = | .................. | = | ................. |
| 3. | భాను | + ఉదయం | = | .................. | = | ................. |
| 4. | మాతృ | + ఋణం | = | .................. | = | ................. |

© SCERT not to be republished

పైవాటిలో మొదటిపదానికి చివర, రెండో పదానికి మొదట ఒకే రకమైన అచ్చు వస్తున్నది కదా! వీటినే సవర్ణాలు అంటారు. ఇలా వచ్చిన ప్రతిసారీ సంధిలో దీర్ఘం వస్తున్నది. దీన్నే **సవర్ణదీర్ఘసంధి** అంటారని 6వ తరగతిలో మీరు తెలుసుకొన్నారు.

**(ఆ) కింది పదాలనూ కలిపి రాయండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | సు | + | ఆగతం | = | (ఉ + ఆ = వా) | = | స్వాగతం |
| 1. | అతి | + | ఆశ | = | ( + ) | = | ............ |
| 2. | అణు | + | అస్త్రం | = | ( + ) | = | ............ |
| 3. | పితృ | + | ఆర్జితం | = | ( + ) | = | ............ |

పై పదాల్లో మొదటి వరసలో ఉన్నవాటికి చివర (పూర్వస్వరాలుగా) ఇ, ఉ, ఋలు ఉన్నాయి. పరస్వరం స్థానంలో వేరే అచ్చులు అంటే అసవర్ణాచ్చులు కలిశాయి. అలా కలిసినప్పుడు ఇ – 'య' గా; ఉ – 'వ' గా; ఋ – 'ర' గా మారడం గమనించారు కదా! దీన్నే **యణాదేశసంధి** అంటారని కిందటి తరగతిలో మీరు తెలుసుకున్నారు.

**(ఇ)** ఇప్పుడు కింది జాబితాలోని పదాలను విడదీసి పూర్వ పర స్వరాలను గుర్తించి, ఏవి సవర్ణదీర్ఘ సంధులో, ఏవి యణాదేశ సంధులో నిర్ణయించండి. సంధులు ఏర్పడ్డ తీరును చర్చించండి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | గుర్వాజ్ఞ | = | గురు | + | ఆజ్ఞ | (ఉ + ఆ = వా) | = | యణాదేశసంధి |
| 1. | అష్టావధానం | = | ........ | + | ........ | .................. | = | ............ |
| 2. | మహేంద్రుడు | = | ........ | + | ........ | .................. | = | ............ |
| 3. | అత్యంత | = | ........ | + | ........ | .................. | = | ............ |
| 4. | మాత్రంశ | = | ........ | + | ........ | .................. | = | ............ |
| 5. | గురూపదేశం | = | ........ | + | ........ | .................. | = | ............ |
| 6. | అణ్వాయుధం | = | ........ | + | ........ | .................. | = | ............ |
| 7. | పిత్రూణము | = | ........ | + | ........ | .................. | = | ............ |



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | ఈ గేయాన్ని రాగయుక్తంగా పాడగలను. | ఔను / కాదు |
| 2. | గేయంలో చెప్పిన విషయాలను నేను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | గేయ సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | గేయంలోని పదాలను సొంతవాక్యాలలో ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 5. | గేయాన్ని భారతమాత ఆత్మకథగా రాయగలను. | ఔను / కాదు |
| 6. | గేయాన్ని అభినయిస్తూ పాడగలను. | ఔను / కాదు |

ప్రపంచానికి మార్గదర్శనం చేయగలిగిన సామర్థ్యం భారతదేశానికి మాత్రమే ఉన్నది – ఆర్నాల్డ్ టాయిన్‌బీ

© SCERT not to be republished

మొదటి యూనిట్

# 2. అతిథి మర్యాద

మూలం: ఆంధ్ర మహాభారతం

కథనం : ఉషశ్రీ

**ఆలోచించండి - మాట్లాడండి :**



**ప్రశ్నలు :**

1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారు? ఏం చేస్తున్నారు?
2. చిత్రంలో ఆసనంపైన కూర్చున్న వ్యక్తికి ఎందుకలా చేస్తున్నారు?
3. సందర్భం ఏమై ఉంటుంది?

**నేపథ్యం:**

అతిథులను ఎలా ఆదరించాలి? మన స్వార్థాన్ని వదిలిపెట్టి వారిని ఎలా గౌరవించాలి అనేది ఈ పాఠం చదివి తెలుసుకుందాం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థం కాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాల పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ధర్మక్షేత్రమైన కురుక్షేత్రంలో అతిరథులూ, మహారథులూ ఎందరో కన్ను మూశారు. పద్దెనిమిది అక్షౌహిణుల సేన ఉన్న కురుపక్షంలో అశ్వత్థామ, కృతవర్మ, కృపాచార్యులు మిగిలారు. ఇటు పాండవులు ఐదుగురూ కృష్ణుడూ, సాత్యకీ మిగిలారు.

ధర్మరాజుకు పట్టాభిషేకం జరిపించారు. అంపశయ్యమీద ఉన్న భీష్మపితామహుడు పాండవులకు సర్వధర్మవిషయాలూ బోధించి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రవేశించగానే యోగమార్గాన దివ్యలోకాలు చేరాడు.

జరిగిన సంగ్రామంలో ఆప్తులూ, ఆత్మీయులూ అందరూ మరణించారనే బాధ ధర్మరాజు మనస్సును వికలంచేస్తూనే ఉంది. ఈ మహాపాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలని భావించాడు. ఆశ్వమేధం చేయమని విద్వాంసులు సలహా ఇచ్చారు.

వారి ఆదేశానుసారం ఆశ్వమేధయాగం ఆరంభించాడు.

దేశదేశాలనుంచి చక్రవర్తులూ, విద్వాంసులూ ఎందరో వచ్చారు, వివిధ నగరాలనుంచి.

జనపదాలనుంచి లక్షలాది ప్రజలు ఆ యాగం తిలకించడానికి వస్తున్నారు.

చూడవచ్చినవారందరికీ వస్త్రదానంతోపాటు నిర్విరామంగా అన్నదానంగూడా జరిపించాడు.

యోగ్యులైనవారికి సువర్ణ, మణి, రత్నదానాలు చేశాడు. అక్కడికి వచ్చినవారిలో సంతృప్తి పడకుండా ఉన్నవాడు ఒక్కడూ లేడు.

అలా సర్వజనసంతృప్తి కలిగించిన ఆశ్వమేధయాగాన్ని చూసిన దేవతలు పూలవాన కురిపించి, ధర్మరాజును అభినందించారు.

అలా ఆనందించే సమయంలో ఆ యాగశాల సమీపానికి ఒక ముంగిస వచ్చింది.


వారందరూ, ఈ శాలలోకి ముంగిస ఎలా వచ్చిందా–అని ఆశ్చర్యంతో చూస్తున్నారు.

అప్పుడా ముంగిస నవ్వుతూ :

"దేవతలు కూడా అభినందించే యాగమా ఇది?" అని అడిగింది.

తెల్లబోయారు అందరూ.

దాని శరీరంలో ఒక భాగం బంగారు కాంతులీనుతూంది. రెండో భాగం మామూలు చర్మంతో ఉంది.



"సక్తుప్రస్థుడి ధర్మబుద్ధితో పోలిస్తే ఈ యాగశాలలో జరిగిన దానం ఏ మాత్రం?" అంది.

అందరూ తెల్లబోయారు, దాన్ని చూస్తూ.

"ఎవరా మహనీయుడు! ఏమిటాయన కథ?" అన్నారు.

అలా వారు ఆతురతతో అడగ్గా

"సావధానంగా వినండి", అని ఇలా చెప్పింది ముంగిస.

"ఈ ధర్మభూమి అయిన కురుక్షేత్రంలో చాలా కాలం క్రితం సక్తుప్రస్థుడనే పేరుగల గృహయజమానుడు ఉండేవాడు.

ఆయనకు ఒకే కుమారుడుండేవాడు. ఆ అబ్బాయికి కూడా వివాహం అయింది. వాళ్ళు నలుగురూ సర్వభూతకోటిని దయతో చూస్తూ, కామక్రోధాలను విడిచి తపస్సు చేసుకుంటున్నారు.

కొడుకూ కోడలూ ఆ వృద్ధులను సేవిస్తూ ఉండేవారు. ఎవ్వరికీ హానిచేయకుండా ఏ పూటకు ఆ పూట దొరికినదాన్ని తిని తృప్తిగా జీవితం గడుపుతున్నారు.

పరబ్రహ్మమీదనే మనస్సు నిలిపి జీవితం సాగించడానికే ఆహారం తీసుకొనేవారు. ఆ జీవితం కూడా పరమేశ్వరధ్యానానికే అర్పించేవారు.

అలా ఉండగా ఒకనాడు :

వారు తమ పరిసర ప్రాంతాలలోని చేలలో తిరిగి, అక్కడ రాలిన ధాన్యపు గింజలు ఏరి తెచ్చుకొని, దంచి, పిండి చేసి, వండుకొని నలుగురూ సమంగా పంచుకొన్నారు. తినడానికి సిద్ధమవుతున్నారు. అటువంటి సమయంలో, ఒక వృద్ధుడు వచ్చాడు. ఆయన కళ్ళు లోతుకు పోయాయి. ఎముకలు బయటపడు తున్నాయి. డొక్కలు మాడి ఉన్నాయి.



"ఆకలి, ఆకలి", అని నీరసంగా అడిగాడు.

ఆయనను ఆదరంగా తీసుకుని వచ్చి, తన పక్క కూర్చోపెట్టుకొని

"అయ్యా! తమరు కుశలమే కదా! మా ఆతిథ్యం స్వీకరించి, అనుగ్రహించండి. ఏ ప్రాణికీ హాని కలగకుండా, ఏ పాపానికీ ఒడిగట్టకుండా మేం తెచ్చుకున్న ధాన్యపు గింజల పిండితో వండిన ఆహారం ఇది. దీనితో మీ ఆకలిబాధ నివారించుకోండి!" అని గృహయజమానుడు తన భాగం ఆయనకు వడ్డించాడు.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి ఉచిత పంపిణీ

అది ఆరగించి తనకింకా ఆకలిగా ఉంది అన్నాడు, అతిథి.

ఆ మాట వింటూనే ఆయన భార్యకూడా తన భాగం ఇచ్చింది.

ఇంకా ఆ వృద్ధుడి ఆకలిబాధ తీరలేదని తెలిసి కొడుకూ కోడలూ కూడా వాళ్ళ ఆహారం ఆయనకు పెట్టారు.

అంతా ఆరగించి, ఆయన ఆనందంతో –

"నాయనా! మీ అతిథి సత్కారం, అన్నదానం నాకు తృప్తి కలిగించాయి. నీతోపాటు నీ కుటుంబంలోని మీవాళ్ళంతా ఎంతో ఆకలితో బాధపడుతూ కూడా మీరు తినబోయే ఆహారాన్ని దానంచేసి, పుణ్యం సాధించారు. మీ దానబుద్ధిని సర్వలోకాలూ మెచ్చుకుంటాయి.

ప్రపంచంలో ఆకలితో ఉన్న మనిషి ఎటువంటి పాపానికైనా ఒడిగడతాడు. అన్నంకోసం ఎన్నో దారుణాలు చేస్తాడు మానవుడు.

అటువంటి దశలో మీ దానబుద్ధి ఎంత గొప్పదో దేవతలు కూడా గ్రహించారు. దయగల గుండె గలవారే ఆశకు దూరమవుతారు. ఈ రెండూ ఉన్న మీకు దివ్యలోకాలు లభిస్తాయి.

ఆకలితో అలమటించే ప్రాణికి ఇంత అన్నం పెట్టడంకంటే ఏ దానమూ గొప్పది కాదు. అటువంటి అన్నదానం చేసిన పుణ్యాత్ములు మీరు," అంటూండగా దేవవిమానం వచ్చింది. వారందరూ ఆ విమానం ఎక్కి వెళ్లారు.

ఇదంతా వింటూ చూసిన నేను వాళ్ళు వెళ్ళిన అనంతరం ఆ ప్రాంతంలో ఆ అతిథి పాదాలు కడిగిన చోట తిరిగాను. అప్పుడు ఆ పాదాలు కడిగిన నీటి తడి తగిలిన నా దేహంలో, ఈ భాగం బంగారుమయ మయింది. దానం అంటే అదే.

అనంతరం ఎన్నెన్నో దాన ధర్మాలు సాగే ప్రదేశాలు తిరిగినా ఈ రెండోవైపు దేహం ఇలానే ఉండిపోయింది. ఇక్కడ కూడా అంతే," అంటూ నవ్వుతూ వెళ్ళిపోయింది ముంగిస.

© SCERT not to be republished

**రచయిత పరిచయం**



| | | |
|---|---|---|
| రచయిత | : | ఉషశ్రీ (పురాణపండ సూర్యప్రకాశ దీక్షితులు) |
| జననం – మరణం | : | మార్చి 16-1928 – సెప్టెంబర్ 07-1990 |
| జన్మస్థలం | : | ఆలమూరు, తూర్పు గోదావరి జిల్లా. |
| రచనలు | : | రామాయణ, భారత, భాగవతాలను వచనంలో రాశారు. ప్రవచనాలు చేశారు. |



## ఇవి చేయండి




### I. వినడం-మాట్లాడడం



1. మీ ఇంటికి వచ్చిన అతిథులకు మీరు ఎలా మర్యాద చేస్తారు?
2. ఈ కథలో ఆశ్చర్యం కలిగించిన సంఘటన ఏది? దాన్ని గురించి చెప్పండి.
3. కథలో మీకు నచ్చిన పాత్ర ఏది? ఎందుకు?
4. కథను సొంతమాటల్లో చెప్పండి.

### II. చదవడం - రాయడం



**1. పాఠం చదవండి. కింది సూచనలకు అనుగుణంగా వాక్యాలను పాఠంలో వెతకండి. వాటి కింద గీత గీయండి.**

అ. మహాభారత యుద్ధానికి సంబంధించిన వాక్యాలు.

ఆ. అశ్వమేధయాగానికి సంబంధించిన వాక్యాలు.

ఇ. అతిథి సత్కారాన్ని గురించి తెలిపే వాక్యాలు.

ఈ. దానం గొప్పదనాన్ని గురించి తెలిపే వాక్యాలు.

ఉ. ముంగిస మాట్లాడిన మాటలు

**2. కింది పేరా చదవండి. ప్రశ్నలకు జవాబులు రాయండి.**

"మహారాజా! నీ రాజ్యంలో ఎక్కడా ఆకలిదప్పికలు లేకుండా చూడు. సత్రాలు, చావడులు కట్టించు. చెరువులు తవ్వించు. అడిగినవాళ్ళకు లేదనకుండా అన్నం పెట్టు. ఏ దానమైనా అన్నదానంతో సరికాదని గుర్తించు. ఎవరి శక్తికి తగినట్టుగా వాళ్ళు అన్నదానం చేసేలా నీ ప్రజల్ని ప్రోత్సహించు. ఆకలిగొన్నవారికి కడుపారా అన్నం పెట్టి, వాళ్ళు తృప్తిగా తింటూంటే అది చూసి మురిసిపోవడం గొప్ప అదృష్టం, గొప్ప అనుభవం. రాజుల సొమ్ము బీదసాదలకు, బడుగుజీవులకు, అన్నార్తులకు, అనాథలకు, అవిటివారికి ఆదరువు కావాలి, అక్కరకు రావాలి. అదే ముక్తికి మార్గం," అని వశిష్ఠుడు శ్వేతరాజుకు చెప్పాడు.

అ. పేరాలోని మాటలు ఎవరు ఎవరితో అన్నారు?

ఆ. రాజులు చేయాల్సిన పని ఏమిటి?

ఇ. పై పేరాలో 'ఆదరువు' అనే పదానికి అర్థం ఏమిటి?

ఈ. వశిష్ఠుడు ముక్తికి మార్గం ఏదని చెప్పాడు?

ఉ. రాజు తన ప్రజలను ఏ విషయంలో ప్రోత్సహించాలి?

ఊ. పై పేరాకు తగిన శీర్షికను సూచించండి.

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. ధర్మరాజు మనసు ఎందుకు వికలమైంది?

ఆ. ధర్మరాజు చేసిన పాపం ఏమిటి? ప్రాయశ్చిత్తంగా ఏమి చేశాడు?

ఇ. ధర్మరాజును దేవతలు ఎందుకు అభినందించారు?

©SCERT not to be republished

ఈ. ధర్మరాజు చేసిన దానధర్మాలను చూసి ముంగిస ఏమన్నది?

ఉ. సక్తుప్రస్థుడు ఏ విధంగా జీవితం గడిపేవాడు?

ఊ. ఆకలితో ఉన్న ముసలివాణ్ణి సక్తుప్రస్థుడు ఎలా తృప్తిపరిచాడు?

ఎ. కడుపు నిండిన ముసలివాడు సక్తుప్రస్థుడితో ఏమన్నాడు?

ఏ. ముంగిస దేహం పూర్తిగా బంగారుమయం అయిందా, కాలేదా? ఎందువల్ల?

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు ఒక పేరాలో లేదా 4, 5 వాక్యాలలో ఆలోచించి సమాధానాలు రాయండి.**

అ. అతిథులు అంటే ఎవరు? అతిథి మర్యాద అంటే ఏమిటి?

ఆ. ఆతిథ్యం అంటే తిండి పెట్టడమేనా? ఇంకేమైనా చేస్తారా? ఆలోచించి రాయండి.

ఇ. సక్తుప్రస్థుడు తన అతిథికి ఎలా మర్యాద చేశాడు?

ఈ. 'దయగల గుండె గలవారే ఆశకు దూరమౌతారు' దీనిమీద అభిప్రాయం ఏమిటి? వివరించండి.

ఉ. ముంగిస దేహం పూర్తిగా బంగారంగా మారాలంటే ఏం జరగాలి?

ఊ. సక్తుప్రస్థుడు సర్వభూతకోటిని దయతో చూసేవాడు కదా ! అంటే ఏమిటో వివరించండి.

ఎ. ఈ కథకు ఇంకే పేరు పెట్టవచ్చు? ఎందుకు? కారణాలు రాయండి.


**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు : – కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. ధర్మరాజు, సక్తుప్రస్థుడు ఇద్దరూ దానాలు చేశారు కదా! వీరిద్దరిలో ఎవరిది గొప్ప దానం? ఎందుకు?

ఆ. ఈ కథను సొంతమాటల్లో రాయండి.

ఇ. ఈ కథ ఆధారంగా మానవులందరూ అలవరచుకోవలసిన మంచి గుణాలు ఏమిటి?

## IV. పదజాలం



**1. కింది ఆధారాలకు తగిన పదాలు రాయండి.**

ఉదా: ఇతరులకు ఉచితంగా అన్నంపెడితే అది అన్నదానం.

అ. ఉచితంగా చదువుచెబితే.......................................

ఆ. అవసరమున్నవాళ్ళకు దుస్తులుఇస్తే............................

ఇ. అవసరమున్నవాళ్ళకు ప్రతిఫలం ఆశించకుండా డబ్బు ఇస్తే.......................

ఈ. అవసరానికి రక్తాన్ని ఇస్తే.....................................

ఉ. శరీర అవయవాలను ఇతరులకు ఇస్తే.........................

ఊ. లేనివాళ్ళకు భూమినిస్తే........................................

ఎ. చూపులేనివాళ్ళకు కళ్ళను ఇస్తే.................................

ఏ. ఇతరుల మేలుకోసం స్వచ్ఛందంగా శ్రమిస్తే............................

© SCERT not to be republished

2. కింది పదాలకు అర్థాలు రాయండి. వాటితో సొంతవాక్యాలు రాయండి.

అ. పుణ్యకాలం = ..................... ఈ. నిర్విరామం = .....................

ఆ. మనసు వికలం = ..................... ఉ. ధర్మబుద్ధి = .....................

ఇ. ప్రాయశ్చిత్తం = ..................... ఊ. ఒడికట్టడం = .....................

4. కింది పదాలకు వ్యతిరేకపదాలను పాఠంలో గుర్తించండి. ఆ పదాలతో వాక్యాలు రాయండి


అ. అసంతృప్తి × .....................................................................

ఆ. విరామం × .....................................................................

ఇ. అధర్మం × .....................................................................

ఈ. అనాదరణ × .....................................................................

## V. సృజనాత్మకత



1. "అతిథిదేవోభవ" అనే శీర్షికతో చిన్న కథ రాయండి.
2. అతిథిమర్యాద కథను సంభాషణల రూపంలో రాయండి.
3. అతిథిమర్యాద కథను నాటకీకరణ చేయండి.

## VI. ప్రశంస



1. ఆకలిగా ఉన్నవాళ్ళకు అన్నంపెట్టడం, అవసరానికి సహాయంచేయడం వంటివి మంచి లక్షణాలు. మీ తరగతిలో ఇలా మంచి లక్షణాలు గలవాళ్ళు ఎవరు ఉన్నారు? వాళ్ళను అభినందించండి.
2. 'అతిథి మర్యాద' లకు సంబంధించిన కథలు ఉర్దూ, హిందీ, ఆంగ్ల భాషల్లో కూడా ఉంటాయి. వాటిని గురించి తెలుసుకొని చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. మర్యాద చేయడం / ఆతిథ్యం ఇవ్వడం ఒక్కో ప్రాంతంలో, ఒక్కో కుటుంబంలో, ఒక్కో రకంగా ఉంటుంది. వీటిని గురించి మీ మిత్రులతో మాట్లాడండి. వివరాలు సేకరించండి. ప్రదర్శించండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



ఈ కింది పదాలు కలిపి రాయండి.

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| ఉదా॥ వెయ్యి | + | అమ్మా | = | (ఇ + అ = అ) | = | వెయ్యమ్మా |
| 1. చిర్రు | + | ఎత్తు | = | .................. | = | .................... |
| 2. అప్పటికి | + | ఏ | = | .................. | = | .................... |
| 3. రాక | + | ఉంటే | = | .................. | = | .................... |

పై పదాల్లో పూర్వస్వరం స్థానంలో వరసగా ఉ, ఇ, అ లు ఉన్నాయి. వాటికి ఎ, ఏ, ఉ అనే అచ్చులు కలిశాయి (పరం అయినాయి). ఏ అచ్చులు కలిశాయో అదే రూపం పూర్వస్వరాలకు వచ్చింది. అంటే పూర్వ స్వరాలు పోయి పరస్వరాలు మిగులుతాయి. తెలుగు సంధుల్లో ఈ మార్పు మనం గమనిస్తాం.

© SCERT not to be republished

ఇక్కడ పూర్వస్వరాన్ని ఆధారంగా చేసుకొని సంధినిర్ణయం చేస్తామని, ఆ ప్రకారంగా పై సంధులు (1) ఉత్వ, (2) ఇత్వ, (3) అత్వ సంధులని మీరు 6వ తరగతిలోనే తెలుసుకున్నారు.

ఇప్పుడు ఈ కింది పదాలను విడదీసి, సంధులను గుర్తించి, సంధి జరిగిన విధాన్ని చర్చించండి.

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| ఉదా॥ | ఏమిటాకథ | = | ఏమిటి | + | ఆ కథ | = | ఇ + ఆ = ఆ | = | ఇత్వ |
| 1. | జీవగడ్డయి | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 2. | భాగ్యసీమయి | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 3. | చేసుకోవాలని | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 4. | సెలవిచ్చి | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 5. | రానిదని | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 6. | ఎవరికెంత | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 7. | వచ్చితిరిపుడు | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 8. | కావ్యంబలరె | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 9. | మధువొలికె | = | ........ | + | ........ | = | ................ | = | .............. |
| 10. | కవితలల్లిన | = | ........ | + | ........ | = | ................ | = | .............. |

ఇటువంటి మరో పది పదాలు మొదటి రెండు పాఠాలనుండి తీసుకొని, లక్షణాలను చర్చించండి.

## మీకు తెలుసా !!



***అక్షౌహిణి అంటే ?***

21,870 రథాలు, 21,870 ఏనుగులు, 65,160 గుర్రాలు, 1,09,350 సైనికులు ఉన్న సైన్య విభాగం.

***అశ్వమేధ యాగం అంటే ?***

ఒక రకం యజ్ఞం. పాపం పోవడం కోసం రాజులు దీన్ని చేస్తారు. గుర్రం నుదుటన పట్టం కట్టి దాన్ని వదిలేస్తారు. దీన్ని అడ్డుకుంటే రాజు వచ్చి యుద్ధం చేస్తాడు. లేదా ఆ గుర్రం తిరిగినభూమి అంతా రాజుదే అని అర్థం. ఇలాంటివి వంద చేస్తే ఇంద్రపదవి లభిస్తుందట.



## నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1. | అతిథి మర్యాద కథను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | పాఠ్యాంశాన్ని ధారాళంగా చదవగలను. | ఔను / కాదు |
| | అర్థంచేసుకొని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 4. | పాఠ్యాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 5. | ఇందులోని పదాలను సొంతవాక్యాలలో ప్రయోగించగలను. | ఔను / కాదు |
| 6. | అతిథి మర్యాద పాఠానికి సంభాషణలు రాసి, నాటకీకరణ చేయగలను. | ఔను / కాదు |

అందం కంటిని మాత్రమే ఆకట్టుకుంటుంది. కాని సౌశీల్యం హృదయాన్నే దోచుకుంటుంది - రామకృష్ణ పరమహంస

© SCERT not to be republished

**మొదటి యూనిట్**

# 3. మేలిమి ముత్యాలు



- వివిధ కవులు

**ఆలోచించండి - మాట్లాడండి.**




**ప్రశ్నలు :**


1. చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?
2. చిత్రంలో మాట్లాడుతున్నది ఎవరు? ఆయన ఏం చెప్తున్నారు? దాని భావం ఏమిటి?
3. ఇలాంటి పద్యాలు మీకు తెలిసినవి చెప్పండి. మరికొన్ని పద్యాలను పాఠం చదివి తెలుసుకోండి.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



★ క. కలిమిగల లోభికన్నను
విలసితముగ పేద మేలు వితరణి యైనన్
చలిచెలమ మేలు కాదా
కులనిధి యంభోధికన్న గువ్వలచెన్నా. 1

– గువ్వల చెన్న శతకం

★ క. అవయవహీనుని, సౌంద
ర్యవిహీను, దరిద్రు, విద్యరానియతని, సం
స్తవనీయు, దేవు, శ్రుతులన్
భువి నిందింపఁ దగదంద్రు బుధులు కుమారా। 2

– కుమార శతకం

★ ఆ. పుస్తకముల నీవు పూవువోలెను చూడు
చింపఁబోకు మురికి చేయఁబోకు
పరుల పుస్తకముల నెరువు తెచ్చితి వేని
తిరిగి యిమ్ము వేగ, తెలుఁగు బిడ్డ। 3

– తెలుగుపూలు శతకం

★ తే. సానఁబెట్టిన వజ్రంబు లీను కాంతి
పొలము చక్కగ దున్నిన ఫలమునిచ్చు
నటులె యజ్ఞానియైనను నవనిపైని
విద్య నేర్చినయేని వివేకియగును. 4

– అజ్ఞాత కవి

★ ఆ. పుత్తడిగలవాని పుండుబాధైనను
వసుధలోన చాల వార్తకెక్కు
పేదవాని యింట పెండ్లైన యెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ. 5

–వేమన పద్యం

★ ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్,
భూపసభాంతరాళమునఁ బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశమునం దనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్ 6

– సుభాషిత రత్నావళి

★ ఆ. పత్రికొకటియున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న
వాస్తవమ్ము నార్లవారి మాట 7

– నార్లవారి మాట

© SCERT not to be republished

★ తే. మొదలఁ జూచినఁ గడు గొప్ప పిదపఁ గుఱుచ
యాది గొంచెము తర్వాత నధికమగుచుఁ
దనరు, దినపూర్వ, పరభాగజనితమైన
ఛాయపోలికఁ గుజనసజ్జనుల మైత్రి. 8

– సుభాషిత రత్నావళి

★ తే. సత్యసూక్తి ఘటించు ధీజడిమ మాన్చు
గౌరవమొసంగు జనులకు గలుషమడఁచు
గీర్తిఁ బ్రకటించు చిత్తవిస్ఫూర్తిఁ జేయు
సాధుసంగంబు సకలార్థ సాధకంబు. 9

– సుభాషిత రత్నావళి

★ సీ. తల్లిగర్భమునుండి ధనము తేడెవ్వఁడు,
వెళ్ళిపోయెడినాడు వెంట రాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱుగు బంగారంబు మ్రింగఁ బోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె కాని,
కూడఁ బెట్టిన సొమ్ముఁ గుడువఁ బోడు
పొందుగా మఱుగైన భూమిలోపల పెట్టి
దానధర్మము లేక దాచి దాచి

★ తే. తుదకు దొంగలకిత్తురో? దొరలకవునొ?
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు?
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర! 10

– నరసింహ శతకం



© SCERT not to be republished

**కవి పరిచయాలు**

| కవి | కాలం | రచన |
|---|---|---|
| 1. పట్టాభిరామకవి/ గువ్వల చెన్నడు | 16వ శతాబ్ది | గువ్వల చెన్న శతకం |
| 2. పక్కి అప్పలనర్సయ్య | 16వ శతాబ్ది | కుమార శతకం |
| 3. నార్ల చిరంజీవి | 20వ శతాబ్ది | తెలుగుపూలు శతకం |
| 4. అజ్ఞాత కవి | -- | -- |
| 5. వేమన | 17వ శతాబ్ది | వేమన పద్యాలు |
| 6. నార్ల వెంకటేశ్వరరావు | 20వ శతాబ్ది | నార్లవారి మాటల |
| 7. ఏనుగు లక్ష్మణకవి | 17వ శతాబ్ది | సుభాషిత రత్నావళి |
| 8. శేషప్పకవి | 18వ శతాబ్ది | నరసింహ శతకం |

## పద్యాలకు భావాలు

1. ధనికుడైన పిసినారి కంటే దానగుణమున్న పేదవాడే మేలు. అనంత జలరాశి గల సముద్రుడికంటే మంచినీరున్న గొయ్యి మేలు కదా!

2. కుమారా! భూమిపైన అవయవలోపం ఉన్నవాళ్ళనూ, అందంగా లేనివాళ్ళనూ, పేదవాళ్ళనూ, నిరక్షరాస్యుణ్ణి గొప్పవాళ్ళనూ దైవాన్నీ వేదాలనూ నిందించగూడదని పెద్దలు చెబుతారు.

3. ఓ తెలుగు బిడ్డా! పుస్తకాలను పువ్వుల్లా చూడు. చింపవద్దు. మురికి చేయవద్దు. ఇతరుల పుస్తకాలు అడిగి తెచ్చుకొంటే వాటిని త్వరగా తిరిగి ఇచ్చివేయాలి.

4. సానబెడితేనే వజ్రం కాంతిని వెదజల్లుతుంది. చక్కగా దున్నితేనే పొలం పంటనిస్తుంది. అలాగే భూమిమీద ఎంత అజ్ఞాని అయినా సరే చదువుకుంటేనే వివేకి అవుతాడు.

5. ఓ వేమా! భూమిమీద ధనవంతుడు చిన్న కురుపుతో బాధ పడినాకూడా పెద్దగా ప్రచారమవుతుంది. కాని పేదవాడి ఇంట్లో పెళ్ళి జరిగినా కూడా ఎవరికీ తెలియదు.

6. ఆపదలు వచ్చినప్పుడు ధైర్యం, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పు, సభల్లో వాక్పాటవం, యుద్ధంలో శౌర్యం చూపడం, కీర్తియందు ఆసక్తి, విద్య నేర్చుకోవాలనే కోరిక – ఇవి మహాత్ములకు సహజ గుణాలు.

7. ఒక పత్రిక పదివేల సైన్యంతో సమానం; కోటిమంది మిత్రులతో సమానం. పత్రిక లేకపోతే ప్రజలకు రక్షణ ఉండదు. సమాజంలోని మంచి చెడులను భయంలేకుండా పత్రికలు తెలియజేస్తాయి. అందువల్ల సమాజంలో పత్రికలు ఉండాలి.

8. చెడ్డవాళ్ళస్నేహం, ఉదయంపూట నీడలాగ మొదట ఎక్కువగా ఉండి క్రమక్రమంగా తగ్గిపోతుంది. మంచివాళ్ళతో స్నేహం, సాయంకాలపు నీడ లాగ మొదట చిన్నదిగా ఉండి క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. బుద్ధిమంతుడు ఏది మంచిదో తెలుసుకోవాలి.

9. మంచివాళ్ళతో సహవాసం మందకొడితనాన్ని పోగొడుతుంది. సత్యాన్ని మాట్లాడేలా చేస్తుంది. మంచి గౌరవాన్ని ఇస్తుంది. పాపాలను పోగొడుతుంది. మనస్సును బాగుచేస్తుంది. కీర్తిని వ్యాపింపజేస్తుంది. ఇన్ని మాటలెందుకు? లోకంలో అది చేయలేని మంచిపని అంటూ లేదు.


10. శ్రీ ధర్మపుర నివాసుడా! ఆభరణాలచేత ప్రకాశించేవాడా! పాపాలను దూరంచేసేవాడా! దుర్మార్గులను పారదోలే వాడా! ఓ నరసింహా! తల్లికడుపులో నుంచి పుట్టినప్పుడు ఎవ్వడూ ధనాన్ని వెంట తీసుకొనిరాడు. పోయేటప్పుడు వెంట తీసుకొని వెళ్ళలేడు. లక్షాధికారైనా ఉప్పుతో కూడిన ఆహారాన్నే కాని బంగారాన్ని తినలేడు. డబ్బు సంపాదించి గర్వం పెంచుకోడమే. కానీ తాను కూడబెట్టిన సొమ్మును తినడు. అలాంటిదాన్ని దానం, ధర్మం చేయకుండా భూమిలో పాతిపెడుతూ ఉంటాడు. చివరకు దాన్ని అనుభవించకుండానే, తేనెటీగలు తేనెను బాటసారులకు సమర్పించుకొన్నట్టు దొంగలకో, రాజులకో సమర్పించుకొంటాడు.



# ఇవి చేయండి



## I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలను కంఠస్థం చేయండి. రాగంతో పాడండి. అలాగే భావం అర్థమయేలా చదవండి.
2. మీ తరగతిలో ఇద్దరు జతగా కూర్చోండి. ఒకరు పద్యం చదివితే ఇంకొకరు భావం చెప్పండి.
3. పాఠంలోని ఏ పద్యం మీకు నచ్చింది? ఎందుకు?
4. మీకు తెలిసిన కొన్ని సూక్తులూ, నీతివాక్యాలూ చెప్పండి.
5. ఈ పాఠానికి మేలిమి ముత్యాలు అనే పేరు తగిన విధంగా ఉందా? ఎందువల్ల?

## II. చదవడం - రాయడం





**1. పాఠంలోని పద్యాలలో ఏ ఏ పద్యాలలో ప్రాసపదాలు ఎక్కువగా ఉన్నాయి? ఆ పదాలు ఏవి? పద్యాలలో వాటిని గుర్తించండి.**

**2. పాఠం ఆధారంగా కింది విషయాలకు తగిన పద్యాలను చదవండి. పద్యభావాన్ని సొంతమాటల్లో చెప్పండి.**

అ. "కష్టపడితే ఫలితం ఉంటుంది"

ఆ. ఎవర్నీ చిన్నచూపు చూడగూడదు.

ఇ. మంచివాళ్ళతో సావాసం మేలు చేస్తుంది.

**3. పాఠంలోని పద్యాలు ఆధారంగా కింద తెలిపినవాటిని దేనితో పోల్చారో చెప్పండి.**

అ. ధనికుడైన పిసినారి

ఆ. పేదవాడు

ఇ. చెడ్డవాళ్ళ స్నేహం

ఈ. మంచివాళ్ళ స్నేహం

ఉ. డబ్బు సంపాదించి కూడబెట్టడం

ఊ. కోటిమంది మిత్రులు

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. ఎవరెవరిని చులకనగా చూడగూడదు?

ఆ. పుస్తకాలను మనం ఎలా జాగ్రత్తగా ఉంచుకోవాలి?

ఇ. చదువుకొంటే ఎవరైనా ఎలా మారతారు?

ఈ. ధనవంతులు, పేదవారి ఇండ్లలో ఏమి జరిగినా ఎవరిని గురించి తొందరగా బయటవాళ్ళకు తెలుస్తుంది?

ఉ. మంచివారి సహజ గుణాలేవి?

ఊ. బుద్ధిమంతుడు ఏమి తెలుసుకొని వ్యవహరించాలి?

ఎ. మంచితనానికి ఉండే గొప్పతనం ఏమిటి?

©SCERT not to be republished

**5. పాఠంలోని పద్యాలు ఆధారంగా చేసుకొని తప్పొప్పులు గుర్తించండి.**

అ. ఎవరిదగ్గర నుంచి అయినా పుస్తకాలు తెచ్చుకుంటే వాళ్ళు అడిగిన వెంటనే ఇవ్వాలి. (    )

ఆ. కష్టపడ్డ తరవాత పొందే సుఖం ఎంతో గొప్పగా ఉంటుంది. (    )

ఇ. పత్రికలు లేకుంటే ప్రజలకు రక్షణ లేదు. (    )

ఈ. ధనవంతుడి విషయాలు తొందరగా ప్రచారం కావు. (    )

ఉ. మంచివాళ్ళతో స్నేహం చేస్తే, వాళ్ళ కీర్తి కూడా వ్యాప్తి చెందుతుంది. (    )

ఊ. ఎవరైనా అన్నం తింటారేకాని బంగారం తినరు. (    )

ఎ. సంపాదించిన సొమ్మును అనుభవించకుండా దాచిపెట్టాలి. (    )

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. ధనికుడైన పిసినారిని సముద్రంతో, దానగుణమున్న పేదవాడిని మంచినీటి మడుగుతోనూ పోల్చడాన్ని గురించి మీ అభిప్రాయం తెలపండి.

ఆ. సాధారణంగా గొప్పవాళ్ళనూ, దైవాన్నీ ఎవరూ నిందించరు. అవయవలోపం ఉన్నవాళ్ళనూ, అందంగా లేనివాళ్ళనూ కూడా చులకనగా చూడగూడదని తెలుసుకొన్నారు కదా! కాబట్టి వాళ్ళను కూడా అందరితో సమానంగా చూడటానికి ఏం చేయాలి?

ఇ. ఇతరుల పుస్తకాలను అడిగి తెచ్చుకుంటే వెంటనే తిరిగిఇవ్వాలని తెలుసుకున్నారుకదా! ఇలా ఎందుకు చెయ్యాలి?

ఈ. ఎంతటి అజ్ఞాని అయినా చదువుకొంటే వివేకి అవుతాడని మీరు ఎలా చెప్పగలరు?

ఉ. "సుభాషిత రత్నావళి" పద్యంలో కవి, స్నేహాన్ని నీడతో పోల్చాడు కదా! ఇది సరైనదేనా? దీనిమీద మీ అభిప్రాయం తెలపండి.

ఊ. "ధనవంతులు చేసే చిన్న పనికి కూడా గొప్ప ప్రచారం లభిస్తుంది. అదే పేదవాళ్ళ గొప్పపనికి కూడా ఎలాంటి ప్రచారం ఉండదు." అని వేమన ఎన్నో సంవత్సరాల కిందట అన్నాడు కదా! ఈ పరిస్థితే నేడుకూడా ఉందా? ఇలా ఎందుకు ఉంటుంది?

ఎ. మంచివాళ్ళతో స్నేహం చేయడానికి మీరు ఏం చేస్తారు?

ఏ. కిందివాటిలో ఏది సరైనదని భావిస్తున్నారు? ఎందుకో వివరించండి.

- అ. డబ్బు సంపాదిస్తే పొదుపు చేసి, అనుభవించాలి.
- ఆ. డబ్బు సంపాదిస్తే పొదుపు చేసి దానం చేయాలి.
- ఇ. డబ్బు సంపాదిస్తే దానంచేయాలి, అనుభవించాలి.
- ఈ. దానం చేయడంకోసం, అనుభవించడంకోసం డబ్బు సంపాదించక పోవడం మేలు.

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు:**

అ. పాఠంలోని పద్యాల ద్వారా నువ్వు గ్రహించిన మంచి విషయాలు ఏవి?


ఆ. పుస్తకాలను పువ్వుల్లాగ చూడాలి. జాగ్రత్తగా చూడాలి అని తెలుసుకున్నారు కదా! పుస్తకాల గొప్పతనం ఏమిటి? వాటిని గురించి ఎందుకు జాగ్రత్తతీసుకోవాలి?

ఇ. మంచివాళ్ళతో స్నేహంచేస్తే కలిగే ప్రయోజనాలు ఏమిటి?

ఈ. "పత్రికలు పదివేలసైన్యంతో, కోటిమంది మిత్రులతో సమానం". అని తెలుసుకున్నారు కదా! దీనిపై మీ అభిప్రాయాన్ని వివరించండి.

© SCERT not to be republished

## IV. పదజాలం



**1. కింది పేరాలోని గీత గీసిన పదాలకు అర్థాలు తెలుసుకోండి. అవే అర్థాలనిచ్చే పదాలతో పేరాను తిరిగి రాయండి.**

ఒక ఊళ్ళో ఒక <u>లోభి</u> ఉండేవాడు. అతను ఎంతో <u>ధనం</u> <u>కూడబెట్టాడు</u>. ఆ సొమ్ము తాననుభవించడు, ఎవరికీ <u>ధర్మం</u> చేయడు. <u>పుత్తడి</u>తో నగలు చేయించుకొని వాటిని చూసుకొని <u>విర్రవీగేవాడు</u>. చదువు నేరిస్తే వివేకం కలుగుతుందని ఎంతమంది చెప్పినా <u>అజ్ఞానం</u>వల్ల వినలేదు. తుదకు ఆ సంపాదన దొంగలపాలైంది. <u>సత్యాన్ని</u> గ్రహించాడు. చదువు మొదలుపెట్టాడు. అందరూ <u>హర్షించారు</u>.

**2. కింది పదాలను మీరు మాట్లాడే భాషలోకి మార్చి రాయండి.**

ఉదా : వృక్షంబు – వృక్షము – వృక్షం

అ. వజ్రంబు ఆ. ప్రాణంబు ఇ. సంగంబు ఈ. సాధనంబు ఉ. బంగారంబు

**3. కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సమానార్థకాలు రాయండి.**

ఉదా : <u>సంపద</u>తో గర్వపడగూడదు. ( కలిమి )

అ. <u>సముద్రం</u>మీద ఓడలు ప్రయాణిస్తాయి. ( )

ఆ. వెన్నెల<u>రాత్రి</u> చంద్రుడు ప్రకాశిస్తాడు. ( )

ఇ. <u>భూమి</u>మీద ఎవరూ శాశ్వతంగా ఉండరు. ( )

ఈ. <u>వికలాంగులను</u> నిందించగూడదు. ( )

**4. కింది వాక్యాలలోని గీత గీసిన పదాలను చదివి ఖాళీలలో వాటికి వ్యతిరేక పదాలు రాయండి.**

అ. <u>కలిమి</u>లో గర్వపడకూడదు. .......................... లో కుంగిపోగూడదు.

ఆ. <u>సజ్జనులతో</u> స్నేహం చేయాలి. ......................దూరంగా ఉండాలి.

ఇ. <u>సత్యాన్ని</u> పలకడం అలవరుచుకోవాలి. ......................... అనర్థాలకు దారి తీస్తుంది.

ఈ. <u>కీర్తి</u> రావాలంటే కష్టపడాలి. ............................ మాత్రం అరక్షణంలో వస్తుంది.

ఉ. ఆకలీ దప్పికా నిద్రా <u>దరిద్రుడికీ</u> .............................. కీ ఒకేలా ఉంటాయి.

**5. కింది ప్రకృతి పదాలు చదవండి వాటికి సంబంధించిన వికృతి పదాలు రాయండి.**

అ. పుస్తకం ---------------- ఆ. సుఖం ----------------

ఇ. భూమి ---------------- ఈ. ధర్మం ----------------

ఉ. శ్రీ --------------- ఊ. గౌరవం ----------------

ఎ. భృంగారం – ------------- ఏ. ప్రాణం ----------------

## V. సృజనాత్మకత



1. ఆపదల్లో ధైర్యం, సంపదల్లో ఓర్పు, సభల్లో వాక్చాతుర్యం కావాలి. ఇటువంటి అంశాలను ఆధారంగా చేసుకొని ఒక కవిత రాయండి.
2. పద్యాలను ఆధారంగా చేసుకొని మంచి సూక్తులను, నినాదాలను తయారు చేయండి. వాటిని ప్రదర్శించండి.

© SCERT not to be republished

## VI. ప్రశంస



1. **మీ తరగతిలోని ఇతర భాషల విద్యార్థులను అడిగి మంచి సూక్తులను తెలుసుకోండి.**
2. **కింది పట్టికలోని అంశాలను చదవండి. మీరు చేసేవి, చేయనివి గుర్తించండి.**

అ. ఎవరి దగ్గరయినా పుస్తకం తీసుకొంటే వెంటనే తిరిగి ఇస్తాను.

ఆ. నేను నా తరగతిలో కొద్దిమందితోనే మర్యాదగా ఉంటాను.

ఇ. నేను డబ్బు ఖర్చుపెట్టకుండా దాచుకుంటాను.


ఈ. నేను కేవలం మంచివాళ్ళతో మాత్రమే స్నేహం చేస్తాను.

ఉ. నా పుస్తకాలను నేను జాగ్రత్తగా ఉంచుకొంటాను.

ఊ. అవయవలోపం ఉన్నవాళ్ళకు నేను సహాయంచేస్తాను.

ఎ. నేను బాగా చదువుకొని గొప్ప కవిలా ఎదుగుతాననే నమ్మకం ఉంది.

## VII. ప్రాజెక్టు పని



1. శతక కవులకు సంబంధించిన విషయాలను సేకరించి కింది పట్టికలో రాయండి.

| కవి పేరు | కాలం | శతకం పేరు | ఇతర రచనలు |
|---|---|---|---|
| | | | |

2. పద్యభావాలకు అనుగుణమైన కథలను, సూక్తులను, దినపత్రికల నుండి సేకరించండి. వాటిని చార్టు మీద రాసి ప్రదర్శించండి.

©SCERT not to be republished

## VIII. భాషగురించి తెలుసుకుందాం



**1. కింది మాటలను చూడండి.**

1. ఎండవానలు – ఎండా, వానా
2. తల్లిదండ్రులు – తల్లీ, తండ్రీ
3. రేయింబవళ్ళు – రేయీ, పగలూ
4. గంగాయమునలు – గంగా, యమునా

వీటిని **'ద్వంద్వసమాసాలు'** అంటారు. ద్వంద్వసమాసాల్లో రెండూ నామవాచకాలే ఉంటాయని, ఇవి కలిసినప్పుడు బహువచనరూపం ఏర్పడుతుందని మీరు 6వ తరగతిలో తెలుసుకున్నారు.

**2. కింది విగ్రహవాక్యాలను సమాస పదాలుగా మార్చండి.**

ఉదా॥ రాముడూ, లక్ష్మణుడూ ______ రామలక్ష్మణులు

అ. కుజనుడూ, సజ్జనుడూ ..............................

ఆ. కూరా, కాయా ..............................

ఇ. అన్నా, తమ్ముడూ ..............................

ఈ. కష్టమూ, సుఖమూ ..............................

ఉ. మంచీ, చెడూ ..............................

**3. కింది సమాస పదాలను ఉదాహరణలో చూపిన విధంగా వివరించండి.**

ఉదా॥ నవరసాలు – నవ (9) సంఖ్యగల రసాలు.

ఊ. రెండు జడలు – ..................................

ఎ. నాలుగు వేదాలు – ..................................

ఏ. దశావతారాలు – ..................................

ఐ. చతుష్షష్టి కళలు – ..................................

ఒ. ఏడు రోజులు – ..................................

పైన పేర్కొన్న సమాసాల్లో మొదటి (పూర్వ) పదంలో 'సంఖ్య' ఉండటాన్ని గమనించారుకదా. ఇలా మొదటి పదంలో సంఖ్యగల సమాసాలను **'ద్విగుసమాసాలు'** అంటారు.

© SCERT not to be republished

4. కింద పేర్కొన్న సమాసాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి. కారణాలు చర్చించండి.

అ. అక్కాచెల్లెళ్ళు ------------------------------

ఆ. పంచపాండవులు ------------------------------

ఇ. ద్వాదశజ్యోతిర్లింగాలు ------------------------------

ఈ. సీతారాములు ------------------------------

ఉ. రాబర్ట్‌రహీమ్‌లు ------------------------------

ఊ. త్రిమూర్తులు ------------------------------

ఎ. నవగ్రహాలు ------------------------------

ఏ. ఏడురంగులు ------------------------------

ఐ. వందపరుగులు ------------------------------

ఒ. సూర్యచంద్రులు ------------------------------



## మీకు తెలుసా !!

**సాన :**

కొడవళ్ళు, గొడ్డళ్ళు మొదలైనవి పదునుపెట్టుకోడానికి వాడే రాయి. గంధంకోసం గంధంచెక్కను ఒక రాతి మీద అరగదీస్తారు. దాన్ని కూడా "సాన" అనే అంటారు.

© SCERT not to be republished



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగంతో, భావంతో చదవగలను. భావాలను సొంత మాటల్లో చెప్పగలను. | ( ఔను / కాదు ) |
| 2. | పద్యాలను చదివి వాటి భావాలను అర్థంచేసుకోగలను. | ( ఔను / కాదు ) |
| 3. | పద్యంలోని పదాలను సొంత వాక్యాలలో వినియోగించగలను. | ( ఔను / కాదు ) |
| 4. | పద్యాలకు భావాలను రాయగలను. | ( ఔను / కాదు ) |
| 5. | పద్యభావాల ఆధారంగా సూక్తులు, నినాదాలు రాయగలను. | ( ఔను / కాదు ) |

ఉన్నతమైన ఆదర్శం ఉండటం - దాన్ని చేరుకొనడానికి ఓపికగా పరిశ్రమించడం మన జీవిత సూత్రంగా ఉండాలి.
డా॥బి. ఆర్. అంబేద్కర్

మొదటి యూనిట్

# 4. ప్రకృతి ఒడిలో.........

– కొడవటిగంటి కుటుంబరావు

**ఆలోచించండి – మాట్లాడండి :**



**ప్రశ్నలు :**

1. చిత్రంలో ఏమేమి ఉన్నాయి ?
2. ఏం జరుగుతూంది ?

ప్రస్తుత పాఠ్యాంశం : కొడవటిగంటివారి తాత్త్విక వ్యాసాలనుండి తీసుకున్నది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థం కాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు–అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

కాటారం బడిలో ప్రార్థనాసమావేశంలో పార్వతి చదివిన అంశానికి అభినందనలు తెలుపుతూ అందరూ చప్పట్లు కొట్టారు. ఆ చప్పట్ల ప్రకంపనలకు ఆ పరిసరాలలో చెట్లమీద ఉన్న రంగురంగుల సీతాకోకచిలుకలు గుంపులు గుంపులుగా, రెక్కలు రెపరెపలాడిస్తూ పైకి లేచాయి. ప్రకృతి అందాన్ని చూసి ఆస్వాదించే మనసు ఉండాలిగాని, అది ఎంత అద్భుతంగా ఉంటుందో ! ఏ కోణంలో చూసినా అందమైన దృశ్యమే కనపడుతుంది. అందమైన పువ్వులు, వయ్యారంగా తలలూపే కొమ్మలు, రెమ్మలు, రెపరెపలాడే ఆకులు, రంగులన్నీ కలబోసి రకరకాల ఆకృతులను కూర్చినట్లు ఎగురుతూ ఉంటే గాలిలో తేలి ఆడుతున్న సీతాకోకచిలుకలు ఎగురుతుంటే, ప్రకృతిలోని రంగులన్నీ మన కళ్ళముందు నాట్యం చేస్తున్నట్లు ఉంది. ప్రకృతిలో ఎన్ని రహస్యాలున్నాయో ...! ఇలాంటివి కొన్ని చూద్దామా...!

"ప్రకృతి రహస్యాలను అన్వేషించడానికి మనిషికి ఉన్న మూలసాధనాలు జ్ఞానేంద్రియాలు. ఇవి మనిషికి అనుభవాన్ని కలిగిస్తాయి. ఈ అనుభవాలలోని సామ్యాన్ని కనిపెట్టి, బుద్ధి కొన్ని సత్యాలను ప్రతిపాదిస్తుంది. ఉదాహరణకు, నిప్పు ఎప్పుడు తాకినా కాలుతుంది. నీరు ఎప్పుడూ పల్లానికే ప్రవహిస్తుంది. తగిన ఉష్ణస్థితి ఉంటే అనేక పదార్థాలు కరుగుతాయి. చలికి నెయ్యి, నూనె పేరుకుంటాయి. ఇలాంటివి తెలుసుకునే శక్తి అన్ని ప్రాణులకూ కొద్దో గొప్పో ఉంటుంది. ప్రకృతి ధర్మాలను గ్రహించిన తర్వాత వాటిని మానవుడు తనకు అనుకూలంగా మార్చుకోగలుగుతాడు. చెయ్యి పెడితే కాలే నిప్పే, చలినుండి మనిషికి రక్షణనిస్తుంది. ఇళ్ళమధ్య నీరు నిలిస్తే, దూరంగా ఉండే పల్లపు ప్రదేశానికి గండిపెట్టి ఆ నీటిని మళ్లించవచ్చు.

ఆధునిక శాస్త్రవేత్త ఇంత తేలిక మార్గాల ద్వారా సంపాదించే జ్ఞానంతో తృప్తిపడడు. మానవుడు నాగరికత సాధించడానికి ఈ జ్ఞానం చాలదు. కాబట్టి శాస్త్రవేత్తలు మొట్టమొదట జ్ఞానేంద్రియాల హద్దులు తెలుసుకున్నారు. మన కన్ను చూసే 'కాంతితరంగాలు' చాలా తక్కువ. అంతకు అనేక రెట్ల తరంగాలు



© SCERT not to be republished


రేడియో తరంగాలు మొదలుకొని అతిసూక్ష్మమైన 'గామా' కిరణాలదాకా కంటికి కనిపించవు. కానీ అవి కూడా 'కాంతి' తరంగాల జాతికి చెందినవే. వాటిని విద్యుదయస్కాంత తరంగాలు అంటారు.

కొన్ని పరిస్థితులలో కన్ను కొన్ని కొన్ని భ్రమలకు లోనవుతుంది. సినిమా చిత్రాలు కదిలే బొమ్మలు, కదలలేని బొమ్మలను తెరమీద అతివేగంగా ఒకదాని తర్వాత మరొకదాన్ని కదిలించి చూపిస్తారు. అవే చలనచిత్రాలయ్యాయి. అప్పుడు కన్ను తాను చూసిన విషయాలను చెరిపెయ్యలేదు. అలాగే చెవులు అన్ని ధ్వనులనూ వినలేవు. మనిషి వినలేని ధ్వనులు కొన్ని కుక్కలకు వినబడతాయట. వినబడని ధ్వనులను శాస్త్రవేత్తలు అనేక ప్రయోజనాలకు ఉపయోగిస్తున్నారు. చివరికి చర్మం కూడా భ్రమలకు లోనవుతుంది. చలికాలంలో రాత్రివేళ ఆరుబయట ఉండే కొయ్యబెంచీ, ఇనుపబెంచీ ఒకే ఉష్ణోగ్రతలో ఉంటాయి. అయినా కొయ్యబెంచీ తగిలితే చెయ్యి జిల్లుమనదు, ఇనుప బెంచీ తగిలితేనే జిల్లుమంటుంది.

ఇంద్రియజ్ఞానంమీదనే ఆధారపడి ఉంటే ఈనాడు మనకు రేడియోలు ఉండేవి కావు. విద్యుచ్ఛక్తి ఉండేది కాదు. ఆకాశంలో ఎక్కడో ఉన్న నక్షత్రాలలో ఏ ఏ పదార్థాలున్నాయో తెలిసేది కాదు. ఇంద్రియ జ్ఞానాన్ని విస్తరించడానికి శాస్త్రజ్ఞులు అనేక వేల సాధనాలు కల్పించారు. టెలిస్కోపులు, మైక్రోస్కోపులు, ఫోటోగ్రఫీ, ఎక్సరేలు, చీకట్లో చూడటానికి వీలైన సాధనాలు, రాడార్ వగైరాలు.

శాస్త్రజ్ఞానం ఇంతగా అభివృద్ధి అయిందంటే అది కొన్ని నియమాలను విధిగా పాటించింది.

ఆ నియమాలు జ్ఞానానికి సంకెళ్ళుగా పనిచేయక తప్పదు. వాటిని ఊడగొట్టుకోవడం



© SCERT not to be republished

ద్వారా జ్ఞానం ఒకమెట్టు పైకెక్కుతుంది. ఇదే విధంగా శాస్త్రజ్ఞానాభివృద్ధికి అడుగడుగునా నియమాలు అడ్డుతగులుతూ ఉంటాయి.

శాస్త్రజ్ఞానం అనుభవంనుంచి కొన్ని ప్రతిపాదనలు చేస్తుంది. ఉదాహరణకు – లోహాలన్నీ ఘనపదార్థాల రూపంలో ఉంటాయి. ఈ ప్రతిపాదనను శాస్త్రం పరమ సత్యంగా పరిగణించదు. అందువల్ల పాదరసం కూడా లోహమే అని తెలిసినప్పుడు ఆ ప్రతిపాదనకు సవరణ వస్తుంది. శాస్త్ర ప్రతిపాదనలను మళ్ళీ మళ్ళీ రుజువుచేసినమీదట అది సిద్ధాంతంగా ఆమోదం పొందుతుంది.

దృష్టి, వినికిడి, వాసనలను పసిగట్టే విషయంలో జంతువులు మానవునికన్నా ఎంతో ముందున్నాయి. గబ్బిలాల వినికిడిశక్తి మనకెంతో ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గాలిలోకి విసిరిన వస్తువులలో పురుగో, బంతో, కర్రో సులువుగా చీకట్లో గుర్తించే శక్తి గబ్బిలానికుంది. ఒకే పరిమాణంలో ఉన్న ఆకులు, పురుగులువంటి వాటిని ఆకారాలనుబట్టి గుర్తించగలదు. ప్రతిధ్వనులను సెకండ్‌కన్నా తక్కువ కాలంలో విశ్లేషించగలదు. తిమింగలాలు, డాల్ఫిన్‌లకు ఉన్న ఇకోలొకేషన్ శక్తి, విశ్లేషణ శక్తి గబ్బిలాల కన్నా ఎక్కువ.

ప్రకృతి వైపరీత్యాలను ముందే పసిగట్టగల అద్భుత ప్రాణులు ఈ విశ్వంలో ఎన్నో ఉన్నాయి. సమాచార రంగంలో మనకన్నా జంతువులే ముందున్నాయి. భూకంపాలను ముందే అంచనా వేయగల జంతువులున్నాయి.క్రీ. పూ. వంద సంవత్సరాలకు పూర్వమే, జంతువులు భూకంపాన్ని ముందే పసిగట్టేవని పూర్వీకులు చెబుతున్నారు. "లెనిన్‌కన్" అనే చోట ఒక కర్మాగారం కలుగుల్లోంచి వందలకొద్ది ఎలుకలు హడావిడిగా బయటకు పరిగెత్తుకొచ్చాయి. వీధులలో వీటిని చూసి అందరూ ఆశ్చర్యపోయారు. అవి అలా వెళ్ళిన కొన్ని గంటలకే ఆ ప్రాంతంలో భూకంపం వచ్చింది. అలాగే చైనాలో ఒకసారి కలుగుల్లోంచి ఎన్నో పాములు బయటకి వచ్చాయి. అందరూ భయపడ్డారు. కొన్ని గంటల తర్వాత భయంకరమైన భూకంపం వచ్చింది. శ్రీలంకలో ఒకసారి ఎన్నో ఏనుగులు పరిగెత్తుతూనే ఉన్నాయి, అలా సుమారు ఐదు కిలోమీటర్లు పరిగెత్తాయి. మూడు గంటల తర్వాత సముద్రంలో సునామి వచ్చింది. తుఫాను, సునామీ మొదలైనవాటిని ఏనుగులు 250 కి.మీ. దూరంనుండే ముందే పసిగట్టగలవని శాస్త్రజ్ఞులు నిరూపించారు.

ఈ విధంగా కళాదృష్టిలాగే శాస్త్రదృష్టి కూడా మానవుడికి అడుగడుగునా అక్కరకు వస్తుంది. మానవుడికి ఈ విశ్వంలోగల సంబంధాలన్నింటిమీదా ప్రభావం చూపిస్తుంది. శాస్త్రదృష్టి మానవుడి కృషికి ఒక మార్గం చూపి దాన్ని ఫలవంతం చేస్తుంది. ప్రకృతి రహస్యాలను వెల్లడిచేస్తుంది.

© SCERT not to be republished

## రచయిత పరిచయం




| | | |
|---|---|---|
| రచయిత | : | కొడవటిగంటి కుటుంబరావు |
| జననం–మరణం | : | అక్టోబరు 28, 1909 – ఆగస్టు 17, 1980 |
| జన్మస్థలం | : | తెనాలి, గుంటూరు జిల్లా. |
| రచనలు | : | జీవితం, చదువు అనే నవలలు, అద్దెకొంప, షావుకారు సుబ్బయ్య మొదలైన కథానికలు, సినిమా వ్యాసాలు, సైన్సు వ్యాసాలు, సంస్కృతి వ్యాసాలు, తాత్త్విక వ్యాసాలు మొ॥నవి. |



# ఇవి చేయండి



## I. వినడం-మాట్లాడడం



1. మీ పాఠశాల ఆవరణలో పరిసరాలను గురించి చెప్పండి.
2. మానవులందరికీ జ్ఞానేంద్రియాలు ఉన్నాయి కదా ! వీటివల్ల కలిగే ప్రయోజనాలు ఏమిటి?
3. మనం చేయలేనివి జంతువులు చేయగలిగేవి ఏవి? మాట్లాడండి.
4. శాస్త్రజ్ఞానం అభివృద్ధి చెందడం అంటే ఏమిటి? దీనివల్ల గతంతో పోలిస్తే, నేడు దేంట్లో ఏమి మార్పులు వచ్చాయి.
5. నిత్యజీవితంలో మీరు గమనించిన ప్రకృతి వింతలను గురించి చెప్పండి.

## II. చదవడం - రాయడం





**1. పాఠం చదవండి. కింది భావం వచ్చే పేరాలను గుర్తించండి. వాటికి పేరు పెట్టండి.**

అ. ప్రకృతి ఎంతో అందంగా ఉంటుంది. దీన్ని చూస్తే చాలా ఆనందం కలుగుతుంది.

ఆ. మనం ఎన్నో విషయాలను తెలుసుకోడానికీ, పరిశీలించడానికీ మనకున్న జ్ఞానేంద్రియాలు ఉపయోగపడుతున్నాయి.

ఇ. మానవుడు తనకున్న బలాలను, బలహీనతలను తెలుసుకున్నాడు. కాబట్టి ఉన్నదానితో తృప్తిచెందక ఎన్నో విషయాలను కనుక్కొన్నాడు.

**2. జట్లు జట్లుగా కూర్చొని పాఠంలోని పేరాలను చదవండి. ఒక్కొక్క పేరాకు ఒక ప్రశ్నను తయారు చేయండి. అంటే అదే ప్రశ్నకు పేరాలోని విషయం జవాబుగా రావాలి.**

**3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. జ్ఞానేంద్రియాలు అంటే ఏమిటి? వాటివల్ల మనం ఏం చేయగలుగుతున్నాం?

ఆ. ఇంద్రియజ్ఞానానికే పరిమితం కాకపోవడంవల్ల ఏం జరిగింది?

ఇ. చూపు, వినికిడి, వాసనలను తెలుసుకోడం అన్నవాటి విషయంలో మనకు, జంతువులకు ఉండే తేడాలు ఏమిటి? దీనివల్ల మీరు ఏం గ్రహించారు?

| జ్ఞానేంద్రియాలు | మనం చేయగలిగేవి | మనం చేయలేనివి | జంతువులు చేయగలిగినవి |
|---|---|---|---|
| కన్ను | | | |
| ముక్కు | | | |
| చెవి | | | |

ఈ. పాఠంలోని మొదటి పేరాకు మిగతా పేరాలకు మధ్య ఉన్న భేదమేమిటి?

© SCERT not to be republished

## III. స్వీయరచన



**1. ఈ కింది ప్రశ్నలకు మీ సొంతమాటలలో జవాబులు రాయండి**

అ. "ప్రకృతి రహస్యాలు అన్వేషించడానికి మనిషికి ఉన్న మూలసాధనాలు జ్ఞానేంద్రియాలు" దీనిమీద మీ అభిప్రాయం ఐదు వాక్యాలలో రాయండి.


ఆ. శాస్త్రజ్ఞులు జ్ఞానేంద్రియాల హద్దులను తెలుసుకోడంవల్ల ఏం జరిగింది?

ఇ. శాస్త్రజ్ఞులకు (శాస్త్రవేత్తలకు), శాస్త్రజ్ఞానానికి గల సంబంధాన్ని వివరిస్తూ రాయండి.

ఈ. సాధారణ దృష్టి, శాస్త్రదృష్టి రెండూ ఒకటేనా? కాదా? ఎందుకు?

ఉ. ప్రకృతి అందాలను వివరిస్తూ వ్యాసం రాయండి.

## IV. పదజాలం



**1. కింది వాక్యాలలో గీతగీసిన పదాలకు అర్థాలు రాయండి.**

అ. శాస్త్రదృష్టి మానవుడి కృషికి ఒక <u>మార్గం</u> చూపిస్తుంది

ఆ. కొండలను పగలగొట్టినప్పుడు <u>భూప్రకంపనలు</u> వస్తాయి.

ఇ. ఎండమావులను చూసి నీరు అని <u>భ్రమ</u>పడతాము.

**2. కింది పదాలను వివరిస్తూ రాయండి.**

అ. ప్రకృతి వైపరీత్యాలు అంటే................................................

ఆ. విశ్లేషణశక్తి అంటే ................................................

ఇ. శాస్త్రదృష్టి అంటే ................................................

ఈ. కళాదృష్టి అంటే................................................

ఉ. భ్రమలు అంటే................................................

ఊ. ఇంద్రియజ్ఞానం అంటే................................................

ఎ. జ్ఞానమంటే సమాచారాన్ని జ్ఞాపకం పెట్టుకోడం కాదు. జ్ఞానం అంటే ................................................

**3. పాఠంలో శాస్త్రసంబంధ పదాలు ఉన్నాయి. వాటి కింద గీత గీయండి. అలాంటి శాస్త్రసంబంధ పదాలను మీకు తెలిసినవాటిని మరికొన్నిటిని రాయండి.**

ఉదా: ఉష్ణోగ్రత, విద్యుచ్ఛక్తి.

## V. సృజనాత్మకత




**1. కింది వాక్యాలు చదవండి.**

"చప్పట్ల చప్పుడు విని సీతాకోకచిలకలు పైకి లేచాయి" – సాధారణ వాక్యం

"ఆ చప్పట్ల ప్రకంపనలకు ఆ పరిసరాలలో చెట్లమీద ఉన్న రంగురంగుల సీతాకోకచిలకలు గుంపులు గుంపులుగా రెక్కలు రెపరెపలాడిస్తూ పైకి లేచాయి" – పై వాక్యాన్నే వర్ణిస్తూ రాసిన వాక్యం ఇది. వాక్యంలోని కర్త, కర్మ, క్రియ పదాలలో దేన్ని గురించి అయినా గొప్పగా / అందంగా వివరించేలా సరైన పదాలను జోడిస్తూ రాస్తే మామూలు వాక్యాలు కూడా వర్ణనాత్మక వాక్యాలుగా మారుతాయి. మీరు కూడా మీకు నచ్చిన కథను / సన్నివేశాన్ని / సంఘటనను లేదా ఏదైనా ఒక అంశాన్ని గురించి వర్ణిస్తూ రాయండి.

©SCERT not to be republished

## VI. ప్రశంస



1. ప్రకృతిలో రంగురంగుల సీతాకోకచిలకలు, పచ్చని చెట్లు మొదలయినవాటిని చూస్తే ఆనందం కలుగుతుంది. అట్లాగే ప్రకృతిలో ఇంకా వేటివేటివల్ల మనకు ఆనందం కలుగుతుంది?
2. భూమిమీద ఉన్న చెట్లు, పక్షులు, జంతువులు, మానవులు ..........ఇలా ప్రతి ఒక్కదాంట్లో ఏదో ఒక గొప్పదనం ఉంటుంది. మీ మిత్రులతో చర్చించి దేంట్లో ఏ ఏ గొప్పదనాలున్నాయో రాయండి.

## VII. ప్రాజెక్టు పని



1. ప్రకృతిని గురించి వర్ణించే కవితలు సేకరించి ప్రదర్శించండి.
2. జంతుప్రపంచానికి సంబంధించిన టి.వి. ఛానళ్ళు చూసి, జంతువులు లేదా కీటకాలు లేదా పక్షుల అద్భుత శక్తులను గురించి రాయండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



**1. కింది వాక్యాలలోని విభక్తి ప్రత్యయాలను గుర్తించి, అవి ఏ విభక్తులో రాయండి.**

ఉదా॥సమావేశంలో చదివిన విషయం బాగుంది –'లో' – షష్ఠీవిభక్తి

| | | | | |
|---|---|---|---|---|
| అ. | గాలికి రెపరెపలాడుతున్నది. | = | ................ | ................ |
| ఆ. | రహస్యాలను అన్వేషించండి. | = | ................ | ................ |
| ఇ. | జంతువులు మనకంటె ముందున్నాయి. | = | ................ | ................ |
| ఈ. | జ్ఞానేంద్రియాల చేత గ్రహిస్తాం. | = | ................ | ................ |
| ఉ. | బాధవలన దుఃఖం వస్తుంది. | = | ................ | ................ |
| ఊ. | ధ్వనులను బట్టి జంతువులను గుర్తించవచ్చు. | = | ................ | ................ |
| ఎ. | రాముడు, ధేనువు పాలు పిండుతున్నాడు. | = | ................ | ................ |

**2. విభక్తులను, వాటి ప్రత్యయాలను మననం చేయండి. పై ఖాళీలను పూరించడానికి ఈ కింది పట్టికను ఆధారంగా తీసుకోవచ్చు.**

| | | | |
|---|---|---|---|
| అ) | డు, ము, వు, లు | – | ప్రథమా విభక్తి |
| ఆ) | ని(న్), ను(న్), ల(న్), కూర్చి, గురించి | – | ద్వితీయా విభక్తి |
| ఇ) | చేత(న్), చే(న్), తోడ(న్), తో(న్) | – | తృతీయా విభక్తి |
| ఈ) | కొఱకు(న్), కై | – | చతుర్థీ విభక్తి |
| ఉ) | వలన(న్), కంటె(న్), పట్టి | – | పంచమీ విభక్తి |
| ఊ) | కి(న్), కు(న్), యొక్క, లో(న్), లోపల(న్) | – | షష్ఠీ విభక్తి |
| ఎ) | అందు(న్), న(న్) | – | సప్తమీ విభక్తి |
| ఏ) | ఓ! ఓరి! ఓయీ! ఓసీ! | – | సంబోధన ప్రథమా విభక్తి |

© SCERT not to be republished

**3. కింది ఖాళీలను సరైన ప్రత్యయాలతో పూరించండి, విభక్తులను బ్రాకెట్లలో రాయండి.**

ఉదా॥ ప్రహ్లాదుడు విష్ణువును గూర్చి తపస్సు చేశాడు. (ద్వితీయ)

అ. తేట తెలుగు మాటల .................. పాటలు రాశాడు. (      )

ఆ. దేశము ........................ కాపాడిన వీరులు (      )

ఇ. దేశాన్ని .................... కీర్తించారు కవులు. (      )

ఈ. వేదాలు మనదేశం ................. వెలిశాయి. (      )

**4. ఈ కింద గీత గీసిన పదాలను గమనించండి. వాటి నామవాచకం అసలురూపాన్ని గుర్తించి రాయండి.**

ఉదా॥ కంటిలోని నలుసు చూడు. కన్ను.

1. ఇంటి వెలుగు ఇల్లాలు. ...................
2. ఏటిలోని చేపపిల్ల. ...................
3. ఊరి కట్టుబాట్లు. ...................
4. కాలికి బుద్ధి చెప్పారు. ...................
5. రాతిని శిల్పంగా చెక్కాడు. ...................

పై వాక్యాల్లోని నామవాచకాల్లో వచ్చిన మార్పులు గమనించారుకదా. నామవాచకాలు వాక్యాలలో ఉపయోగిస్తున్నప్పుడు కొన్ని సందర్భాల్లో వాటి స్వరూపం మారుతున్నది. (కన్ను – కంటిగా; ఇల్లు – ఇంటి గా; ఏరు – ఏటి గా; ఊరు – ఊరిగా; కాలు – కాలి గా; రాయి – రాతిగా మారాయి.) అలా మారేటప్పుడు నామవాచకం చివరి అక్షరం మీద 'ఇ' గాని, 'టి' గాని, 'తి' గాని చేరుతున్నాయి. వీటిని **'ఉపవిభక్తులు'** అంటారు. వీటిని కలిగిన నామవాచకాలను **'ఔప విభక్తికాలు'** అంటారు.

కింది నామవాచకాలకు ఇచ్చిన ఉపవిభక్తులు చేర్చి, ఔపవిభక్తికాలుగా మార్చి వాక్యాలు రాయండి.

ఉదా॥ చేయి + తి = చేతి

అతనికి చేతినిండా పని ఉంది.

1. గోరు + టి =

...........................................................................

2. రోలు + టి =

...........................................................................

3. నూయి + తి =

...........................................................................

4. గోయి + తి =

...........................................................................

## నేనివి చేయగలనా ?

| | | |
|---|---|---|
| 1. | పాఠ్యాంశంలోని శాస్త్రీయ విషయాలమీద మాట్లాడగలను. | ఔను / కాదు |
| 2. | పాఠ్యాంశంలోని విషయాన్ని సొంతమాటల్లో రాయగలను | ఔను / కాదు |
| 3. | శాస్త్రీయ విషయాలను అవగాహనతో ధారాళంగా చదవగలను | ఔను / కాదు |
| 4. | ప్రకృతి అందాలను వర్ణిస్తూ వ్యాసం రాయగలను. | ఔను / కాదు |
| 5. | శాస్త్ర సాంకేతిక పదజాలాన్ని సందర్భోచితంగా ఉపయోగించగలను. | ఔను / కాదు |

నామట్టుకు నాకు తెలిసింది నాకు ఏమీ తెలియదనే – సోక్రటీస్    నిన్ను నీవు తెలుసుకో – రమణ మహర్షి

© SCERT not to be republished

మొదటి యూనిట్

# 5. అద్భుతమైన సెలవులు

(ఉపవాచకం)

అవి శీతాకాలపు సెలవురోజులు. సుశీల్, సునీత, సాగర్‌లకు చాలా విసుగ్గా ఉంది. ఇంట్లోనే ఉంటూ కలసి ఆడుకోటం తప్ప వేరే పనేదీ లేదు. ఏ మాత్రం సాహసోపేతంగా గానీ, ఉత్సాహంగా గానీ లేని పని అది. వాళ్ళ స్నేహితులు చాలామంది వాళ్ళ అమ్మానాన్నలతో బంధువుల ఊళ్ళకు వెళ్ళారు. ఈసారి వీళ్ళ నాన్నకు చాలా పని ఉండటంవల్ల ఇదివరకటిలా కొత్త ప్రదేశాలు చూసేందుకు వెళ్ళలేకపోయారు.

తలగడలతో కొట్టుకుంటూ, ఇంట్లో పరుగులు పెడుతూ ఉంటే, వాళ్ళ పిన్ని సావిత్రి, "ఏమిటిది? వెళ్ళండి. పనికి అడ్డురాకండి", అంది.

"అబ్బా ఇంకేం చేయాలి మేము?"

వాళ్ళ విసుగును లెక్కపెట్టకుండా ," ఈ దిండు తొడుగులూ, కుషన్లూ, పాడుచేయకండి, మీలాంటి పిల్లలు ఆడాల్సిన ఆట కాదిది," అని గట్టిగా చెప్పింది సావిత్రి పిన్ని.

విసుగ్గా, గట్టిగా "మరి మేమేం చెయ్యాలి?" అన్నాడు సుశీల్.

"బయటికెళ్ళి ఆడుకోగూడదూ?" అంటూ ఆమె సలహా ఇచ్చింది.

"మూడు రోజులుగా అదే కదా చేస్తున్నాం. నాకు చాలా విసుగ్గా ఉంది. కొత్తగాను, ఉత్సాహంగాను లేనే లేదు," అన్నాడు సాగర్.



© SCERT not to be republished

"ఏం చేయటానికీ తోచకపోతే వంటింట్లో నాకు సాయంచేయండి. కొత్త వంటకాలు తయారుచేద్దాం," అంది సావిత్రి పిన్ని.

"ఈ ఆలోచన మాకేం నచ్చలేదు," సుశీల్, సాగర్ కలిసి అన్నారొకేసారి. " పద, బయటికెళ్ళి ఆడుకుందాం," అనుకుంటూ ఇద్దరూ బయల్దేరారు.

వాళ్ళ వెనకే సునీత వెళ్తూంటే, "నా చిన్ని సునీతా! నువ్విక్కడే ఉండి నాకు సాయం చెయ్యాలి," అంది సావిత్రి పిన్ని.

"సారీ, పిన్నీ," అంటూ, సునీత బయటికి పరుగులు పెట్టింది. లేకపోతే ఆవిడ బలవంతంమీద ఈ పూట వంటింటి పనులన్నీ తనొక్కతే చేయాల్సి వస్తుందేమోనని భయం వేసింది ఆమెకు.

పిల్లలందరూ ఇంట్లోంచి బయటికి వచ్చి లాన్‌లో గడ్డిని కోస్తున్న తోటమాలి దగ్గరికి వెళ్ళారు. అతను "ఏమిటి సుశీల్ బాబూ! తోటపనిలో మెలుకువలు నేర్చుకుంటావా?" అని అడిగాడు సుశీల్‌ని.

"అది కాదు తాతా," బాధగా అన్నాడు సుశీల్. "మాకందరికీ సెలవులిప్పుడు. ఏం చేయాలో ఎవరికీ తోచడంలేదు."

"చక్కటి పూలు కోసి మంచి పూలగుత్తి మీ అమ్మగారికి ఇవ్వండి. ఆమె తప్పకుండా సంతోషిస్తారు."



"ప్చ్... ఇంకేం చేద్దాం? కొన్ని పూలు కోసి చక్కటి పూలగుత్తి తయారుచేద్దాం పదండి," అన్నాడు సుశీల్.

రోజాపూలు చాలా బాగున్నాయి. చేమంతి పువ్వులూ తాజాగా అందంగా ఉన్నాయి. తోట వందలకొద్దీ పూలతో కళకళలాడుతూ ఉంది. వాటిలో వేటిని కొయ్యాలో, మొగ్గలుగా ఉన్న కారణంగా వేటిని కొయ్యగూడదో తోటమాలి తాతయ్య చెప్పాడు. చక్కటి పూలగుత్తి తయారైంది. "దీన్ని చూసి సంతోషించేవాళ్ళుండే చోటికి తీసుకు వెళ్ళి ఇద్దాం! సరేనా?" అన్నాడు సాగర్.

"ఎక్కడికి?" సుశీల్ అడిగాడు.

"ముసలివాళ్ళంతా ఉండే వృద్ధాశ్రమం గుర్తుందా నీకు? ఒంటరిగా, చేసేందుకేమీ లేకుండా ఉంటారు పాపం. వాళ్ళు దీన్ని తప్పకుండా ఇష్టపడతారు. నాకు తెలుసు"

సుశీల్‌కు, సునీతకు కూడా ఈ ఆలోచన నచ్చింది. "మనకు ఉత్సాహంగా లేకపోయినా, కనీసం అది లేనివాళ్ళకు, ఉత్సాహాన్ని ఇచ్చేందుకు ఇలాంటి పనులు చెయ్యాలి," అన్నారిద్దరూ.

"ఐతే, ఒకటి సరిపోదేమో, మరికొన్ని పూలు కోసి ఇంకొన్ని పూలగుత్తులు చేస్తే బాగుంటుంది కదా!" అనుకొని ముగ్గురూ కలిసి మరికొన్ని పూలగుత్తులు తయారుచేసుకొని, పది నిముషాల నడక దూరంలో ఉన్న వృద్ధాశ్రమానికి వెళ్ళారు.



© not to be republished


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

ఆశ్రమంలో ఉన్న వృద్ధులను గురించి చిన్నపిల్లలు తీసుకుంటున్న శ్రద్ధకు వాళ్ళ ముఖాల్లో సంతోషం కనిపించింది. పిల్లలకు వాళ్ళందరూ కృతజ్ఞతలు చెప్పారు. వీళ్ళు ముగ్గురూ అక్కడే వాళ్ళతో పాటు కూర్చుని కబుర్లు చెప్పారు. వాళ్ళలో కొంతమంది మాట్లాడకుండా కూర్చుని ఉన్నారు. మరి కొంతమంది తమ బాధను దాచుకునేందుకు వాళ్ళతో మాట్లాడుతూ, పిల్లలెక్కడుంటున్నారో, ఎక్కడ చదువుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. చివరికి ఆశ్రమంలో భోజనానికి ఉండిపొమ్మని వాళ్ళు పిల్లలను బలవంతపెట్టారు. కానీ, సుశీల్ వినయంగా, "ఇంట్లో మా అమ్మ మాకోసం ఎదురు చూస్తూంటుం"దని చెప్పాడు.

రెండు రోజుల తరవాత పిల్లలు మరికొన్ని పూలు పట్టుకొని అక్కడికి వెళ్ళారు. మళ్ళీ వాళ్ళతో కబుర్లు. 'రోజంతా ఏం చేస్తూ ఉంటా' రని వాళ్ళను సుశీల్ అడిగాడు, మాటలమధ్య. "ఏముంది? కాస్సేపు కూర్చుంటాం. కొద్దిసేపు దైవప్రార్థన చేసుకుంటాం. కాస్సేపు మాట్లాడుకుంటాం. భోంచేస్తాం. పడుకుంటాం. ఈ వయసులో ఇంతకన్నా ఏం చేయగలం?" అన్నారు వాళ్ళలో ఒకతను.

"అంటే కాలక్షేపానికి ఇక్కడేం లేదన్నమాట. కనీసం టీ.వీ. కూడా?" సాగర్ ఆశ్చర్యపోతూ అడిగాడు.

ఒక పెద్దాయన దగ్గుతూ అన్నాడు "ఇదివరకొక బ్లాక్ అండ్ వైట్ టీ.వీ. ఉండేది. అది చెడిపోయి మరమ్మతుకు వెళ్ళింది. మళ్ళీ వెనక్కి రాలేదు. వార్తాపత్రికలు, వారపత్రికలు వస్తుంటాయి. అప్పుడప్పుడు అవి చదువుకుంటాం."

పిల్లలకు చాలా బాధ కలిగింది. సిగ్గువేసింది కూడా. తమకైతే అన్నీ ఉన్నాయి. అయినా ఎప్పుడూ ఏదో ఒకదానికి గొడవే. ఇంటికి వెళ్ళిన తరువాత వృద్ధాశ్రమాన్ని గురించీ, అక్కడుండేవాళ్ళను గురించీ, కాలక్షేపం కోసం వాళ్ళకేమీ లేకపోవటం గురించే చర్చ జరిగింది.

"వాళ్ళకోసం ఒక టీ.వీ. కానీ, రేడియో కానీ కొని ఇస్తే బాగుంటుంది," అన్నాడు సాగర్. "మనం దాచుకున్న డబ్బులన్నీ పెట్టినా, అలాంటిది ఏదీ కొనలేం" అంది సునీత.

"మనం చేయగలిగిందల్లా మన డబ్బులతో ఓ సినిమాకో, మరోదానికో కొన్ని టికెట్లు కొనివ్వగలం అంతే!"

"సినిమా... టికెట్స్..." సుశీల్ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. ఒక్కసారి గట్టిగా "అంతే!" అంటూ అరిచాడు.

సునీత, సాగర్ ఒక్కసారే అడిగారు "ఏమనుకుంటున్నావ్ మనసులో నువ్వు?" అని. సుశీల్ మెరిసే కళ్ళతో అన్నాడు "మీకూ తెలుసుగా! మన స్కూలు నాటకాల్లో నటించిన అనుభవం మన ముగ్గురికీ బాగావుంది. మనం వాళ్ళకోసం ఉచితంగా ఓ ప్రదర్శన ఇస్తే కనీసం వాళ్ళను ఆనందపరచి నట్టవుతుందిగా?"

సాగర్ సరేనన్నాడు. కానీ సునీతకు ఈ ఆలోచన నచ్చలేదు. "కేవలం ముగ్గురితోనే ప్రదర్శన ఏమంత బాగుండదు. తప్పనిసరిగా యింకా కొంతమంది కావాలిగా మరి ఇదంతా మనవల్లవుతుందా అని?"

"తోటమాలి తాతయ్య, సావిత్రి పిన్ని స్టేజీకి వెనక మనకు తప్పకుండా సాయంచేస్తారు. నాకు తెలుసు!" అన్నాడు సాగర్. "స్కూల్లో నితిన్ అని నాకో స్నేహితుడున్నాడు. మీకు గుర్తుంది కదా. నితిన్ ఈ నాటకంలో పాల్గొంటాడు. ఇంకా కొంతమందిని తీసుకొని వస్తాడు కదా."

సునీత ఒప్పుకొంటూ ఇలా అంది. "మనం దీన్నొక ఛారిటీ షో లాగ చేస్తే బాగుంటుంది. కొన్ని టికెట్లు ఇరుగుపొరుగువాళ్ళకు అమ్ముదాం. ఇలా మనం జమచేసే డబ్బుతో కనీసం రేడియోసెట్టయినా కొని ఇవ్వవచ్చుగా!"

అంతే, వెంటనే సాగర్ నితిన్ ఇంటికి వెళ్ళాడు. మరో రెండు గంటలకల్లా సాగర్ నవ్వుతూ, తుళ్ళుతూ గర్వంగా ఇంటికొచ్చి నితిన్ సాయంత్రమే తన పిన్ని ఇద్దరు కూతుళ్ళతో పాటూ వాళ్ళింటికొస్తున్నాడని ప్రకటించాడు.

ఇంకా చేయవలసింది చాలాఉంది. "మరి టికెట్లెక్కడ ప్రింట్ చేద్దాం? " సునీత అడిగింది.

"ప్రింట్ చేయవలసిన పని లేదు. మనకు తెలిసినవాళ్ళనీ, ఇరుగుపొరుగువాళ్ళనీ, ప్రదర్శనకు రమ్మందాం. తమకు తోచిన విరాళం ఇమ్మని అడుగుదాం. అంతే!" సుశీల్ విడమరిచి చెప్పాడు.


"మరి ప్రదర్శనకు చోటు ఎక్కడుంది? "

"వృద్ధాశ్రమం ఉన్నది పెద్ద ఆవరణలో కదా! దాని పక్కనే ఆటస్థలముంది, అక్కడ."

ఈ ఆలోచన అందరికీ నచ్చింది. సాయంత్రం నితిన్, తన చెల్లెళ్ళు తమన్నా, వీణలతో కలిసి రాగానే, ఏ నాటకం వేయాలని చర్చించుకోడం మొదలుపెట్టారు. నితిన్ తెచ్చిన పుస్తకాల్లో వెతికి వెతికి 'గుశ్వం' అన్న హాస్యనాటకాన్ని ఎంపిక చేసుకున్నారు.

సుశీల్ ఆరోజు రాత్రీ, మరుసటి రోజు పగలంతాను కదలకుండా కూర్చుని నాటక సంభాషణలు రాశాడు. మిగతావాళ్లు ఇంటింటికీ వెళ్ళి వాళ్ళను ఆహ్వానించి విరాళాలు సేకరించారు. అలా వాళ్ళంతా కొంత మొత్తం పోగు చేయగలిగారు.

మూడో రోజున నాటక ప్రదర్శనకు రిహార్సల్సుమొదలయ్యాయి. స్కూల్లో నాటకాలు వేయటంలో మంచి అనుభవమున్న నితిన్ ఈ నాటకానికి దర్శకత్వం వహించాడు. ప్రదర్శనకు ముందు వారం రోజులు ఎలా గడిచి పోయాయో వాళ్లకే తెలియలేదు. ప్రతి రోజూ కనీసం మూడు గంటలు రిహార్సల్సు చేసేవాళ్ళు. తక్కిన రోజంతా స్టేజి ఎలా ఉండాలి, దుస్తులెలా ఉండాలి, ఇరుగుపొరుగువాళ్ళనెలా ఆహ్వానించాలి. ఇలాంటి విషయాలను గురించిన చర్చే.



చివరికి ప్రదర్శన రోజు రానే వచ్చింది. అంతకు ముందురోజే వృద్ధాశ్రమం నిర్వహించే మేనేజరు దగ్గరి నుంచి అనుమతి తీసుకొనేందుకు వెళ్ళారు. ఆయన ఎంతో ఆనందంగా అంగీకరించారు. అక్కడి వృద్ధులకు ఆశ్చర్యం కలిగేలా ఒక్కరోజు ముందు మాత్రమే వాళ్ళ కోసం తాము వేస్తున్న నాటకాన్ని గురించి చెప్పారు. ప్రదర్శన రోజున పొద్దుటినుంచే పిల్లలు తమకోసం వేస్తున్న నాటకంకోసం ఆ ఆశ్రమంలోనివాళ్ళంతా ఎంతో ఉత్కంఠతో ఎదురు చూడసాగారు.

కర్రలు, కర్టెన్‌లతో వరండాలో స్టేజీ తయారు చేసుకున్న తరవాత ఎదురుగా వున్న ఆటస్థలంలో ప్రేక్షకుల కోసం బల్లలు, కుర్చీలు వంటివి వేయటం జరిగింది. వందమంది కూర్చునేందుకు వీలుగా ఆశ్రమంలోంచి కొన్ని, ఇరుగుపొరుగు ఇళ్ళలోంచి కొన్ని, తమ ఇళ్ళనుంచి కొన్ని కుర్చీలు సేకరించి తెచ్చారు.

ప్రదర్శన బ్రహ్మాండంగా జరిగింది. పిల్లలు అద్భుతంగా నటించారని అందరూ అభినందించారు. నాటకంలోని హాస్య సన్నివేశాల్లో అందరూ విరగబడి నవ్వుతూ ఆనందించారు.

నాటక ప్రదర్శన తరవాత తాము 800 రూపాయలు విరాళాల ద్వారా సేకరించామని, దానికి తాము పొదుపుచేసి దాచుకున్న డబ్బులు కలిపి రేడియోతో పాటు ఒక టేప్‌రికార్డర్ కూడా వృద్ధాశ్రమానికి కొని ఇవ్వగలుగుతున్నామని సుశీల్ ప్రకటించాడు. ఈ సెలవులను ఇలా పెద్దవాళ్ళ ఆనందంకోసం వినియోగించిన పిల్లలను చూసి వృద్ధులంతా చాలా ఆనందించారు. అందరినీ దీవించారు.

*–మూలం: నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా*

© SCERT not to be republished



## ఇవి చేయండి



1. అద్భుతమైన సెలవుల కథ ఎలా ఉంది? దీన్ని గురించి మీ అభిప్రాయం చెప్పండి.
2. సెలవులలో సుశీల్, సునీత, సాగర్‌లు నాటకం వేశారు కదా! మరి మీరు సెలవులలో ఏమేం చేస్తారు?
3. సుశీల్, సాగర్, సునీత నాటకం వేసి, దాని ద్వారా డబ్బు పోగుచేసి వృద్ధులకు సహాయ పడ్డారుకదా! అట్లాగే ఏ ఏ మంచి పనులు ఎవరెవరికోసం చేయవచ్చు?
4. ఈ కథలో మీకు బాగా నచ్చిన సంఘటన ఏది ? ఎందుకు?
5. ఈ కథను మీ సొంతమాటల్లో రాయండి.
6. సుశీల్, సాగర్, సునీతల స్థానంలో మీరే ఉంటే, మీ మిత్రులతో కలసి వృద్ధాశ్రమానికి ఎలా సాయపడతారు? ఆలోచించి రాయండి?

ఏ ఋణమైనా తీర్చుకోవచ్చు కాని తల్లి ఋణం తీర్చుకోలేం – జ్యోతిరావ్ పూలే

**రెండో యూనిట్**

# 6. శిల్పి

– గుఱ్ఱం జాషువ

## ఆలోచించండి – మాట్లాడండి




### ప్రశ్నలు

1. పై చిత్రాన్ని చూడండి. చిత్రంలోనివి వేటితో తయారయ్యాయి?
2. ఈ చిత్రాలు ఏ కళకు సంబంధించినవి? దాన్ని గురించి మీకు తెలిసినది చెప్పండి.
3. శిల్పాలను తయారుచేసేవారిని ఏమంటారు? వారిని గురించి మీకు తెలిసింది చెప్పండి.

ప్రస్తుత పాఠ్యభాగం : 'ఖండకావ్యం' మొదటి భాగంలోది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు–అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



★ చేత మిగురొత్త నొక నల్లఱాతియందు
మలచినాడవు, భయద సింహముల తలలు
వసుధ గన్పట్టు సర్వపర్వతములందు
జిత్రముల నెన్ని గతుల జూచెదవొ నీవు!

★ సున్నితంబైన నీచేతి సుత్తెనుండి
బయలుపడె నెన్ని యెన్ని దేవస్థలములు
సార్థకము గాని యెన్ని పాషాణములకు
గలిగె నీనాడు పసుపు గుంకాల పూజ!

★ కవికలంబున గల యలంకార రచన
కలదు కలదోయి శిల్పి, నీ యులిముఖమున;
గాకపోయిన బెను ఱాతికంబములకు
గుసుమవల్లరు లేరీతి గ్రుచ్చినావు?

★ ప్రతిమలు రచించి యొక మహారాజు చరిత
వల్లెవేయింప గలవు చూపరులచేత;
గవనమున జిత్రములు గూర్చు కవికి నీకు
దారతమ్యంబు లే దబద్ధంబు గాదు.

ఱాల నిద్రించు ప్రతిమల మేలుకొలిపి
యులిని సోకించి బయటికి బిలిచినావు;
వెలికి రానేర్చి, నీ పేర నిలపకున్నె
శాశ్వతుడ వోయి నీవు నిశ్చయముగాను.

తలయెత్తెన్ గద, నీదు చాతురి యజంతాగహ్వరశ్రేణి గే
వల పాషాణములందు; జీవకళ నిల్పంజాలు నీ సుత్తెలో
మొలుచు న్మానవ విగ్రహంబులు; మహాపుణ్యుండవయ్యా!హరి
త్తులు, నీ బొమ్మలచెంత ముగ్ధగతినందున్; శిల్పికంఠీరవా!

నునుపుల్ దీర్చి మదంబు చిందిపడ నేస్గున్ గున్నలన్ జెక్కి వై
చిన చాతుర్యము నీ శిరోగ్రమున నిల్చెన్సత్కిరీటాకృతిన్;
తెనుగుందేశము నిన్నువంటి పనివానిం జూచి యుప్పొంగుచుం
డును; నీ లేమి దలంచి కంట దడిబెట్టున్: శిల్పవిద్యానిధీ!

★ తెలిఊాతిన్ జెలువార నచ్చరపడంతిం దిద్ది యా సోగ క
న్నుల పజ్జన్ నిను నీవు దిద్దుకొని,సంతోషించుచున్నాడవా!
భళిరే! శిల్పిజగంబులోన జిరజీవత్వంబు సృష్టించుకో
గల నీకెవ్వడు సాటివచ్చును? నమస్కారంబు నీ ప్రజ్ఞకున్

## కవి పరిచయం



కవిపేరు :గుఱ్ఱం జాషువ
కాలము :1895 – 1971
జన్మస్థలం:వినుకొండ,
గుంటూరు జిల్లా.
రచనలు :గబ్బిలము, పిరదౌసి,
ముంతాజ్ మహల్,
నేతాజీ,బాపూజీ, క్రీస్తుకథ,
నా కథ, స్వప్నకథ,కొత్త లోకము,
ఖండకావ్యములు (7 భాగములు)
బిరుదులు:కవికోకిల, పద్మభూషణ్,
కళాప్రపూర్ణ,
నవయుగ కవిచక్రవర్తి.



© SCERT not to be republished

## భావం

1. ఓ శిల్పీ, మనసు చిగురించేట్లు ఒక నల్లరాతిలో భయంకరమైన సింహాల తలలు చెక్కావు. భూమిమీద కనిపించే కొండల్లోని రూపాలను ఎన్ని విధాలుగా చూస్తావో కదా?
2. మెత్తనైన నీ చేతి సుత్తిదెబ్బలతో ఎన్ని దేవాలయాలు బయటపడ్డాయో! ఒకనాడు వ్యర్థంగా పడిఉన్న ఎన్నో బండలకు నీవల్లనే పసుపుకుంకుమలతో పూజలు పొందే భాగ్యం లభించింది. (అంటే ఆ బండలను శిల్పి దేవతామూర్తులుగా మలిచాడన్నమాట)
3. కవి కలానికి ఉండే అలంకార రచనాశక్తి, నీ ఉలికి కూడా ఉంది. లేకపోతే కఠినమైన రాతి స్తంభంలో (పూసిన లేత కొమ్మలను) పూలగుత్తులను ఎలా చెక్కగలిగావు?
4. చూసేవాళ్ళచేత నీ శిల్పాలు ఒక మహారాజు కథను చెప్పించగలవు.కావ్యంలో బొమ్మలను చూపే కవికి, నీకు ఏ మాత్రం భేదం లేదు.ఇది అబద్ధం కాదు.
5. రాళ్ళలో నిదురపోతున్న బొమ్మలకు నీ ఉలిని తాకించి, మేల్కొలిపి బయటకి పిలిచావు. అవి బయటికి వచ్చి నీ పేరు నిలపవా? నీవు నిశ్చయంగా చిరంజీవివి.
6. అజంతాగుహలలో నీ నైపుణ్యం తలెత్తుకొంది కదా! నీ సుత్తి వట్టి బండరాళ్ళలో కూడా జీవకళను నిలవ గలదు. నీ సుత్తిలోనుంచి మానవ విగ్రహాలు పుడతాయి. ఓ శిల్పిశ్రేష్ఠుడా! నువ్వు పుణ్యమూర్తివి. సింహాలు నీ బొమ్మల దగ్గర చక్కదనాన్ని పొందుతాయి.
7. శిల్పవిద్యను ఎరిగినవాడా! మదజలం కారుతున్న ఏనుగును, వాటి పిల్లలను నున్నగా చెక్కిన నేర్పు నీ తలమీద కిరీటమై వెలుగుతున్నది. తెలుగునేల నీవంటి పనివాళ్ళను చూసి ఉప్పొంగుతున్నది. నీ దారిద్ర్యాన్ని చూసి కన్నీరు కారుస్తున్నది.
8. తెల్లరాతిలో అప్సరసను సృష్టించి, ఆమె విశాల నేత్రాలకు పక్కగా నిన్నునువ్వు మలచుకొని సంతోషపడుతున్నావా? భళా! శిల్పి ప్రపంచంలో శాశ్వతత్వాన్ని కల్పించుకోగలిగిన నీ కెవ్వరు సాటి వస్తారు? నీ బుద్ధికి నమస్కారాలు.

© SCERT not to be republished





## ఇవి చేయండి




### I. వినడం-మాట్లాడడం



1. పాఠంలో ఉండే పద్యాలను రాగయుక్తంగాను, భావయుక్తంగాను పాడండి.
2. కవి శిల్పిని శాశ్వతుడనీ, ఆయన ప్రజ్ఞకు నమస్కారం చేయమని చెప్పాడు. దీనిమీద మీ అభిప్రాయాన్ని చెప్పండి.
3. శిల్పి రాతిని శిల్పంగా మార్చడంలో పడే శ్రమను గురించి నువ్వేమనుకుంటున్నావు?
4. ఈ పాఠం విన్న తరవాత శిల్పిని గురించి మీకేమనిపించిందో చెప్పండి.

## II. చదవడం - రాయడం



1. **కింది పద్యపాదాలు పాఠంలోని ఏఏ పద్యాల్లో ఉన్నాయి. వాటి సందర్భమేమిటి?**

అ. బయలుపడె నెన్ని యెన్ని దేవస్థలములు.

ఆ. తారతమ్యంబు లే దబద్ధంబు గాదు.

ఇ. ఊల నిద్రించు ప్రతిమల మేలుకొలిపి

ఈ. జగంబులోన జిరజీవత్వంబు సృష్టించుకో గల

2. **కవికి- శిల్పికి మధ్య పోలికలున్న పద్యాలు ఈ పాఠంలో ఉన్నాయి. అవి ఏ ఏ పద్యాలలో ఉన్నాయో గుర్తించి వాటిని రాయండి.**

3. **కింది గద్యాన్ని చదవండి. ప్రశ్నలు రాయండి.**

జనపదం అంటే గ్రామం. జనపదంలో నివసించే వాళ్ళు జానపదులు. వీళ్ళు ప్రదర్శించే కళలను జానపదకళలు అంటారు. యక్షగానం, వీధి నాటకం, వీరభద్రవిన్యాసాలు హరికథ, ఒగ్గుకథ, బుర్రకథ వంటివి కొన్ని జానపద కళా రూపాలు. వీటిని కాపాడుకోవలసిన బాధ్యత మనపైన ఉంది.

చిత్రలేఖనం, సంగీతం, శిల్పం, నృత్యం, కవిత్వం వంటివి లలితకళలు. భావం మనస్సుకు హత్తుకొనే రకంగా బొమ్మను గీయడం చిత్రలేఖనం. వీనుల విందుగా ఉండే గానకళ సంగీతం. మనలను కదలకుండా అనేక భావాలను మనసుకు అందించే కళ శిల్పకళ. రాగ, తాళ, లయలకు తగిన విధంగా అభినయం చేయడం నృత్యకళ. ఒక భావాన్ని సూటిగా చెప్పకుండా మాటల వెనుక మరుగుపరచి మనసుకు ఉల్లాసం కలిగించే విధంగా పదాలను కూర్చి చెప్పేదే కవిత్వం.



4. **కింది ప్రశ్నలకు పాఠం చదివి జవాబులు రాయండి.**

అ. కవికి- శిల్పికి గల పోలికలు ఏమిటి?

ఆ. పసుపుకుంకాల పూజ పాషాణాలకు ఎందుకు కలిగింది?

ఇ. శిల్పిని గురించి "నిశ్చయముగా చిరంజీవి" అని కవి ఎందుకన్నాడు?

ఈ. శిల్పిని మహాపుణ్యుడని కవి ఎందుకన్నాడు?

ఉ. "భళిరే!" అని కవి శిల్పిని ఎందుకు పొగిడాడు?

ఊ. "సుత్తెనుండి మొలచునవి" అని కవి వేటిని ఉద్దేశించి చెప్పాడు?

ఎ. శిల్పి వేటిని చూస్తాడు?

## III. స్వీయరచన



1. **కింది ప్రశ్నలకు మీ సొంతమాటల్లో జవాబులు రాయండి.**

అ. శిల్పి రాళ్లలో ఏ ఏ రూపాలను చూసి ఉంటాడు?

ఆ. నల్లని రాళ్ళకు శిల్పిమీద కృతజ్ఞత ఎందుకుండాలి?

ఇ. శిలకు, శిల్పానికీ ఉండే భేదం ఏమిటి?

ఈ. కవికీ, చిత్రకారుడికీ ఉండే పోలికలు, భేదాలు ఏమిటి?

© SCERT not to be republished

ఉ. చూసే వాళ్ళకు శిల్పాలు మహారాజుల కథలు చెప్పగలవని కవి అంటున్నారు. కవి ఎందుకు అలా అన్నారు?

ఊ. "కవి" ఈ గేయంలో ఒకచోట శిల్పి దారిద్ర్యాన్ని చూసి, తెలుగుదేశం కంట తడి పెడుతుందని అన్నాడు కదా! దీన్ని గురించి మీ అభిప్రాయం ఏమిటి?

**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు**

అ. మన రాష్ట్రంలోని శిల్పకళాసంపదను గురించి వ్యాసం రాయండి.

ఆ. శిల్పాలలో ఉన్న గొప్పతనాన్ని గురించి నువ్వేమనుకొంటున్నావు?

ఇ. శిల్పి గొప్పదనాన్ని వివరిస్తూ వ్యాసం రాయండి.

ఈ. శిల్పకళ, కవిత్వం, చిత్రకళ, నాట్యకళ, వాద్యసంగీతం, గాత్రసంగీతం వంటి కళలు ఉన్నాయి కదా! వీటిలో నువ్వు దేన్ని నేర్చుకుంటావు? ఎందుకు?

## IV. పదజాలం



**1. కింది వాక్యాలను చదవండి. గీత గీసిన పదాలను మరో సందర్భంలో ఉపయోగించి రాయండి.**

అ. మాలో కొత్త ఆశలు చిగురించాయి.

ఆ. శిల్పకళ ఎన్నటికీ ఆరిపోయేది కాదు.

ఇ. ఆ సంగతి నాకు తెలియదు.

ఈ. ఆయన కీర్తి పదికాలాలపాటు నిలిచి ఉంటుంది.

ఉ. ఆయనది రాతిగుండె కాదు.

**2. కింది వాక్యాలు మీ పాఠంలోవే. వీటిలో గీత గీసిన పదాల అర్థాన్ని తెలుసుకొని వాక్యాలను తిరిగి రాయండి.**

అ. భయద సింహముల తలలు

ఆ. వసుధ గన్నట్టి పర్వతములందు

ఇ. శాశ్వతుడవోయి నిశ్చయముగాను

ఈ. తెనుగుందేశము నిన్నువంటి పనివానిం జూచి యుప్పొంగుచుండును.

ఉ. నీ సుత్తెలో మొలుచు న్మానవ విగ్రహంబు

**3. కింది పదాలు చదివి వాటికి సరిపడే అర్థం వచ్చే పదాన్ని ఉపయోగించి మీ మాటలతో వాక్యాలు రాయండి.**

ఉదా: చూసేవారు = చూపరులు; అక్కడి శిల్పకళాఖండాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

అ. దేవాలయాలు = ..................................................

ఆ. గుహల శ్రేణి = ..................................................

ఇ. ఏడవడం = ..................................................

ఈ. ఎప్పుడూ ఉండేవాడు = ..................................................

© SCERT not to be republished

4. **కింది వాక్యాలలో ఉన్న ప్రకృతివికృతులను వాడుతూ మరో వాక్యాన్ని రాయండి.**

అ. సింగం బావిలో తన మొహాన్ని చూసి అది మరో సింహం ముఖమని అనుకొంది.

ఆ. కరెంటు స్తంభాలు ఉరికంబాలు కాగూడదు.

ఇ. నిద్ర మనకు అవసరమే కాని మనమే నిద్దుర మొహాలం కాగూడదు.

ఈ. చరిత్రపాఠం మరో కొత్త చరితకు ఉపయోగపడాలి.

ఉ. పేదలకు సహాయం చేయడం పున్నెం. ఆ పుణ్యమే మనను నిలుపుతుంది.

5. **సూచనలు ఆధారంగా పాఠ్యాంశంలోని పదాలతో గళ్ళు నింపండి.**

**ఆధారాలు**

అడ్డం

1. శిల్పాలు చూపరుల చేత ఇలా చేయించగలవు
2. కవి చేతిలోనిది
3. దేవళంలో 'ళం' తీసేస్తే
4. మూడోపద్యం రెండో పాదంలో మొదటి పదం చివరి అక్షరం లోపించింది.
5. శిల్పంగా మారేది
6. శిల్పి ప్రజ్ఞకు .....................

| | | | | | |
|---|---|---|---|---|---|
| 1 | | ★ | 2 | | 3 |
| | ★ | 3 | | ★ | |
| | ★ | ★ | | ★ | |
| ★ | 4 | | ★ | ★ | |
| 5 | | ★ | 6 | ★ | ★ |
| | ★ | 6 | | | |

నిలువు

1. ఈ పదం భూమికి మరో అర్థం
2. కవిత్వం చెప్పడాన్ని ఇలా అంటారు.
3. రాతికి మరో పదం తలకిందులైంది.
4. చివరిపద్యం చివరి పాదంలోని మొదటి పదంలోని మొదటి అక్షరం మారింది.
5. శిలను శిల్పంగా మలిచేవాడు.
6. బొమ్మలు అని అర్థమున్న పదంలో మొదటి అక్షరం లోపించింది.




## V. సృజనాత్మకత



1. శిల్పి ఆత్మకథ రాయండి. దీన్ని ఏకపాత్రాభినయంగా ప్రదర్శించండి.
ఉదా: నేను తెలుసా ! నేను రాళ్లను చెక్కే.....

## VI. ప్రశంస



1. శిల్పాలు చెక్కడంలాగా చిత్రాలు గీయడం, పాటలు పాడడం, నాట్యం చేయడం, సంగీతం పాడడం వంటివి కూడా కళలే. వీటిలో నైపుణ్యమున్నవాళ్ళు ఎవరెవరు ఉన్నారు? వాళ్ళలో బొమ్మలు చేసేవాళ్ళు ఎవరు? వాళ్ళను గురించి చెప్పండి.
2. మీ గ్రామం / ప్రాంతంలోని కళలను గురించి, కళాకారులను గురించి వివరాలు తెలుసుకొని వాళ్ళ గొప్పదనాన్ని గురించి వివరించండి.

© SCERT not to be republished

## VII. ప్రాజెక్టు పని



1. శిల్పం, సంగీతం....... ఇలాంటి వాటికి సంబంధించిన అదనపు సమాచారం లేదా చిత్రాలు సేకరించండి. వాటిని గురించి రాసి గోడపత్రికలో ప్రదర్శించండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



1. **ఈ కింది పదాలను విడదీయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా॥ రాజేంద్రుడు | = | రాజ | + | ఇంద్రుడు | ( అ + ఇ = ఏ ) |
| అ. గజేంద్రుడు | = | ......... | + | ............. | ( ) |
| ఆ. మహేంద్రుడు | = | ......... | + | ............. | ( ) |
| ఇ. నరేంద్రుడు | = | ......... | + | ............. | ( ) |
| ఉదా॥ పరోపకారం | = | పర | + | ఉపకారం | ( అ + ఉ = ఓ ) |
| ఈ. మహోన్నతి | = | ......... | + | ............. | ( ) |
| ఉ. దేశోన్నతి | = | ......... | + | ............. | ( ) |
| ఊ. గృహోపకరణం | = | ......... | + | ............. | ( ) |
| ఉదా॥ మహర్షి | = | మహా | + | ఋషి | ( అ + ఋ = అర్ ) |
| ఎ. రాజర్షి | = | ......... | + | ............. | ( ) |

పైనపేర్కొన్న పదాలను 3 రకాలుగా విడదీయడం సాధ్యమైంది. అవి ..

అ/ఆ + ఇ/ఈ = ఏ,    అ/ఆ + ఉ/ఊ = ఓ,    అ/ఆ + ఋ/ౠ = అర్


మూడు సందర్భాల్లోనూ పూర్వస్వరం 'అ'; పరస్వరం స్థానంలో ఇ, ఉ, ఋ లు వచ్చాయి. 'ఇ' కలిసినపుడు 'ఏ'; 'ఉ' కలిసినపుడు 'ఓ'; 'ఋ' కలిసినపుడు 'అర్' ఆదేశంగా వచ్చాయి కదా!

ఏ, ఓ, అర్‌లను గుణాలు అంటారు. ఇలా ఏర్పడే సంధిని గుణసంధి అంటారు.

ఈ కింది పదాలను కలిపి, సంధి ఏర్పడ్డ విధానాన్ని చర్చించండి.

| | | | |
|---|---|---|---|
| ఉదా॥ రాజ + ఉత్తముడు | = | (అ + ఉ = ఓ) | రాజోత్తముడు |
| 1. సుర + ఇంద్రుడు | = | | |
| 2. మహా + ఈశ్వరుడు | = | | |
| 3. దేవ + ఋషి | = | | |
| 4. స్వాతంత్ర్య + ఉద్యమం | = | | |
| 5. రామ + ఈశ్వరం | = | | |
| 6. ఇతర + ఇతర | = | | |





### నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | ఈ పాఠంలోని పద్యాలను రాగ,భావయుక్తంగా పాడగలను, | ఔను / కాదు |
| 2. | ఈ పాఠంలోని పద్యభావాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | శిల్పి గొప్పదనాన్ని వివరిస్తూ వ్యాసం రాయగలను. | ఔను / కాదు |
| 4. | నూతన పదజాలాన్ని ఉపయోగించి సొంతవాక్యాలు రాయగలను. | ఔను / కాదు |
| 5. | శిల్పి ఆత్మకథను రాసి ఏకపాత్రాభినయం చేయగలను. | ఔను / కాదు |

లలిత కళల్లో మనోవాక్కాయకర్మలన్నీ మిళితమై ఉన్నాయి. - జాన్ రస్కిన్

©SCERT not to be republished

రెండో యూనిట్

# 7. భూదానం

మూలం : వినోబా భావే

అనువాదం : వేమూరి రాధాకృష్ణమూర్తి

ఆలోచించండి - మాట్లాడండి



ప్రశ్నలు :

1. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?
2. వీళ్ళు ఎందుకు పాదయాత్ర చేస్తున్నారు?
3. ఇలా పాదయాత్రలు చేసిన వారు మీకు తెలుసా? చెప్పండి?

## నేపథ్యం :

భూమి ప్రకృతిలో భాగం. అది అందరిదీ అని గుర్తించి భూమిని అందరికీ సమానంగా పంచడానికి 'భూదాన ఉద్యమం' చేపట్టారు వినోబా భావే. ఆ ఉద్యమంలో ఆయన పొందిన అనుభవాలను ఆయన మాటల్లోనే తెలుసుకొందాం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థం కాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

హైదరాబాదుకు సమీపంలో గల శివరాంపల్లిలో సర్వోదయ సమ్మేళనం జరుగబోతున్నది. రైల్లో వెళ్తే వార్ధానుంచి హైదరాబాదుకు ఒక రాత్రి ప్రయాణం. కాని నేను పాదయాత్ర చేయాలని నిర్ణయించుకున్నాను. ఇది మార్చి 1951 నాటి మాట. రైల్లోగాని, విమానంలోగాని వెళ్ళగూడదా? అని జనం అడిగారు. విమానాలవంటి యాత్రాసాధనాలను మనం ఎంత ఇష్టపడినా మన కాళ్లకు గల ప్రత్యేకత మన కాళ్లదే గదా! పాదయాత్ర సాగిస్తున్నప్పుడు ప్రకృతిని, ప్రజలను బహు దగ్గరగా చూడవచ్చు. అలాంటి అవకాశం మరే యాత్రాసాధనంవల్లా లభించదు. అలాంటి అనుభవం పొందాలనే లక్ష్యంతో పాదయాత్రకు పూనుకొన్నాను. మన దేశాన్ని ఈ విధంగా దర్శించడం ఊహాతీతమైన విషయం కాకపోయినా నిజానికి ఒక గొప్ప విశేషం. కాలినడకన యాత్ర సాగించి ఉండకపోతే ఇలాంటి అవకాశం నాకు లభించి ఉండేది కాదు.



వినోబాభావే

పల్లెప్రజల్లో ఉత్సాహం ఉంది. పట్టణాల ప్రజలలోకూడా ఉత్సాహం ఎక్కువగానే ఉంది. వీళ్ళను కలియడం ఎంత అవసరమో ఇప్పుడు బోధపడింది. చిన్న చిన్న గ్రామాలలో మకాంచేయాలని అనుకొన్నా. సాధ్యమైనచోట్ల గ్రామాలలో కొందరి ఇళ్ళకు కూడా వెళ్ళి వచ్చా. నాకు తెలుగు వచ్చు. కానీ తెలుగులో మాట్లాడలేను. అయినా నాకు వచ్చిన తెలుగు భాషవల్ల ఎంతో ప్రయోజనం కలిగింది. ప్రార్థన సభల్లో స్థితప్రజ్ఞుని లక్షణాలను గురించి తెలుగులో చెప్పేవాణ్ణి. నా తెలుగు మాటలు ప్రజల హృదయాలకు హత్తుకోడం నేను గమనించాను. మనవాడే, మన సోదరుడే మాట్లాడుతున్నాడనివాళ్ళు భావించేవారు. ఎంతో ప్రేమతో ప్రజలు మాకు స్వాగతం పలికారు. శివరాంపల్లి వెళ్ళవలసిన అవసరం లేకపోతే తోవలో కొద్ది రోజులపాటు ఉండవలసిన గ్రామాలు అనేకం తగిలాయి. ఒక ఊరు వెళ్ళడం, అక్కడి పరిస్థితి చూడడం, అక్కడి లోటుపాట్లు తెలుసుకోడం, అక్కడి సమస్యల్ని పరిష్కరించగలగడం అనే పనులు చేసినా ఆ చోటు వదిలి ముందుకు సాగిపోవడం నాకు నచ్చలేదు. కాని అలా చేయక తప్పలేదు. ఇక ఆయా చోట్ల ఆ పనులు చేసేందుకు అక్కడి స్థానికుల్ని తయారుచేసే ప్రయత్నం కూడా చేశా. ఒక్క విషయం స్పష్టంగా బోధ పడింది. ప్రతి గ్రామంలోనూ మనకు సంబంధించిన వ్యక్తి ఒకరు ఉండాలి. వారితో మనకు సంబంధం ఏర్పడి ఉండాలి. అప్పుడు ఎన్నో ఘనకార్యాలను మనం సాధించవచ్చుననే నిర్ణయానికి వచ్చాను.



భూదానోద్యమంలో వినోబాభావే పాదయాత్ర

శంకరాచార్యులు, మహావీరుడు, బుద్ధుడు, కబీర్, చైతన్యుడు, నామదేవ్ వంటివాళ్ళు భారతదేశంలో కాలినడకన తిరిగారు. వారు కావాలనుకొంటే గుర్రాలమీద తిరగగలిగేవారే. కాని వారంతా వేగంగా నడిచే వాహనాన్ని అభిలషించలేదు. ప్రజల ఆలోచనాప్రక్రియలో మార్పు తేవాలని వారు కోరుకోవడమే అందుకు కారణం. పాదయాత్రే తగిన యాత్రా సాధనమని వారు విశ్వసించారు. దేశమంతా కాలినడకన తిరిగారు. అయితే ఈనాటి యుగంలో పాదయాత్రను గురించి యోచించడమే విడ్డూరంగా ఉంటుంది. కాని ప్రశాంతంగా యోచిస్తే అంతకంటే మించిన మంచి సాధనం మరొకటి లేదని చెప్పక తప్పదు. అందువల్ల కాలినడకన తిరగాలనే నిర్ణయానికి వచ్చాను. ఇలా తిరిగేటప్పుడు ప్రతి మాటా నిండు హృదయంతో, ఎంతో విశ్వాసంతో చెప్పేవాణ్ణి. అందుకు అవసరమైన నిబ్బరం, ఆత్మవిశ్వాసం నాకు కలిగాయి.

1951 ఏప్రిల్ 8వతేది. అది మా యాత్రలో మూడోరోజు. పోచంపల్లిలో గ్రామదళితులు మమ్మల్ని కలుసుకోడానికి వచ్చారు. "మాకు కొద్దిగా భూమి దొరికితే కష్టపడి పనిచేసుకుంటాం. కష్టార్జితం తింటాం," అని వాళ్ళు చెప్పారు. వాళ్ళకు

80 ఎకరాల పొలం అవసరం అని తేలింది. "మీకు పొలం కావాలంటే ఇప్పిస్తా! కాని ఒక్క షరతు. మీరు విడివిడిగా పొలం తీసుకోగూడదు. అంతా కలిసి మొత్తం పొలంలో సమష్టి వ్యవసాయం చేసుకోవాలి," అని చెప్పాను.

మా షరతుకు వాళ్లు అంగీకరించారు. అయితే కాగితంమీద రాసి సంతకాలుచేసి ఇవ్వండి. మీ అర్జీని ప్రభుత్వానికి పంపిస్తాను అని చెప్పాను. కాని అక్కడే అదే సభలో ఒక సోదరుడు (వెదిరె రామచంద్రారెడ్డి) వంద ఎకరాల భూమి దళితులకు ఇవ్వడానికి సంసిద్ధతను వెల్లడించారు. "మీకు వంద ఎకరాల పొలం దానంగా ఇస్తాను." అని నా సమక్షంలో ఆయన దళితులకు వాగ్దానం చేశారు.

వినోబాభావే సమక్షంలో వంద ఎకరాల పొలం దానం ఇస్తానని ప్రకటిస్తున్న వెదిరె రామచంద్రారెడ్డి



ఇది ఒక అసాధారణమైన ఘట్టం. సాధారణంగా రక్తపాతానికి, కోర్టు కచ్చేరీల చుట్టూ తిరగడానికి, కుత్తుకలు నరుక్కోడానికి ఆటపట్టు అవుతుంది పొలం. అటువంటి పొలం, అందులో వంద ఎకరాల భూమి దానంగా లభించడం సామాన్యమైన విషయమా? దీని వెనక ఏదో ఒక కారణం, ఏదో ఒక సంకేతం ఉన్నది అని అనిపించింది. ఆ రాత్రంతా యోచిస్తూనే ఉన్నాను. ప్రజలు ప్రేమతో భూమిని ఇవ్వగలరు అనే అనుభూతి నాకు కలిగింది.

పండిత జవాహర్‌లాల్ నెహ్రూ నాకు ఒక జాబు రాశారు. ఆ జాబులో, ఇప్పుడు జరుగుతున్నదానికి తమ సంతోషం వ్యక్తం చేశారు. ఆయనకు సమాధానం రాసి పంపాను. అసలు ఏ సమస్యనైనా అహింసావిధానంలో తప్పక పరిష్కరించవచ్చు. అందుకు హృదయశుద్ధి అవసరం. ఇంతవరకు ఈ విషయం నా ఊహలో మాత్రమే ఉంది. కాని ఇప్పుడు అది ఆచరణలోకి వచ్చిందని తెలుసుకున్నాను.

భూసమస్య చాలా పెద్దది. ఇది అంతర్జాతీయ సమస్య. ఈ సమస్యను మనం శాంతియుతంగా పరిష్కరించగలిగితే స్వరాజ్యం లభించిన తరవాత మనం సాధించిన ఘనకార్యమవుతుంది. ఊహించే శక్తితో మనం యోచించగలిగితే ఈ సమస్యలో ప్రపంచశాంతికి సంబంధించిన బీజాలు నిక్షిప్తమై ఉన్నాయని బోధపడుతుంది. నేనేదో గొప్ప సమస్యను పరిష్కరిస్తున్నాననే భావం నాకు కలగలేదు. ఆ విధంగా భావిస్తే అది అహంకారానికి హేతువవుతుంది. కాని ఒక్క విషయం మాత్రం నేను గ్రహించగలిగాను. భూసమస్య విషయంలో కలిగిన ప్రత్యక్షానుభవాన్ని సరిగా అర్థం చేసుకోగలిగితే భూసమస్యాపరిష్కారానికి మార్గం సుగమమవుతుంది. భూదానంకోసం ప్రజలముందు చేయి చాచాను. నెమ్మది నెమ్మదిగా భావప్రచారం జరిగింది. భగవంతుడు నా మాటలకు శక్తిని ప్రసాదించాడు. ప్రభుత్వ శక్తికి మించిన కార్యం. ఇది జీవిత విలువల్ని మార్చివేసే కార్యక్రమం అని ప్రజలు గ్రహించారు.

ఇది ఒక యజ్ఞం. దీనికి భూదానయజ్ఞం అని పేరు పెట్టాను. ఇది సాధారణమైన యజ్ఞం కాదు. ఈ యుగంలో జరిగిన ఈ ఘట్టం అసాధారణమైనది. అందుకు కారణం ఇది ఒక మహత్తరమైన దానం కావడమే. చిత్తశుద్ధితో ప్రజలు చేసిన మహత్కార్యం, ప్రజల ఔదార్యానికి ఒక తార్కాణం. అందుకు నేనే సాక్షిని.

నేను ప్రతి చోటా స్పష్టంగా చెప్పాను. బీదవాళ్లకు ఏదో ఉపకారం చేశామని దాతలు భావించగూడదు. అది అహంకారం అవుతుంది. దానివల్ల మేము ఆశించిన ఫలితం చేకూరదు. గాలిమీద, నీటిమీద, వెలుగుమీద అందరికీ హక్కు ఉన్నట్లే భూమి మీదకూడా అందరికీ హక్కు ఉన్నది. కొందరి దగ్గర ఒక్క అంగుళమైనా భూమి లేకపోవడం, కొందరి దగ్గర వందలాది వేలాది

ఎకరాలు పడిఉండటం సబబు కాదు. ధర్మం కాదు. ఈ విషయాన్ని సక్రమంగా గ్రహించి భూదానం చేసినప్పుడే నా సంకల్పం నెరవేరుతుంది అని స్పష్టంగా దాతలకు, ప్రజలకు చెప్పాను. చేసిన తప్పును సవరించుకొంటున్నామనే భావంతో ఇలాంటి సత్కార్యానికి పూనుకోమని కూడా చెప్పాను. ఎవరైనా భూదానానికి ముందుకు వచ్చినప్పుడు వారి దానంలో తామస భావంగాని, రాజసభావం గాని ఇమిడి ఉన్నదా అని జాగ్రత్తగా పరిశీలించి చూసేవాణ్ణి. అలాంటి భావం కనబడితే ఆ దానం నేను స్వీకరించలేదు. ఏదో విధంగా భూమిని సమీకరించడం నా లక్ష్యం కాకపోవడమే అందుకు కారణం.

పేదలకు భూమిని ఇప్పించడమే పాదయాత్రలో నా ప్రధాన కార్యక్రమం. తల్లికీ బిడ్డలకూ కలిగిన ఎడబాటును తొలగించి ఇద్దరినీ దగ్గరకు చేర్చడమే నా లక్ష్యం. దేశంలో దానం చేయాలన్న ప్రవృత్తిని మేల్కొలపాలి. ఒక ప్రభంజనాన్ని సృష్టించాలి. ఆ ప్రేరణే నన్ను ముందుకు నడిపిస్తున్నది. భూదాన యజ్ఞానికి మూలం గాంధీజీయే!

పవనార్‌నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర సాగింది. అప్పటికి సుమారు 35 వేల ఎకరాల భూమి దానరూపంలో లభించింది. భారతీయుల సంస్కృతివిశేషాలతో విలసిల్లిన ఈ భూఖండంలో శాంతియుతంగా సాగిన ఈ ఉద్యమానికి ప్రజల సహకారం పూర్తిగా లభించింది. దేశంలో మొత్తం 30 కోట్ల ఎకరాల భూమి ఉన్నది. ఆ మొత్తంలో 6వ భాగం ఇమ్మని కోరాను. భారతదేశంలో గల ఒక్కొక్క కుటుంబంలో సగటున ఐదుమంది చొప్పున ఉన్నారు. ఆ కుటుంబంలో మరొకణ్ణి చేర్చుకోమని చెప్పాను. సామాన్య బీద ప్రజానీకమే ఆరోవ్యక్తి. అందువల్లనే ఆ ఆరోవ్యక్తి కోసం నేను మొత్తం భూమిలో ఆరోభాగం ఇమ్మని కోరాను.


భూదానోద్యమ సభలో వినోబాభావే

"నేను చేస్తున్నదంతా ఏమిటి? నా ఉద్దేశం ఏమిటి? నేను మార్పు కోరుతున్నాను. మొదట హృదయ పరివర్తనం. తరవాత జీవన పరివర్తనం. తరవాత సమాజ పరివర్తనం. ఈ విధంగా మూడు విధాల మార్పులు అంటే మూడు రకాల విప్లవాలు రావాలని నా ఆకాంక్ష." నేను మొదటినుంచి న్యాయం, అధికారం అనే ప్రాతిపదికమీద భూదానాన్ని గురించి ప్రస్తావిస్తూ ఉన్నాను. న్యాయం అంటే చట్టపరమైన న్యాయం కాదు. నేను కోరేది భగవంతుని విధానం ప్రకారం లభించే న్యాయం. స్వరాజ్యశాస్త్రం అనే నా గ్రంథంలో ఈ విషయం స్పష్టంగా పేర్కొన్నాను. మనం చట్టరీత్యా భూమిని సంపాదించాలి.

నేను భూసమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని కోరుకున్నాను. భారతదేశమంతటా భూదానాన్ని గురించి ఒక్కొక్క సభ జరుగుతూ ఉండేది. భూమిని ఇమ్మని నేను ప్రజల్ని కోరడం, వాళ్ళు భూదానం చేయడం ముమ్మరంగా సాగింది. ఒక ఏడాదిలో ఒక లక్ష ఎకరాల భూమి దానరూపంలో లభించింది. నా ఆనందానికి అవధులు లేవు.


పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎన్నో అనుభవాలు కలిగాయి. వాటినన్నింటినీ రెండు మాటల్లో క్రోడీకరించి చెబుతున్నాను. నా అనుభవాల్ని టూకీగా ఎలా చెప్పాలా అని యోచించాను. సాక్షాత్కారం అనే మాట నాకు గోచరించింది; ఈ రూపంలో నిజంగా నాకు లభించింది దేవుని సాక్షాత్కారమే! మనిషి మనస్సులో మంచితనం ఉంది. దాన్ని వెలికితీయవచ్చుననే కృతనిశ్చయంతో నేను పనిచేశాను. అందుకు భగవంతుడు ఈ రూపంలో నా ముందు సాక్షాత్కరించాడని నా దృఢ విశ్వాసం. మనిషి మనస్సు ఈర్ష్య, అసూయ, మాత్సర్యం,లోభం మొదలయినవాటికి నిలయం అని విశ్వసించి బయలుదేరి ఉంటే నాకు ఆ గుణాలే దర్శనం ఇచ్చి ఉండేవి. అలా జరగలేదు. భగవంతుడు అనుగ్రహించాడు. దేవుడు కల్పవృక్షం వంటివాడు. మనం ఏ రూపంలో కోరుకుంటే ఆ రూపంలో దర్శనమిస్తాడనే సత్యాన్ని నేను తెలుసుకోగలిగాను.



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. "పాదయాత్ర" అని పాఠం పేరును విన్నప్పుడు మీరేమి అనుకున్నారు?
2. ఈ పాఠం ఎవరి పాదయాత్రకు సంబంధించినది? ఆయన దేనికోసం పాదయాత్ర చేశారు?
3. ఈ పాఠంద్వారా మీరు గ్రహించినదేమిటి?
4. "భూ సమస్య చాలా పెద్దది" అని వినోబా అన్నారు కదా! ఇలా ఎందుకు అని ఉంటారు? ఇది ఈనాటి పరిస్థితులలో కూడా ఇలాగే ఉందా? దీనిమీద మీ అభిప్రాయం చెప్పండి.

### II. చదవడం - రాయడం





**1. కింది వాక్యాలు చదవండి. ఆ వాక్యాలకు సమానభావం వచ్చే వాక్యాన్ని గుర్తించండి.**

**అ. పల్లెపట్టణాల ప్రజల్లో ఉత్సాహం ఎక్కువగా ఉంది. పల్లెల్లో ఆప్యాయతతో కూడిన ప్రత్యేక విశేషం కనపడింది.**

ఎ. పల్లె పట్టణాల ప్రజల్లో ప్రత్యేక విశేషం ఉంది. ( )
బి. పల్లె ప్రజల కంటే పట్టణాల ప్రజల్లో ఎక్కువ విశేషం ఉంది. ( )
సి. పల్లె ప్రజల్లో పట్టణ ప్రజలకంటే తక్కువ విశేషం కనబడింది. ( )
డి. ఆప్యాయత అనే ప్రత్యేక విశేషం పల్లెప్రజల్లో ఎక్కువగా కనబడింది. ( )

**ఆ. వినోబాకు తెలుగు వచ్చు. కానీ తెలుగులో మాట్లాడలేరు. అయినా వచ్చిన తెలుగు భాషవల్ల ఎంతో ప్రయోజనం కలిగింది.**

ఎ. వినోబాకు తెలుగు వచ్చు. కానీ సరిగా మాట్లాడలేరు. ( )
బి. వినోబాకు తెలుగు రాదు. కాబట్టి అసలే మాట్లాడలేరు. ( )
సి. వినోబాకు తెలుగు బాగా వచ్చు, బాగా మాట్లాడగలరు. ( )
డి. వినోబాకు తెలుగు బాగా రాదు. కాని ఎంతో కొంత మాట్లాడగలరు. ( )

**ఇ. శివరాంపల్లి వెళ్ళవలసిన అవసరం లేకపోతే తోవలో కొద్ది రోజులపాటు ఉండవలసిన గ్రామాలు అనేకం తగిలాయి.**

ఎ. శివరాంపల్లికి తప్పకుండా వెళ్ళాలి కాబట్టి తోవలోని గ్రామంలో ఉండవలసిన అవసరం ఉన్నా ఉండకుండా వెళ్లారు. ( )
బి. శివరాంపల్లికి వెళ్ళ వలసిన అవసరం లేదు. అందుకే తోవలోని గ్రామాల్లో ఉండకుండా వెళ్ళారు. ( )
సి. శివరాంపల్లికి వెళ్లారు. తోవలోని గ్రామాల్లో కూడా కొద్ది రోజులు ఉండి వెళ్ళారు. ( )
డి. శివరాంపల్లికి వెళ్ళడం కంటే ఇతర గ్రామాల్లో ఉండడం ఎక్కువ అవసరం. ( )

**ఈ. 'మాకు కొద్దిగా భూమి దొరికితే, కష్టపడి పని చేసుకుంటాం; కష్టార్జితం తింటాం.'**

ఎ. కష్టపడి పని చేయడానికి భూమి ఉంటే, మేము మా కష్టార్జితం తింటాం. ( )
బి. భూమి లేదు కాబట్టి , మేము కష్టపడి కష్టార్జితం తింటున్నాం. ( )
సి. మాకు కొద్దిగా భూమి దొరికితే కష్టపడకుండా తినవచ్చు. ( )
డి. మాకు భూమి ఉన్నది కాబట్టి మేము కష్టార్జితం తినవలసిన పనిలేదు. ( )

© SCERT not to be republished

2. పాఠంలోని కింది పేరాలు చదవండి. ఆ పేరాలోని ముఖ్యమైన పదం / పదాలు కింద గీత గీయండి. అవి ఎందుకు ముఖ్యమైనవో రాయండి.

1వ పేరా, 3వ పేరా, 6వ పేరా, 7వ పేరా, 13వ పేరా, చివరిపేరా.

3. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.

అ. వినోబా శివరాంపల్లికి ఎలా వెళదామనుకున్నారు? ఎందుకు?
ఆ. వినోబాకు తెలుగు రావడంవల్ల ఎలాంటి ప్రయోజనం పొందారు?
ఇ. వినోబా గ్రామాలకు వెళ్ళడం వల్ల ఏమి గ్రహించారు?
ఈ. వినోబాగారి లాగ ఇంకా ఎవరెవరు పాదయాత్ర చేశారు? ఎందుకు?
ఉ. వినోబాకు పోచంపల్లిలో ఎలాంటి అనుభవం ఎదురైంది?
ఊ. వినోబా భూసమస్యను ఎలా పరిష్కరించాలని భావించారు?
ఎ. వినోబా ఎలాంటివారి నుండి భూ దానం స్వీకరించారు?
ఏ. వినోబా ఎలాంటి మార్పును కోరుకున్నారు?

## III. స్వీయరచన




1. కింది ప్రశ్నలకు ఆలోచించి నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.

అ. వినోబా పాదయాత్ర చేద్దామని ఎందుకు అనుకున్నారు?
ఆ. రైలుయాత్ర, విమానయాత్ర కంటే పాదయాత్ర మంచిదని వినోబా భావించారు కదా! దీనిమీద మీ అభిప్రాయం ఏమిటి?
ఇ. "పల్లెల్లో పట్టణాల కంటే ఆప్యాయతతో కూడిన ప్రత్యేక విశేషం కనబడింది," అని వినోబా అన్నారు కదా! పల్లెల్లోని ప్రత్యేక ఆప్యాయత అంటే ఏమై ఉంటుంది?
ఈ. ఏదైనా ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి భాషను నేర్చుకోవడం అవసరమా? ఎందువల్ల?
ఉ. సమష్టి వ్యవసాయం అంటే ఏమిటి? ఈనాడు గ్రామాల్లో సమష్టి వ్యవసాయాలు జరగక పోవడానికి గల కారణాలు ఏమిటి?
ఊ. బీదలకు ఉపకారం చేశామని దాతలు భావించగూడదని వినోబా చెప్పారు కదా! ఆయన ఎందుకని అలా అని ఉంటారు?
ఎ. పేదలకు భూమికి ఉండే సంబంధం తల్లికి, బిడ్డలకు ఉన్న సంబంధం వంటిది అని వినోబా అన్నారు కదా! అది సరైందేనా? ఎందుకు?

2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు : కింది ప్రశ్నలకు 10 వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ. వినోబా గురించి 10 వాక్యాలలో వ్యాసం రాయండి.
ఆ. కొందరికి అసలే భూమి లేకపోవడం, మరికొందరికి వందల ఎకరాల భూమి ఉండడం అనే పరిస్థితి నేడు కూడా ఉంది కదా! ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి మీరు సూచించే పరిష్కార మార్గాలు ఏమిటి?

## IV. పదజాలం



1. పాఠం ఆధారంగా కింది పదాల అర్థాలు తెలుసుకోండి. వీటిని వివరిస్తూ రాయండి.

అ. "కష్టార్జితం" అంటే ..................................................................
ఆ. "నిండు హృదయం" అంటే..........................................................

© SCERT not to be republished

ఇ. "అసాధారణ ఘట్టం" అంటే.......................................................

ఈ. "హృదయశుద్ధి" అంటే.......................................................

ఉ. "జీవన పరివర్తనం" అంటే.......................................................

ఊ. "సమాజ పరివర్తనం" అంటే.......................................................

ఎ. "సత్కార్యాలు" అంటే.......................................................

**2. కింది ఆధారాలతో ఖాళీలు పూరించండి.**

అ. కాలినడకన చేసే యాత్ర □□ యాత్ర

ఆ. పుణ్యక్షేత్రాలకోసం చేసే యాత్ర □□ యాత్ర

ఇ. ఆనందంగా తిరగడానికి చేసే యాత్ర □□□ యాత్ర

ఈ. తెలివితేటలు పెంచుకోవడంకోసం చేసే యాత్ర □□□ యాత్ర

ఉ. జయించాలని కోరికతో చేసే యాత్ర □□ యాత్ర

ఊ. అంతరిక్షంలోకి వెళ్ళడం □□□□ యాత్ర

ఎ. జీవించడం, బతుకుతెరువు కోసం తిరగడం □□□ యాత్ర

ఏ. దేవుణ్ణి రథంమీద ఉంచి ఊరేగించడం □□ యాత్ర

ఐ. ఇతర రాజ్యాలను ఆక్రమించడంకోసం చేసే యాత్ర □□ యాత్ర


## V. సృజనాత్మకత



1. నువ్వే వినోబా స్థానంలో ఉంటే, నేటి పరిస్థితుల్లో ప్రజలకు ఏమని సందేశం ఇస్తావు? దాన్ని రాసి ఏక పాత్రాభినయం చేయండి.

2. ఈనాటి పరిస్థితులకనుగుణంగా భూదానం ఆవశ్యకతను వివరిస్తూ ఒక కరపత్రాన్ని లేదా పోస్టరును తయారు చేసి ప్రదర్శించండి.


## VI. ప్రశంస



1. భూదానం అనేది ఒక సత్కార్యం. ఇలాంటివే ఇంకా ఏ ఏ సత్కార్యాలు చేయవచ్చు? ఇలాంటి సత్కార్యాలు చేసినవారిని అభినందిస్తూ లేఖ రాసి ప్రదర్శించండి.

2. వినోబా భూదాన ఉద్యమంకోసం చేసిన పాదయాత్రను అభినందిస్తూ, ఆయనకు ఏమని లేఖ రాస్తారు? రాసి గోడ పత్రికలో ప్రదర్శించండి.

## VII. ప్రాజెక్టు పని



1. పోచంపల్లిలో రామచంద్రారెడ్డిగారు వినోబాభావే ప్రసంగానికి ప్రేరణపొంది ఒకేసారి వంద ఎకరాలను దానం చేశారు కదా! అలా మీ ఊరిలోనూ పేరు పొందిన దాతలు కొందరు ఉంటారు కదా! వాళ్ళ పేర్లను సేకరించి ఎవరు ఏ రకమయిన దానం చేశారో తెలియజేసే వివరాలను రాసి గోడపత్రికలో పెట్టండి.

© SCERT not to be republished

## VIII. భాషగురించి తెలుసుకుందాం



**1. కింది పదాలను విడదీయండి.**

| | | | | | |
|---|---|---|---|---|---|
| ఉదా॥ | వసుధైక | = | వసుధ + ఏక | = | ( అ + ఏ = ఐ ) |
| అ. | రసైక | = | ....... + .......... | = | ( ) |
| ఆ. | సురైక | = | ....... + .......... | = | ( ) |
| ఉదా॥ | సమైక్య | = | సమ + ఐక్య | = | ( అ + ఐ = ఐ ) |
| ఇ. | అష్టైశ్వర్యం | = | ....... + .......... | = | ( ) |
| ఈ. | దేవైశ్వర్యం | = | ....... + .......... | = | ( ) |
| ఉదా॥ | పాపౌఘము | = | పాప + ఓఘము | = | ( అ + ఓ = ఔ ) |
| ఉ. | దివౌకసులు | = | ....... + .......... | = | ( ) |
| ఊ. | వనౌషధి | = | ....... + .......... | = | ( ) |
| ఉదా॥ | రసౌచిత్యం | = | రస + ఔచిత్యం | = | ( అ + ఔ = ఔ ) |
| ఎ. | దివ్యౌషధం | = | ....... + .......... | = | ( ) |
| ఏ. | దేశౌన్నత్యం | = | ....... + .......... | = | ( ) |

**2. పైన పేర్కొన్న పదాలను విడదీసినప్పుడు మీరు గమనించిన విషయం సరిచూడండి...**

అ) ఈ సంధి ఏర్పడేటప్పుడు ప్రతిసారీ పూర్వస్వరంగా 'అ' వచ్చింది

ఆ) పరస్వరం స్థానంలో వరుసగా ఏ, ఐ ఓ, ఔ లున్నాయి.

ఇ) 'అ'కారానికి ఏ, ఐ లు కలిసినపుడు 'ఐ'వచ్చింది.

ఈ) 'అ'కారానికి ఓ, ఔలు కలిసినపుడు 'ఔ' వచ్చింది.

అంటే –


i. 'అ'కారానికి ఏ, ఐ లు పరమైనపుడు 'ఐ' వస్తుంది.

ii. 'అ'కారానికి ఓ, ఔ లు పరమైనపుడు 'ఔ' వస్తుంది.

ఐ; ఔ లను వృద్ధులు అంటారు.

ఈ సంధి వృద్ధిసంధి.

పై తరగతుల్లో ఈ సంధిని గురించి మరింత వివరంగా తెలుసుకుంటారు.





### నేనివి చేయగలనా?



| | |
|---|---|
| 1. వినోబాను గురించి ఆయన చేసిన పాదయాత్రను గురించి సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. "ఆత్మకథ" రూపంలోని ఈ పాఠాన్ని చదివి అర్థంచేసుకొని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. పాఠంలోని పదజాలాన్ని సొంత మాటల్లో వినియోగించగలను. | ఔను / కాదు |
| 4. వినోబాను గురించి, భూదాన ఉద్యమాన్ని గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 5. భూదాన ఉద్యమాన్ని గురించి కరపత్రం / పోస్టర్ తయారుచేయగలను. | ఔను / కాదు |

మీరు సాహసంతో పనిని చేపట్టలేకపోతే మీరు ఓటమికి గురి కానేకారు. కానీ మీరు జీవితంలో ఏదీ సాధించలేకపోతారు.
– వినోబా భావే

© SCERT not to be republished

రెండో యూనిట్

# 8. పిల్లలకో ఉత్తరం

ఆలోచించండి - మాట్లాడండి

ఆంగ్లమూలం : జవాహర్‌లాల్ నెహ్రూ



ప్రశ్నలు

1. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏంచేస్తున్నారు?
2. చిత్రంలో చాచా నెహ్రూ పిల్లలతో ఏంమాట్లాడుతున్నారో ఊహించి చెప్పండి?
3. పిల్లలు నెహ్రూ గారిని కలవడానికి ఎందుకు వెళ్ళి ఉంటారు?

విద్యార్థులకు సూచనలు

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాల, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థం కాని పదాల, వాక్యాల గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న అకారాది పట్టిక ఆధారంగా తెలియని పదాల అర్థాలు గ్రహించండి.

కొత్త ఢిల్లీ,
1949 డిసెంబరు 3.

ప్రియమైన పిల్లలూ!


మన దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ

పిల్లలతో కలిసి ఉండటం, వాళ్ళతో మాట్లాడటం, అంతకన్నా ఎక్కువగా వాళ్ళతో ఆడటమంటే నాకెంతో ఇష్టం. ఇప్పుడు నేను చాలా పెద్దవాణ్ణి చాలా కాలంకిందట నేను పిల్లవాణ్ణి. ఈ విషయాన్ని మరచిపోయాను.

కాని మీకు ఉత్తరం రాయటానికి కూర్చోగానే ఇప్పటి నా వయస్సును మరిచిపోలేక పోతున్నాను. ఆ భావనే నానుంచి మిమ్మల్ని దూరం చేస్తుంది. పెద్దపెద్ద ఉపదేశాలు ఇవ్వడం, పిల్లలకు ఉచిత సలహాలు ఇవ్వడం మాలాంటి పెద్దవాళ్ళకు ఉండే అలవాటు.

నేను బాలుడిగా ఉన్నప్పుడు ఇలాంటి సలహాలు, ఉపన్యాసాలు వినడం ఇష్టపడేవాణ్ణి కాదని నాకు బాగా గుర్తు. అందువల్ల మీరుకూడా దీన్ని ఇష్టపడరని భావిస్తున్నాను. పెద్దవాళ్ళు తాము చాలా తెలివిగలవాళ్ళమనే విధంగా ప్రవర్తిస్తూంటారు. కానీ వాళ్ళలో కొద్దిమంది మాత్రమే విజ్ఞానవంతులు. అయితే నేను తెలివిగలవాణ్ణి అవునో కాదో ఇప్పటికీ తేల్చుకోలేకపోతున్నాను.

ఒక్కొక్కప్పుడు ఇతరులు చెప్పే మాటలు వింటూంటే నేను కూడా వివేకవంతుణ్ణి, ప్రతిభావంతుణ్ణి, ముఖ్యుడిననే అనుకుంటూంటాను. అప్పుడు నన్ను నేను పరిశీలించుకొని సంశయానికి లోనవుతాను. ఏ సందర్భంలోనూ విజ్ఞానవంతులు తమ తెలివితేటలను గురించి ప్రస్తావించరు. అంతే కాకుండా వాళ్ళు అధికులమని కూడా చాటుకోరు.

మరి దేన్ని గురించి నేను మీకు రాయాలి? మీరు నా దగ్గర ఉండి ఉంటే అందమైన ఈ మన ప్రపంచాన్ని గురించి, పూలూ, చెట్లూ, పక్షులూ, జంతువులూ, నక్షత్రాలూ, పర్వతాలూ, హిమానీనదాలే కాకుండా మన చుట్టూ ప్రపంచంలో ఉన్న అందమైనవాటన్నింటి గురించి మీతో ఎంతో ఇష్టంగా ముచ్చటించేవాణ్ణి. మన చుట్టూ ఉన్న ఈ అందాన్ని నిత్యం గమనించవచ్చు. అయితే పెద్దవాళ్ళం మేము తరుచుగా మా వాదనలతో, కలహాలతో ఈ అందమైన విషయాలను మరిచిపోతూంటాం. అందాన్ని కోల్పోతాం. మేము ఆఫీసుల్లో కూర్చొని ఎంతో ముఖ్యమైన పనిచేస్తున్నామని అనుకుంటూంటాం.

© SCERT not to be republished

మీరు ఎంతో సున్నితంగా ప్రవర్తిస్తారని, మీచుట్టూ ఉన్న ఈ అందాలను గురించి, జీవితాన్ని గురించి మీ దృష్టిని, మీ వీనుల్ని, హృదయాల్ని విశాలం చేసుకొంటారని ఆశిస్తాను. పేర్లనుబట్టి పూలను, కూతల్ని బట్టి పక్షులను మీరు గుర్తించగలరా? ప్రేమతో, స్నేహభావంతో వాటికి దగ్గరగా వెళ్ళాలి. అప్పుడే వాటితోపాటు ప్రకృతిలోని అన్నింటితో స్నేహంచేసుకోవడం ఎంత సులభమో గ్రహిస్తారు. పూర్వకాలంనాటి అద్భుతగాథలు, కథలు మీరు చదివే ఉంటారు. కానీ ఎవరూ రాయని ఒక గొప్ప అద్భుత సాహసగాథ ఈ ప్రపంచం. కేవలం మనం ఈ జీవితాన్నీ ప్రపంచంలోని సౌందర్యాన్నీ మన కళ్ళతో చూసేందుకు, చెవులతో వినేందుకు హృదయాన్ని విప్పార్చుకోవాలి.

పెద్దవాళ్ళు ఎంతో విచిత్రంగా తమకు తాముగా పరిమిత పరిధుల్ని, సమూహాల్ని నిర్మించుకుంటారు. మతం, కులం, రంగు, పార్టీ , జాతి, రాజ్యం, భాష, సంప్రదాయాలు, పేద – గొప్ప అనే అవరోధాలను ఏర్పరుచుకుంటారు. అందువల్ల వాళ్ళు సృష్టించుకున్న జైళ్ళలోనే వాళ్ళు మగ్గిపోతారు. అదృష్టంకొద్దీ మీకు ఈ అవరోధాల గురించి తెలియదు. మీరు కలిసిమెలిసి చక్కగా ఆడతారు, పాడతారు, పని చేస్తారు. మీరు ఎదిగాక పెద్దవాళ్ళనుండి ఈ అవరోధాలగురించి తెలుసుకుంటారు. మీరు పెద్దవాళ్ళు కావటానికి ఇంకా చాలా కాలం పడుతుంది కదా!

కొన్ని నెలల క్రితం జపాన్ పిల్లలు నాకు ఒక ఉత్తరం రాశారు. ఒక ఏనుగును పంపమని కోరారు. భారతదేశపు పిల్లల పక్షాన వాళ్ళకు నేను ఒక అందమైన ఏనుగును బహుమతిగా పంపాను. ఠీవితో కూడిన ఆ జంతువు వాళ్ళకు భారతదేశపు జ్ఞాపిక అయ్యింది. అంతేకాకుండా అది వాళ్ళకు, మన దేశప్రజలకూ మధ్య వారధిగా నిలిచింది. మనం పంపిన ఈ బహుమానం, జపాన్‌లోని వేలమంది పిల్లలకు ఆనందం కలిగించడమే కాకుండా వాళ్ళు మన దేశాన్ని గురించి ఆలోచించేలా చేయడం నాకు ఎంతో సంతోషాన్నిచ్చింది. ప్రపంచమంతటా మీలాంటి పిల్లలే ఉన్నారనీ వాళ్ళంతా పాఠశాలలకు పోతున్నారని, ఆడుతున్నారని, అంతేకాకుండా అప్పుడప్పుడు పోట్లాడుకున్నా ఎల్లప్పుడూ స్నేహితుల్లానే కలిసిమెలిసి ఉంటున్నారనే విషయం మీరు గుర్తుంచుకోవాలి.

మీ పుస్తకాల్లో ఈ దేశాలను గురించి మీరు చదువుతారు. మీరు పెద్దవాళ్ళయ్యాక మీలో చాలామంది వాటిని సందర్శిస్తారు కూడా! అక్కడికి స్నేహితుల్లా వెళ్లండి. మిమ్మల్ని వాళ్ళు స్నేహితుల్లా పలకరిస్తారు.

మనదేశంలో ఒక గొప్ప మహనీయుడు ఉన్నాడన్న సంగతి మీకు తెలుసు. ఆయనను అందరూ మహాత్మాగాంధీ అన్నారు. కానీ మేము ఆయనను ప్రేమతో 'బాపూజీ' అని పిలిచాం. ఆయన గొప్ప జ్ఞాని. కాని ఎప్పుడూ తన జ్ఞానాన్ని ప్రదర్శించుకోలేదు. అంతేకాకుండా చాలా నిరాడంబరులు. ఎన్నో సందర్భాల్లో ఆయన చిన్న పిల్లవాడిగా ప్రవర్తించేవారు. పిల్లల్ని ఎంతో ప్రేమించేవారు. ప్రపంచాన్ని సంతోషంతో, చిరునవ్వుతో ఎదుర్కోవాలని ఆయన మాకు నేర్పారు.

మనదేశం సువిశాల దేశం. మనమంతా దాని అభివృద్ధికి ఎంతో కృషి చేయాల్సి ఉంది. మనలో ప్రతి ఒక్కరూ తమ వంతుగా ఏ కొద్ది కృషి చేసినా మనదేశం సుభిక్షమౌతుంది.. ప్రగతిపథంలో ముందుకు వెళ్తుంది.

ఈ లేఖలో మీరు నా పక్కనే కూర్చొని ఉన్నట్లుగా భావించి మీతో అనేక విషయాలు ముచ్చటించేందుకు ప్రయత్నించాను. నేను అనుకున్నదానికంటె ఎక్కువే రాశాను కూడా!

ప్రేమతో

*జవాహర్‌లాల్ నెహ్రూ.*

© SCERT not to be republished



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. మీరెప్పుడైనా లేఖ రాశారా? ఎవరికి రాశారు? ఎందుకోసం?
2. ఎవరైనా రాసిన ఉత్తరాలను చదవండి. చదివినది ఎలా ఉందో మీ మిత్రులను అడగండి.
3. రేడియోలోను, దూరదర్శన్‌లోను అప్పుడప్పుడు ఉత్తరాలను చదివి వినిపించే కార్యక్రమాలు ప్రసారమవుతుంటాయి. ఆ కార్యక్రమాన్ని చూడండి. వాళ్ళు ఉత్తరాలు చదివే విధానం ఎలా ఉందో చెప్పండి. అట్లాగే వీటిలో ఎక్కువగా ఏ విషయాలున్నాయో చెప్పండి.
4. లేఖలను ఎప్పుడెప్పుడు రాస్తారో చెప్పండి.
5. మన అభిప్రాయాలను ఇతరులకు తెలియజేయడానికి లేఖ ఒక సాధనం. నేటి కాలంలో లేఖల ద్వారా కాకుండా మరి వేటి ద్వారా మన అభిప్రాయాలను ఇతరులకు తెలపవచ్చు.

### II. చదవడం - రాయడం



**1. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు సమాధానాలు రాయండి.**

అ. నెహ్రూగారు ఉత్తరాన్ని పిల్లలకు ఏ రోజు ఎక్కడినుంచి రాశారు?
ఆ. నెహ్రూకు ఏ అంశాలు ఇష్టమైనవని ఉత్తరం ద్వారా మీరు గ్రహించారు?
ఇ. నెహ్రూ తన చిన్నతనంలో ఏ అంశాలు తమకు ఇష్టం కానివని ఉత్తరంలో చెప్పారు?
ఈ. విజ్ఞానవంతులు ఎలా ఉంటారు?
ఉ. నెహ్రూ, తన ఉత్తరంలో ప్రపంచాన్ని గురించి ఏమని చెప్పారు?
ఊ. నెహ్రూ పెద్దవాళ్ళను గురించి తమ ఉత్తరంలో ఏ ఏ విషయాలు చెప్పారు?
ఎ. జపాన్ పిల్లల ఉత్తరానికి నెహ్రూ ఎలా స్పందించారు? దీనివల్ల ఏం జరిగింది?
ఏ. గాంధీజీని గురించి నెహ్రూ ఏమని తెలిపారు?

**2. నెహ్రూ పిల్లలకు రాసిన ఉత్తరం ఆధారంగా మీరు దానికి ఏ పేరును సూచిస్తారు? ఎందుకు?**

### III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. ఉత్తరం రాసేటప్పుడు దృష్టిలో ఉంచుకోవలసిన అంశాలు ఏవి?
ఆ. పెద్దవాళ్ళు పిల్లలకు సలహాలు, సూచనలు ఇవ్వాలని ఎందుకు భావిస్తుంటారు?
ఇ. "గొప్పవాళ్ళు, విజ్ఞానవంతులు ఏ సందర్భంలోనూ తాము అధికులమని భావించరు," అని నెహ్రూ చెప్పారు కదా! ఇలా ఎందుకు అన్నారు? గొప్పవాళ్ళకూ మామూలువాళ్ళకూ గల తేడా ఏమిటి?
ఈ. పిల్లలను ప్రకృతి, పక్షులు, చెట్లు మొదలైనవాటి విషయంలో సున్నితంగా ఉండమని చెప్పారు కదా! దీన్నుంచి మీరు గ్రహించినది ఏమిటి ?
ఉ. పిల్లలకూ పెద్దలకూ మధ్యగల తేడా ఏమిటి?
ఊ. ప్రపంచంలోని సౌందర్యాన్ని కళ్ళతో చూసేందుకు, చెవులతో వినేందుకు హృదయాన్ని విప్పార్చుకోవాలని నెహ్రూ సూచించారు కదా! దీని భావమేమిటి?

© SCERT not to be republished


**2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు: కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. నెహ్రూ ఉత్తరానికి ప్రత్యుత్తరాన్ని రాయండి.

ఆ. ప్రకృతితో స్నేహం చేయడం అంటే ఏమిటి? ఇందుకోసం మీరు ఏమేం చేస్తారు?

ఇ. మన దేశం సువిశాల దేశం. మనమంతా దాని అభివృద్ధికి కృషిచేయవలసి ఉంది. అప్పుడే దేశం ప్రగతిపథంలో ముందుకు వెళ్తుంది. ఈ వాక్యాలను సమర్థిస్తూ మీరు ఏం చేస్తారో రాయండి.

## IV. పదజాలం



**1. కింది మాటల్లో ఏవైనా రెండు మాటలను తీసుకొని, వాటిని ఒకే వాక్యంలో ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

అ. మరిచిపోలేకపోవడం.

ఆ. దూరంచేయడం.

ఇ. ఉపదేశాలు

ఈ. సంశయానికి లోనుకావడం.

ఉ. అధికులమని భావించడం.

ఊ. వాదనలు, కలహాలు

ఎ. హృదయం విప్పారడం

ఏ. అవరోధాలు

ఐ. ప్రకృతి అందాలు

ఒ. ఎదుర్కోవడం

**2. ఈ కింద ప్రతి వరసలోనూ కొన్ని పదాలు ఉన్నాయి. వాటిలో సంబంధంలేనివాటిని గుర్తించండి.**

అ. సెల్‌ఫోన్, టెలిఫోన్, ఇంటర్‌నెట్, రేడియో

ఆ. ఉపన్యాసాలు, పుస్తక పఠనం, ఉపదేశాలు, సలహాలు

ఇ. వివేకవంతుడు, విజ్ఞానవంతుడు, అధికుడినని భావించేవాడు, ప్రతిభావంతుడు.

ఈ. పక్షులు, పర్వతాలు, నదులు, చెట్లు.

ఉ. బాపూజీ, జాతిపిత, మహాత్ముడు, శాంతిదూత

## V. సృజనాత్మకత



1. జవాహర్‌లాల్ నెహ్రూ పిల్లలకు రాసిన ఉత్తరం చూశారు కదా! మీరే పెద్దవారైతే పిల్లలకు ఏమని ఉత్తరం రాస్తారో రాయండి.
2. పెద్దలు పిల్లలతో ఎలా ఉండాలో కోరుకుంటూ పెద్దలని ఉద్దేశించి పత్రికలకు ఒక లేఖ రాయండి.
3. ప్రకృతితో సున్నితంగా ప్రవర్తించాలని, ప్రకృతిని ప్రేమించాలని, చుట్టూ ఉన్న అందాలను చూడాలని నెహ్రూ లేఖలో చెప్పారు కదా! ఈ భావానికి అనుగుణంగా ఒక అందమైన ప్రకృతి చిత్రాన్ని గీసి రంగులు వేయండి. ఆ చిత్రానికి ఒక పేరు పెట్టండి.

## VI. ప్రశంస



1. మీ తరగతిలో పైన తెలిపిన విధంగా లేఖలు రాసినవారు ఎవరు? చిత్రాన్ని గీసినవారు ఎవరు? అవి మీకు ఎందుకు బాగా అనిపించాయో చెప్పండి.
2. పిల్లలతో ప్రేమగా కలిసిపోయి వ్యవహరించే పెద్దలలో ఉండే గొప్ప గుణాలు ఏమిటి? వారు అలా పిల్లలతో ఎందుకు కలిసిపోతారు?

© SCERT not to be republished

## VII. ప్రాజెక్టు పని



1. మీ గ్రంథాలయం / వార్తాపత్రిక / ఇంటర్‌నెట్ / మేగజైన్‌ల ఆధారంగా గొప్ప వ్యక్తులు రాసిన లేఖలను సేకరించండి. వారు ఎవరికి రాశారో, ఏ విషయాన్ని గురించి రాశారో తెలుసుకొని చెప్పండి.
2. తెలుగు / ఆంగ్ల వార్తాపత్రికలను సేకరించండి. వాటిలో వచ్చిన ఉత్తరాలు ఏ అంశాలను గురించి ఉన్నాయో పరిశీలించి ప్రదర్శించండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



1. ఇంతకుముందు పాఠాలలో చర్చించిన సంధిరూపాలను ఆధారంగా చేసుకొని, కింది పదాలను విడదీసి, సంధులను గుర్తించండి

ఉదా॥ సభాంతరాళం = సభ + అంతరాళం =(అ + అ) = సవర్ణదీర్ఘ సంధి

| | | | | | |
|---|---|---|---|---|---|
| అ. | కిరీటాకృతి | = ........... | + .............. | =( ) | = ................. |
| ఆ. | మహేశ | = ........... | + .............. | =( ) | = ................. |
| ఇ. | అభ్యుదయం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఈ. | లఘూత్తరం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఉ. | సూర్యోదయం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఊ. | గిరీంద్రం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఎ. | నరేంద్ర | = ........... | + .............. | =( ) | = ................. |
| ఏ. | లోకైక | = ........... | + .............. | =( ) | = ................. |
| ఐ. | మాతౄణం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఒ. | మాత్రాదరం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఓ. | వర్షర్తువు | = ........... | + .............. | =( ) | = ................. |
| ఔ. | దివ్యౌషధం | = ........... | + .............. | =( ) | = ................. |
| క. | ఉదరాగ్ని | = ........... | + .............. | =( ) | = ................. |
| ఖ. | అణ్వస్త్రం | = ........... | + .............. | =( ) | = ................. |
| గ. | భాషౌన్నత్యం | = ........... | + .............. | =( ) | = ................. |
| ఘ. | నిఖిలైశ్వర్యం | = ........... | + .............. | =( ) | = ................. |

© SCERT not to be republished



### నేనివి చేయగలనా?



| | |
|---|---|
| 1. లేఖలు చదివి భావాన్ని సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. లేఖలు ఆధారంగా ఇచ్చిన ప్రశ్నలకు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3. లేఖకు సమాధానం రాయగలను. | ఔను / కాదు |
| 4. సమాచారానికి సంబంధించిన నూతన సౌకర్యాలకు చెందిన పదజాలాన్ని రాయగలను. | ఔను / కాదు |
| 5. భావానికి అనుగుణంగా ప్రకృతిచిత్రాన్ని గీసి రంగులు వేయగలను. శీర్షికను సూచించగలను. | ఔను / కాదు |

పూలలో సువాసన, మనుష్యులలో యోగ్యత దాచినా దాగదు. - నెహ్రూ

రెండో యూనిట్

# 9. ప్రకటన

(పరారీ అయిన వ్యక్తికోసం)

**– దేవరకొండ బాలగంగాధర తిలక్**

**ఆలోచించండి – మాట్లాడండి**

**కనబడటం లేదు**



పేరు : **కపోతం**

వయస్సు : ఆరు నెలలు

గుర్తులు : తెల్లగా బలంగా ఉంటుంది. మెడ చుట్టూ బూడిదరంగు ఉంటుంది.

సంప్రదించవలసిన చిరునామా : విశ్వశాంతి సమాజం

గమనిక : తెచ్చి ఇచ్చినవారికి సుఖసంతోషాలు కానుకగా ఇస్తాం.

ప్రశ్నలు :

1. ఇలాంటి ప్రకటనలు ఎప్పుడైనా చూశారా? ఎక్కడ చూశారు?
2. ఈ ప్రకటన ఎవరికోసం?
3. ప్రకటనలోని కపోతాన్ని వెతకడానికి నీవేం చేస్తావు?

**నేపథ్యం:**

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన మూడేళ్ళకు అంటే 1950లో వచ్చిందీ కవిత. ఆరు దశాబ్దాలైనా సమకాలీన ప్రపంచంలో నెలకొన్న అశాంతిపూరిత, ఆందోళనకర వాతావరణానికి అనుగుణంగా రాసినట్టుగా ఉంది. తిలక్ ఈ కవిత రాసేనాటికే రెండు ప్రపంచ యుద్ధాలు, ఒక ఆర్థికమాంద్యం, అంతర్యుద్ధాలు, ప్రచ్ఛన్న యుద్ధవ్యూహాలను పన్నుతున్న రెండు అగ్రరాజ్యాల మధ్య పోటీ వంటి అంతర్జాతీయ అంశాలు ఉన్నాయి. భారతదేశ స్వాతంత్ర్యోద్యమ పోరాటం, విముక్తి, కరువుకాటకాలు వంటి సమీపగత స్థానిక అంశాలు, వీటన్నింటినీ తిలక్ దగ్గరగా పరిశీలించి ఈ కవిత రాశారు.

ఇన్నేళ్ళ తరవాత కూడా పరిస్థితిలో మార్పు లేదు. ఉగ్రవాదం మరింత బలపడింది. స్థానిక ఉద్యమాలు, వివక్ష, ప్రజావిప్లవాలు, ప్రపంచీకరణ విధానాలు, అనారోగ్యకరమైన పోటీ, సామ్రాజ్యవాదం లాంటివి ఎన్నో దీనికి తోడయ్యాయి. భూగోళం అశాంతితో అట్టుడికిపోతూ ఉంది. సమస్త మానవాళీ అశాంతితో విలవిలలాడిపోతూ ఉంది. అణుబాంబులను మించిన వినాశకర ఆయుధాలు సమకూరాయి. ప్రతి దేశమూ అనివార్యమైన అశాంతిపూరిత దుస్థితిలోకి వెళ్ళిపోయింది. ప్రతి పౌరుడూ అశాంతిమయ, అభద్రజీవిత వలయంలో పడ్డాడు. ఈ నేపథ్యంలో తిలక్ చేసిన ఈ 'ప్రకటన' కాల దోషం పట్టని ఒక 'అంతర్జాతీయ ప్రకటన'. పరారీ అయిన వ్యక్తికోసం ప్రతివాడూ వెతికి పట్టుకోడమే మానవాళి ప్రధాన లక్ష్యం. అందుకోసం ప్రతిమనిషీ కృషిచేయాలి. అదే మానవజాతి ఆశయం కావాలి. అదే కవి కోరుకొనే అంతిమ ఆదర్శం.

**ప్రస్తుత పాఠ్యభాగం: 'అమృతం కురిసిన రాత్రి' అనే కవితా సంపుటిలోది.**

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థం కాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు–అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.

© SCERT not to be republished

స్టేషన్లో టిక్కెట్లను జారీ చెయ్యకండి
ఎక్కడి రైళ్ళు అక్కడ ఆపివెయ్యండి
దేశదేశాలకి కేబుల్ గ్రామ్స్ పంపించండి
దేవాలయాల్లో నిత్యం పూజలు చేయండి
ఆకాశవాణిలో యీ విషయం ప్రకటించండి.
కాఫీహోటళ్ళలో, క్లబ్బులలో, కర్మాగారాల్లో
కాస్త జాగ్రత్తగా నిశితంగా పరిశీలించండి.
సముద్రతీరాలలో నదీజలాలలో వెదకండి
సాయుధ దళాల్ని దిక్కులలో నిలబెట్టండి
రాకెట్లను అంగారకాది గ్రహాలకు పంపించండి.
అడుగుజాడల్ని కాపీ తియ్యండి
వ్రేలిముద్రల్ని పరీక్షించండి
ప్రజలు తండోపతండాలుగా విరగబడుతున్నారు
కంగారుతో భయంతో గుసగుసలాడుతున్నారు
కావ్యచర్చలు కళాలయాలు ఆకర్షించటం లేదు
స్వార్థజీవనులు గభాలున రొమ్ములు బాదుకుంటున్నారు
సిద్ధాంతాలు చర్చలు ఎవరూ చేయడం లేదు
సిరా యింకకుండానే ఎగ్రిమెంట్లు చింపేస్తున్నారు
అతృప్త అశాంత ప్రజాపారావార తరంగం



అంచుల్ని దాటి భీకరంగా విరుచుకుపడుతోంది.
ఇంక చరిత్రలు వ్రాయనక్కరలేదు
ఇక రాజ్యాలు పాలించనక్కరలేదు
అణుబాంబు యుగాంతాన్ని నిరూపిస్తున్నది
ఆ ముహూర్తం త్వరలోనే వస్తున్నది
కాబట్టి స్టాండ్ ఎటెన్షన్-మన జాతిని మనం
కాపాడుకోవాలంటే ఒక్కటే మార్గం
వెదికి తీసుకురండి పరారీ అయిన వ్యక్తిని
వేరుదారి లేదు కదలండి కదలండి జై అని
అపార కృపాతరంగితాలైన నయనాంచలాలు
ఆనందం జాలువారే స్నిగ్ధ దరహాస పరిమళాలు
సంస్కారపు కేశపాశంలో తురిమిన అనురాగపు గులాబి
సదా ప్రజాహితైషిణి సుభాషిణి గర్వంలేని రాణి
కల్లనీ క్రౌర్యాన్నీ కాలుష్యాన్నీ తిరస్కరిస్తుంది
తెల్లని పావురాల్ని సరదాగా ఎగరేస్తుంది
చల్లని తల్లి చక్కని చెల్లి ఆమె పేరు శాంతి.



### కవి పరిచయం :



**పేరు** : దేవరకొండ బాలగంగాధర తిలక్

**కాలం** : 1921-1966

**జన్మస్థానం** : మండపాక (గ్రామం), తణుకు (తాలూకా), ప. గో (జి)

**రచనలు** : అమృతం కురిసిన రాత్రి, గోరువంకలు (కవితా సంపుటాలు) తిలక్ కథలు

**పురస్కారాలు** : 'అమృతం కురిసిన రాత్రి' కవితాగ్రంథానికి 1971లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందారు.

© SCERT not to be republished

**సారాంశం:** ఎవరూ ప్రయాణం చేయకుండా స్టేషన్లలో టిక్కెట్లు ఇవ్వడం ఆపి వెయ్యండి. ఎక్కడి రైళ్ళను అక్కడే నిలిపి వెయ్యండి. అన్ని దేశాలకూ టెలిగ్రాములు పంపించండి. దేవాలయాల్లో నిత్యం పూజలు చెయ్యండి.

అన్ని రేడియో స్టేషన్లనుండి ఈ విషయం ప్రకటించండి. కాఫీ హొటళ్ళలో, క్లబ్బులలో, కర్మాగారాల్లో చాలా జాగ్రత్తగా అన్నివైపులా పరిశీలించండి. సముద్ర తీరాలలో, నదీజలాలలో వెదకండి. ఆయుధాలు ధరించిన సైనిక దళాల్ని అన్ని దిక్కులలో నిలబెట్టండి. రాకెట్లను అంగారక గ్రహంమీదికే కాదు అన్ని గ్రహాలమీదికి పంపించండి. నేలమీది అడుగుల ముద్రల్లో ఏమైనా జాడలు కనిపిస్తాయేమో వెతకండి. వేలిముద్రల్నీ పరిశీలించండి.

ఇసుక వేస్తే రాలనంతగా ప్రజలు గుంపులు గుంపులుగా వస్తున్నారు. కంగారుతో, భయంతో ఏవేవో అనుమానాలతో గుసగుసలాడుతున్నారు. నిత్యం సహృదయులను, కళాభిమానులను ఆకర్షించే సాహిత్యచర్చలు, కళాప్రదర్శనలు ఎవర్నీ ఆకర్షించడం లేదు. తమ స్వార్థంకోసం ఆలోచించే మనుషులుమాత్రం గుండెలు బాదుకుంటున్నారు. విభిన్నవాద సిద్ధాంతాలమీద రకరకాల చర్చలు జరిపే మేధావులు మౌనంగా ఉండిపోయారు. ఎన్నో అంశాలమీద చేసుకొన్న ఒప్పందాలన్నింటినీ సంతకంలోని సిరా ఆరకముందే చింపేస్తున్నారు.

అసంతృప్తి, అశాంతితో ఉన్న ప్రజలు సముద్రంలోని అలల్లా భయంకరంగా విరుచుకుపడుతున్నారు. ఇక ఎవరూ చరిత్రలు రాయనవసరం లేదు. పాలకులు రాజ్యాల్ని పాలించనవసరం లేదు. అణుబాంబు ఈ యుగాన్ని, మానవాళిని నాశనం చేసే ముహూర్తం తొందరలోనే ఎదురవుతుంది. ఇన్ని విపత్తులు చుట్టుముట్టినా అప్రమత్తంగా ఉండి మన జాతిని మనం కాపాడుకోవాలంటే ఒక్కటే మార్గం. అందరూ కదలి పరారీ అయిన వ్యక్తిని వెతికి తీసుకురావాలి. తప్పకుండా పట్టుకురావాలి. అందరూ 'జై' అంటూ కదలాలి. కదలండి.

ఆమె హృదయం అంతులేని దయతో నిండి ఉంటుంది. ఆమె కనుకొనలనుండి ఆనందం, ఆర్ద్రత ప్రవహిస్తుంటాయి. ఆమె సుతిమెత్తని చిరునవ్వు సువాసనలను వెదజల్లుతూ సహృదయతను చూపుతుంది. ఆమె తలలో ప్రేమగులాబీని తురుముకొని ఉంటుంది. ఆమె ఎప్పుడూ తియ్యగా మాట్లాడుతూ ప్రజల సంక్షేమాన్ని కోరుకొంటూ ఉంటుంది. ఆమె గర్వంలేని రాణి. అబద్ధాల్ని, క్రూరత్వాల్ని, భావకాలుష్యాల్ని నిరసిస్తుంది. ఆమె ఎప్పుడూ తెల్లని పావురాల్ని ఆనందంగా ఎగరవేస్తుంది. ఆమె మన చల్లని అమ్మ, చక్కని చెల్లెలు. ఆమెపేరు 'శాంతి'.



## ఇవి చేయండి




### I. వినడం-మాట్లాడడం



1. ఈ కవితను భావయుక్తంగా చదవండి.
2. పాఠ్యభాగ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పండి.
3. జాతరల్లో, మహాసభల్లో తప్పిపోయినవాళ్ళను గురించి ఏమని ప్రకటిస్తారు?
4. మీరు ప్రకటనలు ఎక్కడెక్కడ విన్నారు? ఇవి వేటికి సంబంధించినవి?
5. ప్రకటనలు ఎన్ని రకాలుగా ఉంటాయి? మీకు ఇష్టమైన ఏదైనా ఒక ప్రకటనను గురించి చెప్పండి. అది ఎందుకు ఇష్టమైందో వివరించండి.

© SCERT not to be republished

## II. చదవడం - రాయడం




1. **పాఠం చదవండి. కిందివాటిని పాఠంలో గుర్తించండి.-**
   - అ. ఆపివేయండి-పంపించండి-ప్రకటించండి-పరిశీలించండి'
   - ఆ. గుసగుసలాడుతున్నారు - బాదుకుంటున్నారు - చింపేస్తున్నారు, ఇలాంటి పదాలు గల వాక్యాలను గుర్తించండి. వాటి కింద గీత గీయండి.
2. **కవితలో శాంతిని గురించి వర్ణించిన పంక్తులు చదవండి. వాటి కింద గీత గీయండి.**
3. **పాఠం చదవండి. కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**
   - అ. 'స్వార్థజీవనులు గభాలున రొమ్ములు బాదుకుంటున్నారు' ఈ వాక్యానికి అర్థం ఏమిటి?
   - ఆ. జాతిని కాపాడుకోడానికి కవి ఏం చెయ్యాలన్నారు?
   - ఇ. కవితలో ముహూర్తం అంటే ఏమి అర్థం వస్తుంది?
   - ఈ. కవి దేనికోసం వెతకమన్నారు? ఎక్కడెక్కడ వెతకమన్నారు?

## III. స్వీయరచన



1. **ఈ కింది ప్రశ్నలకు నాలుగయిదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**
   - అ. ప్రకటన అంటే ఏమిటి? ప్రకటనలు ఎందుకోసం?
   - ఆ. ఈ పాఠానికి మరొక శీర్షికను సూచించండి? దానికి మూడు కారణాలు తెలపండి.
   - ఇ. ఆకాశవాణి, దూరదర్శన్‌లలో ఏ ఏ ప్రకటనలు వస్తాయి?
   - ఈ. ప్రజల అశాంతికి, అసంతృప్తికి కారణాలేమిటి?
   - ఉ. యుగాంతం అంటే ఏమిటి? యుగాంతానికి దారితీసే ప్రమాదకర పరిస్థితులు ఏవి?
   - ఊ. "ప్రకటన" పాఠం గురించి మీ అభిప్రాయాలు తెల్పండి.
2. **కింది ప్రశ్నలకు పది వాక్యాలలో సమాధానాలు రాయండి.**
   - అ. తిలక్ 'ప్రకటన' కవితా సారాంశం రాయండి.
   - ఆ. తిలక్ ప్రకటన కవితకు నేపథ్యం ఏమిటి? ఈ కవిత రాయడంలో కవి ఉద్దేశం ఏమై ఉంటుంది?
   - ఇ. తిలక్ శాంతి అనే స్త్రీని ఏ విధంగా వర్ణించాడు?
   - ఈ. తిలక్ 'ప్రకటన' అనే కవిత ద్వారా శాంతిని కాంక్షించాడు. ఈ కవిత నేటి పరిస్థితులకు కూడా సరిపోతుందా? ఎందువల్లనో వివరించండి.

## IV. పదజాలం



1. **గీత గీసిన పదాలకు సమానమైన అర్థమిచ్చే పదాలు పాఠంలో ఉన్నాయి. వాటిని వెతికి ఎదురుగా రాయండి.**
   - అ. సాగరంలో అలలు ఎగసిపడుతున్నాయి. ..........................................
   - ఆ. ఆయుధాలు ధరించిన సైనికులు సరిహద్దుల్లో కాపలాకాస్తున్నారు. .................
   - ఇ. రేడియోలో రోజూ నేను వార్తలు వింటాను. ..............................
   - ఈ. శాంతికి గుర్తుగా కపోతాలను ఎగరవేద్దాం. .............................
   - ఉ. నేను ఎప్పుడూ అబద్ధం ఆడను. ...........................
   - ఊ. గులాబీ తోటలోని సువాసనలు మనసుకు ఆహ్లాదాన్ని కలిగించాయి. ............

© SCERT not to be republished

**2. ఈ కింది వాక్యాలలో గీత గీసిన పదానికి సమానమైన పర్యాయ పదాలు అదే వాక్యంలో ఉన్నాయి. వాటిని గుర్తించండి.వాటి కింద గీత గీయండి.**

అ. దేవాలయంలో దేవుడి విగ్రహాలు ఉంటాయి. పూజారులు కోవెలలో పూజలు చేస్తారు. గుడికి మనమందరం తప్పకుండా వెళతాం.

ఆ. **సర్వేంద్రియాణాం నయనం ప్రధానం** అంటూంటారు. అందుకే మన కళ్ళను జాగ్రత్తగా చూసుకోవాలి. అప్పుడప్పుడు నేత్రవైద్యుడి దగ్గరకు వెళ్ళాలి.

ఇ. సరిహద్దుల్లో సైనికదళాలు ఉంటాయి. వాళ్ళను చూడడానికి మనం బృందాలుగా వెళ్దాం. సమూహంగా వెళ్ళడంలో ఆనందం ఉంటుంది.

ఈ. గూఢచారులు రహస్యంగా విషయాలను కూపీలాగుతారు. వాళ్ళు ఆరా తీయడంలో చాలా నేర్పరులు.

**3. పాఠ్యాంశం ఆధారంగా ఈ కింది నానార్థాల మూలపదాలను వెతికి రాయండి.**

అ. ______________________ = గుంపు, ఆకు

ఆ. ______________________ = గుర్తు, ప్రభావం

**4. ఈ కింది పదాలకు వ్యతిరేకపదాలు మీ పాఠ్యాంశంలోనే ఉన్నాయి. వాటిని గుర్తించండి.రెండు పదాలనూ ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.**

ఉదా : అజాగ్రత్త × జాగ్రత్త : నేను ఏ విషయమైనా జాగ్రత్తగా పరిశీలిస్తాను. ఎప్పుడూ అజాగ్రత్తగా ఉండను.

(అ) నీతి (ఆ) నిస్స్వార్థం (ఇ) సుఖం (ఈ) శాంతి

(ఉ) నిగర్వి (ఊ) అంగీకారం (ఎ) నిర్భయం

**5. ఈ కింది పదాలకు ప్రకృతి పదాలు పాఠ్యాంశంలో ఉన్నాయి. వాటిని గుర్తించి సొంత వాక్యంలో ఉపయోగించి రాయండి.**

ఉదా : దేవళం – దేవాలయం (ప్రకృతి)

నేను రోజూ దేవాలయానికి వెళ్ళి దేవునికి దండం పెడతాను.

(అ) దరి ..............................................................

(ఆ) సంద్రం ..............................................................

(ఇ) గారవం ..............................................................

(ఈ) నిచ్చలు ..............................................................

© SCERT not to be republished

6. **ఈ కింది పదాలను చదవండి. ఏవైనా రెండేసి పదాలను ఉపయోగించి సొంతవాక్యాలు తయారు చేయండి.**

| | |
|---|---|
| అ. తండోపతండాలు | ఉ. పరీక్షించండి |
| ఆ. విరగబడు | ఊ. ఆకర్షించటం |
| ఇ. రొమ్ములు బాదుకొను | ఎ. విరుచుకుపడు |
| ఈ. గుసగుసలాడు | ఏ. నిరూపిస్తున్నది |

ఉదా : ఆ జాతరకు ప్రజలు తండోపతండాలుగా విరగబడి వచ్చారు.

## V. సృజనాత్మకత



1. ఈ కవిత ఆధారంగా 'శాంతి ఆవశ్యకత ' అనే అంశంమీద కార్టూన్‌లు గీయండి.
2. రవి నాలుగు సంవత్సరాల పిల్లవాడు. ఒకసారి దురాజ్‌పల్లిలో జరిగిన లింగమంతుల జాతరకు వెళ్ళినప్పుడు కిక్కిరిసిన జనంలో తప్పిపోయాడు. అప్పుడు నీలంరంగు నిక్కరు, తెల్లచొక్కా వేసుకున్నాడు. ఈ వివరాలతో ఒక ప్రకటనను తయారు చేయండి.

2. **మీ పాఠం ఆధారంగా అంత్యప్రాసపదాలను ఉపయోగించి నాలుగు పంక్తుల కవిత రాయండి.**

-------------------- పంపించండి

-------------------- ప్రకటించండి

-------------------- పరిశీలించండి


-------------------- నిలబెట్టండి

----------------------------

----------------------------

----------------------------


----------------------------



3. **అందరినీ ఆకర్షించే 'శాంతి నినాదాలు' తయారు చేయండి.**

ఉదా : ఆయుధాలను నాశనంచేద్దాం. భూగోళాన్ని కాపాడుకుందాం.

## VI. ప్రశంస



1. 'శాంతి'కి సంబంధించిన పాటలు సేకరించండి, పాడండి.
2. ఆయా సందర్భాల కనుగుణంగా శాంతికోసం జరిగే సభల్లో, ర్యాలీలో పాల్గొనండి. ఇతరులతో చర్చించండి. ప్రపంచశాంతి దినోత్సవాన్ని గురించి తెలుసుకోండి.

©SCERT not to be republished

### VII. ప్రాజెక్టు పని



1. మీ గ్రామంలో, వాడలో శాంతికోసం ప్రయత్నంచేసిన వ్యక్తులు ఎవరో తెలుసుకోండి. వారు ఎందుకు ఆ విధంగా చేస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకోండి.
2. ప్రపంచ శాంతికోసం కృషిచేసిన నోబెల్ శాంతి బహుమతి గ్రహీతల ఫోటోలు, వివరాలు సేకరించండి. వారి ఫోటోలను ఛార్టుమీద అతికించి వివరాలు ప్రదర్శించండి.

### VIII. భాషగురించి తెలుసుకుందాం





ఔరౌర! ఎంత పని చేశావు!

అరెరె! అలా అయిందా?

ఆహాహా! నేనే గొప్పవాడిని.

ఏమేమి? నువ్వు చూశావా?

ఎట్లెట్లు? మరోసారి చెప్పండి.

ఏమిటేమిటి? నువ్వు వినలేదా!

ఓహోహో! మీరూ వచ్చారా?

పై వాక్యాల్లో కొన్ని పదాలు రెండుసార్లు వాడాం.

ఔర + ఔర

అరె + అరె

ఆహా+ ఆహా

ఏమి + ఏమి

ఎట్లు + ఎట్లు

ఏమిటి + ఏమిటి

ఓహో + ఓహో

వీటిలో మనం తొలుత పలికిన పదాన్నే రెండోమారు పలుకుతున్నాం. అలా రెండో మారు పలికే పదాన్ని "ఆమ్రేడితం" అని అంటాం.

1. పై పదాల్లో, పూర్వపదాల్లో చివరన ఏముందో చూద్దాం.

అ) ఔర్ + అ; ఆ) అర్ + ఎ ; ఇ) ఆహ్ + ఆ ;

ఈ) ఏమ్ + ఇ; ఉ) ఎట్ల్ + ఉ ; ఊ) ఏమిట్ + ఇ ;

ఎ) ఓహ్ + ఓ;

అ, ఆ, ఇ, ఉ, ఎ, ఓ, లు చివరన ఉన్నాయి. అంటే అచ్చులు ఉన్నాయన్నమాట.

ఈ అచ్చులకు ఆమ్రేడితం పరమైతే

ఔర + ఔర = ఔరౌర (అ + ఔ = ఔ)

ఆహా + ఆహా = ఆహాహా (ఆ + ఆ = ఆ)

ఏమి + ఏమి = ఏమేమి (ఇ + ఏ = ఏ)

© SCERT not to be republished

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| ఎట్లు | + | ఎట్లు | = | ఎట్లెట్లు | (ఉ + ఎ = ఎ) | |
| ఏమిటి | + | ఏమిటి | = | ఏమిటేమిటి | (ఇ + ఏ = ఏ) | |
| అరె | + | అరె | = | అరెరె | (ఎ + అ = అ) | |
| ఓహో | + | ఓహో | = | ఓహోహో | (ఓ + ఓ = ఓ) | లుగా మారుతాయి. |

కిందివాటిలో కూడా అచ్చుకు ఆమ్రేడితం పరమైందనే విషయాన్ని గమనించండి.

ఏమి + ఏమి = ఏమేమి, ఏమియేమి

ఎట్లు + ఎట్లు = ఎట్లెట్లు, ఎట్లుయెట్లు

ఎంత + ఎంత = ఎంతెంత, ఎంతయెంతలు

ఇలాంటి పదాల్లో ఒక్కోసారి ఆమ్రేడితం విడిగా ఉండటం జరుగుతున్నది.

పై విషయాలను బట్టి ఈ సంధిని గుర్తుపట్టడానికి ఒక సూత్రీకరణం చేసుకుందాం.

అచ్చుకు ఆమ్రేడితం పరమైతే తరచుగా సంధి అవుతుంది.

ఇప్పటివరకు ఆమ్రేడితానికి సంబంధించిన సంధి అంటే **ఆమ్రేడిత సంధి** గురించి తెలుసుకున్నారు. ఇప్పుడు ఈ కింది పదాలను పరిశీలించి సూత్రాన్ని సరిచూడండి.

అ) అడిగడిగి = ................ + ................

ఆ) ఊరూరు = ................ + ................

ఇ) అంతంత = ................ + ................

ఈ) ఓరోరి = ................ + ................



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | తిలక్ వచన కవిత "ప్రకటన" పాఠం భావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 2. | కవితను రాగయుక్తంగా, భావయుక్తంగా చదవగలను. | ఔను / కాదు |
| 3. | కవిత భావాన్ని అర్థంచేసుకోగలను. కవితలోని కవి ఉద్దేశాన్ని అర్థంచేసుకోగలను. | ఔను / కాదు |
| 4. | పాఠం భావాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 5. | ఈ పాఠంలోని నినాదాలను సొంతమాటల్లో ఉపయోగించగలను. ప్రకృతి - వికృతి పదాలను, వ్యతిరేక పదాలను గుర్తించగలను. | ఔను / కాదు |
| 6. | కవితలోని పదాలు ఆధారంగా ఇంకొక కవితను, శాంతి నినాదాలను రాయగలను. | ఔను / కాదు |

ప్రపంచాన్ని రక్షించే జ్ఞానాన్ని భారతదేశం సంరక్షిస్తోంది. - శ్రీ అరవిందులు

©SCERT not to be republished

రెండో యూనిట్

# 10. ఏడుచేతుల రాకాసిచెట్టు

ఉపవాచకం

(వైజ్ఞానిక కల్పితకథ)

ఒకప్పుడు నాకు వేటంటే చాలా ఇష్టం. నా గురి బ్రహ్మాండమైనదని అందరూ మెచ్చుకునేవారు. అకస్మాత్తుగా నా ఆలోచనల్లో మార్పు వచ్చింది. వేట మానుకున్నాను. రచనావ్యాసంగంవైపు దృష్టి మళ్ళించాను. కొంతకాలం తర్వాత ఉద్యోగం మానుకొని పూర్తికాలం రచనకే వినియోగించాలనే ఆలోచనలో ఉన్నాను. నా తుపాకి మూలన పడింది. ఇక దాని అవసరం రాదని అనుకుంటున్న వేళ దాని అవసరం వచ్చింది. అదీ కాంతిబాబు కోరిక మేరకు. ఆయనవల్లే నా జీవితంలో మరో గొప్ప సాహస అనుభవంలో పాత్రధారినయ్యాను. ఇంతకూ ఎవరీ కాంతిబాబు? ఇది తెలుసుకోవాలి అంటే పదేళ్ళు వెనక్కు వెళ్ళాలి.



కాంతిబాబు పూర్తిపేరు కాంతిచరణ్ ఛటర్జీ. స్కాటిష్ చర్చ్ కాలేజీలో వృక్షశాస్త్ర అధ్యాపకుడుగా పనిచేసేవాడు. అది మానుకొని అరుదైన మొక్కల సేకరణకోసం దేశాటన చేశాడు. చాలా పరిశోధనలు చేశాడు. కొన్ని పరిశోధన పత్రాలు ప్రచురించాడు. ఆయనదగ్గర ముఖ్యంగా, పూలమొక్కలు ఎన్నో రకాలవి ఉన్నాయి. ఇతర మొక్కలు కూడా అనేకం సేకరించాడు. కజిరంగా ఫారెస్ట్ బంగళాలో మేము మొదటిసారి కలుసుకున్నాం. పులివేటకోసం నేనక్కడికి వెళ్ళాను. ఆయనేమో నెఫెన్థిస్ (Nepenthis) అనే మొక్కను వెతకడానికి వచ్చాడు. అప్పుడే నాకు నెపెన్థిస్ గురించి తెలిసింది. అది వృక్షశాస్త్రంలో ఒక రకం మొక్క పేరు. దాన్నే 'ముంతాకు మొక్క' అంటారు. అస్సాం అడవుల్లో పెరుగుతుంది. పురుగులు దానికి ఆహారం. వృక్షశాస్త్ర పాఠ్యగ్రంథాలలో ఈ మొక్కల చిత్రాలు చూడవచ్చు. మొక్కలపట్ల నాలో ఆసక్తి, అభిరుచి అప్పటినుంచే పెరిగింది.

కాంతిబాబుతో ఎక్కువ పరిచయం కొనసాగలేదు. పులిని వేటాడి నేనొచ్చేశాను. కాంతిబాబు మాత్రం అస్సాం అడవుల్లో నెపెన్థిస్ అన్వేషణలో ఉండిపోయాడు. ఎప్పుడో కాంతిబాబును ఏ పామైనా కరవడమో, ఏ అడవి మృగమైనా మీద పడడమో జరుగుతుందని భయపడేవాణ్ణి. ఇప్పటికీ ఆయనిచ్చిన పూలమొక్క మా ఇంటి కిటికీలో ఉన్న కుండీలో కనిపిస్తూ పలకరిస్తూంటుంది. ఒకసారి ఆయన పరిశోధన పత్రాన్ని ప్రముఖ విదేశీయ వృక్షశాస్త్ర పత్రిక ఒకటి ప్రచురించింది. అది ఆయనకు మంచి పేరు తెచ్చింది. అమెరికాలో జరిగే వృక్షశాస్త్రజ్ఞుల సమ్మేళనానికి ఆయన్ని ఆహ్వానించారు. అమెరికానుంచి కొత్తరకం మొక్కల్ని నాకోసం తెస్తానని మాటకూడా ఇచ్చాడు. పదేళ్లయింది. ఆ తర్వాత ఆయన ఎక్కడున్నాడో తెలియలేదు.

ఆ కాంతిబాబే ఇన్నాళ్ళకు నా రచనల ఆధారంగా చిరునామా తెలుసుకొని నన్ను వెతుక్కుంటూ మా ఇంటికొచ్చాడు. చాలా ఆశ్చర్యపోయాను. ఇద్దరం ఒకర్నొకరం గుర్తుపట్టుకున్నాం. సాదరంగా ఆయన్ని ఆహ్వానించాను. అతిథిమర్యాదలు చేశాను. మామూలు క్షేమసమాచారాలు మాట్లాడుకున్నాం. ఈ పదేళ్లలో ఆయన రూపురేఖల్లో ఎంతో మార్పు వచ్చింది. భూతద్దం పట్టుకొని అస్సాంలోని దట్టమైన అడవుల్లో తిరుగుతుండేవాడంటే ఎవరు నమ్ముతారు? ఇప్పుడు మాత్రం వృద్ధాప్య ఛాయలు కనిపిస్తున్నాయి.

కాంతిబాబు అకస్మాత్తుగా ఒక ప్రశ్న వేశాడు. "పరిమళ్ ! మీ గురి అద్భుతం. ఇప్పటికీ అలాగే ఉందా?" ఇప్పుడీ విషయం ఎందుకడుగుతున్నాడో నా కర్థంకాలేదు. "నా గురి ఎలా ఉందో చెప్పలేను. ఈ మధ్య ఎప్పుడూ పరీక్షించలేదు. రమారమి ఏడు సంవత్సరాల కిందట వేట మానుకున్నాను." అయినా ఇప్పుడీ ప్రస్తావన ఎందుకని ఎదురు ప్రశ్నించాను.

కాంతిబాబు అసలు విషయం బయటపెట్టాడు. మిమ్మల్ని ఒక సహాయం అర్థించడానికి వచ్చాను" అన్నాడు. నావల్ల ఆయన పొందే సహాయమేమిటో అర్థం కాలేదు. "మీ తుపాకి ఇంకా ఉందా! ఎవరికైనా ఇచ్చేశారా?" ఈ ప్రశ్న విని ఆశ్చర్యపోయాను. ఆయన ఆంతర్యం బోధపడలేదు. "అది నా దగ్గరే ఉంది, కొంచెం తుప్పుపట్టి ఉండవచ్చు. అయినా దాన్ని గురించి ఎందుకడుగుతున్నారు?" "అది తీసుకుని రేపు మా ఇంటికి రాగలరా," కాంతిబాబు మాటలకు మరింత ఆశ్చర్యపోయాను. ఆయన ముఖం శ్రద్ధగా గమనించాను. వేళాకోళంగా అన్న మాటగా అనిపించలేదు.

"గుళ్ళు కూడా తీసుకురావాలి సుమా!" ఆయన హెచ్చరించాడు. సరేనన్నాను. అభిజిత్ అనే నా స్నేహితుడితో కలిసి వస్తానని చెప్పాను. కాంతిబాబు సంతోషంగా తిరిగి వెళ్లిపోయాడు.

అభిజిత్‌కు ఫోన్‌చేశాను. 'వెంటనే బయలుదేరి రమ్మనగానే వచ్చాడు. కాంతిబాబు కథంతా చెప్పాను. ఆసక్తిగా విన్నాడు. మొత్తంమీద ఏదో రహస్యం ఉన్నట్టుందని తీర్మానించుకున్నాం. అభిజిత్ కార్లో కాంతిబాబు ఇంటిదిశగా బయలుదేరాం. మా ఇద్దరితోపాటు మూడో ప్రాణిని కూడా వెంటబెట్టుకొని వెళ్ళాం. ఆ ప్రాణి అభిజిత్ కుక్క, దాని పేరు బాద్‌షా. రాంపూర్ జాతి జాగిలం. ఈ ప్రయాణంలో బాద్‌షాని వెంట తీసుకరావడం అంత అవసరం కాదేమోనని అన్నాను. "నీ తుపాకీ గురిమీద



ఎక్కువ నమ్మకంలేకపోవడం వల్లనే దీన్ని తీసుకొస్తున్నాను. నువ్వు తుపాకి ముట్టుకుని ఎన్నేళ్లయిందో! ఏదైనా ప్రమాదం సంభవిస్తే బాద్‌షా నీ కంటే ఎక్కువగా ఉపయోగపడుతుంది. పైగా వాసన పసికట్టడంలో అది పెట్టింది పేరు. ఇక దాని ధైర్యం సంగతి చెప్పే పని లేదు" అంటూ అభిజిత్ తిప్పికొట్టాడు.

కాంతిబాబు మాకు స్వాగతం పలికాడు. బాద్‌షాని చూసి కొంచెం మొహం చిట్లించుకున్నాడు. ముందుగది కిటికీకి కుక్కను కట్టెయ్యమని చెప్పాడు. అభిజిత్ ఆ పని చేశాడు. బాద్‌షా మొదట కొంచెం పేచీపెట్టినా, తర్వాత సర్దుకుంది. వరండాలో ఉన్న పేము కుర్చీల్లో కూర్చున్నాం. టీ తాగాం. ఇంటి పరిసరాలు ఆహ్లాదంగా అనిపించాయి. ఇటువంటి ప్రశాంత స్థలంలో ఏ ప్రమాదం నక్కి ఉందో ఉహించలేకపోయాను. తుపాకీ తీసుకురావడం అవివేకమనిపించి దాన్ని గోడకు ఆనించాను. అభి నగరవాసి. కాసేపయినా ఊరికే కూర్చోలేడు. గ్రామీణశోభ, ఎన్నో పక్షుల కిలకిలారావాలు అతను ఆస్వాదించలేకపోతున్నాడు. కుర్చీలో అటూ ఇటూ కదిలి హఠాత్తుగా కాంతిబాబుపై ప్రశ్నలవర్షం కురిపించాడు. కాంతిబాబు అన్నింటికీ చిరునవ్వుతో సమాధానాలిచ్చాడు. 'నెపెన్‌థిస్' మొక్క దొరికిందా' అని అడిగాడు. "దొరికింది అది ఇంకా నా దగ్గరే ఉంది. అయినా మాంసాహార జాతి మొక్కలు తప్ప తక్కినవాటిమీద నాకిప్పుడు ఆసక్తి లేదు. చాలా పూలమొక్కల్ని అమ్మేశాను కూడా," అని కాంతిబాబు లోపలికి వెళ్ళాడు. నేను, అభి ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నాం. 'మాంసం తినే మొక్కలా!' కళాశాలలో చదివేప్పుడు వృక్షశాస్త్ర పాఠ్యగంథ్రంలోని ఒక పుటలో ఉన్న విషయాలు కొంచెం గుర్తున్నాయి. అలాగే కొన్ని చిత్రాలు కూడా ఉన్నాయి. మళ్ళీ ఇన్నాళ్ళకు వాటిని గురించి వింటున్నాం.

కాంతిబాబు వస్తూ సీసా ఒకటి తీసుకువచ్చాడు. మిడతలు, పేడపురుగులు ఇంకా ఏవేవో కీటకాలున్నాయి. దాని మూతకు మిరియాల పొడి సీసాకున్నట్టు సన్నని రంధ్రాలున్నాయి. "ఆహారం పెట్టే వేళయింది. నాతో రండి" అని మమ్మల్ని పిలిచాడు. గాజుతొట్టెలున్న రేకుషెడ్డులోకి వెళ్ళాం. ప్రతి తొట్టెలోనూ ఒక మొక్క ఉంది. ఆ రకం మొక్కల్ని నేనిదివరకెన్నడూ చూడలేదు. అవన్నీ, నేపాల్, అమెరికా, ఆఫ్రికా దేశాలనుంచి సేకరించినవట. వీటికి నేలతో సంబంధం లేదు. మనుషులు పరాయిదేశంలో ఉండి ఇతరమైన ఆహారం భుజిస్తూ జీవిస్తున్నట్టుగానే ఈ మొక్కలు ఆహారం లభిస్తే ఎక్కడైనా బతకగలుగుతాయట.

కాంతిబాబు ఒక గాజుతొట్టి దగ్గర ఆగాడు. అందులో వింతగా కనిపించే మొక్క ఉంది. దాదాపు రెండంగుళాల పొడవున్న ఆకుపచ్చని ఆకులు. పళ్ళవరస మాదిరి రంపపు అంచులు. సీసామూత పరిమాణంలో తొట్టెకు గుండ్రని మూత వుంది. కాంతిబాబు వేగంగా ఈ మూతతీసి, సీసా బిరడా విప్పి రంధ్రంగుండా చొప్పించాడు. సీసా నుంచి పురుగొకటి బయటికొచ్చింది, కాంతిబాబు వెంటనే సీసా యివతలకి లాగి తొట్టెమూత మూసేశాడు. పురుగు కాసేపు ఎగిరింది. తర్వాత ఒక ఆకుమీద వాలింది. ఆకు, మధ్యకి ముడుచుకుని పురుగును గట్టిగా బంధించింది. ఆకుకున్న పళ్ళవంటివి బిగుసుకున్నాయి. "పురుగు బయటికి వచ్చే అవకాశమే లేదు. ప్రకృతిలో అలాంటి విచిత్రమైన సన్నివేశం లోగడ చూడలేదు. కొంచెం భయం వేసింది. పురుగు ఆకుమీద తప్పక వాలుతుందని ఎలా చెప్పగలం?" అనే అనుమానాన్ని వ్యక్తపరిచాను. "ఈ మొక్కలనుంచి అదో విధమైన వాసన వెలువడుతుంది. అది పురుగుల్ని ఆకర్షిస్తుంది. దీన్ని 'వీనస్ ఫ్లైట్రాప్' మొక్క అంటారు. మధ్య అమెరికానుంచి తెచ్చాను. దీన్ని వృక్షశాస్త్ర పాఠ్యగ్రంథాలన్నింటిలో చూపుతారని కాంతిబాబు వివరించాడు.

ఆ పురుగు ఏం చేస్తుందో నిశితంగా గమనించాను. ముందు అది కాసేపు కొట్టుకుంది. తర్వాత అలసిపోయింది. దానిపైన ఆకు ఒత్తిడి పెరిగింది. బల్లి మాదిరిగా ఆకు కూడా కీటకాన్ని భక్షించింది. అభికి ఆశ్చర్యంగా ఉంది. ఇంట్లో ఇలాంటి మొక్క ఉంటే బాగా ఉపయోగం. పురుగుల బెడద తప్పుతుంది. బొద్దింకల్ని చంపేందుకు డి.డి.టి., పొడి చల్లే పని ఉండదు, అని వింతైన ఆలోచన చేశాడు. కానీ "ఇది అందుకు ఉపయోగపడదు. ఆకులు మరీ చిన్నవి. బొద్దింకల్ని జీర్ణించుకోలేవని కాంతిబాబు తెలిపాడు.

మరో గాజుతొట్టెలో వేరే మొక్కని చూశాం. దానికి తామరాకంత పెద్ద ఆకులున్నాయి. ప్రతి ఆకు చివరా ముంతవంటిది వేలాడుతుంది. నేను చూసిన బొమ్మల్ని బట్టి పోల్చుకోగలిగాను. అదే నెఫెన్థిస్; అంటే ముంతాకు మొక్క. దీనికి అపరిమితమైన ఆకలి ఉంటుందట. చిన్న చిన్న పక్షుల్ని కూడా సులభంగా తినేయగలదని కాంతిబాబు చెబుతూంటే మేము విస్తుపోయాం. ప్రస్తుతం బొద్దింకలు, గొంగళిపురుగులు, సీతాకోకచిలకల్ని ఆహారంగా అందిస్తున్నారట. ఒకసారి బోనులో ఎలుకను పట్టి ఆహారంగా ఇస్తే నిక్షేపంగా ఆరగించిదట. అయితే మితిమీరిన ఆహారం ప్రాణాంతకంగా మారుతుంది. గంపెడు ఆశతో తన పరిమితుల్నీ గుర్తించదట, ఇవన్నీ కాంతిబాబు చెబుతూంటే నోరువెళ్ళబెట్టుకొని విన్నాం. అలా అక్కడ సుమారు ఇరవై రకాల మాంసాహార మొక్కల్ని చూశాం. నాకు తెలిసినంతవరకు, బటర్‌వార్ట్, సన్‌డ్యూ, బ్లాడర్‌వార్ట్ మొక్కల్ని గుర్తించగలిగాను. మిగిలినవి చాలా కొత్తగా కనిపించాయి. నమ్మశక్యంగా లేనంత వింతగా ఉన్నాయి. ప్రపంచంలో ఇంత అరుదైన అపూర్వ సేకరణ మరెక్కడా కనిపించలేదంటే అతిశయోక్తి కాదు. సన్‌డ్యూ మొక్క కనువిందు చేస్తోంది. ఆకుపైన సన్నని రోమాల వంటివి వున్నాయి. వాటిచుట్టూ తళతళలాడుతున్న నీటిచుక్కలు కనిపిస్తున్నాయి. కాంతిబాబు ఏలకి గింజంత మాంసపు ముక్కను దారం చివర కట్టి అది ఆకుకు అందేటట్టు పట్టుకున్నాడు. ఆకుపైన రోమాలవంటివి ఆ మాంసపు ముక్కను అందుకునేందుకు యత్నించడం మా కంటికి స్పష్టంగా కనిపించింది. కాంతిబాబు దారంపైకి లాగాడు. దారాన్ని యింకా కిందికి దించినట్టయితే ఆకు మాంసంముక్కను ఒడిసి పట్టుకునేది. తనకు పనికి వచ్చే మేరకు ఆహారం తీసుకుని తక్కినదాన్ని వదిలిపెట్టేదని కాంతిబాబు విశదంచేశాడు.

షెడ్డులోంచి బయటికి వచ్చాం. సాయంత్రం నాలుగయింది. కాంతిబాబు అసలు విషయం చెప్పడం ప్రారంభించాడు. "నాదగ్గర అపురూపమైన మొక్క మరొకటుంది. ఇంతవరకు దాన్ని ఏ గ్రంథంలోనూ పేర్కొనలేదు. ఇక నేను రాస్తేనే లోకానికి తెలుస్తుంది. దాన్ని మీరు చూసి తీరాలి. అప్పుడు మీరే ఒప్పుకుంటారు, నేను మిమ్మల్ని ఎందుకు పిలిపించానో! పరిమళ్, అభిజిత్ నాతో రండి" అంటూ కాంతిబాబు మమ్మల్ని తీసుకువెళ్ళాడు.కార్ఖానాలో ఉన్న షెడ్డు వైపు నడిచాం. దానికి ఇనుప తలుపు ఉంది. అటూ ఇటూ రెండు కిటికీలున్నాయి. కాంతిబాబు ఒక కిటికీ రెక్కలు లోపలికి తోసి తొంగిచూశాడు. మమ్మల్ని పిలిచి అటు చూడమన్నాడు. అభీ, నేనూ వెళ్ళి చూశాం.

గది ఎడమగోడకు పై కప్పు దగ్గర రెండు లైట్లు అమర్చివున్నాయి. వాటికి గాజు అద్దపలకలున్నాయి. వాటి గుండా వచ్చే వెలుగువల్ల అక్కడ వెలుతురు పడుతుంది. అక్కడ ఉన్నది చెట్టులా లేదు. జంతువులా ఉంది. దానికి చేతుల్లాంటి దళసరి పాశాలున్నాయి. చెట్టుమాను ఎనిమిదినుంచి పది అడుగులు పైనే ఉంది. మాను పై భాగానికి ఒక అడుగు దిగువగా ఏడు చేతుల్లాంటి పాశాలు మొలిచినట్టున్నాయి. మాను పాలిపోయిన రంగులో ఉంది. అంతటా ఊదారంగు మచ్చలు కనిపిస్తున్నాయి. అప్పుడు మొత్తం పాశాలు నిర్జీవంగా ఉన్నట్లు తోచింది. కాని వాటివైపు చూడగానే వణుకు పుట్టింది.

ఆ మసక వెలుతుర్లో మాకో దృశ్యం కనిపించింది. గది నేలంతటా ఈకలు పరుచుకొని ఉన్నాయి. మేము నిశ్చేష్టులమై ఎంతసేపు ఉన్నామో చెప్పలేము. “చెట్టు ప్రస్తుతం నిద్రలో ఉంది. అది మేల్కొనే సమయమయింది.” కాంతిబాబు చెపుతున్న మాటలేవీ మా చెవికెక్కడం లేదు. అది చెట్టేనా అని అనుమానం వస్తూంది. కాని అది నేలలో పెరుగుతోంది కాబట్టి చెట్టే. అయితే దాని వైఖరి చెట్టుమాదిరిగా ఉండదన్నమాట మాత్రం నిజం. నిఘంటువులో కూడా దీనికి పేరంటూ లేదు. ‘సెప్టోపస్’ అని వ్యవహరిస్తారు. పాశం అంటే చుట్టుకుని ఉండేది; నాగపాశం మాదిరిది. మనం దీన్ని ఏడుచేతుల రాకాసిచెట్టుగా పిలుచుకుందాం. కాంతిబాబు ఉత్సాహంగా వివరిస్తున్నాడు.

“నేనేం పెడితే అది భక్షిస్తుంది. బోనులో పడ్డ ఎలకల్ని పెడుతూంటాను. కారు కిందపడి చనిపోయిన కుక్కగాని, పిల్లిగాని కనిపిస్తే ఈ చెట్టుకు ఆహారంగా తీసుకువస్తాను. మనం తినే కోడి, మేక మాంసంకూడా దానికి వేస్తాను. శుభ్రంగా అరిగించుకుంటుంది. ఈ మధ్య దాని ఆకలి విపరీతంగా పెరిగిపోయింది. ఆ ఆకలి తీర్చడం నావల్ల కావడం లేదు. రోజూ ఈవేళకు మేలుకుంటుంది. అప్పుడు చాలా కలవరపాటుతో, అశాంతితో ఉంటుంది. ఏనుగుకు ఆహారం ఎలా పెడతామో ఈ చెట్టుకు కూడా అలా ఆహారం అందించాలి. మాను పై భాగంలో ఉన్న మూతలాంటి భాగం తెరుచుకుంటుంది. ఈ చెట్టు ఒక చేతి (పాశం)తో ఆహారాన్ని తీసుకొని పై భాగాన ఉండే రంధ్రంలోకి జార విడుస్తుంది. ప్రతి తడవా లోపలికి కొంత ఆహారం వెళ్తుంది. అప్పుడు ఈ రాకాసి చెట్టు మెదలకుండా ఉంటుంది. తర్వాత చేతుల్ని కదిలిస్తుంది. అప్పుడు ఇంకా ఆకలి ఉన్నట్టు గ్రహించాలి.



ఇప్పటి వరకు దీనికి రోజుకు రెండు కోళ్ళు, చిన్న గొర్రె ఆహారంగా సరిపోతున్నాయి. కాని ఈ రెండురోజులనుంచీ పరిస్థితిలో మార్పు వచ్చినట్టు కనిపిస్తోంది. మొన్నటి రోజు పెద్ద ప్రమాదం జరిగింది. రోజులాగే మా పనిమనిషి ప్రయాగ్, కోడిమాంసం వేసేందుకు ఆ చెట్టున్న గదిలోకి వెళ్ళాడు. ఆ చెట్టు కోడిని తింటూనే మరో చేతితో ప్రయాగ్ కుడిచేతిని గట్టిగా పట్టుకుంది. అప్పుడు ప్రయాగ్ అరిచిన అరుపులు విని

© SCERT not to be republished

ఆదుర్దాగా వెళ్ళాను. రాకాసిచెట్టు మావాణ్ణి తినేందుకు ప్రయత్నిస్తూంది. ప్రయాగ్ శక్తినంతనూ కూడగట్టుకొని చేతినుండి విడిపించుకొనేందుకు ప్రయత్నిస్తున్నాడు.. మరోవైపునుంచి ఇంకో చేయి అతన్ని పట్టుకొనేందుకు సిద్ధమవుతూంది. వెంటనే నేను కర్రతో చేతిని గట్టిగా కొట్టాను. రెండు చేతులతో ప్రయాగ్‌ను లాగి రక్షించగలిగాను. రాకాసిచెట్టు ప్రయాగ్ చేతికండను కొంతవరకు కొరకడం ఎంతో బాధ కలిగించింది. ఆ కండను చెట్టు తన లోపల, అంటే నోట్లో వేసుకోడం నేను ప్రత్యక్షంగా చూశాను"



మేము వరండాలోకి వచ్చాం. కాంతిబాబు కూర్చుని, రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ఇలా అన్నాడు. "రాకాసిచెట్టుకు మనిషి మాంసం ఇష్టమని ఎప్పుడూ అనుకోలేదు. అది చెట్టు వెర్రి ఆకలి కావచ్చు, దుర్మార్గం కావచ్చు. నిన్నటి సన్నివేశం ప్రత్యక్షంగా చూసిన మీదట ఆ చెట్టును చంపడం మినహా నాకు వేరే మార్గం కనిపించలేదు. దానికిచ్చే ఆహారంలో విషం కలిపాను. కాని చెట్టు తెలివిగలది. చేతితో ముట్టుకుని ఆహారాన్ని నెట్టేసింది. మిగిలిందల్లా దాన్ని తుపాకితో కాల్చడం.ఇప్పుడు అర్థమయిందా పరిమళ్, మిమ్మల్ని ఎందుకు రమ్మన్నానో?" అన్నాడు కాంతిబాబు.

మరోసారి టీ తాగడం పూర్తి చేశాం. పదిహేను నిమిషాలు గడిచాయి, అప్పుడు చెట్టు మేలుకొంది. ముందు గదిలో బాద్‌షా గింజుకుంటోంది. ఉన్నట్టుండి 'ష్' అనే ధ్వని. కాళ్ళు దట్టిస్తున్న చప్పుడు వినిపించాయి. ఆ సంగతేమిటో తెలుసుకొనేందుకు అభీ, నేనూ హడావిడిగా అక్కడికెళ్ళాం. గొలుసు తెంపుకొనేందుకు బాద్‌షా తంటాలుపడుతోంది. అభి గట్టిగా మందలిస్తూ దాని గొడవ ఆపే యత్నం చేశాడు. ఆ సమయంలో ఒక విధమైన వాసన అలుముకుంది. ఈ వాసన, రేకుల షెడ్డువైపునుంచి వస్తున్నట్టుంది. క్లోరోఫామ్ వాసనలాగ అనిపిస్తూంది. చెట్టు మేలుకొంది. "దానికి ఆహారం కావాలని తెలియపరిచే వాసన..." అని కాంతిబాబు చెపుతూండగానే ఘోరం జరిగిపోయింది. బాద్‌షా, బలంగా గుంజుకుని మెడపట్టీ తెంపుకుని వాసన వస్తున్న రేకుల షెడ్డువైపు పరుగెత్తుకు వెళ్ళి కిటికీ గుండా లోపలికి దూకింది. లోపల్నించి, బాద్‌షా మృత్యుముఖంలో చిక్కుకున్న అరుపు వినిపించింది. కాంతిబాబు వెంటనే షెడ్డు తాళం తీయగా లోపలికి పరుగెత్తాం. చెట్టుకున్న ఒక చేతిలో బాదుషా చిక్కుకుంది. పూర్తిగా పట్టు బిగించడానికి ఆ చెట్టుకు ఒక చేయి సరిపోవడం లేదు. రెండో చేతితో, మూడో చేతితో బాద్‌షాను బంధించేందుకు రాకాసిచెట్టు గట్టిగా ప్రయత్నిస్తూంది. "ముందుకు వెళ్ళకండి పరిమళ్! వెంటనే కాల్చండి." కాంతిబాబు ఆందోళనగా హెచ్చరించాడు.కాంతిబాబు ఎంత వద్దన్నా వినకుండా అభి చెట్టు వైపు పరుగెత్తి, బాద్‌షాను బంధించిన మూడు చేతుల్లో ఒక దాన్ని పట్టి గుంజాడు. ఆ భయంకర దృశ్యం చూడగానే ఆపాదమస్తకం కంపించిపోయాను. రాకాసి చెట్టు తన మూడు

© SCERT not to be republished

చేతులతో అభిని బంధిస్తోంది. బాద్‌షాని వదిలిపెట్టింది. మిగిలిన మూడు చేతులు ఆకలితో అలమటించే నాలుకల్లా మనిషి రక్తం చవిచూసేందుకు కమ్ముకుంటున్నాయి.

"పరిమళ్! కాల్చండి. చెట్టు తలకు గురిపెట్టండి" కాంతిబాబు గట్టిగా అరుస్తూ సూచించాడు. చెట్టుపై నా దృష్టి కేంద్రీకరించాను. మానుపై భాగంలో మూత వంటిది తెరుచుకుంది. అక్కడే రంధ్రం వుంది. చేతులు అభిని ఆ రంధ్రం వైపు లాక్కొస్తున్నాయి. అభి ముఖం పాలిపోయింది. కళ్ళు ఉబ్బాయి.

ఇది అత్యంత ప్రమాదకరమైన క్షణం. అది నాకు తెలుసు. మంత్రం పెట్టినట్టు నా నరాలన్నీ అదుపులోకి వచ్చాయి. ఎలాంటి కంగారూ లేదు. గట్టిగా తుపాకి పట్టుకున్నాను. ఎలాంటి పొరపాటు లేకుండా చెట్టు తలపైన రెండు గుండ్రటి మచ్చల మధ్య కాల్చాను. వరదలా ద్రవం పెల్లుబికింది. చెట్టుచేతులు వెంటనే శక్తిహీనమయ్యాయి. అభిమీద పట్టును కోల్పోయింది. ఘాటైన వాసన వ్యాపించి, నా మనస్సును చుట్టుముట్టింది. రాకాసిచెట్టు నెమ్మదిగా కిందికి ఒరిగిపోవడం మొదలైంది.

ఈ సంఘటన జరిగి దాదాపు నాలుగు నెలలు పూర్తయ్యాయి. అభికి రెండు పక్కటెముకలు విరిగాయి. రెండు నెలలు హాస్పటల్‌లో ఉన్న తర్వాత నడవడం సాధ్యపడింది. కాంతిబాబు మాంసాహార మొక్కలన్నింటినీ నాశనం చేశాడు. నేను రాకాసి చెట్టును గురించి కథ రాసే ప్రయత్నంలో నిమగ్నమయ్యాను.

బెంగాలీ మూలం : సత్యజిత్ రే
ఇంగ్లీషు అనువాదం : మీనాక్షి ముఖర్జీ
తెలుగు అనువాదం : గోవిందరాజు రామకృష్ణారావు
'ఆఖరి టికెట్ మరికొన్ని కథలు' సంపుటినుంచి

© SCERT not to be republished



## ఇవి చేయండి.



1. కాంతిచరణ్ ఛటర్జీ విభిన్న రకాల మొక్కలను ఎలా సేకరించాడు? వాటిని ఏ విధంగా భద్రపరిచాడు?
2. రాకాసి చెట్టు ఆహారాన్ని ఏ విధంగా తీసుకుంటుంది?
3. పరిమళ్ రాకాసి చెట్టును ఏ విధంగా చంపేశాడు?
4. ఏడు చేతుల రాకాసి చెట్టు కథను సంగ్రహంగా వివరించండి.
5. రాకాసి చెట్టువల్ల మీకు వచ్చిన సందేహాలేమిటి? వాటిని మీ సహవిద్యార్థులతో ఏమని చర్చించారు?
6. ఈ కథ చదివిన తరవాత మీలో కలిగిన భావాలు ఏమిటి?

దృఢ సంకల్పం ఉంటే దేన్నైనా సాధించవచ్చు. – స్వామి వివేకానంద

మూడో యూనిట్

# 11. ?

– దాశరథి కృష్ణమాచార్యులు

**ఆలోచించండి – మాట్లాడండి.**



ప్రశ్నలు :

1. చిత్రంలోని పిల్లలను చూస్తే మీకు ఏమనిపిస్తుంది?
2. రెండో చిత్రంలో ఏం జరుగుతూంది? యుద్ధాలు ఎందుకు జరుగుతాయి?
3. ఇలాంటి బాధలు లేని లోకంకోసం ఏం చేయాలని మీరు అనుకుంటున్నారు?



**నేపథ్యం :**

ప్రశ్నలరూపంలో కొనసాగుతూ అసంఖ్యాకమైన ఆలోచనలను రేకెత్తించే గేయం ఇది. ఇరవై ఎనిమిది పంక్తుల్లో సమస్త మానవ ప్రపంచాన్ని, విశ్వవిజ్ఞానశాస్త్ర విషయాల సారాన్ని కవిత్వంలో సంక్షిప్తీకరించారు. మొదటి చరణం సముద్రం, ఖగోళశాస్త్రాల సమ్మేళనం. రెండో చరణం భూమి, మనిషి పుట్టుకల తీరును వివరిస్తుంది. ఇందులో విశ్వం ఆవిర్భావం, మానవ పరిణామక్రమం కనిపిస్తాయి. మిగిలిన చరణాలు కవి లోకానుభవంనుండి వచ్చిన చారిత్రక వాస్తవాలు. కవి కలలు, అందమైన ఊహలు, మరో కొత్తప్రపంచపు ఆశలు, ఆశయాలు, ఆవేదనలు, ఆగ్రహాలతో ఉద్వేగంగా నడుస్తుంది. కవి సున్నితమైన భావాలు మనల్ని ఆనందానికి, ఆగ్రహానికి గురిచేస్తాయి. కవి అన్నీ ప్రశ్నలే వేశాడు. ఇవి మానవాళికి సంధించిన ఆత్మవిమర్శనాత్మక అస్త్రాలు. ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఈ ప్రశ్నలకు సమాధానం, సమస్యలకు పరిష్కారం మనలోనే, మనదగ్గరే ఉంది. కవి వేసే ప్రశ్న మనకు గుచ్చుకుంటుంది. ఇలాంటి ప్రశ్నలకు చోటులేని 'నవయుగం' కోసం కవి చేసిన అక్షరయాగమే ఈ గేయం.

ప్రస్తుత పాఠ్యభాగం 'అగ్నిధార' కవితాసంపుటినుంచి తీసుకొన్నది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు–అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



ఆ చల్లని సముద్రగర్భం
దాచిన బడబానల మెంతో?
ఆ నల్లని ఆకాశంలో
కానరాని భాస్కరు లెందరో?

భూగోళం పుట్టుకకోసం
కూలిన సురగోళా లెన్నో?
ఈ మానవరూపంకోసం
జరిగిన పరిణామాలెన్నో?

ఒక రాజును గెలిపించుటలో
ఒరిగిన నరకంఠా లెన్నో?
శ్రమజీవుల పచ్చినెత్తురులు
తాగని ధనవంతులెందరో?

అన్నార్తులు అనాథ లుండని
ఆ నవయుగ మదెంత దూరమో?
కరువంటూ కాటకమంటూ
కనుపించని కాలాలెపుడో?

అణగారిన అగ్నిపర్వతం
కని పెంచిన "లావా" యెంతో?
ఆకలితో చచ్చే పేదల
శోకంలో కోపం యెంతో?


పసిపాపల నిదుర కనులలో
ముసిరిన భవితవ్యం యెంతో?
గాయపడిన కవిగుండెల్లో
రాయబడని కావ్యాలెన్నో?

కులమతాల సుడిగుండాలకు
బలియైన పవిత్రులెందరో?
భరతావని బలపరాక్రమం
చెర వీడే దింకెన్నాళ్ళకో?



© SCERT not to be republished

### కవి పరిచయం



| | | |
|---|---|---|
| పేరు | : | **దాశరథి కృష్ణమాచార్యులు** |
| కలం పేరు | : | దాశరథి |
| జన్మస్థలం | : | చిన్న గూడూరు, వరంగల్ జిల్లా |
| కాలం | : | 1925–1987 |
| రచనలు | : | అగ్నిధార, పునర్నవం, రుద్రవీణ, అమృతాభిషేకం, మహాంధ్రోదయం, ఆలోచనాలోచనాలు, గాలిబ్ గీతాలు |
| బిరుదులు | : | కవిసింహ, అభ్యుదయకవితాచక్రవర్తి. |
| పురస్కారాలు | : | 1967లో ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి, 1974లో కేంద్ర సాహిత్య అకాడమి అవార్డులు, ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవి. |

© SCERT not to be republished

## సారాంశం

పైకి చల్లగా, ప్రశాంతంగా కనిపించే సముద్రంలోపల కనిపించని అగ్ని దాగి ఉంటుంది. అలాగే ఎన్నో అసమానతలు ఉన్న ప్రపంచంలో అసంతృప్తిగలవాళ్ళ గుండెల్లో కూడా అగ్ని దాగి ఉంటుంది. నల్లని మబ్బులతో నిండిపోయిన ఆకాశంలో కంటికి కనపడని ఎన్నో సూర్యబింబాలు దాగిఉన్నట్టుగా ఈ పెద్ద ప్రపంచంలో ఎందరు ప్రతిభావంతులూ గొప్పవాళ్ళు మరుగునపడి ఉన్నారో.

భూమి పుట్టుకకోసం ఎన్నో సూర్యగోళాలు కూలిపోయాయి. ఆదిమానవుడి దగ్గరినుంచి నేటి మనిషి రూపం వరకు ఎన్ని మార్పులు జరిగాయో.

ఒక రాజును గెలిపించడానికి ఎంతమంది కంఠాలు తెగిపోయాయో! శ్రామికుల కష్టాన్ని దోచుకోనటువంటి ధనవంతులెంతమంది ఉంటారో?

తిండిదొరకనివాళ్ళూ, దిక్కులేనివాళ్ళూ లేని కొత్త ప్రపంచం ఎంతదూరంలో ఉందో, కరువుకాటకాలు లేని సుభిక్షమైన కాలం ఎప్పుడు వస్తుందో.

నిద్రిస్తున్న అగ్నిపర్వతంలో కనపడని లావాలా, సామాజిక చైతన్యంగల వ్యక్తుల గుండెల్లో ఎంత ఆవేదన దాగి ఉందో. ఆకలితో చనిపోయే పేదల మనసుల్లో ఎంత బాధ, ఎంత కోపం దాగి ఉందో!

హాయిగా నిద్రపోయే పసిపిల్లల కళ్లు ఎంత ప్రశాంతంగా ఉంటాయో అంతటి ప్రశాంతత, నిశ్చింత భవిష్యత్తు లో ఉంటాయా వాళ్ళకు? ఇన్ని అసమానతలున్న లోకాన్ని చూసి కవిహృదయం ఎంత లోతుగా గాయపడిందో! ఆ ఆవేదనలో మునిగిపోయి రాయవలసిన ఎన్ని కావ్యాలను రాయలేకపోయాడో.


ఈ వర్గ దురహంకార ప్రపంచంలో కులమతాలనే సుడిగుండంలో చిక్కుకొని బలిఅయిపోయిన మంచివాళ్ళు ఎంతమందో? భరతభూమిలోని వీరుల శక్తిసామర్థ్యాలు ఇంకెన్ని రోజులకు లోకానికి తెలుస్తాయో?



# ఇవి చేయండి




## I. వినడం-మాట్లాడడం



1. ఈ గేయాన్ని రాగయుక్తంగా గానం చేయండి.
2. కవి ఈ గేయం ద్వారా ఎవరిని గురించి చెప్పాడు?
3. ఈ గేయంలో కవి ఎవరి పక్షాన ఉండి మాట్లాడాడు?
4. పాఠంలో కవి ఆవేదనను మీ సొంతమాటల్లో చెప్పండి.
5. ఆకాశం వైపు చూసినప్పుడు మీకు కలిగిన ఆలోచనలేమిటి?
6. ఈ గేయం ఆధారంగా దాశరథిగారిని గురించి మీ అభిప్రాయం చెప్పండి.

## II. చదవడం - రాయడం



1. గేయాన్ని చదవండి. గేయంలో ప్రతి చరణంలోను చివరి వాక్యంలో ఏమున్నది? వాటిని చదివి, ఆ వాక్యాల భావం చెప్పండి.
2. గేయాన్ని చదవండి. గేయంలోని కొన్ని పదాలు రెండు చిన్న పదాలతో కలిసి ఏర్పడ్డాయి. అలాంటి పదాలను వెతికి రాయండి.

   ఉదా : సముద్రగర్భం, కవిగుండె

3. ఈ గేయం ప్రశ్నలతో ఉన్నది కదా! వీటిలో, మిమ్మల్ని బాగా ఆలోచించేటట్లు చేసిన ప్రశ్నలు ఏవి?వాటిని రాయండి.
4. కింది వాక్యాలు చదవండి. ఈ భావాలు గల గేయపంక్తులకింద గీత గీయండి.

   అ. పైకి చల్లగా, ప్రశాంతంగా కనిపించే సముద్రంలోపల, ఎవరికీ కనిపించని అగ్ని దాగి ఉంటుంది.

   ఆ. కులమతాల గొడవలకు, వివక్షలకు ఎంతోమంది గొప్పవారు, మంచివారు బలైపోయారు.

   ఇ. కరువుకాటకాలు లేని మంచి కాలం ఎప్పుడు వస్తుందో?

   ఈ. ఆకలితో బాధపడే పేదల దు:ఖంలో ఎంత కోపం ఉంటుందో?

5. పాఠం ఆధారంగా కింది గేయ పాదాలను పూరించండి.

   భూగోళం ____________________

   ____________________

   ____________________

   ________________ పరిణామాలెన్నో

© SCERT not to be republished

## III. స్వీయరచన



**1. ఈ కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. సముద్రం, ఆకాశం గురించి మీకు తెలిసిన విశేషాలు ఏమిటి?

ఆ. ఈ గేయానికి మీరైతే ఏ పేరు పెడతారు? రెండు కారణాలు రాయండి.

ఇ. కరువు కాటకాలవల్ల వచ్చే నష్టాలేమిటి?

ఈ. "రాజును గెలిపించడంలో ఒరిగిన నరకంఠాలెన్నో" ఈ వాక్యాన్ని కవి ఎందుకోసం రాశాడు? కవిభావం ఏమిటి?

ఉ. పేదల కోపాన్ని కవి లావాతో ఎందుకు పోల్చాడు?

ఊ. ఈ గేయాన్ని దాశరథిగారు రాయడంలో ఉద్దేశం ఏమై ఉంటుంది?


**2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. పాఠ్య సారాంశాన్ని మీ సొంతమాటలలో రాయండి

ఆ. ఈ గేయం ఆధారంగా ఆనాటి పరిస్థితులు ఎలా ఉన్నాయని మీరు భావిస్తున్నారు?

ఇ. "కులమతాల సుడిగుండాలకు బలియైనవారెందరో?" అని కవి ఆవేదన చెందాడుకదా! దీన్ని గురించి వివరించండి. అట్లాగే కులమతాలు లేని సమాజంలో ప్రజలందరూ ఎలా ఉంటారో ఊహించి రాయండి.

## IV. పదజాలం



**1. ఈ కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సమాన అర్థాన్ని ఇచ్చే పదాలు గేయంలో ఉన్నాయి. వాటిని గుర్తించి ఎదురుగా రాయండి.**

ఉదా: భారతదేశంలో దిక్కులేనివారు ఎందరో ఉన్నారు. అనాథలు

అ. ఆకలితో అలమటించేవారికోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టింది. ____________

ఆ. సముద్రంలో పుట్టే అగ్ని చాలా ప్రమాదకరమయింది. ____________

ఇ. సూర్యుడు ప్రపంచానికి వెలుగునిస్తాడు. ____________

ఈ. అగ్నిపర్వతంనుంచి వచ్చే వేడిద్రవం వల్ల చాలా వినాశనం కలుగుతుంది. ____________

ఉ. మన పాలపుంతలో ఎన్నో సూర్యగోళాలు ఉన్నాయి. ____________

ఊ. దెబ్బతగిలితే పిల్లలు ఏడుపు ఆపుకోలేరు. ____________

© SCERT not to be republished

**2. కింది వాక్యాలు చదవండి. ప్రతి వాక్యంలోనూ ప్రకృతి, వికృతి పదాలు ఉన్నాయి. వాటిని పట్టికలో రాయండి**

ఉదా: రాజు – రేడు

అ. రాజరాజు రాజమహేంద్రవరాన్ని పాలించేవాడు. ఆ రేడు ఆస్థానకవి నన్నయ.

ఆ. సముద్రంలో అలలు ఉంటాయి. కొన్ని సంద్రాలలో అలలు ఎగసిపడతాయి.

ఇ. చెట్ల రాపిడిలో అగ్ని పుట్టింది. ఈ అగ్గికి అడవి తగలబడిపోతుంది.

ఈ. అతని రూపం ఎంతో మనోహరం. ఆ రూపురేఖలు కొందరికే ఉంటాయి.

ఉ. ఆకాశంనిండా మేఘాలు అలముకున్నాయి. ఆకసం వర్షించడానికి సిద్ధంగా ఉంది.

ఊ. పోతన భాగవత కబ్బాన్ని రచించాడు. ఆ కావ్యాన్ని దైవానికి అంకితం చేశాడు.

| ప్రకృతి | వికృతి |
|---|---|
| | |

© SCERT not to be republished

**3. గేయం ఆధారంగా కింది పదాలను వివరించి రాయండి.**

అ) కానరాని భాస్కరులు అంటే ---------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

ఆ) దాగిన బడబానలం అంటే ---------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

ఇ) ఒరిగిన నరకంఠాలంటే ---------------------------------

---------------------------------------------------

---------------------------------------------------

ఈ) రాయబడని కావ్యాలంటే ---------------------------------------
-----------------------------------------------
-----------------------------------------------

ఉ) నవయుగం అంటే ---------------------------------------
-----------------------------------------------
-----------------------------------------------

## V. సృజనాత్మకత



1. "?" గేయ సారాంశాన్ని గ్రహించి వచన కవితగా రాయండి.
2. ఈ గేయంలోని ప్రశ్నార్థక వాక్యాల్లాంటివి మరికొన్ని రాసి గేయాన్ని పొడిగించండి.
3. కవి నవయుగాన్ని కోరుకుంటున్నాడు కదా! మీరు కోరుకునే నవయుగాన్ని ఎలా ఉండాలనుకుంటున్నారో ఊహించి రాయండి. దానికి ఒక చిత్రం గీయండి.

## VI. ప్రశంస




1. సముద్రం, పైకి కనిపించినట్టుగా లోపల ఉండదు. అగ్నిపర్వతం పైకి ప్రశాంతంగా ఉంటుంది. కాని లోపల లావాతో కుతకుతలాడుతూ ఉంటుంది. ఇలా పైకి ఒక రకంగా లోపల ఇంకో రకంగా ఉండే వాటిని గుర్తించండి.

## VII. ప్రాజెక్టు పని



1. దాశరథి రచించిన ఇతర రచనలను సేకరించండి.
2. దాశరథి రచనలు, పొందిన అవార్డులు, బిరుదులతో ఒక పట్టిక తయారు చేయండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



**1. కింది వాక్యాలను చదివి గీత గీసిన పదాలను ఉదాహరణలలో చూపినట్లు విడదీయండి.**

<u>చిట్టెలుక</u> చెట్టు రంధ్రంలోకి దూరింది.

<u>కట్టెదుటి</u> అన్యాయాలను ఎదిరిద్దాం.

<u>నట్టిల్లు</u> బాగుంది.

<u>నిట్టూర్పు</u>లతో కాలయాపన చేయవద్దు.

ఉదా॥ కుట్టుసురు = కుఱు + ఉసురు

చిట్టెలుక = ........ + .............

ఉదా॥ కట్టెదురు = కడు + ఎదురు

నట్టిల్లు = ......... + .............

నిట్టూర్పు = ......... + .............



© SCERT not to be republished

పైన పేర్కొన్న పదాలు రెండు విధాలుగా కనబడుతున్నాయి. వాటిలోని పూర్వ, పర స్వరాలను కలిపితే ఎలా మారుతున్నాయో చూడండి.

| | | |
|---|---|---|
| ట + ఉ = ట్టు ; | | డు + ఎ = ట్టె |
| ట + ఎ = ట్టు ; | | డు + ఇ = ట్టి |
| డు + ఊ = ట్టూ | | |

అంటే, పూర్వపదం చివర ఉన్న ట, డ లకు అచ్చుపరమైతే "ట్ట" అంటే ద్విరుక్త "ట"కారం వస్తున్నది. కాబట్టి దీన్ని **ద్విరుక్తటకారసంధి** అంటారు.

**అభ్యాసాలు :**

చిట్టడవి = ................. + ...................

నట్టేట = ................. + ...................

**కింది పదాలను ఉదాహరణలో చూపినట్లు విడదీయండి.**

ఉదా॥ నట్టనడుమ = నడుమ + నడుమ

కట్టకడ = ............... + .................

ఎట్టెదురు = ............... + .................

తుట్టతుద = ............... + .................

చిట్టచివర = ............... + .................

ఇవి ద్విరుక్త టకార సంధికి సరిపోతాయా? సరిపోవుకదూ! ఇవన్నీ ఆమ్రేడిత సంధికి ఉదాహరణలే. దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను పై తరగతుల్లో తెలుసుకుందాం.



## నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1. | గేయాన్ని రాగంతో పాడగలను. | ఔను / కాదు |
| 2. | గేయభావాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |
| 3. | ఈ పాఠ్య సారాంశాన్ని సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | గేయంలోని పదాలకు సమానార్థక పదాలు, రాయగలను, వివరించగలను | ఔను / కాదు |
| 5. | గేయాన్ని పొడిగించి రాయగలను. | ఔను / కాదు |

పుష్పానికి పరిమళం ఎలాంటిదో మనిషికి విశిష్టమైన శీలం అలాంటిది. - చార్లెస్.ఎమ్. ప్రానజ్


© SCERT not to be republished

మూడో యూనిట్

# 12. తెలుగు వెలుగు

(సంభాషణ)

## ఆలోచించండి - మాట్లాడండి :




ప్రశ్నలు :

1. చిత్రంలో ఎవరెవరు ఉన్నారని మీరనుకుంటున్నారు?
2. చిత్రంలో ఏ భాషగురించి చెబుతున్నారు?
3. తాతయ్య చెప్పిన మాటలకు అర్థం ఏమిటి?
4. తెలుగుభాష ఎటువంటి భాష?

తెలుగు భాష చాలా అందమైంది. అన్ని భావాలనూ తెలిపే సామర్థ్యం కలది. తెలుగు భాషలో ఉన్న గొప్పదనం సామెతలు, శబ్దపల్లవాలు, జాతీయాలు మొదలైనవాటిలోనూ, హరికథలు, సంకీర్తనలు మొదలైన ప్రక్రియలలోనూ ఉంది. ఈ పాఠంలో తెలుగుభాష అందచందాలను గురించి తెలుసుకుందాం.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

తాతయ్య : చిట్టీ!సురభీ! ఏం చేస్తున్నావమ్మా!

సురభి : ఏం లేదు తాతయ్యా! ఇవాల్టి ఆదివారంసంచికలోని ఓ తెలుగు పద్యాన్ని చదువుతున్నాను.

తాతయ్య : ఏదీ ఆ పత్రిక తే !



సురభి : పద్యం బలేగా ఉంది తాతయ్యా! ఇదుగో చూడండి.

(తాతయ్య పద్యం చూసి)

తాత : చమత్కారమున్న పద్యం!


సురభి : తాతయ్యా, ఈ పద్యాన్ని మీరొకసారి చదువుతారా!

తాత : అడిగెదనని కడు వడిఁ జను
నడిగినఁ దను మగుడ నుడువడని నడ యుడుగున్
వెడ వెడ జిడిముడి తడవడ
నడుగిడు; నడుగిడదు జడిమ నడుగిడు నెడలన్.

సురభి : చాలా బాగా చదివారు తాతయ్యా! నేనూ మీలాగే చదవాలికదా!

నాయనమ్మ: ఔను భాగవతంలోని గజేంద్రమోక్షం కథలో ఉన్న ఈ ఒక్కపద్యమే కాదు, ఇలాంటివి చాలా నేర్చుకోవాలి. మీ తాతయ్య ఎన్ని పద్యాలు నెమరువేస్తుంటారో!

సురభి : "నెమరువేయటం" అంటే ఏమిటి నాయనమ్మా!



తాతయ్య : 'నెమరు వేయటం' అంటే నిజానికి కొన్ని జంతువులు తిన్న ఆహారాన్ని మళ్ళీ నోట్లోకి తెచ్చుకొని ఒక పక్కనుంచి మళ్ళీ దాన్ని నములుతూంటాయి. ఇదే నెమరు వేసుకోటం. కాని దీన్ని భాషా విషయంగా "జ్ఞప్తికి తెచ్చుకోటం" అనే అర్థంలో వాడుతూ ఉంటారు.

(అప్పుడే శ్రీనిధి లోపలికి వచ్చింది)

శ్రీనిధి : ఇలాంటి వాటిని జాతీయాలంటారు కదా తాతయ్యా!

తాతయ్య : ఔనమ్మా! ఒక భాషలో కొన్ని పదాలు కలసి ఒక విశేష అర్థాన్ని ఇచ్చే పదబంధమైతే దాన్ని జాతీయం అంటాం. అది ఆ భాషకే సొంతం. పలుకుబడి అనే పేరుతో జాతీయాన్ని పిలుస్తాం. వీటితో మన భాషలో మాటల సంపద పెరిగింది.

సురభి : ఆర్.టి.సి. బస్సుల లోపల "దేశభాషలందు తెలుగు లెస్స" అని రాసి ఉంటుంది. అలా అంటే ఏమిటి తాతయ్యా?

తాతయ్య : శ్రీకృష్ణదేవరాయలు రాసిన వాక్యమిది. దేశభాషల్లో తెలుగు చాలా గొప్పదని అర్థం.

శ్రీనిధి : నాక్కూడా తెలుగుభాష ఎంతో ఇష్టం! కాని మా పాఠశాలలో తెలుగు మాట్లాడనీయరు తాతయ్యా!

తాతయ్య : అదేమిటి? చాలా తప్పు. అట్లాంటి పాఠశాల గురించి ప్రభుత్వానికి ఫిర్యాదుచెయ్యాలి. దానిమీద ప్రభుత్వం చర్య తీసుకొంటుంది.

శ్రీనిధి : సరేగాని! మా ఉపాధ్యాయులు పద్యంలోనే ఒక పొడుపు కథ చెప్పారు. బలేగా ఉంది.

సురభి : ఏమిటది?

శ్రీనిధి : పండిన దెండిన దొక్కటి<br>ఖండించిన పచ్చిదొకటి కాలిన దొక్కటై<br>తిండికి రుచియై యుండును<br>ఖండితముగ దీని దెల్పు కవియుంగలడే!<br>అంటే వక్క, ఆకు, సున్నం అని చెప్పారు.

సురభి : "తోక లేని పిట్ట తొంభై ఆమడలు పోయింది" – ఇలా కూడా పొడుపుకథలుంటాయి కదా తాతయ్యా!

తాతయ్య : ఔనమ్మా! పద్యంలో కావచ్చు, వచనంలో కావచ్చు. పొడుపు కథల్లోనే కాదు, ఇంకా అనేక రకాలుగా ఆనందాన్ని కలిగించే విధంగా తెలుగు పద్యాలున్నాయి. రచనలున్నాయి.

సురభి : 'తెలుగుభాష' అంటే పద్యాలేనా తాతయ్యా?

తాతయ్య : పద్యాలే తెలుగు భాష కాదు. వచన రచనలు కూడా ఉన్నాయి. తెలుగుకు కావల్సినంత భాషా సాహిత్య సంపద ఉంది. "మొక్కై వంగనిది మానై వంగుతుందా?" వంటి సామెతలు, జాతీయాలు, శబ్దపల్లవాలు మొదలైనవాటితో భాష నిండుగా ఉంది. అదే గొప్పతనం.


శ్రీనిధి : శబ్దపల్లవమంటే ఏమిటి తాతయ్యా?

నాయనమ్మ : ఏమిచదువులో ఏమో! తెలుగుభాష విషయంలో ఇప్పుడైనా మేలుకొనాలి!

తాతయ్య : చూశారా! మీ నాయనమ్మ అన్నదాంట్లో చివరిది శబ్దపల్లవమే. "మేలుకొను" అన్న మాటలో చిన్న మాటలు ఎన్ని ఉన్నాయి? నువ్వు చెప్పు శ్రీనిధి!

శ్రీనిధి : మేలు,కొను అనే రెండు చిన్న మాటలు ఉన్నాయి.

తాతయ్య : ఔను, నిజమే. 'మేలు' అంటే మంచి; ఇది నామవాచకం. 'కను' అంటే చూడటం; ఇది క్రియ. 'కను' 'కొను'గా మారింది. మేలుకొను అంటే నిద్రలేవడం, జాగృతమవడం అని అర్థం.



© SCERT not to be republished

శ్రీనిధి : ఓహో! రెండు వేరు వేరు అర్థాలున్న పదాలు కలిసి ఇంకో అర్థం వచ్చే కొత్తపదం అన్నమాట!

తాతయ్య : ఇలా నామవాచకానికి క్రియ చేరిన పదాలనే శబ్దపల్లవాలు అంటారు.

సురభి : మేలుకొలపడానికి పాటలు కూడా పాడతారుకదా తాతయ్యా!

తాతయ్య : ఔను సురభి తల్లీ! నువ్వు చెప్పింది నిజం. పాడతారు.

శ్రీనిధి : తాతయ్యా! పడుకోబెట్టడానికి కూడా పాటలు పాడతారుకదా!

తాతయ్య : ఔను పాడతారు. పిల్లలను జోకొడుతూ పాడే పాటలు. నీకేమైనా వచ్చా?

శ్రీనిధి : జోలపాటలా? తాతయ్యా! వచ్చు! జో అచ్యుతానంద జో జో ముకుంద......పిల్లల్ని జోకొడుతూ పాడే పాటలు జోలపాటలన్నమాట.

సురభి : నాకేమో 'పలుకే బంగారమాయెనా....." చాలా ఇష్టం.

తాతయ్య : ఇలాంటి పాటలను ఏమంటారో తెలుసా?

సురభి : సంకీర్తనలు కదా తాతయ్యా!

తాతయ్య : ఔను. మన తెలుగు భాషలో త్యాగయ్య, అన్నమయ్య వంటివారు రాసిన సంకీర్తనలు చాలా ప్రసిద్ధి పొందాయి.

శ్రీనిధి : మరి మన పల్లెల్లో ఉన్నవాళ్ళు పొలం పనులు చేసుకొంటూ పాటలు పాడుకొంటూ ఉంటారు కదా! అవి ఏమిటి?

తాతయ్య : అవి తెలుగుపాటల సంపదలోవే. పల్లెటూళ్ళలో ఉన్నవాళ్ళు ఆనందంగా పాడుకొంటూ ఉంటారు. చాలా బాగుంటాయి. వాటిని జానపద గేయాలంటారు.

సురభి : మరి అవన్నీ ఎవరు రాశారు?

తాతయ్య : అవన్నీ ఎవరో పనిగట్టుకొని రాసినవి కావు. అవి మౌఖికంగా, ఆశువుగా చెప్పినవి. అంటే అప్పటికప్పుడు ఊహించుకొని పాడినవి. ఫలానా జానపదగేయం ఫలానా వాడు రాసినది అని చెప్పలేము.

సురభి : అలానా! మరి మా అమ్మ ఇంట్లో నోమునోచుకొంటూ పాటలు పాడుతుంది.నోముల పాటలు కూడా ఉంటాయా?

తాతయ్య : ఉంటాయ్, ఉంటాయ్! తెలుగు భాష ఆడవాళ్ళకిచ్చిన ప్రత్యేక వరం. స్త్రీల నోముల పాటలు, పెండ్లి పాటలు, బతుకమ్మ పాటలు, జోలపాటలు, పండుగపాటలు, వేడుకలపాటలు మొదలయినవి ఎన్నో ఉన్నాయి. ఇది సరేగాని నిన్న రాత్రి మీరు ఎక్కడికెళ్ళారు?

సురభి : హరికథ వినటానికి వెళ్ళాం

తాతయ్య : హరికథ, బుఱ్ఱకథ, ఒగ్గుకథ, డప్పుకథ మొ॥నవి అన్నీ తెలుగులో ఆబాలగోపాలాన్ని అలరిస్తాయి.

సురభి : ఇవన్నీ ఒకే తీరుగా చెబుతారా?

తాతయ్య : లేదమ్మా! ఒక్కొక్క కథావిధానం ఒక్కొక్కరకంగా ఉంటుంది.

శ్రీనిధి : తాతయ్యా! మా స్నేహితురాలికి తెలుగుభాషలో ఆటలను గురించి వాళ్ళ అమ్మ చెప్పిందట. భాషలో ఆటలు అంటే ఏమిటి?

తాతయ్య : తెలుగు భాషలోని పదాలు, వాక్యాలు తీసుకొని ఆడుకోవడమన్నమాట. మీరిప్పుడు ఇంగ్లీషులో పజిల్స్, క్రాస్‌వర్డ్స్ లాంటివి నింపుతూఉంటారుకదా! అలాంటివన్నీ తెలుగులో కూడా ఉన్నాయి. నేనో ఆట చెప్పనా? "జనపనార" అనే మాటను తీసుకోండి ఇందులో ఉన్న పదాల్ని వెతకండి.



© SCERT not to be republished

శ్రీనిధి : జప,నాప,నర,జర,

సురభి : నాన,జన,పర,నార

తాతయ్య : చూశారా! మీరు ఎన్ని పదాలు తీయగలిగారో! ఈ ఆటలు పాటలవల్ల మీ భాషాసంపద, పదసంపద కొంత పెరుగుతుంది.

సురభి : 'కప్పను గని ఫణివరుండు గడగడ వణికెన్." అనే పంక్తితో మా పుస్తకంలో ఒక గమ్మత్తు పద్యం ఉంది.

తాతయ్య : వాటిని సమస్యాపూరణలు అంటారు. ఇవి సాధారణంగా అవధాన ప్రక్రియల్లో ఉంటాయి.

సురభి : అష్టావధానం అంటే ఆదేనా?

తాతయ్య : ఔను! అష్టావధానంలో సమస్యా పూరణం అనేది ఒక విషయం. శతావధానం, సహస్రావధానం అనేవి కూడా ఉన్నాయి. ఇవికూడా తెలుగులో ఒక అద్భుత విధానం. కవి ఏకాగ్రతను, ధారణను, ప్రతిభను తెలుసుకోదగిన ప్రక్రియలివి.

శ్రీనిధి : అబ్బా ! తెలుగు భాష ఎంత గొప్పదో ఇప్పుడు అర్థమవుతూంది. ఇన్ని రకాలుగా భాషను ఉపయోగించి , ఆనందించవచ్చు. ప్రయోజనాన్ని పొందవచ్చు.

సురభి : వేమన, బద్దెన లాంటివారి పద్యాలద్వారా నీతిని, ధర్మాన్ని గురించి ఎంతో తెలుసుకోవచ్చుకదా!

తాతయ్య : మంచిచెడులను గురించి కూడా చెప్పవచ్చు.

శ్రీనిధి : అదెలా?

తాతయ్య : మా నిజాంరాజు

తరతరాల బూజు! ... అన్నాడు కవి దాశరథి.

వట్టిమాటలు కట్టిపెట్టోయ్

గట్టిమేలు తలపెట్టవోయ్! ... అన్నాడు మహాకవి గురజాడ.

సురభి, : ఎంత సులభంగా అర్థమైందో!

శ్రీనిధి : ఐతే ఇన్ని రకాల గొప్పతనం ఉన్న మన తెలుగు భాషను వదిలిపెట్టేదే లేదు. తెలుగుతోపాటు ఇతర భాషల్నీ నేర్చుకుంటాం.

సురభి : నేను ఇతర భాషల్ని నేర్చుకున్నప్పటికీ నాకు తెలుగు భాషంటేనే ఇష్టం. తేనెల భాష తెలుగు అన్నది నిజం. తీయని భాష-తరగని భాష తెలుగు.

తాతయ్య : చాలా బాగా చెప్పారు. మన తెలుగును పాశ్చాత్యులు "ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ " అని కీర్తించారు తెలుసా!

శ్రీనిధి : అంటే ఏమిటి?

తాతయ్య : మన తెలుగులో కాలు, చెయ్యి, నోరు, నడుము, బరువు లాంటి మాటలు ఉన్నాయి కదా! వీటిలో ప్రతి మాటకూ చివర అచ్చు ఉంది కాలు అన్న మాటకు చివర లు ఉంది. 'లు' లో 'ల్ 'అనేది హల్లు, 'ఉ' అనేది అచ్చు ఈ విధంగా ఉండడంవల్ల తెలుగుకు అచ్చులతో అంతమయ్యే భాష అనీ, అజంత భాష అని పేరు వచ్చింది.

సురభి : ఓహో, అదా సంగతి!

తాతయ్య : ఇటలీభాషలో కూడా మాటల చివర అచ్చు ఉంటుందట. అందువల్ల పడమటి దేశాలవాళ్ళు తెలుగును 'తూర్పు దేశాల ఇటాలియన్' అని అన్నారు.

సురభి : ఆహా! అయితే ఇటాలియన్ భాష పడమటి దేశాల తెలుగు అన్నమాట.

© SCERT not to be republished

తాతయ్య : అదీ సంగతి!

శ్రీనిధి : ఎవరి మాతృభాష వారికి కన్నతల్లి లాంటిది. మన తెలుగు భాష మనకు అమృతం కదూ! మనం తెలుగులోనే ఆలోచిస్తాం. తెలుగులోనే మాట్లాడతాం. తెలుగులోనే జీవిస్తాం! మా స్నేహితులను ఇలానే ప్రోత్సహిస్తాం.

తాతయ్య : మీ స్నేహితులనే కాదు. అందరినీ, అన్ని అవసరాలకూ తెలుగు భాషనే వాడమని ప్రోత్సహించాలి. తెలుగు గొప్పతనాన్ని పద్యాల్లో, గేయాల్లో, పాటల్లోనూ నలుదిక్కులా పాడి వినిపించాలి. తెలుగు ఆరాధ్య భాష అయ్యేలా చూడాలి.

సురభి మా స్నేహితులందరికీ చెబుతాం తాతయ్యా!

తాతయ్య : తప్పకుండా చెప్పండి. ఎంతో మంది మహానుభావులు పెంచి పోషించినది మన తెలుగు భాష. ఇది ఎంత ప్రాచీనమయినదో అంత ఆధునికమయింది. ఎప్పుడో పుట్టిన గోదావరి ఇప్పటికీ ప్రవహిస్తూనే ఉంది కదా! అందువల్ల మనం ఏం చెప్పాలంటే–

**"భువి అంతా తిరిగినా**
**జన్మభూమి చేరరా!**
**భాషలెన్ని నేర్చినా**
**నీ భాషనె వాడరా!"**


© SCERT not to be republished



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. పాఠ్యభాగంలో మీకు బాగా నచ్చిన అంశం ఏమిటి?
2. మనకు ఏ భాషా లేకపోతే ఏమౌతుంది?
3. మన భాష గొప్పతనాన్ని గురించి నువ్వు ఏం తెలుసుకొన్నావు?
4. తెలుగు భాషలో జానపద గేయాలు, కథలు, పాటలు, పద్యాలు, సామెతలు, బుర్రకథలు, బతుకమ్మ పాటలు ఇలాంటివి ఉన్నాయి కదా! వీటిలో నీకు ఏవేవి ఇష్టం? ఎందుకు ఇష్టం?
5. 'ఎన్ని భాషలు నేర్చుకొన్నా మనం మన మాతృభాషను మరవగూడదు.' అనడానికి కారణం ఏమిటి?

### II. చదవడం - రాయడం



**1. ఈ కింది వాక్యాలు ఎవరు ఎవరితో అన్నారు.**

అ. తెలుగు భాష అంటే పద్యాలేనా తాతయ్యా?

ఆ. లేదమ్మా! ఒక్కొక్క కథావిధానం ఒక్కొక్క రకంగా ఉంటుంది.

ఇ. ఎప్పుడో పుట్టిన గోదావరి ఇప్పటికీ ప్రవహిస్తూనే ఉంది కదా!

ఈ. అజంత భాష అనీ పేరు వచ్చింది.

**2. కింది పేరాలోని సామెతలను గుర్తించి రాయండి.**

అప్పుచేసి పప్పుకూడు తినకుండా కోటి విద్యలు కూటి కొరకే కాబట్టి, ఏదో ఒక విద్యను నేర్చుకొని, తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టడం మాని మూడు పువ్వులు ఆరు కాయలుగా జీవితంలో వృద్ధి చెందాలి.

........................................................................................

........................................................................................

........................................................................................

........................................................................................

**3. కింది ప్రశ్నలకు పాఠాన్ని చదివి జవాబులు రాయండి.**

అ. తెలుగుభాష ఆడవాళ్ళకిచ్చిన ప్రత్యేక వరమేది?

ఆ. జాతీయాలు, శబ్దపల్లవాలు అంటే ఏమిటి? వాటికి ఉదాహరణలు ఇవ్వండి.

ఇ. నెమరువేయడం అంటే భాషాపరంగా అర్థమేమిటి?

ఈ. సంకీర్తనలు రచించినవారు ఎవరెవరు?

ఉ. జానపద గేయాలు అంటే ఏమిటి?

ఊ. ఇటలీ భాషను తెలుగు భాషతో పోల్చవచ్చా? ఎందువల్ల?

ఎ. తెలుగు సాహిత్యంలోని కొన్ని రకాల ప్రక్రియల పేర్లను తెలపండి.

ఏ. మనం చెప్పాల్సిన విషయమేమిటి?

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో ఆలోచించి జవాబులు రాయండి.**

అ. మీ ఉపాధ్యాయుడు తెలుగు మాట్లాడే తీరుకూ మీరు మాట్లాడే తీరుకూ తేడాలు కనిపిస్తున్నాయా? వాటిని గుర్తించి రాయండి.

ఆ. మీకు తెలిసిన ఐదారు సామెతలు రాసి వాటికి అర్థాలు తెలపండి.

ఇ. టీ.వీ. లోను, రేడియోలోను యాంకర్లు అనేవాళ్ళు తెలుగు మాట్లాడుతూ ఉంటారు కదా! వాళ్ళు పలికే భాష తీరును గురించి మీ అభిప్రాయం రాయండి.

ఈ. మీ తరగతిలో ఎన్ని భాషలు మాట్లాడే పిల్లలు ఉన్నారు. ఆ భాషల పేర్లు ఏమిటి?

ఉ. మన భాషలో మీకు తెలిసిన కవుల పేర్లను రాయండి.

ఊ. టీ.వీ., రేడియో, మీ ఇల్లు, తరగతిగది – వీటిలో ఏ ప్రదేశంలో మీకు భాష బాగా అర్థమవుతున్నదో రాయండి. ఏ ప్రదేశంలో ఎందుకు అర్థం కావడంలేదో రాయండి.

© SCERT not to be republished

2. **కింది ప్రశ్నలకు పది పంక్తుల్లో జవాబులు రాయండి.**

అ. భాషవల్ల కలిగే ప్రయోజనాలను రాయండి.

ఆ. ప్రసార మాధ్యమాల్లో వచ్చే "తెలుగు భాష"కు సంబంధించిన కార్యక్రమాల్ని చూడండి. మీ అభిప్రాయాన్ని రాయండి.

ఇ. తెలుగు భాష గొప్పతనాన్ని గురించి రాయండి.

ఈ. తెలుగు భాషను కాపాడడానికి మీరు ఏం చేస్తారో రాయండి.

## IV. పదజాలం


1. **కింది పట్టికలోని పదబంధాల్లో గల జాతీయాలను గుర్తించండి.వాటితో వాక్యాలు రాయండి.**

| | | |
|---|---|---|
| భగీరథ ప్రయత్నం | గుండె కరిగింది | తలపండిన |
| కొట్టిన పిండి | కంటికి కాపలా | కాలికి బుద్ధి చెప్పటం |
| అన్నం అరగటం | వీనులవిందు | కాయలు కాయటం |
| తలలో నాలుక | నా ప్రయత్నం | తుమ్మితే ఊడే ముక్కు |
| పెళ్ళి విందు | పుక్కిటి పురాణం | చెప్పులరగడం |
| కలగాపులగం | కళ్ళు కాయలు కాయటం | చెవిలో పోరు |

ఉదా : తలపండిన :- రామయ్య వ్యవసాయం చేయడంలో తలపండినవాడు కాబట్టి ప్రతి ఏటా మంచి పంట పండిస్తున్నాడు.

© SCERT
not to be republished

2. **కింది వృత్తంలోని పదాలకు ఆధారంగా శబ్దపల్లవాల్ని రాయండి. సొంతవాక్యాల్లో ఉపయోగించండి.**




ఉదా : బయటపడు : కిషన్ కష్టపడి సమస్యలనుంచి బయటపడ్డాడు.

3. **కింది వాక్యాలను చదవండి. వీటిని పట్టికలోనున్న తెలుగు భాషాప్రక్రియలలో సరైనవాటితో జతపరచి వాటిని వాక్యాలుగా రాయండి.**

| | | |
|---|---|---|
| అ. ఉప్పు కప్పురంబు ఒక్క పోలికనుండు | ................... | హరికథ |
| ఆ. అదిగో అల్లదిగో శ్రీహరి వాసము | ......................... | సంకీర్తన |
| ఇ. సోమవారపు లక్ష్మి ఉయ్యాలో | ......................... | బతుకమ్మపాట |
| ఈ. నేను అన్నం తిని బడికి వెళతాను | ........................ | బుర్రకథ |
| ఉ. బొబ్బిలిపులిని నేనురా – సై<br>దేశరక్షణ చేసెదరా – సై | ........................ | వచనం |
| ఊ. శ్రీమద్రమారమణ గోవిందో హరి | ........................ | పద్యం |

ఉదా : 'ఉప్పు కప్పురంబు నొక్కపోలికనుండు' అనేది పద్యప్రక్రియ

4. **కిందివాటిని ఉదాహరణలో చూపిన విధంగా ఒకే పదంగా కూర్చండి**

ఉదా : తెలుగు అనే పేరు గల భాష = తెలుగుభాష

అ. తల్లీ, తండ్రీ = ...................................

ఆ. హరి యొక్క కథ = ...................................


ఇ. దేశమునందలి భాషలు = ...................................

## V. సృజనాత్మకత



1. కింది జాతీయాలను ఉపయోగించి ఒక కథ రాయండి.
   చెవిలో ఇల్లు కట్టుకొని, కంటికి కాపలా, తలపండిన, వీనుల విందు, తలలో నాలుక, కాలికి బుద్ధి చెప్పు, చేతులు ముడుచుకోవడం, కొట్టిన పిండి.
2. "మన మాతృభాష కన్నతల్లితో సమానం". దీన్ని సమర్థిస్తూ ఉపన్యాసం ఇవ్వండి.
3. "తెలుగుభాష" గొప్పదనాన్ని గురించి, కాపాడడాన్ని గురించి నినాదాలు రాయండి.

## VI. ప్రశంస



1. **కింది సామెతల్ని మీకు తెలిసిన ఇతర భాషల్లో ఏమంటారో తెలుసుకోండి.**

అ. మనసుంటే మార్గముంటుంది.

ఆ. సాధనమున పనులు సమకూరు ధరలోన

ఇ. మెరిసేదంతా బంగారం కాదు

ఈ. నోరు మంచిదైతే ఊరు మంచిదౌతుంది.

2. **మనకు తెలుగు భాష లాగే ఇతరులకు వాళ్ళ భాష గొప్పది. కాబట్టి ఇతర భాషల్లోని గొప్పదనాన్ని గురించి తెలుసుకొని చెప్పండి.**

©SCERT not to be republished

## VII. ప్రాజెక్టు పని :



1. మీ పుస్తకంలోని ఇతర పాఠాలలో ఉన్న శబ్దపల్లవాల్ని, జాతీయాల్ని, సామెతల్ని వెతికి రాయండి.
2. తెలుగుభాష /మాతృభాష గొప్పదనాన్ని గురించి తెలిపే పద్యాలు, పాటలు, గేయాలు సేకరించండి. వాటిని పెద్దగా రాసి ప్రదర్శించండి. పాడి వినిపించండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



1. మీరు ఆమ్రేడితసంధి, ద్విరుక్తటకారసంధి గూర్చి తెలుసుకున్నారు కదా!
కింది పదాలను విడదీయండి. సంధిపేరు తెల్పండి.

అ) అయ్యయ్యో = .................... + .................... ........................
ఆ) కుట్టుసురు = .................... + .................... ........................
ఇ) కొట్టకొన = .................... + .................... ........................
ఈ) పట్టపగలు = .................... + .................... ........................
ఉ) అన్నన్న = .................... + .................... ........................
ఊ) చిట్టెలుక = .................... + .................... ........................
ఋ) ఎట్టెట్లు = .................... + .................... ........................
ౠ) అహాహా = .................... + .................... ........................
ఎ) అడిగడిగి = .................... + .................... ........................
ఐ) ఓరోరి = .................... + .................... ........................

2. కింది పదాలు ఏ సంధి సూత్రానికి వర్తిస్తాయో గుర్తించి ఆ సంధి పేరు రాసి సూత్రం రాయండి.

అ) అచ్చు .................... ఆమ్రేడితం ................ తరచు.
సంధిపేరు .....................................
సూత్రం.....................................

ఆ) ఱ, డలు .............. అచ్చు ............. ద్విరుక్తటకారం ............ ఆదేశం ............ కుఱు, చిఱు, కడు, నిడు, నడు.
సంధిపేరు .....................................
సూత్రం.....................................

© SCERT not to be republished



### నేనివి చేయగలనా ?



| | | |
|---|---|---|
| 1 | తెలుగు భాష గొప్పదనాన్ని గురించి మాట్లాడగలను. | ఔను / కాదు |
| 2. | పాఠం ధారాళంగా చదవగలను. పాఠం ఆధారంగా ప్రశ్నలు జవాబులు రాయగలను. | ఔను / కాదు |
| 3. | తెలుగుభాష గొప్పదనాన్ని గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు |
| 4. | తెలుగుభాషలోని సామెతలను, జాతీయాలను ఉపయోగించగలను. | ఔను / కాదు |
| 5. | జాతీయాలతో, సామెతలతో కథ రాయగలను. | ఔను / కాదు |


మీ బద్ధ శత్రువుతోనైనా సరే మంచిగా, మృదువుగా నొప్పికలిగించకుండా ఉండే భాషనుపయోగించి మాట్లాడండి.
– వివేకానందుడు

**మూడో యూనిట్**

# 13. బాల్య క్రీడలు

**ఆలోచించండి - మాట్లాడండి.**

**- బమ్మెర పోతన.**



ప్రశ్నలు :

1. చిత్రంలో ఎవరెవరు ఏం చేస్తున్నారో చెప్పండి?
2. చిత్రంలో పిల్లలు ఏఏ ఆటలాడుతున్నారు?
3. మీకిష్టమైన ఒక ఆటను ఎలా ఆడతారో చెప్పండి?

## నేపథ్యం

వ్రేపల్లెలో శ్రీకృష్ణుణ్ణి చంపడానికి కంసుడు అనేకమంది రాక్షసులను పంపాడు. ఆ రాక్షసులను ఒక్కొక్కరిని ఒక్కొక్క రీతిగా కృష్ణుడే చంపాడు. ఇవన్నీ చూసి వ్రేపల్లెలో నందుడు సమావేశం పెట్టాడు. అంతవరకు జరిగిన భయంకరమైన విషయాలను గురించి చర్చించాడు. ఆ సమయంలో ఉప నందుడనే వృద్ధ గోపాలకుడు ఇన్ని సమస్యలను ఎదుర్కొంటూ వ్రేపల్లెలో ఉండడంకన్న బృందావనం వెళ్ళడం మంచిదని సూచించాడు. అందుకు అందరూ అంగీకరించి బృందావనం చేరారు. అక్కడ బలరామకృష్ణులు తమతోటి బాలురతో ఆడిన ఆటలను గురించి ఈ పాఠ్యాంశం వివరిస్తుంది.


**ఈ పాఠ్యభాగం "ఆంధ్రమహా భాగవతం" దశమస్కంధం నుండి తీసుకొన్నది.**

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థం కాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థం కాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ




★ క. కసవు గల దిరవు పసులకు,
లస దద్రినదీ మహీజ లతికావలి పెం
పెసఁగును, గాఁపురమునకును,
బొసఁగును బృందావనంబు వొదఁడచ్చుటికిన్. 1

వ. ఇట్లు బృందావనంబు జెందిఁయుందుఁగొంతకాలంబునకు రామకృష్ణులు సమానవయస్కులైన గోపబాలకులం గూడికొని వేడుక లూదు కొన దూడల గాచుచు. 2

★ సీ. వేణువు లూఁదుచు వివిధరూపములతో
గంతులు వైతురు కౌతుకమున,
గురుకంబళాదుల గోవృషంబులఁబన్ని
పరవృషభము లని ప్రతిభటింతు,
రల్లులు దట్టించి యంఘ్రుల గజ్జెలు
మొరయఁ దన్నుదు రోలి ముమ్మరముగఁ
బన్నిదంబులు వైచి ఫలమంజరులఁ గూల్చి
వ్రేటులాడుదురు ప్రావీణ్యమొప్ప,

తే. వన్యజంతుచయంబుల వాని వాని,
పదురు పదురుచు వంచించి పట్టఁబోదు,
రంబుజాకరములఁజల్లులాడఁజనుదు,
రాకుమారులు బాల్యవిహారులగుచు. 3

© SCERT not to be republished




క. పోరుదురు గికురు వొడుచుచుఁ ,
దూఱుదురు భయంబు లేక తోరపుటిరవుల్.
జాఱుదురు ఘనశిలాతటి,
మీఱుదు రెన్నంగరాని మెలఁకువల నృపా! 4

★ సీ. కపులమై జలరాశిఁగట్టుదమా యని
కట్టుదు రడ్డంబుఁగాలువలకు,
మునులమై తపములు మొనయుదమా యని
మౌనులై యుందురు మాట లేక,
గంధర్వవరులమై గానవిద్యలు మీఱఁ
బాడుదమా యని పాడఁ జొత్తు,
రప్సరోజనులమై యాడుదమా యని
యాఁడు రూపుల ఁదాల్చి యాడఁ జనుదు,

ఆ. రమర దైత్యవరులమై యబ్ధిఁ ద్రత్తమా,
యని సరోవరములయందు హస్త
దండచయముఁ ద్రిప్పి తరుతురు తమ యీడు
కొమరు లనుసరింప గొమరుఁ మిగుల. 5

క. ఒకనొకని చల్దికావడి,
నొకఁడొకఁ డడకించి దాఁచు, నొకఁ డొకఁడది వే
ఱొకఁడొకని మొఱగికొని చన
నొకఁడొకఁ డది దెచ్చి యిచ్చు నుర్వీనాథా! 6

★ క. ఒక్కఁడు ము న్నే మఱి చన
నొక్కఁడు బలుబొబ్బ వెట్టి నులికిపడన్, వే
ఱొక్కఁడు మిట్టి తటాలున,
నొక్కని కనుదోయి మూయు నొక్కఁడు నగఁ గన్ 7





© SCERT not to be republished

★ క. తీపుగల కజ్జ మన్న్యఁడు,
గోపింపఁగ నొడిసి పుచ్చుకొని త్రోపాడం
బైపడి యదిగొని యొక్క ఁడు,
క్రేపులలో నిట్టునట్టుఁగికురించు నృపా! 8

★ క. వనజాక్షుఁడు మున్నరిగిన,
'మునుపడఁగా నతని నేనె ముట్టెద' ననుచుం
జని మును ముట్టనివానిన్,
మును ముట్టినవాడు నవ్వ మొనసి నరేంద్రా! 9

★ ఉ. ఎన్నఁడునైన యోగివిభు లెవ్వని పాదపరాగ మింతయుం
గన్నులఁగానరట్టి హరి గౌఁగిట జేర్చుచుఁ జెట్టబట్టుచుం
దన్నుచుఁగ్రుద్దుచున్ నగుచుఁదద్దయు ఁబైపడి కూడి యాడుచున్
మన్నన సేయు వల్లవకుమారుల భాగ్యము లింత యొప్పునే? 10



### కవి పరిచయం



| | | |
|---|---|---|
| పేరు | : | **బమ్మెర పోతన** |
| కాలం | : | 15వ శతాబ్దం |
| జన్మస్థలం | : | బమ్మెర గ్రామం, వరంగల్ జిల్లా, |
| రచనలు | : | భోగినీదండకం, ఆంధ్రమహాభాగవతం, వీరభద్రవిజయం, |
| బిరుదు | : | సహజపండితుడు |



© SCERT not to be republished

## భావం:


1. బృందావనం అనే ప్రదేశంలో పశువులకు మేత సమృద్ధిగా ఉన్నది. అక్కడ అందమైన చెట్లు, కొండలు, నదులు, చెట్లు, తీగలు ఉన్నాయి. ఉండడానికి తగినట్లుగా ఉంది. అక్కడికి పోదాం పదండి.
2. ఈ విధంగా బృందావనం చేరిన కొంతకాలానికి బలరామకృష్ణులు తమతో సమానమైన వయసుగల గోపబాలురతో కలసి సంతోషంగా దూడలను కాస్తూ.......
3. రాకుమారులు పిల్లనగ్రోవులను ఊదుతూ, అనేక రూపాలతో సంతోషంగా గంతులు వేస్తున్నారు. పెద్ద కంబళ్ళను కప్పుకొని ఎద్దుల్లాగ ఒకరినొకరు ఎదిరించుకొంటున్నారు. బట్టలతో తయారుచేసిన బొమ్మలను తన్నుకుంటూ ఆడుతుంటే వాళ్ళ కాళ్ళ గజ్జెలు ఘల్లు ఘల్లుమన్నాయి. పండ్ల గుత్తులను నేల రాల్చటానికి పందేలు వేసుకొని వారి వారి నేర్పరితనాన్ని చూపిస్తున్నారు.

   అడవి జంతువుల మాదిరి అరుస్తూ, దగ్గరకు వచ్చిన జంతువులను అమాంతంగా పట్టబోతున్నారు. సరస్సులోకి వెళ్ళి నీళ్ళు జల్లుకుంటూ ఆడుతూ బాల్యవిహారులౌతున్నారు.
4. ఉత్తుత్త యుద్ధాలు చేస్తూ ఒకరినొకరు దొంగదెబ్బ తీసుకొంటున్నారు. కొత్త ప్రదేశాలకు ఏమాత్రం భయం లేకుండా పోతున్నారు. పెద్ద పెద్ద బండరాళ్ళపైకి ఎక్కి జారుతున్నారు. ఇవన్నీ చేయడంలో ఊహించని నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు.
5. మనమంతా కోతులలాగ సముద్రానికి వారధి కడదామా, అంటూ కాలవలకు అడ్డుకట్టలు కడుతున్నారు. మనమంతా మునులలాగ, మరి తపస్సు చేద్దామా ? అంటూ మాట్లాడకుండా మునులులాగా కూర్చుంటున్నారు. మనమంతా గంధర్వులలాగ, చక్కగా పాటలు పాడుదాం, అంటూ చెవులకింపుగా గొంతెత్తి పాడుతున్నారు. మనమంతా అప్సరసలలాగ, చక్కగా నాట్యం చేద్దామా? అంటూ ఆడవేషాలు వేసుకొని నాట్యం చేస్తున్నారు. మేము దేవతలం, మీరు రాక్షసులట; కలసి సముద్రాన్ని మథిద్దామా, అంటూ కొలనులలో చేతులతోనే నీళ్ళను చిలుకుతున్నారు. ఈ విధంగా తమ ఈడు పిల్లలతో ఆనందంగా ఆటలాడుతున్నారు.
6. ఒకని చల్ది కావడిని (చిక్కాన్ని) మరొకడు బెదిరించి తీసుకొని దాచాడు. వీణ్ణి మోసగించి ఇంకొకడు తీసుకొని వెళ్ళాడు. వాడిదగ్గరినుంచి వేరొకడు తెచ్చి మొదటివాడికి ఇచ్చాడు.
7. ఒకడు పరధ్యానంగా నడుస్తూంటే ఇంకొకడు వెనకనుంచి గట్టిగా కేకపెట్టాడు. అది విని వాడు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. ఇంకోచోట ఒకడు వెనకనుంచి వచ్చి మరొకని కళ్ళు మూశాడు. అది చూసి వేరొకడు నవ్వుతున్నాడు.
8. ఒకని చేతిలోని తియ్యని పిండివంటను మరొక్కడు లాక్కొని పారిపోతున్నాడు. పిండివంట తెచ్చుకొన్న వాడికి చాలా కోపం వచ్చింది. కాని ఆ పారిపోతున్నవాడి దగ్గరినుంచి దాన్ని మరొకడు లాక్కొనిపోయి దూడల మధ్య అటూ ఇటూ తిరుగుతూ దొరకకుండా వీణ్ణి ఏడిపిస్తున్నాడు.
9. కృష్ణుడు ముందు నడుస్తూంటే చూసి ఇద్దరు బాలకులు ఎవరు కృష్ణుణ్ణి ముందుగా ముట్టుకొంటారో చూద్దామని పందెం వేసుకొన్నారు. పందెంలో, ముట్టుకోలేనివాణ్ణి చూసి నవ్వుతున్నారు.
10. యోగి శ్రేష్ఠులు సైతం పరమపురుషుడయిన శ్రీకృష్ణుని పాదధూళిని రవ్వంతకూడా చూడలేరు అటువంటి శ్రీకృష్ణుణ్ణి గోపబాలురు కౌగిలించుకొంటూ, చెట్టపట్టాలు వేసుకొంటూ, తన్నుతూ, గుద్దుతూ, నవ్వుతూ మీద పడుతూ కలిసి ఆడుకొంటున్నారు. ఈ గోపబాలకుల అదృష్ట మెంత గొప్పదో గదా!


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ


 **ఇవి చేయండి** 

### I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలను భావయుక్తంగా పాడండి.
2. పాఠంలోని పద్యాలు వేటినిగురించి ఉన్నాయి?
3. ఈ పద్యాలు మీకు అర్థమయ్యేలా ఉన్నాయని భావిస్తున్నారా? వాటిలో ఏ ఏ పద్యాలు సులభంగా అర్థమౌతున్నాయి?
4. పాఠంలోని ఏ ఏ పద్యాలు మీకు బాగా నచ్చాయి? ఎందువల్ల?
5. బాల్యక్రీడలని పాఠంపేరు విన్నప్పుడు మీకు ఏమనిపించింది?
6. ఈ పద్యాలు విన్నారు కదా! బలరామకృష్ణులు, గోపబాలకులు. ఏ ఏ ఆటలు ఆడారు? వాటిలో ఏ ఏ ఆటలను ఇప్పటి పిల్లలు కూడా ఆడుతున్నారు?

### II. చదవడం - రాయడం



**1. పాఠం ఆధారంగా కింది అంశాలకు సంబంధించిన పద్యాలు ఏవో చెప్పండి.**

వాటికింద గీత గీయండి.

(అ) బృందావనం (ఆ) గోపబాలకుల భాగ్యం

(ఇ) పిండివంటలతో ఆడుకోడం (ఈ) ఒకరినొకరు ముట్టుకొనే ఆట

**2. కింది పద్యాలను చదవండి. వాటి భావం ఆధారంగా ఆ పద్యాలకు శీర్షికలు పెట్టండి.**

(అ) వేణువులూదుచు ...................... బాల్య విహారులగుచు

(ఆ) కపులమై జలరాశి ........................ గొమరు మిగుల.

**3. కింది పేరాను చదవండి.**

ఒకనాడు బలరామకృష్ణులూ గోపబాలురు అందరూ కలిసి వనభోజనాలు చేయాలని సరదాపడ్డారు. పొద్దుటే లేచి, గబగబా తమ ఇంటి లేగదూడలను బయటికి తోలుకొని వచ్చారు. అందమైన కొమ్ము బూరలను పూరించి ఊదగానే మిగిలిన గోపకుమారులందరూ మేల్కొన్నారు. చల్ది అన్నపు కావడులను భుజాలకు తగిలించుకొన్నారు. తల్లులు సిద్ధంచేసి ఉంచిన రకరకాల పిండివంటలు మూటలు కట్టుకొన్నారు. కాళ్ళకు చెప్పులు వేసుకున్నారు, చేతికర్రలు పట్టుకున్నారు. లెక్కపెట్టడానికి కూడా కష్ట మనిపించే తమతమ లేగలమందలను 'హెహెయ్' అని కేకలతో తోలుకొంటూ బయలుదేరారు. పరుగులతో ఆయాసపడుతూ అడవిలోకి ప్రవేశించారు. బంగారు, మణి భూషణాలు ధరించి ఉన్న పూలను, చిగుళ్ళను,

©SCERT not to be republished

చిన్నచిన్న పండ్లను అలంకారాలుగా ధరించారు. కొమ్ముబూరలు పూరిస్తూ, పిల్లనగ్రోవులు ఊదుతూ, తుమ్మెదలతోబాటు ఝుమ్మని పాడుతూ, నెమళ్ళతో సమానంగా నాట్యంచేస్తూ, కోకిలలను, మిగిలిన పక్షులను అనుకరించి కూతలు కూస్తూ, చిలకలతోపాటు అరుస్తూ కేరింతలు కొట్టారు. పైన పక్షులు ఎగురుతూ ఉంటే వాటి నీడలతోపాటు తామూ పరుగులెత్తారు. జలజలపారే సెలయేళ్ళను చెంగున దాటారు. హంసలపక్కనే వాటిని అనుకరిస్తూ నడిచాడు. కొంగలతో పాటు ఒంటికాలిమీద నిలబడ్డారు. బెగ్గురు పక్షులను తరిమితరిమి అలసిపోగొట్టారు. నదీ జలాలలో స్నానాలు చేశారు. తీగల ఉయ్యాలలు ఊగారు. గోతులలో దాక్కొన్నారు. దూరాలకు పరుగు పందేలు వేసుకొన్నారు. కోతులవలె చెట్లు ఎక్కారు. పండ్లు తిని, ఆ రుచులకు పరవశించిపోయారు. కుప్పించి దూకి, తమ నీడలను చూసి నవ్వుకొన్నారు. ఒకరితో ఒకరు పోట్లాడుకున్నారు. కేరింతలు కొడుతూ, పరుగెడుతూ, పడుకొంటూ, అలసిపోతూ ఇలా ఎన్నో రకాలుగా ఆటలు ఆడుకొన్నారు.

(అ) పై పేరాకు వీలైనన్ని ప్రశ్నలు రాయండి.

(ఆ) పై పేరాకు శీర్షికను రాయండి.

(ఇ) పై పేరాకు, పాఠానికి ఉన్న సంబంధం ఏమిటి?

**4. కింది ప్రశ్నలకు పాఠం ఆధారంగా సమాధానాలు రాయండి.**

(అ) బృందావనం ఎలా ఉంది?

(ఆ) గోపబాలురతో బలరామకృష్ణులు నీటికి సంబంధించి ఏ ఏ ఆటలు ఆడారు?

(ఇ) గోపబాలకులు నవ్వుకొనేలా ఏ ఆటలాడారు?

(ఈ)పోతన గోపబాలకుల అదృష్టాన్ని ఏమని చెప్పాడు?

## III. స్వీయరచన



**1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. బలరామకృష్ణులు గోపబాలురతో ఆడిన ఆటలలో మీకు ఏ ఏ ఆటలు బాగా నచ్చాయి? ఎందుకు?

ఆ. పోతన పద్యాలలో చెప్పిన ఆటల్లో మీరు ఆడే ఆటలు ఏమైనా ఉన్నాయా? అవి ఏవి?

ఇ. ఒకరినొకరు భయపెట్టే ఆటలు ఏవేవి ఆడారు?

ఈ. గోపబాలకులతో బలరామకృష్ణులు బృందావనంలో ఆటలు ఆడారు కదా! మీరు ఎక్కడెక్కడికి వెళ్ళి ఏ ఏ ఆటలు, ఎవరితో ఆడతారు?

ఉ. గోపాలబాలకులతో బలరామకృష్ణులు ఆటపాటలతో గడిపేవారు కదా! దీన్ని బట్టి బలరామకృష్ణులు ఎలాంటివారో వివరించండి.

ఊ. గోపబాలకులు ఎంతో భాగ్యవంతులని పోతన వివరించాడు కదా! ఇలా పోతన అనడానికి కారణం ఏమిటి?

©SCERT not to be republished

2. కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.

అ. పోతన సుమారు 500 సంవత్సరాల కిందట భాగవతంలో రకరకాల ఆటలను గురించి వివరించాడు కదా! నాటి ఆటలతో పోల్చినప్పుడు నేటి ఆటల్లో ఏమైనా తేడాలున్నాయా? అలాగే ఆడుతున్నారా? మీ సొంత మాటల్లో రాయండి.

ఆ. పోతన తన పద్యాలద్వారా బలరామకృష్ణులు గోపబాలకులతో ఆడే ఆటలను వివరించాడు. దీన్ని బట్టి పోతనకు పిల్లలను గురించి ఏ ఏ విషయాలు తెలిసి ఉండవచ్చు.

ఇ. బలరామకృష్ణుల బాల్యక్రీడలను గురించి సొంతమాటల్లో రాయండి.

ఈ. బలరామకృష్ణులు ఆడిన ఆటల్లో ఏదైనా ఒక ఆటను ఆడిన విధానాన్ని వివరించండి.

## IV. పదజాలం

1. పాఠంలోని పద్యాల ఆధారంగా బలరామకృష్ణులు ఏ ఏ వస్తువులు ఉపయోగించి ఆడుకున్నారో ఆ వస్తువుల పేర్లను రాయండి.

2. కింది వాక్యాలు చదవండి. గీతగీసిన పదాల అర్థాలను రాయండి.

(అ) రాముడు కపులతో కలిసి వారధిగట్టాడు.

(ఆ) నదులన్నీ జలరాశిలో కలుస్తాయి.

(ఇ) <u>నరేంద్రుడు</u> రాజ్యాన్ని పాలిస్తాడు.

(ఈ) <u>ప్రావీణ్యం</u> కోసం రోజూ అభ్యాసం చెయ్యాలి.

(ఉ) రామయ్యకు <u>భాగ్యం</u> కొద్దీ ఉద్యోగం దొరికింది.

3. కింది పదాలను చదవండి. వీటిని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

(అ) బొబ్బపెట్టు : ..........................................................

(ఆ) ఒడిసి పట్టుకొని : ..........................................................

(ఇ) కౌతుకము : ..........................................................

(ఈ) వన్యజంతువులు : ..........................................................

(ఉ) బాల్యక్రీడలు : ..........................................................

(ఊ) మన్ననచేయు : ..........................................................


## V. సృజనాత్మకత

1. పాఠం ఆధారంగా బృందావనం ఎలా ఉంటుందో ఊహించి చిత్రం గీయండి, రంగులు వేయండి. దాన్ని గురించి రాయండి.

2. మీరు ఆడుకొనే ఆటల జాబితా తయారుచేసి వాటిని ఉపయోగించి ఒక గేయం రాయండి.


© SCERT not to be republished

## VI. ప్రశంస



1. పిల్లలను గురించి వాళ్ళు ఆడే ఆటలను గురించి పోతన ఎంతో చక్కగా పద్యాలలో వివరించాడు కదా! ఇలా పోతన రాసిన మరికొన్ని పద్యాలను సేకరించండి. వాటిని రాగంతో, భావంతో పాడండి.
2. బాల్యక్రీడలనే పాఠం పోతన భాగవతంలోది కదా! భాగవతంలోని మరికొన్ని కథలను తెలుసుకొని చెప్పండి.

## VII. ప్రాజెక్టు పని



1. మీ నాన్న, అమ్మ, మీ తాతయ్యలు, అమ్మమ్మలు బామ్మలను అడిగి వాళ్ళ చిన్నతనంలో ఏ ఏ ఆటలు ఆడుకొనేవారో, అడిగి తెలుసుకోండి. వాటి ఆధారంగా కింది పట్టికను పూరించండి.

| తాతయ్యలు, అమ్మమ్మలు, బామ్మలు వారు చిన్నప్పుడు ఆడిన ఆటలు | నాన్న, అమ్మ, అత్త మొదలైనవాళ్ళు చిన్నప్పుడు ఆడిన ఆటలు | మీరు ఇప్పుడు ఆడుకొనే ఆటలు |
|---|---|---|
| | | |

బలరామకృష్ణులు గోపబాలురతో ఆడిన ఆటలతో వీటిని పోల్చండి. ఏమి గ్రహించారో చెప్పండి.

©SCERT not to be republished

## VIII. భాషగురించి తెలుసుకుందాం



శబ్దాలంకారాలను గురించి 6వ తరగతిలో నేర్చుకున్నారు కదా!

ఈ పాఠంలోని కింది పద్య పాదాలను గమనించండి


1. గంతులు వేతురు కౌతుకమున.

   (దీనిలో మళ్ళీ మళ్ళీ వచ్చిన హల్లు ..............................)

2. పోరుదురు గికురు వొడచుచు దూఱుదురు.

   (దీనిలో మళ్ళీ మళ్ళీ వచ్చిన .............................. )

3. ఒకనొకని చల్దికావడి,
   నొకఁ డడకించి దాచు, నొకఁడొకఁ డదివే
   ఱొకఁడొకఁని మొఱగి కొని చన
   నొకఁ డొక ......................
   ఈ పద్యంలో మళ్ళీ మళ్ళీ వచ్చిన హల్లు ..............................





ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

పై ఉదాహరణల్లో ఏ అలంకారం ఉన్నదని గుర్తించారు? వృత్త్యనుప్రాసమే కదూ!

పైన మీరు రాసిన సమాధానాలను బట్టి ఈ అలంకారం లక్షణాన్ని అంటే వృత్త్యనుప్రాసాలంకారం గుర్తించడం ఎట్లాగో తెలుసుకుందాం.

లక్షణం: ఒకే హల్లు పలుమార్లు వచ్చినట్లైతే అంటే పునరావృత్తమైతే దాన్ని వృత్త్యనుప్రాసాలంకారం అంటారు.

**అభ్యాసం:** మూడో, ఐదో పద్యాల్లో ఉన్న అలంకారాన్ని గుర్తించి రాయండి.

## అంత్యానుప్రాసం

1. వేద శాఖలు వెలిసెనిచ్చట

   ఆది కావ్యంబలరె నిచ్చట,

   ఈ గేయంలోని రెండు పంక్తుల చివరన ఉన్న పదాలు ఏవి?

   మొదటి పంక్తి చివర.......................... రెండో పంక్తి చివర ..........................

2. తలుపుగొళ్ళెం

   హారతిపళ్ళెం

   గుఱ్ఱపుకళ్ళెం

   ఈ మూడు వరసల్లో చివరన వచ్చిన పదాలు ఏవి?

   1. .................... 2. .................... 3. .....................

పై ఉదాహరణలలో మీరు రాసిన సమాధానాల ద్వారా. మీరు ఒక విషయాన్ని గుర్తించి ఉండాలి. అన్ని పంక్తులూ చివరన ఒకే రకమైన పదంతోనో, అక్షరంతోనో ముగుస్తున్నాయి. అంతే కదూ!

ఇప్పుడు మీరు ఇది అంత్యానుప్రాసాలంకారమని గుర్తించారు కదూ! ఈ అలంకారాన్ని గుర్తించడానికి లక్షణం ఏమిటో రాద్దాం.

**"పాదాంతంలో లేదా పంక్తిచివరలో ఒకే ఉచ్చారణతో ముగిసే పదాలు లేదా అక్షరాలు ఉంటే దాన్ని అంత్యానుప్రాసాలంకారం అంటాం".**

**అభ్యాసం** :దేశభక్తి, ప్రకటన పాఠాల్లోని అంత్యానుప్రాసాలంకారం పాదాలను గుర్తించి రాయండి.



### నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగంతో భావంతో పాడగలను. భావాలను సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | పద్యాలను విన్న, చదివిన భావాలను అర్థం చేసుకోగలను. | ఔను/కాదు |
| 3. | బాల్యక్రీడల గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను/కాదు |
| 4. | నేర్చుకున్న పదజాలంతో సొంతవాక్యాలు రాయగలను. | ఔను/కాదు |
| 5. | పద్యభావాలకు అనుగుణంగా చిత్రాలను గీయగలను. ఆడుకొనే ఆటలతో గేయం రాయగలను. | ఔను/కాదు |

దృఢమైన శరీరంలోనే దృఢమైన ఆత్మ ఉంటుంది. – నరేంద్రనాథ్ దత్త

© SCERT not to be republished

మూడో యూనిట్

# 14. గుశ్వం

ఉపవాచకం



జానపద గాథలలో “పరమానందయ్యగారి శిష్యుల కథలు” ఎంతో వినోదాన్ని కలిగిస్తూ ఉంటాయి. ఆయన శిష్యుల చర్యలు, చేష్టలు నవ్వు పుట్టిస్తూ ఉంటాయి. పరమానందయ్య శిష్యుల కథలని చెప్పుకొనే వాటిలో ఒక కథ ఈ నాటికకు ఆధారం.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



## పాత్రలు

పరమానందయ్యగారు, చెన్నడు, గున్నడు, తిన్నడు, పెద్దమనిషి.

### మొదటి రంగం

(పరమానందయ్యగారి ఆశ్రమం : చెట్టుక్రింద తిన్నెమీద కూర్చుని పరమానందయ్యగారు శిష్యులకు పాఠం చెపుతూ ఉంటారు. శిష్యులు కింద చాపమీద భక్తి శ్రద్ధలు చూపుతూ ఆయనకు ఎదురుగా కూర్చుని ఉంటారు.)

పరమా: చెప్పు, చెన్నడూ! చెప్పు! గుళ్ఙము .... చెప్పు!

చెన్నడు: గుల్లము – గుల్లము.

పరమా: గుల్ల మేమిట్రా? గుళ్ఙము అను.

చెన్నడు: గుల్లము.

పరమా: కాదురా, 'ఙ', బండిరా.

చెన్నడు: బండిరా అండీ? అలా చెప్పరేం? మరండీ, అందుచేతనేనండి నాకా మాట రావటం లేదు.

పరమా: ఎలా చెప్పమంటావురా?

చెన్నడు: ఇప్పుడు చెప్పారుగాదండి బండిరా అని. అదే ...

పరమా: ఏమదేరా?

చెన్నడు: గుల్లంలో బండిరా ఉందన్నారుగా? గుల్లము, బండి కూడా ఒక్కసారి నాకు నోట పట్టటం లేదండి.

గున్నడు: ఔనండి గురువుగారూ! వాడి నోరు బొత్తిగా చిన్నదండి. బళ్ళు, రాళ్ళు అసలు పట్టవు... మరో మాట చెప్పండి.

పరమా: మొదట్లోనే అలా చెప్పమని ఏడవకపోయావూ? సరే గున్నడూ? నువ్వు చెప్పు అశ్వం.

గున్నడు: అంటే ఏమిటండీ.

పరమా: అశ్వం రా ... అశ్వం ... అంటే గుర్రమన్న మాట.

చెన్నడు: అశ్వం గుర్రం ఎలా అవుతుందండి? గురువుగారూ! ... నాకు తెలియక అడుగుతానుకానీ ... బొత్తిగానూ!

పరమా: అశ్వము గుర్రం అవడం కాదురా ... రెండు మాటలకూ ఒకటే అర్థం. అశ్వం అనే మాట సంస్కృతమూ, గుర్రమనే మాట తెనుగూనూ!

గున్నడు: అలాగండీ! ఈ రెండు మాటలూ వచ్చేస్తే తెలుగూ, సంస్కృతమూ రెండు భాషలూ వచ్చేస్తాయన్నమాట.

© SCERT not to be republished

చెన్నడు: అయితే గురువుగారూ! రెండు మాటలు రెండు ఘడియల్లో కంఠతాపట్టేసి వప్పచెప్తామండీ. అలా చెట్టు కింద కూర్చుని వల్లెవేసుకొస్తాం.

వరమా: సరే పొండి. శ్రద్ధగా వల్లెవేసి చెప్పండి. నేను ఈలోగా పూజ పూర్తిచేసుకొని వస్తాను (వెడతాడు).

చెన్నడు: ఒరే గున్నా. అబ్బా! ఎంత అదృష్టవంతులంరా మనం! రెండూ ... రెండు భాషలు వచ్చేస్తున్నాయి మనకి.

గున్నడు: ఏమి(త్రోయ్, రెండూ నీకే అన్నట్టుగా మాట్లాడుతున్నావ్! ఒకటి నాదీ.

చెన్నడు: నీదెలా అవుతుంది. ఒకటి నాది, రెండు నీదీని......

గున్నడు : ఒరేయ్ గుర్రం అని నువ్వనలేకపోతే నేను గురువుగారిని ఇంకో మాట చెప్పమని అడిగానా? అప్పుడు ఆయన ఏమని చెప్పార్రా....?

చెన్నడు : అవును చెప్పారు.... నాకోసం చెప్పారు కనుక అశ్వం నాదీ, గుర్రం నీదీను.

గున్నడు : నే నొప్పుకోను, నాది అశ్వం.

చెన్నడు : కాదు, గుర్రం నీది.

(గబగబ అంటూ ఇద్దరూ పోటీపడతారు)

చెన్నడు : ఒరేయ్ ! నువ్వలా పేచీ పెట్టావంటే గురువుగారితో చెబుతాను.

గున్నడు : గురువుగారితో చెబితే ఇద్దర్నీ తిడతారు. ఒరేయ్ చెన్నా నీకు తెలియదు కాబోలు!

చెన్నడు : అవునురోయ్-నిజమే ఆ మాట ! పిచ్చి మొద్దుల్లారా ! ప్రతిదానికీ అలా దెబ్బలాడుకొంటారుట్రా? ఏదో కూడబలుక్కుని, సమాధానపడి, కలిసికట్టుగా పనిచేసుకోవాలిగానీ, అంటారు. అప్పుడేం చేస్తాం?

గున్నడు: అందుకోసం సమాధానపడదాంరా, చెన్నా! ఏం?

చెన్నడు: సమాధానపడడం ఎలాగురా? గున్నా!


గున్నడు: ఎలాగంటే నేను చెబుతానుగా! జాగ్రత్తగా వినరా చెన్నా! ఏమంటే మొట్టమొదట గురువుగారు చెప్పినది... గుల్లమనేగా?

చెన్నడు: అవును, అందులో బండిరా ఉందిగా, అది నాకు రాలేదుగా-


గున్నడు: రాకపోతేనేం? నాకు చెప్పిన అశ్వం ఉందిగా! నీ మాటలో బండిరా ఉన్నచోట నా మాటలోని -శ్వ- పెట్టేస్తే సరి!

చెన్నడు: ఏమిటేమిటి? ఇట్టే చెప్పేశావురా! నాకు అట్టే అర్థమవలేదురా! విడమరచి చెప్పరా! అరటిపండు ఒలిచి చేతిలో పెట్టినట్లు........

గున్నడు: ఏమంటే, అర్థంచేసుకొంటూ విను-వింటూ అర్థంచేసుకో - తెలిసిందా? ఏమంటే ! గుర్రములోని 'ఱ' తీసేసి, అశ్వంలోని 'శ్వ' ను 'ఱ'ఉన్నచోట పెట్టేయడమే రా!



©SCERT not to be republished



చెన్నడు : బలే ఆలోచనరా! అప్పుడెలా అనాలి? గుల్లము అశ్వము బదులు శ్వ శ్వ ఆ! అరె! గుశ్వము–ఒరేయ్ గున్నా, వచ్చేసిందిరా గుశ్వము. గుశ్వమురా గున్నా! గుశ్వం..... గుశ్వం (అంటూ ఆనందంతో ఎగురుతూ గంతు లేస్తాడు)

గున్నడు: (చెన్నడితోపాటు సంతోషంతో తిరుగుతూ చెన్నడిని నిలబెట్టి) అదీ! చూడు, ఇప్పుడు నీకు నోరూ పడుతుంది, మన రెండు మాటలూ కలిసి ఒక సమాధానమూ కుదిరింది. బావుందిరా! చాలా బాగుంది. కాదురా ! చెన్నా పద...... మన గురువుగారికి దీన్ని – ఏది ఈ గుశ్వాన్ని– వప్ప జెప్పేస్తే పాఠం వప్పచెప్పినందుకు మనల్ని ఎంతో మెచ్చుకుంటార్రా పద.....పద.....

చెన్నడు: పద, పదరా బాబూ– నాకు ఆనందం ఆగటం లేదు. అంతా ఉక్కిరి బిక్కిరి అయిపోతూంది. అరుగో గురువుగారు!

ఇద్దరు: గురువుగారూ ! గురువుగారూ! వచ్చేసిందండి, ఇద్దరికీ కంఠతా వచ్చేసింది, గుశ్వమూ......

పరమా: ఏమి వచ్చేసిందిరా?

ఇద్దరూ: గుశ్వమండి! గుశ్వం

పరమా: గుశ్వమేమిటిరా? గుశ్వం రావడమేమిటర్రా? గుశ్వమూ

చెన్నడు: గుశ్వమేనండి గుశ్వం..... గుశ్వం

పరమా: ఇదెక్కడొచ్చిందిరా ? ఎప్పుడూ వినలేదూ......!

చెన్నడు: అలా అడగండి చెబుతాను గురువుగారు? నాకు గుల్లం చెప్పారా! అందులో నాకు బండిరా రాలేదుగా.

గున్నడు : నాకు అశ్వము చెప్పారా? అది నాకు వచ్చేసిందా?.......

చెన్నడు : వాడికి వొచ్చినదీ, నాకు రానిదీ రెంటినీ కలిపి, ఇద్దరికీ వొచ్చేట్టు చేసేశాం, గురువుగారూ! కలిసికట్టుగా ఉండాలని రెండూ కలిపేశాం. అప్పుడు గుశ్వము అయిందండీ. ఓ మాటలో గుశ్వం అయి ఊరుకుంది గురువుగారూ!

గున్నడు: రెండు భాషలూ కలిపేసి నేర్చేసుకుంటున్నాం గురువుగారూ!

పరమా: ఏడిచినట్టే ఉంది మీ నేర్చుకోవడం మీరూను....!శివ శివ శివ శివ శివా!

చెన్నడు : గురువుగారూ అదేమిటండీ! గురువుగారూ! అలా అనేశారేమిటండీ! గురువుగారూ! తప్పయితే మీరు మమ్మల్ని క్షమించాలి! గురువుగారూ! క్షమించేసెయ్యాలి!

పరమా: శివ శివా ! ఏం క్షమించమంటార్రా ? మీ తెలివి అంతా విషమించిపోతూ ఉంటేనూ.....!

ఇద్దరూ: విషమించడమా? అంటే ! విషమే .... అయ్యబాబోయ్...... విషమేనాండీ?

పరమా: మీ మొహం.... చెప్పిన ఒక మాటైనా నోట పట్టని శుంఠలు .....ఎలా చచ్చేదిరా మీతోటి!

© SCERT not to be republished

ఇద్దరూ: చచ్చిపోవద్దు, గురువుగారూ! మీరు చచ్చిపోతే మేము బతికి ఉండేటంత తెలితక్కువవాళ్ళమా గురువుగారూ! (బతిమలాడుతూ) గురువుగారూ ! నోరు తిరిగే ఇంకో మాట చెప్పి పుణ్యం కట్టుకోండి!

గున్నడు: గురువుగారూ ! క్షమించి ఇంకో మాట చెప్పండి!

పరమా: సరే చెబుతాను ఏడవకండి. తురగము.

చెన్నడు: మేం తిరగమండీ!

గున్నడు: ఎక్కడా తిరగము గురువుగారూ! ఇక్కడ ఉండే వల్లెవేస్తాం. చెప్పండయ్యా.

పరమా: తిరగడం కాదురా.......తురగము అనండి, గుర్రం రాకపోతే.

చెన్నడు: గుర్రం రాకపోతే తిరగడమెలా తిరుగుతాము గురువుగారూ?

గున్నడు: అది గాదురా! గుర్రం వచ్చినా తిరగమని చెప్పరా. తిరగమండయ్యా. గురువుగారూ గుర్రం వచ్చినా తిరగం. చచ్చినా తిరగం. మీరు చచ్చిపోయినంత ఒట్టే! తిరగం తిరగం!

పరమా: హరీ హరీ! నేను చావనూ వద్దూ, మీరు తిరగనూ వద్దు పోండి, అవతలకు పోండి!

చెన్నడు: అది గాదండీ............

పరమా: కాకపోతే, ఏమిట్రా నీ మొహం ! శివ శివ ...... మీకు గుర్రమూ రాదు, అశ్వమూ రాదు, తురగమూ రాదు. శివ శివ – మీకే రానిది నాకేం చేసి పెడతారురా! గుర్రం మాట నేర్పితే, గుర్రాన్ని సంపాదించుకు వచ్చి, దానిమీద నన్ను కూర్చోబెట్టి కాశీకి తీసుకు వెడతారనుకున్నానా! శివ శివ శివ వాడేడిరా మూడోవాడు.....? తిన్నడూ?

తిన్నడు: గురువుగారూ! గురువుగారూ! వచ్చేశానండీ .....పట్టేశానండి. పట్టేసి, వచ్చేశానండీ గురువుగారూ.....!

(వగర్చుకొంటూ, ఆపసోపాలు పడతాడు)

పరమా: ఏం పట్టేశావురా? అంత ఆయాసమెందుకురా? కూర్చోరా.......ఆయాసం తీర్చుకోరా, ముందు స్తిమితపడరా, అప్పుడు చెప్పు!

తిన్నడు: పట్టేశానండీ......గుర్రం, గుర్రం గుడ్డూ కూడా పట్టేశానండీ.

పరమా: గుర్రమా? గుర్రంగుడ్డా? ఏం పట్టేశావురా?


తిన్నడు: రెండూ పట్టేశానండి, రెండండీ, రెండూ పట్టేశానండి, గురువుగారూ!

పరమా: ఏమిట్రా ? స్తిమితపడి చెప్పరా.... ఏం పట్టేశావూ? ఎక్కడ పట్టేశావూ?

(తిన్నడు ఆయాసపడుతూ చెబుతూ ఉంటే చెన్నడు వాడికి విసనకర్రలతో విసురుతూ తాను కూడా ఆయాసపడుతూ ఉంటాడు)



© SCERT not to be republished



తిన్నడు: చెప్తానండి. మీకు గుఱ్ఱము ఎక్కాలనే కోరిక ఉన్నదని తెలుసుకొన్నటువంటివాడనై అద్దానిని ఎక్కడ ఉన్నా అంగ, వంగ, కళింగ, కాశ్మీర, నేపాళ, ఘూర్జర .... ఛప్పన్న దేశాలలో ఎక్కడ ఉన్నా పట్టుకొని వచ్చి, మీ పాదాలకడ ఉంచాలని బయలుదేరానండి ....కాని అదృష్టవశాత్తూ దగ్గరలోనే అది దొరికిందండి.

పరమా: అలాగట్రా, తిన్నడూ! ఎక్కడ దొరికిందిరా? నా నాయన! నా నాయన! చెప్పు చెప్పు ......

తిన్నడు: మన మఠానికి పది కోసుల్లో ఓ చెరువు గట్టున రెండు ఆడగుఱ్ఱాలు మేస్తున్నాయండి. బలేగా ఉందని అనుకొని ఆ గుఱ్ఱాల ఆసామిని అడిగానండి 'గుడ్లు అమ్ముతావా?' అని అతడు నాకేసి అట్టే పైకి కిందికి చూసి అమ్ముతానన్నాడండి. అయితే, 'ఎంత వెల?' చెప్పమన్నానండి. పది వరహాలిచ్చి పట్టుకు వెళ్ళమన్నాడండి. ఆపళంగా పరుగెత్తుకొంటూ వచ్చేశానండి. పది వరహా లిచ్చేయండి గురువుగారూ... పట్టుకొచ్చేస్తాను గురువుగారూ ! గుఱ్ఱంగుడ్డు పట్టుకొచ్చేస్తానండి.

పరమా: ఆఁ ఆఁ ఎంత పని చేసుకొచ్చావురా నాయనా......శిష్యుడంటే నువ్వేరా!

తిన్నడు : చిత్తమండి గురువుగారూ!...... మీ ఆశీర్వచన ఫలితమండి గురువుగారూ.

పరమా: వత్సా! ఆ గ్రుడ్లు శ్రేష్ఠమైనవేనా.....? ప్రశస్తమైనవేనా!

తిన్నడు: అయ్యో గురువుగారూ! రెండూనండి! రెండూ రెండేనండీ! పదివరహాలిచ్చేయండి.....పట్టుకొచ్చేస్తా! పరుగెత్తుకుని వెళ్ళి, పట్టుకొని పరుగెత్తుకొని వచ్చేస్తా.

పరమా: ఔనురా–ఔను–అది అవశ్యం ఆచరణీయమే కాని, కాస్త ఆలోచనీయం కూడాను – (ఆకాశం వైపు చూస్తూ ఆలోచిస్తాడు)

చెన్నడు: ఆలోచించకండి గురువుగారూ!.... ఇచ్చేయండి పట్టుకొస్తాం .....ఆలోచన అనవసరమండీ! ఇలాగ ఆలోచిస్తూ కూర్చుంటే అవకాశం జారిపోతుందండీ.....

గున్నడు: మాకు గుఱ్ఱము అనేమాట రాకపోయినా మీకు గుఱ్ఱమైనా వస్తుంది.... మమ్మల్ని పంపించండి..... మోసుకొచ్చేస్తాం ఆలోచించకండి. ఆలోచిస్తూ కూర్చుంటే, ఆలస్యం అయిపోతుంది.

చెన్నడు: 'ఆలస్యం అమృతం విషం' అన్నారుగా మీరు. గురువుగారూ! జ్ఞాపకం చేసుకోండి.

పరమా: అయితే, తలిచినప్పుడేనా తాత పెళ్ళి?

తిన్నడు: తాత పెళ్ళాండి? గురువుగారూ ! బలే! బలే.....! గుఱ్ఱాన్ని తీసుకొచ్చేస్తే దానిమీద ఎక్కి సవారి చేస్తూ అందరమూ తాత పెళ్ళికి తరలి వెళ్ళొచ్చు కదండీ!

చెన్నడు: ఔనౌను ......చల్ చల్ చల్ చల్ ......(అంటూ అందరూ గుఱ్ఱం ఎక్కినట్లు తిరుగుతారు)

గున్నడు: గురువుగారూ!.....ఆలోచించకండి........

పరమా: ఆలోచించకుండా ఎలాగురా? గుఱ్ఱంగుడ్డు గాని, గుఱ్ఱం కాదుగా!

© SCERT not to be republished

చెన్నడు: అయితే నేమండి గుర్రం గాక, గుర్రంగుడ్డు కావటం మంచిదండీ!

పరమా: దాన్ని పొదగవద్దూ ? ఎవరు పొదుగుతారు?

చెన్నడు: మేమంతా లేమూ గురువుగారూ! అంత చేతగానివాళ్ళమా గురువుగారూ?

గున్నడు: పొదగబెట్టడమే గాదు, ఎదగ బెడతాం కూడానూ......

తిన్నడు: ఇందులో ఇంకొక ధర్మసూక్ష్మం కూడా ఉంది. గమనించండి గరువుగారూ! గుడ్డు దగ్గర్నించీ పొదిగి ఎదిగిన గుఱ్ఱం మనం చెప్పినమాట వింటుంది. అదే ఎదిగిన గుర్రం అయితే మన మాట వినదు. ఎగిరి తన్నుతుంది. అది చాలా ప్రమాదకరం కనుక పది వరహాలు ఇచ్చేయ్యండయ్యా మోసుకొచ్చేస్తాం....గురువుగారూ......

పరమా: సరే! ఇంతగా సరదా పడుతున్నారు కనుక ఆ గుడ్డు పట్టుకురండి. అమ్మగారి నడిగి సొమ్ము పట్టుకెళ్ళండి. జాగ్రత్తగా వెళ్ళిరండి. గుడ్లు మొయ్య లేకపోతే, మీరు ముగ్గురూ వంతు లేసుకుని భుజాలు మార్చుకోండి. చెట్లంటా గుట్లంటా జాగ్రత్తగా వెళ్ళిరండి.

అందరూ: వెళ్ళి వస్తాం గురువుగారూ, నమస్కారం.!

పరమా: శుభం. క్షేమంగా వెళ్ళి లాభంగా తిరిగిరండి.

## రెండవ రంగం

(పొలాల మధ్య గట్టుదారి. ఒక బూడిద గుమ్మడికాయను గుడ్డలో మూటకట్టి, దాన్ని ఒక కర్రకు వేలాడకట్టి ఇద్దరు శిష్యులు తమ భుజాలమీద ఆ కర్రను పెట్టుకొని మోసుకొస్తూ ఉంటారు. మూడో శిష్యుడు హుషారిస్తూ ఉంటాడు.)

అందరు: ఓం ఓం ఓం ఓం.

చెన్నడు: ఒరేయ్ గున్నడూ ! భుజం మార్చుకోరా.

గున్నడు: ఛేస్! భుజమంతా తెల్లగా బూడిదయ్యింది. ఇందాకా భుజంమీద మోసుకొస్తేనూ......

తిన్నడు: గుడ్డా? మరోటా? అయితే అయింది., జాగ్రత్తగా మోసుకురారా! మన మఠం దగ్గరకు వచ్చేస్తున్నాం!

గున్నడు: కర్రకు కట్టి మోసుకొస్తున్నాం కనుక కొంత సులువు అయింది.

తిన్నడు: ఔను. ఈ కొండ దాటామంటే మన ఆశ్రమం అల్లంత దూరంలో కనపడుతూ ఉంటుంది. ఆశ్రమం బయట గురువుగారు నుంచుని మనకోసం ఎదురు చూస్తూ ఉంటారు.


చెన్నడు: ఒరేయ్ ! చెట్టుకొమ్మలు రా, వంగి నడవరా! లేకపోతే కొమ్మలు రాసుకొని గుడ్లు గీతగా పడిపోతుంది.

గున్నడు: ఆ, కొమ్మ కిందికి వచ్చేశాక చెబుతారేం రా (ధ్వని) అరే అనుకున్నంత పనీ అయింది. కర్ర జారిపోయి గుడ్డు కింద పడిపోయిందిరోయ్!

తిన్నడు: అయ్యో, గుడ్డు పగిలిపోయిందిరోయ్!



© SCERT not to be republished



చెన్నడు: పోతే పోయిందిగాని- ఒరేయ్ పిల్ల ఊడిపడిందిరోయ్. బలే, బలే.........

(మూట కిందపడి కాయ పగులుతుంది. అదే సమయంలో ఆ పొదలచాటు నుండి ఒక తెల్లటి కుందేలు బెదురుతూ పారిపోతుంది.)

గున్నడు: ఆ డొంకలోకి పిల్ల పారిపోయిందిరోయ్.

తిన్నడు: అరెరె! ఎలాగ? గుడ్డూ పోయి, పిల్లా పోయి......

చెన్నడు: వెదుకుదాం పదండి. అదిగో అది పారిపోతోంది.

గున్నడు: అరే! తెల్లగా బొద్దుగా చెవులూ అదీ.......మా బలేగా ఉంది. అరెరే.....మా అందమైన గుఱ్ఱం గుడ్డు పిల్లరా! ఇట్టే జారిపోయిందిరా! చూస్తూ కూడా దాన్ని పట్టుకోలేకపోయామేమిటి? చెన్నా?

చెన్నడు: ఏం చెప్పమంటావురా? చేతుల్లో దొరికి వేళ్ళమధ్యనుండి జారిపోయిందిరా, అయ్యయ్యో (ఏడుస్తాడు)

తిన్నడు: ఏడువకురా చెన్నా! నువ్వు ఏడిస్తే గున్నడు కూడా ఏడుస్తాడురా.........అప్పుడు నాకు కూడా ఏడుపొచ్చేస్తుందిరా!

గున్నడు: ఏడుపు వస్తున్నపుడు, ఏడవ వద్దంటే, ఎలా ఏడవడంరా? ఒరేయ్-ఏడుస్తూ కూర్చోవడం కాదురా-ఏడుస్తూనే గుఱ్ఱం గుడ్డు పిల్లకోసం వెదుకుదాం, పదండిరా! ఈ తుప్పలూ గిప్పలూ ముళ్ళూ గీసుకుపోయినా సరే-వెదుకుదాం పదండిరా!

చెన్నడు: అలాగే పదండిరా! ఏడుస్తూనే వెదుకుదాం ఏంచేస్తాం? పదండి!

గున్నడు: గుఱ్ఱంగుడ్డూ లేక, గుఱ్ఱంగుడ్డుపిల్లా లేక గురువుగారి మొహం ఎలా చూస్తాముురా?

తిన్నడు: గురువుగారూ! గురువుగారూ! ఎంత పని జరిగిపోయిందండీ? (ఏడుస్తాడు)

చెన్నడు: (ఏడుస్తూ) ఏడవకురా! వెదకరా!

గున్నడు: పదరా, నువ్వు ఆ పక్కకు పరుగెత్తు, నే నీపక్కకు పరుగెడతాను. పొలాలన్నీ వెతికేద్దాం.

(విచారంగా ముగ్గురూ అక్కడంతా వెదుకుతూ, మూడు వైపులకూ వెడతారు.)

## మూడవ రంగం

(ఆశ్రమంలో పరమానందయ్యగారు శిష్యులకోసం ఎదురు చూస్తూ ఉంటారు. అంతలో శిష్యులు ముగ్గురూ వచ్చి ఆయన పాదాల మీద పడతారు.)

చెన్నడు: మీ పాదాలకు దండాలు గురువుగారూ!

గున్నడు: సాష్టాంగ దండ ప్రణామాలు గురువుగారూ.

తిన్నడు: అనేకకోటి దండాలు గురువుగారూ!

పరమా: అయ్యో! అయ్యో! అదేమిటర్రా-చెన్నా, గున్నా, తిన్నా లేవండిరా- లేచి నిలబడండిరా- ఏంచేశారు?

© SCERT not to be republished

చెన్నడు: చావలేక బతికి వచ్చాం గురువుగారూ!

గున్నడు: బతకలేక చచ్చి వచ్చాం గురువుగారూ!

తిన్నడు: చావూ కాక బతుకూ కాక, ఇక్కడకు వచ్చిపడ్డాం గురువుగారూ!

పరమా: ఏమిట్రా -ఏం జరిగింది? ఒంటినిండా ఈ రక్కు లేమిటి? ఈ రక్తా లేమిటి?

చెన్నడు: గుర్రంగుడ్డుపిల్లకోసం పరుగెత్తి పాటుపడ్డాం గురువుగారూ!

గున్నడు: చెట్లంటా గుట్లంటా పరుగులెత్తి పడి, దొర్లి ఇలా అయిపోయాము- గురువుగారూ!

తిన్నడు: పది ఆమడలూ పాటుపడ్డాం గురువుగారూ!

పరమా: ఇంతకీ ఆ గుఱ్ఱంగుడ్డుపిల్ల ఏదర్రా!

తిన్నడు: అది పారిపోయింది గురువుగారూ! దొరకలేదండీ.

చెన్నడు: గుడ్డు పగిలి పిల్ల గంతేసి పారిపోయిందండి.

గున్నడు: మా కళ్ళ ముందే తుర్రుమందండి.

పరమా: పోనీ ఆ పగిలిన ముక్కలేవర్రా?

చెన్నడు: ఇవిగో గురువుగారూ! ముక్కలన్నీ ఏరుకొచ్చామండీ-- కొంచెం కూడా వదిలెయ్యకుండా!

పరమా: ఆఁ......ఇదేమిటర్రా ఇదేమి గుఱ్ఱం గుడ్డర్రా! శివ శివా. ఇవి బూడిదగుమ్మడికాయ ముక్కలురా-- అయ్యయ్యో ఒకటి చెప్పి, మరొకటి చూపి, ఇంకొకటి పట్టుకొచ్చారేమర్రా! (తిన్నెమీద కూలబడతాడు)

చెన్నడు: బూడిద గుమ్మడికాయాండి? అంటే?

గున్నడు: గుమ్మడికాయ కానిది బూడిద గుమ్మడికాయ కాబోలురా....

తిన్నడు: బూడిద పూసుకొన్న గుమ్మడికాయను బూడిద గుమ్మడికాయ అంటారు కాబోలురా!

పరమా: మీ మొహం - శుంఠల్లారా! శివ శివ - గుర్రమూ లేదు, గుర్రంగుడ్డూ లేదు- పది వరహాలు గంగపాలుచేశారు కదర్రా.

పెద్దమనిషి : అయ్యా గురువుగారూ! నమస్కారాలండి!

పరమా: ఎవరు బాబూ ! మా శిష్యుడేనా ఏమిటి?


పెద్దమనిషి: మీ శిష్యుణ్ని కాకపోయినా అలాంటివాడినేనండి! అయితే మీ శిష్యులలాంటివాణ్ని మాత్రం కాదండి. మీరు జగద్గురువులు. అందుచేత అందరికీ మీరు గురువులే, అందరూ మీ శిష్యులే.....

పరమా: దాని కేం బాబూ! అదంతా మీ అభిమానం ! రా, ఇలా రా కూర్చో! అదేమిటి? ఏదో పట్టుకొచ్చావు?


పెద్దమనిషి: ఇదేనండి-గుర్రంగుడ్డుపిల్ల---

శిష్యులు: అరే, అరే, ఔనండి గురువుగారూ-అదే అదే! గుర్రంగుడ్డు పగిలి, పిల్ల పారిపోయింది.

పరమా: అది పారిపోయింది: మీ మతి జారిపోయింది-- వెర్రి చవటల్లారా! అది గుర్రంపిల్ల కాదు, కుందేలుపిల్ల.



© SCERT not to be republished



పెద్దమనిషి : చిత్తం – మీరైనా తెలుసుకొన్నారు. దీని కోసమే మీ శిష్యులు వెతికి వెతికి ఇలా అయిపోయారు.

పరమా: నేను మాత్రం వాళ్ళలా అయిపోకుండా ఉన్నానా? వాళ్ళతో పాటు నేనున్నూ మతిలేనివాడినై పోయాను.

పెద్దమనిషి: గుర్రంపిల్లను పెడుతుంది. గుడ్డు పెట్టదుగా––

పరమా: అదే, వాళ్ళతోపాటు నాకు కూడా మతిపోయిందని అంటున్నానుగా!

పెద్దమనిషి: అంత మాట అనకండి. మీరు పెద్దలు! వాళ్ళతోపాటు ఏదో పొరపాటు పడి ఉంటారు. అంతే! ఇవిగో మీ పది వరహాలూనూ!

పరమా: ఇదేమిటి. మీరే వీళ్ళకు అమ్మేరా?

పెద్దమనిషి : ఔను –– మా పొలంలో బూడిద గుమ్మడి కాయలను చూసి, గుర్రంగుడ్డు అమ్ముతావా? అని అడిగారు. వీళ్ళేమో చిత్రమైనవాళ్ళలా ఉన్నారని వీళ్ళకు అమ్మి, వీళ్ళతో పాటు వెనకాల బయలుదేరాను, విచిత్రం చూద్దామని! ఇక్కడ మిమ్ములను చూసి, ఇలా వచ్చాను, మీతో చెబుదామని!

పరమా: మంచివాడవు నాయనా! మాకందరికీ తెలివి చెప్పావు!

పెద్దమనిషి: తెలివి మాట ఎలా ఉన్నా –– మీ శిష్యులు సృష్టించిన "గుశ్వం" మాత్రం కలకాలమూ ఉంటుంది–– మీరు, మీ శిష్యులు –– చిరకాలము వర్ధిల్లుతారు తెనుగుజాతి జానపద చరిత్రలో – సెలవు !

పరమా: శుభం.!

రచన : **ఏడిద కామేశ్వరరావు**; మూలం : **పసిడితెర**, ఆంధ్రప్రదేశ్ బాలల అకాడమీ.



**ఇవి చేయండి :**



1. ఈ నాటకం వేయడానికి ఒకరు గురువుగాను, ముగ్గురు శిష్యులుగా, ఇంకొకరు పెద్దమనిషిగా ఉండాలి. నాటకంలోని సంభాషణలను అభ్యాసం చేయండి. పాత్రలకనుగుణంగా దుస్తులు ధరించాలి. అలంకరించుకోవాలి. తరగతిలో / పాఠశాలలో ప్రదర్శించాలి.
2. "గుశ్వం" నాటకాన్ని కథగా సొంతమాటల్లో పది వాక్యాల్లో రాయండి.
3. "గుశ్వం" నాటిక హాస్యంతో కూడినది కదా! ఎందుకో వివరంగా పది వాక్యాల్లో రాయండి.
4. "గుశ్వం" నాటికలోని శిష్యులు ఎలాంటివారు ? వీరి గురించి సొంతమాటల్లో రాయండి.
5. పరమానందయ్య గురువుగారు, తిన్నడు, చెన్నడు, గున్నడు శిష్యులు కదా! గురుశిష్యుల మధ్య ఉండే సంబంధం గురించి తెలపండి.

నేను మాట్లాడుతున్నప్పుడు నాదేశం మాట్లాడుతున్నదన్న భావం ధ్వనించేలా మాట్లాడాలి. – స్వామి రామ తీర్థ

© SCERT not to be republished

నాలుగో యూనిట్

# 15. సీత ఇష్టాలు

**ఆలోచించండి - మాట్లాడండి.**



ప్రశ్నలు :

1. చిత్రం చూడండి. ఎవరెవరు ఉన్నారు?
2. చిత్రంలో ఏం జరుగుతున్నది?
3. ఇలాంటి ప్రదర్శనను ఎప్పుడైనా చూశారా? దీనిని ఏమంటారు?

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

అది ఒక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. పాఠశాల ప్రాంగణం అంతా పిల్లలతో కలకలలాడుతున్నది. జాతీయ దినోత్సవంలో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్నారు విద్యార్థులు. రమాదేవి అనే విద్యార్థిని తరవాత ప్రదర్శించబోయే అంశం ప్రకటిస్తున్నది ఇలా...

**రమ :** జానపద కళల్లో ఎంతో ప్రాచుర్యం పొందినది బుర్రకథ. తరతరాలుగా ప్రజాచైతన్యంలో ఈ కళారూపం కీలకపాత్ర పోషించింది. ఇందులో ఒకరు కథ చెబుతూంటే వారికి చెరో పక్కా ఇద్దరు వంత పాడుతూ ఉంటారు. కథ చెప్పేవారిని "కథకుడు' అనీ ఆయనకు రెండుపక్కలా నిలబడి గొంతు కలిపేవాళ్ళను "వంతలు" అని అంటారు. కథకుడు తంబూరా వాయిస్తాడు కాబట్టి కథకు బుర్రకథ అని పేరు వచ్చింది. ఈనాటి బుర్రకథను కృష్ణవేణి చెబుతుంది. రోజా, రాజు వంతలుగా వస్తున్నారు.

అనగనగా రామాపురం అనే ఒక పల్లెటూరు. ఆ పల్లెలో శివయ్య, గౌరమ్మ అనే దంపతులకు కలిగిన తొలి సంతానం సీత. ఆ సీత చదువుకునేందుకు చేసిన ప్రయత్నమే ఈ నాటి బుర్రకథకు నేపథ్యం.

### బుర్ర కథ – పాత్రలు

కథకురాలు – కృష్ణవేణి

వంతలు – 1. రాజు

2. రోజా

**కృష్ణవేణి:** (పాట)– జయము జయము మన భారతమాతకు జయము దిగ్విజయమూ... ॥తందాన తాన॥
చదువులనిచ్చు సరస్వతి తల్లీ –చల్లగ జూడమ్మా ॥తందాన తాన॥
సిరులనిచ్చెడి శ్రీ మహాలక్ష్మీ – కరుణ జూపవమ్మా ॥తందాన తాన॥
శత్రువినాశము జేసెడి దుర్గా – జయము నీయవమ్మా –
తందాన – తందాన – దేవనందనానా – తరికిట ఝుం తరిత

**రాజు:** అక్కా! ఈరోజు నువ్వే కథ చెప్పబోతున్నావ్?

**రోజా:** ఏదో చెబుతుందిలేరా! నలమహారాజు కథ, పాండవులూ కౌరవుల కథ, మరాఠీల కథ, రామకథ, లవకుశుల కథ, సీతమ్మ కష్టాలు...

**రాజు:** ఏందక్కా! ఆ కథలన్నీ పాత గాథలయిపోయినాయి కదా, కొత్త కథ చెప్పరాదా?

**రోజా:** ఏందిరా! పాతంటే రోతగా ఉందా? అయితే పాత గ్లాసులు, బిందెలూ, వెండి కంచాలు, బంగారు గొలుసులూ అన్నీ తీసి బయటికి విసిరేస్తావా? ప్రతివాడికీ ఇదో ఫేషనైపోయింది. పాత లేందే కొత్తెక్కడుందిరా తిక్క సన్నాసీ! ఇప్పుడు కొత్త.... కొత్త... అని అరుస్తున్నారు గానీ, ఈ కొత్త చెత్తంతా పాతలోనుంచే గదరా పుట్టింది...

**రాజు:** అరరరె... ఇప్పుడు నేనేమన్నానని కరెంట్ షాక్ తగలిన కాకిలాగా అట్లా అరుస్తావ్? పాతంటే రోతని నేనన్నానా? కాలం మారినా ఇంకా మనం పాతలోనే బతుకుతున్నామా? ఎలక్ట్రిక్ దీపాలు వద్దని ఆముదం దీపాలు పెట్టుకుంటున్నామా? బస్సులూ, రైళ్ళూ కొత్తవని ఎడ్లబండ్లమీదనే ప్రయాణిస్తున్నామా?

**కృష్ణవేణి:** ఒరే తమ్ముడూ! చెల్లీ! అనవసరంగా మీరిట్లా తగవులాడుకొని రసాభాస చెయ్యకండి! తమ్ముడన్నట్లు ఈరోజు మనం కొత్త కథనే చెప్పుకుందాం.

**రాజు:** (మంచి పనయింది అన్నట్లు అభినయించాడు)

**రోజా:** ('చాల్లే బడాయి' అన్నట్లు మూతి వంకర తిప్పుతూ అభినయించింది)

**కృష్ణవేణి:** ఈ రోజు మనం చెప్పుకోబోయే కథ – **'సీత ఇష్టాలు'.**

(పాట) తకతా – తకిట – తక– తరికిట తరికిట తా – – – – ఇది –

పేద ఇంటిలో పుట్టి పెరిగిన పైడిబొమ్మ కథరా ॥ తందాన తాన ॥
చదువు సందెలో పేరు పొందిన చక్కనమ్మ కథరా ॥ తందాన తాన ॥
ఓటమినెరుగక పోరాడే ఒక వీర బాల కథరా ॥ తందాన తాన ॥
పదిమందికినీ ప్రేరణనిచ్చే వర్తమాన కథరా ॥ తందాన తాన ॥

– తరికిట ఝుం తరితా!

**రోజా :** ఇంతకూ ఎవరా పైడిబొమ్మ? ఏమా కథ?

**కృష్ణవేణి:** అయ్యలారా! అమ్మలారా! శ్రీలు విలసిల్లిన భారత భూమిలో, రాజనాలు పండే రతనాల నేల తెలుగు నేల. ఆ తెలుగు నాట రామాపురమనేది ఒక పల్లెటూరు. ఆ పల్లెలో శివయ్య, గౌరమ్మ అనే పేదదంపతులున్నారు. ఆ దంపతులకు కలిగిన తొలి సంతానమే సీత. సీతను బడికి పంపాలనుకుంటూండగానే వాళ్ళకు మరో అబ్బాయి పుట్టాడు. సంతానాన్ని ఇక్కడితో ఆపేద్దామా, వద్దా అని వాళ్ళు మథనపడుతూండగానే మరో కూతురు పుట్టింది.

**రాజు:** ఆలస్యం అమృతం విషం అంటే ఇదేనేమో!

**రోజా:** నువ్వు నోరు మూస్తావా, ముయ్యవా?

**రాజు:** నోరు మూసుకునే కాలం పోయిందక్కా. ప్రశ్నించేవాడే ఉత్తముడు. మాట్లాడేవాడే మంచివాడు.

**కృష్ణవేణి:** తరవాత కథ వినండి...

(పాట) పూట గడవని తల్లి దండ్రులకు పాటు లెక్కువాయె ॥ తందాన తాన ॥
పంటలు పండక – పొట్టనిండక కష్టమెక్కువాయె ॥ తందాన తాన ॥
కుటుంబ భారం కుంగదీయగా తల్లడిల్లినారు ॥ తందాన తాన ॥
భార్యా – భర్త కూలినాలితో బతుకు నీడ్చినారు ॥ తందాన తాన ॥

తరికిటి ఝుం తరితా!

**రోజా:** ఇంతకూ సీత బడికెళ్ళిందా? లేదా?

**కృష్ణవేణి:** లేదు చెల్లీ! అమ్మా, నాయనా పనిలోకి పోతే తమ్ముణ్ణీ, చెల్లెల్నీ ఆడించడానికే ఆమె అంకితమైపోయింది.

**రాజు:** **'పిల్లలు బడిలో – పెద్దలు పనిలో'** అనే సంగతి వాళ్ళకు తెలవదా అక్కా? "పదహారేళ్ళలోపు పిల్లలను పనిలో పెట్టగూడదు"అన్న చట్టాన్ని గురించి వాళ్ళెందుకు పట్టించుకోలేదు?

**కృష్ణవేణి:** చట్టాలు అమలు చేయడం ఏ ఒక్కరి బాధ్యతో అనుకున్నంతకాలం పరిస్థితిలో మార్పు రాదురా తమ్ముడూ!

**రోజా:** ఇంతకూ ఆ చిన్నారి సీతమ్మ ఏమేం పనులు చేసేదక్కా?

**కృష్ణవేణి:** (పాట)

ఇంటి పనులనే చేసేరా ..... సై
వంట పనీ కొంత నేర్చెరా .... సై
బీడీలెన్నో చుట్టెరా .... సై
పత్తి చేలకే పోయెరా .... సై
కొవ్వొత్తిలా బతుకాయెరా
వినరా సోదర చదువుల తల్లిదీనగాథనిపుడు–నిరుపేద గాథ ఎపుడూ –తందాన తాన.
॥తరికిట ఝుం తరిత॥

**రోజా:** తరవాతేం జరిగిందక్కా?

**రాజు:** ఇంకేం జరుగుతుందీ? నాలుగు రాళ్ళు సంపాదించిం తర్వాత, ఆ రాళ్ళతోనే, ఆ పిల్లనెత్తిన నీళ్ళు పోసి, పెళ్ళి చేసి ఉంటారు.

**కృష్ణవేణి:** నిజంగా అదే జరిగితే మన కథకు అర్థం లేదురా తమ్ముడూ!

ఆ ఊరికి శ్రావణి అనే కొత్త టీచర్ వచ్చింది.

**రోజా:** నీ పిచ్చిగానీ, టీచర్లు చదువు చెబుతారుకానీ, ఇవన్నీ పట్టించుకుంటారా?

ఒకవేళ పట్టించుకొని చెప్పినా వినేవాళ్ళుంటారా? విన్నా, మార్పు సాధ్యమవుతుందా?

**రాజు:** తప్పకుండా సాధ్యమవుతుంది. మా బళ్ళో టీచర్లు రోజూ పాఠాలతోపాటు మంచి మంచి కథలు, సూక్తులు చెప్తారు. ఆటలాడిస్తారు. పాటలు పాడిస్తారు. బడి పిల్లలని తమ సొంత బిడ్డల్లాగా పట్టించుకుంటారు.



**కృష్ణవేణి:** ఔను తమ్ముడూ! శ్రావణి కూడా అలాంటి టీచరే! ఆమె ఆ ఊరికి రాగానే ముందుగా చేసిన పని – బడి ఈడున్న పిల్లలు ఎవరెవరు బడికి రావడం లేదో తెలుసుకోడం. అట్లా తెలుసుకొని ఒక్కొక్క ఇంటికి వెళుతూ శివయ్య వాళ్ళింటికి కూడా వెళ్ళింది.

**రాజు:** అయితే అది గమనించిన గౌరమ్మ సీతను ఇంట్లో దాచేసి, మా ఇంట్లో అటువంటివాళ్ళెవరూ లేరని చెప్పేసిందా?


**రోజా:** నువ్వు అతిగా ఊహించక, అక్క చెప్పేది విను.

**కృష్ణవేణి:** రాజు ఊహించింది నిజమే. గౌరమ్మ సీతను దాచింది.

**రాజు:** అయ్యో! అప్పుడేమయింది?

**కృష్ణవేణి:** శ్రావణి టీచర్ వచ్చిన పని చెప్పకుండా శివయ్య దంపతులకు కొన్ని మంచి మాటలు చెప్పింది.

**రోజా:** ఏమని?



**కృష్ణవేణి:** (పాట) ఓ భారతీయుడా - ఓ బాలభానుడా- వినవయ్య వీనులవిందుగా
తెలుసుకోవయ్య చరితను ముందు
ఎన్నో జన్మల పుణ్యఫలంబది మానవ జన్మంబు ॥అది మానవ జన్మంబు॥
అందులోనూ ఆడపిల్లగా పుట్టుట శ్రేష్ఠంబు ॥ఔనూ పుట్టుట శ్రేష్ఠంబు॥
సహనము స్నేహము ప్రేమ భావము ఆమె గొప్పతనము ॥అది ఆమె గొప్పతనము॥
ఆ గొప్పను గల్గిన ఆడపిల్లను చక్కగ పెంచాలి ॥బహు చక్కగ పెంచాలి॥
అప్పుడె ఇల్లు - ఊరూ - దేశం - అభ్యున్నతి పొందు- ॥ఔను అభ్యున్నతి పొందు॥
అట్టి బాలికల నణచిపెట్టుట - అన్యాయం బగును ॥అంతే - అన్యాయంబగును॥
॥ ఓ భారతీయుడా॥

**రాజు:** ఆడవాళ్ళుకూడా గొప్పవాళ్ళు, వాళ్ళ నణచిపెట్టడం మహాపాపం అంటున్నావు బాగానే ఉంది కాని, అటువంటి నలుగురు గొప్పవాళ్ళ పేర్లు చెప్పక్కా.

**కృష్ణవేణి:** సరే, వినండి మరి. ఆ శ్రావణి టీచర్ కూడా కొందరు ఆదర్శ మహిళల గురించి ఇలా చెప్పింది.

**రోజా:** ఎలా....

**కృష్ణవేణి:** (పాట) రుద్రమదేవి చూడరా సై
శత్రువులను చెండాడెరా సై
సరోజినీ నాయుడురా సై
స్వరాజ్య సమరం చేసెరా సై
సంగెం లక్ష్మీ బాయిరా సై
బాలలను బాగు పరచెరా సై
దుర్గాబాయీ దేశముఖ్ సై
మహిళల మార్గము దిద్దెరా సై
కల్పన చావ్లా చూడరా సై
అంతరిక్షమున కెగిరెరా సై
అన్ని రంగములలోన మహిళలూ ఆదర్శంగా నిలిచారు.
॥భళానంటి భళి తమ్ముడా -సై - మేలు భళానోయ్‌తందానా॥
తకతా - తకిట తక - తరికిట తరికిట-తా

**రోజా:** అక్కా! అక్కా! ఆ తర్వాతేమయిందో నేను చెబుతా! ఆ మాటలన్నీ లోపలినుంచి వింటున్న సీత బయటకివచ్చి, తానూ చదువుకుంటానని చెప్పింది.

**కృష్ణవేణి:** ఔను చెల్లీ! అంతేకాదు, టీచర్ మాటలతో ప్రభావితులైన శివయ్య దంపతులు బిడ్డను చదివించడమే మంచిదన్న సంగతి అర్థం చేసుకున్నారు. సీతను టీచర్ వెంట పంపించారు.

**రాజు:** అంతే లెండి. అందరూ మా చిన్నక్కలా ఉంటారా?

**రోజా:** అంటే?

**రాజు:** నువ్వు రాజుకంటే గొప్పదానివక్కా.

**రోజా:** ఈ కథ గానీ, నీ సంగతి చెబుతా.

**కృష్ణవేణి:** సరే! మీరు తర్వాత కొట్టుకోవచ్చు. ముందు కథ వినండి. సీత ఎలా చదువుకున్నదయ్యా అంటే
(పాట) అక్షరమాల నేర్చెరా సై
తెలుగు చక్కగా జదివెరా సై
ఎక్కాలన్నీ నేర్చెరా సై

లెక్కలు చక్కగ జేసెరా — సై
పరిసరాల విజ్ఞానమూ — సై
పక్కాగా గ్రహించెరా — సై

ఏది జదివినా - ఏది రాసినా - ఎదురు లేదు తనకు- ॥తందాన తాన॥
అందరిలోను అన్నిటికన్నా ముందు నిలిచె తుదకూ
తా - తకిటతక - తరికిట తరికిట తా-

**కృష్ణవేణి:** ఆమె తెలివితేటలు గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు కూడా ముగ్ధులై ఏడాది గడవకుండానే ఐదో తరగతిలో చేర్పించారు.

**రోజా:** చూడు! చదివితే అట్లా చదవాలి.

**రాజు:** తమరేం నన్ను వెక్కిరించనవసరంలేదు. నేను కూడా ఒకటో తరగతిలో ఉండగానే పెద్ద పెద్ద లెటర్స్ చదివానమ్మా.

**రోజా:** నువ్వా? అంత లేదు. ఏం చదివావో చెప్పు

**రాజు:** లెటర్స్... పేద్ద లెటర్స్.

**రోజా:** అవే... ఏంటో.. ఒకటి రెండు చెప్పు

**రాజు:** ఒకటి రెండు కాదు... 26 చదివాను... చెప్పనా... చెప్పమంటావా...? అయితే విను... A..B... C...D....

**రోజా:** ఆ లెటర్సా? ఏడిశావులే. నువ్వు తర్వాత కథ చెప్పక్కా.

**కృష్ణవేణి:** ఆ తర్వాత సీతకు ఎదురే లేకుండా పోయింది. ఏడో తరగతి కూడా అలవోకగా పూర్తి చేసింది. సరిగ్గా అదే సమయంలో శ్రావణి టీచర్ ప్రమోషన్‌మీద బదిలీ అయి, వేరే ఊరికి వెళ్ళింది.

**రాజు:** అయ్యో! అయితే సీత చదువు ఆగిపోయిందా అక్కా?

**కృష్ణవేణి:** లేదులే రాజూ! శ్రావణి టీచర్ సీత మనసులో చదువుబీజాలు బలంగా నాటింది. టీచర్ బదిలీ అయినా, ఉన్న ఊళ్ళో పై చదువులకు అవకాశం లేకపోయినా పక్క టౌనుకు పోయి స్కూల్ చదువూ, కాలేజీలో ఇంటరూ పూర్తిచేసి, డిగ్రీలో చేరింది.

**రోజా:** ఎందుకక్కా? ఇంజనీరింగ్‌లో సీటు దొరకలేదా?

**కృష్ణవేణి:** ఏదో చదువుకొని, డబ్బులు సంపాదించి, తను మాత్రం హాయిగా ఉండాలనుకోలేదు సీత. తను బాగా చదువుకొని, తనలాంటి పిల్లలను బాగుపరచాలని, కలెక్టరుగానో, నాయకురాలుగానో ఈ సమాజానికి సేవ చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నది. డిగ్రీ చదివి పోటీ పరీక్షలలో విజయం సాధించి, మండల అభివృద్ధి అధికారిగా ఎంపికైంది.

**రాజు:** ఓహో! చాలా బాగుంది. తర్వాత కథ చెప్పక్కా.

**కృష్ణవేణి:** తర్వాతేమున్నదిరా తమ్ముడూ! పిల్లల చదువుకోసం,స్త్రీలకు మేలు చేసేందుకోసం నిరంతరం కృషిచేస్తున్నదిప్పుడు మన సీతక్క.

**రోజా:** ఔనా! అక్కా! సీత ఇష్టాలన్నావు కదా! అవేవో చెప్పవూ!

**రాజు:** మరి నా ఇష్టాలో...



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

© SCERT not to be republished

**రోజా:** అవా? అవి.... మన కథ అయింతర్వాత తీరుబడిగా చెబుదువుగానీ ముందు సీత ఇష్టాలు విను.

**రాజు:** సరే సరే... నువ్వంటావుగా. వింటానుగా, ఇప్పుడు నువ్వు.... ముందు అక్క చెప్పేవి విను.

**కృష్ణవేణి:** (పాట) ఆడపిల్లలను చిన్నచూపుతో చూడరాదు భాయీ
॥అరెరే చూడరాదు భాయీ॥
అన్నిటిలోనూ అవకాశాలను కల్పించాలోయీ
॥చక్కగ– కల్పించాలోయీ॥
చదువులనైనా పదవులనైనా సమానమేనోయీ
॥వాళ్ళూ సమానమేనోయీ॥
వాళ్ళలోని ప్రతిభను గుర్తించి గౌరవించవోయీ
॥తప్పక గౌరవించవోయీ॥
తరికిట ఝుం తరిత.

**రాజు:** చాలా మంచికథ చెప్పినా వక్కా. ఈ కథ వింటే నిజంగా ఎవ్వరిలోనయినా మార్పు వస్తుంది.

**రోజా:** ఇటువంటి సీతక్కలు ఊరికొక్కరున్నా ఈ దేశం తొందరగా బాగుపడుతుంది.

**కృష్ణవేణి:** ప్రతి ఒక్కరూ ఈ సీతక్కను ఆదర్శంగా తీసుకొని తమనూ, తమ దేశాన్నీ బాగుపరచాలని కోరుకుంటూ, కథ ముగిద్దాం.

(పాట) మంగళం మన భారత మాతకు ॥
మంగళం జయ మంగళం ॥
మంగళం మన తెలుగు తల్లికి ॥
మంగళం జయ మంగళం ॥
మంగళం మన రుద్రమదేవికి ॥
మంగళం జయ మంగళం ॥
మంగళం ఆదర్శ మహిళలకు ॥
మంగళం జయ మంగళం ॥
తరికిట ఝుం తరిత!





© SCERT not to be republished



## ఇవి చేయండి



### I. వినడం-మాట్లాడడం



1. 'సీత' లాంటివాళ్ళను గురించి మీ అభిప్రాయాలు చెప్పండి
2. ఆడవాళ్ళుకూడా గొప్పవాళ్ళే. ఎందుకు? కారణాలు చెప్పండి.
3. సీతకథ విన్న తర్వాత మీకు ఏమనిపించిందో చెప్పండి. అటువంటివాళ్ళను గురించి చర్చించండి.
4. శ్రావణి టీచర్ గురించి తెలుసుకున్నారు కదా! అట్లాగే మీ ఉపాధ్యాయులను గురించి మాట్లాడండి.

### II. చదవడం - రాయడం



1. 'కొత్త వింత – పాత రోత' అనే అర్థంవచ్చే వాక్యాలు పాఠంలో ఎక్కడ ఉన్నాయి?
2. పాఠంలో మీకు నవ్వుపుట్టించిన అంశాలు రాయండి.
3. కింది వచన భాగం చదివి, ప్రశ్నలకు సరైన జవాబులు గుర్తించి, రాయండి.

1940 ప్రాంతంలో తెలంగాణాలో స్త్రీల చైతన్యం కొంత వికసించింది. లేడీ హైదరీ క్లబ్, సోదరీ సమాజం, ఆంధ్ర యువతీ మండలి, ఆంధ్రమహాసభ మొదలైన సమాజాలు ఏర్పడి సమావేశాల ద్వారా స్త్రీలను చైతన్యవంతులను చేశాయి. రత్నదేశాయి తన సాహిత్యంద్వారా గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేశారు. వితంతువులకోసం వసతిగృహాలు ఏర్పాటు చేశారు. అనేకమంది రచయితలు, రచయిత్రులు పత్రికల ద్వారా స్త్రీలలో చైతన్యం కలిగించారు. సుమిత్రాదేవి, ఈశ్వరీబాయి, సంగెం లక్ష్మీబాయి మొదలయిన వాళ్ళు సంఘసంస్కరణకు కృషి చేశారు. అఘోరనాథ చట్టోపాధ్యాయగారి భార్య వరదసుందరీదేవి గారు నాంపల్లిలో బాలికలకోసం పాఠశాలను ప్రారంభించారు. ఈమె సరోజనీనాయుడుగారి తల్లి.

అ. పైన పేర్కొన్న సంఘటనలన్నీ ఎప్పుడు జరిగాయి? (     )
(ఎ) స్వాతంత్ర్యానికి ముందు (బి) స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత (సి) 19వశతాబ్దంలో

ఆ. గాంధీ సిద్ధాంతాలను ప్రచారం చేసిన మహిళ ఎవరు? (     )
(ఎ) లేడీ హైదరీ క్లబ్ (బి) రత్నదేశాయి (సి) ఇందిరాగాంధీ

ఇ. సంగెం లక్ష్మీబాయి ఏం చేశారు? (     )
(ఎ) వితంతువులకు హాస్టల్ ఏర్పరిచారు (బి)సంఘసంస్కరణ చేశారు
(సి) క్లబ్బును స్థాపించారు.

ఈ. నాంపల్లిలో బాలికా పాఠశాలను ప్రారంభించినవారు ఎవరు? (     )
(ఎ) అఘోరనాథ చట్టోపాధ్యాయ (బి) శ్రీమతి అఘోరనాథ చట్టోపాధ్యాయ
(సి) శ్రీమతి సరోజనీనాయుడు

ఉ. ఇది ఒక సమాజంపేరు. (     )
(ఎ) సోదరీ సమాజం (బి) ఆంధ్ర యువతీమండలి
(సి) లేడీ హైదరీక్లబ్

ఊ. సరోజనీనాయుడు తండ్రి పేరు. (     )
(ఎ) రత్నదేశాయ్ (బి) అఘోరనాథచట్టోపాధ్యాయ (సి) గాంధీ

© SCERT not to be republished

1. **పాఠం ఆధారంగా ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. బుర్రకథ ప్రదర్శన ఎక్కడ జరిగింది? ఎవరెవరు ప్రదర్శించారు?

ఆ. బుర్రకథలో మొదట ఎవరెవరిని ప్రార్థించారు? ఏమని వేడుకొన్నారు?

ఇ. బుర్రకథ ప్రారంభంలో సీతను ఏమని పరిచయం చేశారు?

ఈ. సీత బడిలో చేరడానికి కారణం ఏమిటి?

ఉ. బుర్రకథలో ఏ ఏ ఆదర్శ మహిళలను గురించి చెప్పారు? వారు ఏం చేశారు?

ఊ. బుర్రకథను ముగించేటప్పుడు ఏ పాట పాడారు?

## III. స్వీయరచన



1. **కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదేసి వాక్యాల్లో జవాబులు రాయండి.**

అ. శ్రావణి టీచర్ పిల్లల అభివృద్ధికోసం చేసిన ప్రయత్నాన్ని తెలపండి.

ఆ. పాఠాన్ని ఆధారంగా చేసుకొని ఆడపిల్లల పరిస్థితులు గురించి 5 వాక్యాలు రాయండి.

ఇ. బుర్రకథ గురించి రాయండి.

ఈ. "పెద్దలు పనికి – పిల్లలు బడికి " అనే నినాదాన్ని గురించి రాయండి.

ఉ. "ఆలస్యం అమృతం విషం " అంటే మీకేమి అర్థమైంది?

ఊ. మీరు చదువుకొని ఏం కావాలనుకొంటున్నారు? ఎందుకు?

ఎ. ఆడపిల్లలు, మగపిల్లలు అందరూ సమానమే ! ఎందుకు? మీ అభిప్రాయాలు రాయండి.


2. **కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో సమాధానాలు రాయండి.**

అ. సీత ఇష్టాలు బుర్రకథను కథలాగ రాయండి.

ఆ. బుర్రకథలోని ముఖ్యాంశాలను రాయండి.

ఇ. సీత ఇష్టాలు పాఠం ఆధారంగా మీ ఇష్టాలను వివరించండి.

## IV. పదజాలం



1. **కింది వాక్యాలు చదవండి. ఎవరెవరిని ఏమంటారో రాయండి**

అ. బుర్రకథలో కథ చెప్పేవాడు. ..................................................

ఆ. మండలంలో అభివృద్ధి పనులు నిర్వహించే వ్యక్తి..................................................

ఇ. నాయకత్వం వహించేవాడు. ..................................................

ఈ. ఉపన్యాసం ఇచ్చేవాడు ..................................................

ఉ. హరికథ చెప్పేవాడు..................................................

ఊ. పాఠాలు బోధించేవాడు..................................................

ఎ. శిక్షణను ఇచ్చేవాడు..................................................

## V. సృజనాత్మకత




1. ఈ బుర్రకథను మీ పాఠశాలలో ప్రదర్శించండి. ఈ బుర్రకథకు 'సీత ఇష్టాలు' గాక మరేదైనా పేరును సూచించండి.
2. ఆడపిల్లలను సమానంగా చూడాలన్న అంశాన్ని గురించి నినాదాలు రాయండి.

©SCERT not to be republished

3. కింది అంశాలలో మీకు నచ్చిన అంశంమీద మీ మిత్రులతో కలిసి బుర్రకథ రాయండి. ప్రదర్శించండి.

(అ) చెట్లు నాటడం-కాపాడటం, (ఆ) నీటి కాలుష్యం-నివారణ, (ఇ) ప్లాస్టిక్ సంచుల నిషేధం

## VI. ప్రశంస



(అ) మీ పాఠశాలలో తరగతిలో ప్రదర్శించిన బుర్రకథ మీకు నచ్చిందా? ఎందుకు నచ్చిందో వివరించండి.

(ఆ) ఆడపిల్లల్లోని మంచి గుణాలను గుర్తించి, జాబితా రాయండి.

## VII. ప్రాజెక్టు పని



(అ) ఆడవాళ్ళపట్ల జరుగుతున్న అన్యాయాలకు సంబంధించి వార్తాపత్రికల్లో ప్రచురితమైన వార్తలను సేకరించండి.

(ఆ) వేరువేరు రంగాల్లో పేరుపొందిన స్త్రీలను గురించిన వివరాలను, ఫోటోలను సేకరించండి, ప్రదర్శించండి.

(ఇ) సీతవంటి బాలికల వివరాలు సేకరించండి. పెద్దల దృష్టికి తీసుకొని వెళ్ళండి.

(ఈ) మీ ప్రాంతంలోని కళారూపాలను గురించి తెలుసుకొని, నచ్చిన కళారూపాన్ని గురించి రాయండి.

## VIII. భాషగురించి తెలుసుకుందాం



సీత బడికి వెళ్ళింది.

సీత అన్నం తిని, బడికి వెళ్ళింది.

సీత అన్నం తిన్నది, కాని బడికి వెళ్ళలేదు.

ఇలా ఉన్న వాక్య భేదాల గురించి మీరు తెలుసుకున్నారు. అవేమిటంటే సామాన్య, సంశ్లిష్ట సంయుక్తవాక్యాలు. ఐతే ఈ వాక్యాలు ఇలా వేరువేరుగా కనబడటానికి కారణం ఆ వాక్యాల్లోని క్రియ. అంతే కదూ! క్రియనుబట్టే కాక అర్థాన్నిబట్టి వాక్యాల్లో తేడాలు గమనించవచ్చు. అలాంటి వాక్యభేదాలు చాలా ఉన్నాయి. వాటిలో కొన్నింటిని తెలుసుకుందాం!

**1. కింది వాక్యాల్ని చదివి అర్థంచేసుకోండి.**

అ. ఆహా! ఎంత బాగుందో !

ఆ. చేతులు కడుక్కో !

ఇ. చాలాసేపు టీ.వీ. చూడొద్దు.

ఈ. లోపలికి రావచ్చు.

ఉ. గోపాల్ చెట్టు ఎక్కగలడు.

చదివారు కదా! పై వాక్యాలు ఒక్కో భావాన్ని సూచిస్తూన్నాయి. అదెలాగో చూద్దాం!

'ఆహా! ఎంత బాగుందో!' ఇది ఆశ్చర్యానికి సంబంధించిన అర్థాన్ని సూచిస్తుంది. ఆశ్చర్యానికి సంబంధించిన అర్థాన్ని సూచిస్తుంది. కనుక ఈ వాక్యం ఆశ్చర్యార్థక వాక్యం.

ఇక రెండో వాక్యం. 'చేతులు కడుక్కో' ఇది విధిగా చేయాలి అనే అర్థాన్ని సూచిస్తున్నది. అంటే చేయాల్సిన పనిని విధిగా చెయ్యాలి అనే అర్థాన్ని సూచించే వాక్యాన్ని విధ్యర్థక వాక్యం అంటాం.

© SCERT not to be republished

ఇక మరో వాక్యం చూడండి.

'చాలా సేపు టీ.వీ. చూడొద్దు.'

ఈ వాక్యం టీ.వీ. చూడటం వద్దని చెబుతున్నది. టీ.వీ. చూడటాన్ని నిషేధిస్తున్నది కదూ! అంటే నిషేధార్థక వాక్యం.

ఒక పనిని చేయవద్దని నిషేధించే అర్థాన్ని సూచించే వాక్యం నిషేధార్థక వాక్యం.

ఇక నాలుగోవ వాక్యం 'లోపలికి రావచ్చు'.

ఈ వాక్యం ఒక వ్యక్తికి అనుమతిని ఇస్తున్నట్లు సూచిస్తున్నదికదూ! అంటే ఇది అనుమత్యర్థక వాక్యం.

ఏదైనా ఒక పనిని చేయడానికి అనుమతినిచ్చే అర్థాన్ని సూచించే వాక్యం అనుమత్యర్థక వాక్యం.

ఇక చివరి వాక్యం

'గోపాల్ చెట్టు ఎక్కగలడు.'

ఈ వాక్యంలో గోపాలు చెట్టు ఎక్కగలడు. అంటే గోపాల్‌కున్న చెట్టును ఎక్కే సామర్థ్యాన్ని సూచిస్తున్నది. ఇది సామర్థ్యార్థక వాక్యం.

ఒక వ్యక్తికి గాని, వ్యవస్థకుగాని లేదా యంత్రానికిగాని ఉన్న సమర్థతను సూచించే అర్థం గల వాక్యాన్ని సామర్థ్యార్థక వాక్యం అంటాం.

**అభ్యాసాలు :**

**2. కింది వాక్యాలు వాటిలోని భావాన్ని అనుసరించి ఏ వాక్యాలు అవుతాయో గుర్తించి రాయండి. ఈ వాక్యాలన్నీ మీ పాఠ్యాంశంలోనివే.**

అ. సీత కలెక్టరైందా? ......................................

ఆ. మీరు తర్వాత కొట్టుకోవచ్చు. ......................................

ఇ. అక్క చెప్పేది విను. ......................................

ఈ. రసాభాస చేయకండి. ......................................

ఉ. సీత లెక్కలు బాగా చేసింది. ......................................

ఊ. నీవు ఇంటికి వెళ్ళవచ్చు. ......................................

ఇలాంటి మరిన్ని వాక్యాలు మీ పాఠ్యాంశాల్లో నుంచి రాయండి.



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | బుర్రకథ విని అర్థం చేసుకోగలను. అభిప్రాయాలు చెప్పగలను. | ఔను/కాదు |
| 2. | బుర్రకథ సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను. | ఔను/కాదు |
| 3. | బుర్రకథ రూపంలోని పాతాల భావాన్ని గ్రహించగలను | ఔను/కాదు |
| 4. | చిన్న చిన్న బుర్రకథలు రాయగలను. ప్రదర్శించగలను. | ఔను/కాదు |

మన అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన విజ్ఞానం. - సర్వేపల్లి రాధాకృష్ణన్

© SCERT not to be republished

నాలుగో యూనిట్

# 16. కరపత్రం

మూలం : డా॥ గల్లా చలపతి

**ఆలోచించండి - మాట్లాడండి :**




**ప్రశ్నలు :**

1. పై చిత్రం చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?
2. ఇలాంటి దృశ్యాన్ని మీరెప్పుడైనా చూశారా?
3. ఇలా ఎప్పుడెప్పుడు ఊరేగింపులు నిర్వహిస్తారు? ఎందుకు?
4. ఊరేగింపులో ఏమి పంచుతున్నారు? వాటిని ఏమంటారు?

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

చేతిలో అనువుగా ఒదిగి ఒక విషయానికి సంబంధించిన వివరణను ఇచ్చే కాగితాన్ని **'కరపత్రం'** అనవచ్చు. కరపత్రం సంస్కృత పదం. చేతిలోని కాగితమని దీని అర్థం. దీన్నే ఆంగ్లంలో 'పాంఫ్లెట్' అంటారు. పదిమందికి తెలియవలసిన విషయంతో కూడుకొన్నదే కరపత్రం. ఒక వ్యక్తి ఒక విషయాన్ని మరొకరికి తెలియబరచడానికి ఒక కాగితంమీద రాసి పంపవచ్చు. ఆ విషయం ఆ ఒక్క వ్యక్తికే సంబంధించినది కాక ఎందరికో సంబంధించినది కావచ్చు. సాంఘిక, రాజకీయ, ఆర్థిక, మతస్థితులను ప్రతిబింబించేది కావచ్చు. ఇలా రాసిపంపే కాగితాలను లేఖలు అనవచ్చుగదా అనిపిస్తుంది. లేఖలకు, కరపత్రాలకు ఒక ప్రధానమైన భేదముంది. లేఖలలో రాసే, చదివే వ్యక్తుల వ్యక్తిగత విషయాలుంటాయి. కరపత్రాలలో వ్యక్తిగత విషయాలేకాక మన చుట్టూరా ఉన్న సమాజం, దేశం, ప్రపంచంలోని విషయాలుంటాయి. అచ్చుయంత్రం లేని పూర్వకాలంలో ఒక విషయం అందరికీ తెలియజేయడానికి కాగితాలమీద రాసి వాటికి అనేక ప్రతులు తయారుచేసి పంచేవారు. ఈ కరపత్రాల ప్రతులను చదివిన ప్రజలు వాటిని గురించి నిశితంగా ఆలోచించేవారు. ముద్రణ సౌకర్యం ఏర్పడిన తరవాత కరపత్రాల ప్రచారం ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తుంది.

ఇప్పుడు కనిపించే కరపత్రాలకు ఒక పరిణామదశ ఉంది. విభిన్న అభిప్రాయాల వ్యక్తీకరణలు కరపత్రాలలో కనిపిస్తాయి. ఈ అభిప్రాయ వ్యక్తీకరణకు ప్రాచీనకాలంనుంచి అలవాటులోఉన్న పద్ధతులన్నీ కరపత్రాలకు మూలరూపాలుగా చెప్పవచ్చు. కరపత్రంలోని విషయం ఒక వ్యక్తికిగాని, ఒక సంస్థకుగాని సంబంధించినదైనప్పటికీ అది సంఘంలోని వ్యక్తులందరికీ తెలియవలసిన అవసరం ఉంది. అందుకే జనసమ్మర్దమున్న కూడళ్ళలో కరపత్రాలు పంచడం ఇప్పటికీ మనం చూస్తుంటాం. ఒక వ్యక్తి అందరికీ తెలియజేయవలసిన విషయాన్ని బిగ్గరగా అరుస్తూ వీధులవెంట వెళ్ళటం, ఆ తరవాత చిన్న గొట్టమున్న గరిగలను తయారుచేసుకొని గొట్టాన్ని నోటి దగ్గర ఉంచుకొని గట్టిగా అరచి చెప్పవలసిన విషయాన్ని ప్రచారం చేసేవారు. ఇది ఈనాడు మనం వాడే 'లౌడ్‌స్పీకర్' లాగా ఉంటుంది. మనిషి అరుపు ఈ గరిగద్వారా గట్టిగా వినబడేది. లిపి తెలియని రోజుల్లో ఉన్న ఈ పద్ధతి ఇంకా ఇప్పటికీ అక్కడక్కడ గ్రామీణ ప్రాంతాలలో కనిపించడం విశేషం.

లిపి వాడుకలోకి వచ్చిన తరవాత గుడ్డముక్కలమీద, చెక్క పలకలమీద రాసేవారు. ఒక విషయాన్ని దూరప్రాంతాలవారికి పంపాలనుకున్నప్పుడు మందపాటి గుడ్డమీద రాసి దానికి ఒక పిడిని అమర్చి ఆ పిడి చుట్టూ రాత ఉన్న గుడ్డను చుట్టి పైన తాడుతోకట్టి పంపేవారు. రాజుల కాలంలో ఇది ఎక్కువగా వాడుకలో ఉండేది. ఇలాంటి గుడ్డ ఉత్తరాలు ఇప్పటికీ కొన్ని ప్రాచీన మఠాలలో ఉన్నాయని తెలుస్తోంది. చేతులలో అందంగా అమరే ఈ గుడ్డ ఉత్తరాలను కరపత్రాల పరిణామంలో రెండో దశగా భావించవచ్చు. ముద్రణ సౌకర్యం ఏర్పడిన తరవాత ఇంగ్లండ్, ఫ్రాన్స్, జర్మనీ దేశాలలో కరపత్రాల ముద్రణ మొదలై ప్రపంచమంతటా విస్తరించింది.

not to be republished ©SCERT

ఆంగ్లేయుల రాకకు ముందు భారతదేశంలో కరపత్రాలు లేవు. అయితే ప్రాచీనకాలంలో మన దేశంలో దొరికిన శాసనాలు, అశోకుని శిలాశాసనాలు నేటి కరపత్రాల ప్రయోజనాన్ని సాధించాయని చెప్పవచ్చు. భారతదేశానికి పాశ్చాత్యులు వచ్చిన తరవాతే ఇక్కడ కరపత్రం పుట్టింది.

ఆధునిక కాలంలో ప్రతిరోజూ మనం కనీసం ఒక కరపత్రమైనా చూస్తున్నాం. వీటిలో చాలావరకు వ్యాపార ప్రకటనలే. అసంఖ్యాకంగా కనిపిస్తున్న వ్యాపార ప్రకటనలకు సంబంధించిన కరపత్రాలను నిజమైన కరపత్రాలుగా చెప్పడానికి వీల్లేదు. నిఘంటువులిచ్చిన నిర్వచనాలనుబట్టి కరపత్రంలో సమకాలీన విషయాసక్తి, వాస్తవదృక్పథం, వివాదాత్మక విషయ ప్రతిపాదన, సాంస్కృతిక స్థితి, సాహిత్యపు విలువ, నిర్భయత్వం, చిత్తశుద్ధి మొదలైన లక్షణాలు తప్పనిసరిగా ఉండాలి. ఒక సమాచారాన్ని లేదా వివాదాస్పద అంశాన్ని అందరికీ తెలియజేయడమే కరపత్రం ప్రధాన ఉద్దేశం. అయితే కరపత్రంలోని విషయాలు వాస్తవాలా? కావా! అది పాఠకుడిమీద ఎలాంటి ప్రభావం చూపిస్తుంది అనే పట్టింపు కరపత్రంరాసిన వారికి, పంచినవారికి ఉండదు. కరపత్రాలు వేసిన వాళ్ళు, రాసిన వాళ్ళ పేర్లుగాని, ముద్రణాలయం పేరుగాని కరపత్రాల్లో ఉండాలి. అయితే కొన్నిసార్లు ఇవేమీ కనిపించవు. సాధారణంగా కరపత్రాలన్నీ చౌకగా ఉండే రంగుకాగితాల్లోనే అచ్చువేసి ఉంటాయి. ఎక్కువగా కరపత్రాలు ఒకటి, రెండు పేజీలకే పరిమితమౌతాయి. అవసరాన్నిబట్టి ఇవి వేరు వేరు కొలతలలో, పరిమాణాలలో కనిపిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సామాజిక ప్రయోజనమున్న అంశాలను సామాన్య ప్రజానీకానికి చేరవేయడానికి కరపత్రం ఒక ప్రముఖమైన సాధనంగా ఉపయోగపడుతూంది.

కరపత్రాల్లోని విషయాలు ఉద్దేశించిన వ్యక్తులకు వెంటనే అర్థమౌతాయి. మిగిలినవాళ్ళకు వాటిలోని భావాలు సందిగ్ధంగా ఉంటాయి. కొన్ని కరపత్రాలను ఎవరికీ తెలియనివ్వకుండా రహస్యంగా అతి తక్కువ సమయంలో ముద్రించి పంపకం చేస్తారు. అందువల్ల అచ్చుతప్పులకు, అపార్థాలకు ఎక్కువ ఆస్కారముంటుంది. కరపత్రాల్లోని విషయాలు నిజాలా! అబద్ధాలా! అనే అనుమానం కలుగుతుంది. ఆధారాలు దొరికితే తప్ప, ఈ విషయాల వెనకఉన్న వాస్తవం బయటపడదు. కొన్ని విషయాలను వార్తాపత్రికల్లో చూడనివారు కరపత్రాల్లో చూసి తెలుసుకుంటారు. కరపత్రాల్లో ఎక్కువగా వాడుకభాష ఉంటుంది. సాధారణంగా కరపత్రాలను ఉచితంగా పంపిణీ చేస్తారు. కరపత్రం మనిషి భావప్రకటన స్వేచ్ఛకు సంకేతం.

ఇక ఇప్పుడు ఒక కరపత్రాన్ని చూద్దాం!

© SCERT not to be republished

అందరూ చదవాలి

# బాలల హక్కుల వారోత్సవాలు

అందరూ ఎదగాలి

ఇంతకాలం బాలల హక్కుల గురించి, నిశితంగా మనం పరిశీలించలేదనే చెప్పాలి. పెద్దల ఆజ్ఞలకు లోబడి పిల్లలు ఉండాలనే ఆలోచనతోనే చాలాసార్లు పిల్లల హక్కుల భంగం గురించి లోతుగా ఆలోచించలేదనే చెప్పాలి. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగానే ప్రభుత్వాలలోను, సామాజిక సంస్థలలోను చాలా మార్పులు వచ్చాయి. వచ్చిన మార్పుల పర్యవసానంగా పిల్లల చాకిరీని వ్యతిరేకిస్తూ, పిల్లలను పనిలో పెట్టి వాళ్ళ సంపాదనమీద ఆధారపడే పద్ధతిని, బాలల శ్రమ దోపిడీని నిరసిస్తూ బాలకార్మికతకు వ్యతిరేకంగా చాలా కార్యక్రమాలు జరిగాయి. చట్టాలు రూపుదిద్దుకున్నాయి. ఈ క్రమంలోనే ఐక్యరాజ్య సమితి 1989లో బాలల హక్కులను నిర్వచించి వాటి అమలుకు పూనుకొన్నది. ఐక్యరాజ్య సమితి రూపొందించిన ఈ బాలల హక్కుల తీర్మానంపై మనదేశం కూడా సంతకం చేసింది.

## బాలల హక్కుల ప్రకటనలోని ప్రధాన హక్కులు

*1. జీవించే హక్కు 2. చదువుకొనే హక్కు 3. ఆరోగ్యం పోషణ హక్కు 4. కూడు, గూడు, గుడ్డ హక్కు 5. ఆటపాటలతో కూడిన వినోదం విశ్రాంతి పొందే హక్కు 6. కష్టమైన పని చేయకుండా బయటపడే హక్కు 7. కూలిజీవితంనుండి బయటపడే హక్కు 8. కుల మత వర్గ విచక్షణ లేని బాల్యం హక్కు 9. దౌర్జన్యాలనుండి రక్షణ పొందే హక్కు- ప్రత్యేకించి ఆడపిల్లలు దుర్మార్గులనుండి రక్షణపొందే హక్కు 10. అభివృద్ధి చెందే హక్కు.*

ఈ నేపథ్యంలోనే ఆగస్టు 2009లో భారత ప్రభుత్వం బాలల విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా చట్టం చేసింది. మనరాష్ట్రంలో **01-04-2010 నుండి నిర్బంధ ఉచిత విద్యాహక్కు చట్టం** అమలులోకి వచ్చింది. దీని ప్రకారం బడిఈడు పిల్లలందరికీ ఎలిమెంటరీ విద్యను పొందే హక్కు ఉంది. బడికి వెళ్ళే పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడం కూడా దీని ముఖ్య ఉద్దేశ్యం. పిల్లల తల్లిదండ్రులకు, సమాజ సభ్యులకు తెలియజేయడానికి మన రాష్ట్రంలో బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14వతేదీ నుండి 21వ తేదీ వరకు *'బాలల హక్కుల వారోత్సవాలను'* నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా చదువుకున్న వ్యక్తులుగా మనందరం కింది అంశాలమీద అందరికీ అవగాహన కల్పిద్దాం !

*విద్యాహక్కుచట్టం గురించి తెలియజేయటం; 6-14 సం॥ల మధ్య వయస్సుగల బాలబాలికలందరూ ఉచిత నిర్బంధ విద్యను పొందడం; బాలల హక్కులు రక్షించబడడం; బడికి వెళ్ళని పిల్లలను బళ్ళలో చేర్పడం; ఆర్.టి.ఇ ప్రకారం పాఠశాలల్లో పిల్లల దగ్గర ఫీజులు, విరాళాలు వసూలు చేయడం చట్టవిరుద్ధం. బయట పిల్లలకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ కేంద్రాలను గురించి తెలియజేయడం; బడిలోని పిల్లలందరూ నాణ్యమైన విద్యను పొందడం. వలస వచ్చినవారి పిల్లలకు విద్యాసౌకర్యాలు కల్పించడం; ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉపకరణాలు అందించడం మొదలయినవి.*

పిల్లల్లో పెరుగుదల, అభివృద్ధి సక్రమంగా కొనసాగాలంటే విద్య, వికాసం, వినోదం, విరామంతోబాటు బాల్యాన్ని, వాళ్ళ హక్కులను వాళ్ళు అనుభవించేలా చూడాలి. అందుకు మనందరి దృక్పథాల్లో మార్పు రావాలి. పిల్లలను పనులలో పెట్టకుండా బళ్ళకు పంపడం అవసరమని, పిల్లల హక్కులను రక్షించడంకోసమే పాఠశాల ఉందని గుర్తిద్దాం ! నేటి బాలలే రేపటి పౌరులు కూడా ! బాలల భవిష్యత్తుతోటే మన గ్రామ / రాష్ట్ర / దేశ భవిష్యత్తు ముడిపడి ఉంటాయని తెలుపుదాం ! ఇందుకోసం బాలల హక్కుల వారోత్సవాలలో భాగస్వాములమవుదాం. బాలల హక్కుల పరిరక్షణ మనందరి బాధ్యత ! పిల్లలచేత చాకిరీ చేయించడం అమానుషం, అనాగరికం ! పిల్లలను బళ్ళలో చేర్పిద్దాం ! నాణ్యమైన విద్య పొందేలా చూద్దాం !

తేది : 01-01-2011
హైదరాబాద్

సంచాలకులు
పాఠశాల విద్యాశాఖ, ఆం.ప్ర.

చదివించడం మనందరి బాధ్యత - చదువుకోవడం పిల్లల హక్కు


© SCERT not to be republished



# ఇవి చేయండి



## I. వినడం-మాట్లాడడం



1. ఏదైనా ఒక కరపత్రాన్ని సేకరించండి. ఇద్దరిద్దరు కలిసి కూర్చోండి. ఒకరు తెచ్చిన కరపత్రాన్ని ఇంకొకరికి చదివి వినిపించండి. విన్న తరవాత ఆ కరపత్రంలో ఏ అంశాలు ఉన్నాయో చెప్పండి.
2. పిల్లల హక్కుల గురించి మీ తల్లిదండ్రులను అడగండి. వారు ఏమి చెప్పారో చెప్పండి?
3. రేడియో, టెలివిజన్ కార్యక్రమాలలో పిల్లల హక్కుల గురించి విద్యాహక్కు చట్టం గురించి ప్రకటనలు, కార్యక్రమాలు ఏమి వచ్చాయో తెలుసుకొని చెప్పండి.
4. మీ వాడలో / గ్రామంలో బడికి వెళ్ళని పిల్లలు ఉన్నారా ? ఒకవేళ ఉంటే వాళ్ళను బళ్ళలో చేర్చడానికి మీరేం చేస్తారు?

## II. చదవడం - రాయడం





**1. కింది పేరాను చదివి ప్రశ్నలకు జవాబులు రాయండి.**

మదునయ్య చేపల వ్యాపారి. శ్రీశైలం రిజర్వాయరులో చేపలు పట్టి అమ్ముతాడు. పెద్ద పెద్ద వలలను నీటిలో వేసి చేపలను పడతారు. ఇందుకోసం ఒరిస్సా రాష్ట్రంలోని బరంపూర్‌కు వెళ్ళి ఆరోతరగతి చదివే గంగయ్య అనే బాలుడి తల్లిదండ్రులతో మాట్లాడి పదివేలకు అతన్ని పనికి కుదుర్చుకున్నాడు. గంగయ్యను తనవెంట తీసుకొని శ్రీశైలం వచ్చాడు. గంగయ్య రోజూ నీటి ఒడ్డున కూర్చొని వలను చూస్తూ ఉండేవాడు. ఒక్కోసారి రాత్రికూడా అక్కడే పడుకొనేవాడు. ఈ విషయం తెలుసుకొన్న అధికారులు మదునయ్యను శిక్షించారు. గంగయ్యను బళ్ళో చేర్పించి అతని తల్లిదండ్రులకు తెలియజేశారు.

అ. మదునయ్య ఎవరు? ఏం చేసేవాడు?

ఆ. గంగయ్య ఎవరు? శ్రీశైలానికి ఎందుకు వచ్చాడు?

ఇ. గంగయ్య పనిలో చేరడంవల్ల ఏమేం కోల్పోయాడు?

ఈ. బాలల హక్కులలో గంగయ్య ఏ హక్కులకు దూరమయ్యాడు?

ఉ. మదునయ్యను ఎందుకు శిక్షించారు? ఇలా చేయడం సరైందేనా?

ఊ. గంగయ్య తల్లిదండ్రులు చేసిన పని సరైందేనా? ఎందుకు?

**2. కింది వాక్యాలను చదివి తప్పో, ఒప్పో గుర్తించండి. కారణం రాయండి.**

| | | కారణం |
|---|---|---|
| అ. చదువుకోడం అందరి హక్కు | తప్పు/ఒప్పు | .................... |
| ఆ. బాలికలు కూడా బాలురతోపాటు సమానంగా చదవడం. | తప్పు/ఒప్పు | .................... |
| ఇ. బాలబాలికలకు సమాన హక్కులు ఉంటాయి. | తప్పు/ఒప్పు | .................... |
| ఈ. బాలలను భయపెట్టడం, కొట్టడం, తిట్టడం. | తప్పు/ఒప్పు | ..................... |
| ఉ. తల్లిదండ్రులు తమ పిల్లలను పనిలో పెట్టడం. | తప్పు/ఒప్పు | .................... |
| ఊ. పిల్లలు మంచి ఆహారం పొందడం. | తప్పు/ఒప్పు | .................... |
| ఎ. తెలియనివాటిని రానివాటిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడం, నేర్చుకోవడం | తప్పు / ఒప్పు | .................... |

©SCERT not to be republished

3. **పాఠం చదవండి. జవాబులు రాయండి.**

అ. కరపత్రం అంటే ఏమిటి? లేఖలకు, కరపత్రాలకు గల తేడా ఏమిటి?

ఆ. కరపత్రాలను ఎందుకు రూపొందిస్తారు?

ఇ. కరపత్రాలు ఎలా ఉంటాయి?

ఈ. పాఠంలోని కరపత్రం దేనికి సంబంధించినది? దీన్ని ఏ శాఖవారు తయారుచేశారు? ఎందుకు?

ఉ. కరపత్రంలో ఏ చట్టాన్ని గురించి తెలిపారు? అది ఎప్పటినుంచి అమలు జరుగుతున్నది?

ఊ. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా ఏ ఏ అంశాల గురించి అవగాహన కల్పించాలని భావించారు?

ఎ. గతంలో కరపత్రాలు ఎలా ఉండేవి? ప్రస్తుతం ఎలా ఉంటున్నాయి? తేడాలు రాయండి.

ఏ. బాలల హక్కుల జాబితా తయారు చేయండి.

## III. స్వీయరచన



1. **కింది ప్రశ్నలకు ఐదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

అ. అందరూ చదువుకోవాలి కదా ! కాని కొంతమంది ఆడపిల్లలను వాళ్ళ తల్లిదండ్రులు చదివించడం లేదు. దీనిమీద మీ అభిప్రాయం తెలపండి.

ఆ. కొంతమంది బాలబాలికలు 'వీధిబాలలు'గా మారడానికి కారణాలేవి?

ఇ. బాలబాలికలలో 'ప్రత్యేక అవసరాలున్న పిల్లలు' కూడా ఉంటారు! మరి ఈ పిల్లలు బడిలో ఉంటే వాళ్ళ హక్కులను కాపాడడానికి మీరేం చేస్తారు?

ఈ. 'నేటి బాలలే రేపటి నేతలు' –ఈ విషయం చర్చించి రాయండి.

ఉ. కరపత్రాలను ఏ ఏ అంశాల గురించి తయారు చేయవచ్చు? కరపత్రాన్ని తయారుచేసేటప్పుడు ఏ ఏ అంశాలు మనకు తెలియాలి?

## IV. పదజాలం

1. **కింది పదాలను ఉపయోగించి సొంత వాక్యాలు రాయండి.**

అ. హక్కులు, బాధ్యతలు ______________________

ఆ. కంటికి రెప్పలా ______________________

ఇ. సొంతకాళ్ళమీద నిలబడు ______________________

ఈ. విజయం సాధించు ______________________

ఉ. రక్షణ ______________________

ఊ. పనితనం ______________________

2. **నీకు వినోదాన్ని, విశ్రాంతిని, ఆనందాన్ని ఇచ్చేవి ఏవి? కష్టాన్ని, విసుగును, అలసటను కల్పించేవి ఏవి?**

| వినోదం, విశ్రాంతి, ఆనందం కలిగించేవి | కష్టం, విసుగు, అలసట కలిగించేవి |
|---|---|
| | |

© SCERT not to be republished

3. "బడి", పిల్లల ప్రపంచం. ఇది పిల్లల అభివృద్ధికి కృషి చేస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని బడికి సంబంధించిన పదాలు రాయండి.

4. వారంరోజులపాటు ఏదైనా ఒక అంశాన్ని గురించి కార్యక్రమాలను నిర్వహిస్తే వారోత్సవం అంటారు. వారోత్సవాలలాగ ఇంకా ఏ ఏ ఉత్సవాలు నిర్వహిస్తారు. వాటి పేర్లు రాయండి.


## V. సృజనాత్మకత



1. బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం అంశాలను దృష్టిలో పెట్టుకొని నినాదాలు రాయండి.
2. బాలల హక్కుల వారోత్సవాల గురించి కరపత్రం చదివారు కదా ! కింది అంశాలలో ఏదైనా ఒక అంశంపై మీ మిత్రులతో కలిసి ఒక కరపత్రం తయారు చేయండి.

అ. పరిసరాల పరిశుభ్రత     ఆ. దోమల నిర్మూలన     ఇ. చెట్ల పెంపకం

## VI. ప్రశంస



1. బాలల హక్కులు మీ బడిలో, గ్రామంలో / వాడలో / వీధిలో ఎలా అమలు జరుగుతున్నాయో మీ అభిప్రాయాలు రాయండి.
2. బాలల హక్కుల కోసం కృషి చేసే వారి గురించి / సంస్థల గురించి మీ అభిప్రాయాలు రాయండి. వారిని అభినందిస్తూ లేఖ రాయండి.
3. బాలల హక్కులకు సంబంధించిన నినాదాలను ఉపాధ్యాయులతో, మిత్రులతో చర్చించి ఇతర భాషల్లో కూడా రాయండి.

## VII. ప్రాజెక్టు పని



1. ప్రత్యేక అవసరాలుగల పిల్లలను బడిలో చేర్చడానికి మీ మిత్రులతో కలసి ఒక కరపత్రం తయారుచేయండి. దాన్ని తీసికెళ్ళి నీకు తెలిసిన 'ప్రత్యేకఅవసరాలు'గల పిల్లలకు ఇచ్చి చదివించండి.
2. కొన్ని కరపత్రాలు సేకరించండి. వాటిని ఎవరు ముద్రించారు? ఎందుకోసమో తెలపండి.

## VIII. భాష గురించి తెలుసుకుందాం



1. **కింది వాక్యాలు భావాన్ని అనుసరించి ఏ వాక్యాలో గుర్తించండి. ఆ పక్కన రాయండి.**

ఉదా : ఎంత బాగుందో !     ఆశ్చర్యార్థకం

అ. నువ్వు చదువు. ..................................................

ఆ. అల్లరి చేయవద్దు. ..................................................

ఇ. పరీక్షలు రాయవచ్చు. ..................................................

ఈ. తనూ బొమ్మలు వేయగలడు. ..................................................

ఇప్పుడు మరిన్ని వాక్య భేదాలు చూద్దాం.

1. రవి పనిచేస్తాడో చెయ్యడో!

   ఈ వాక్యం చదివితే రవి పని చేయటం అనే విషయంలో అనుమానం, అంటే సందేహం, కలుగుతున్నది కదూ! ఇలా సందేహాన్ని తెలిపే వాక్యాలను సందేహార్థక వాక్యాలు అంటారు.

2. నువ్వు నూరేళ్ళు వర్ధిల్లు!

   ఈ వాక్యం ఏ అర్థాన్ని సూచిస్తున్నది? ఒక వ్యక్తిని ఆశీర్వదిస్తున్నట్లు కనబడుతోంది కదూ! ఇలా ఆశీర్వదిస్తున్నట్లు అర్థాన్ని సూచించే వాక్యాలను ఆశీరాద్యర్థక వాక్యాలు అంటాం.

© SCERT not to be republished

3. దయచేసి పని చేయండి.

ఈ వాక్యం ఒక పనిని చేయమని ప్రార్థిస్తూ ఉంది. అంటే ప్రార్థన అర్థాన్ని సూచిస్తున్నది. కాబట్టి ఇది ప్రార్థనార్థక వాక్యం.

ఒక వాక్యం ప్రార్థన అర్థాన్ని సూచిస్తున్నట్లు ఉంటే అది ప్రార్థనార్థక వాక్యం అన్నమాట.

4. ఏం! ఎప్పుడొచ్చావ్?

ఈ వాక్యం ప్రశ్నిస్తున్నట్లుంది కదూ! అంటే ఇది ప్రశ్నార్థక వాక్యం.

ఒక వాక్యానికి ప్రశ్నను సూచించే అర్థం ఉంటే దాన్ని ప్రశ్నార్థక వాక్యం అంటాం.

5. వర్షాలు లేక పంటలు పండలేదు.

ఈ వాక్యం మనకు రెండు విషయాల్ని తెలుపుతోంది. ఒకటి వర్షాలు లేవని, రెండు పంటలు పండలేదని. ఐతే పంటలు పండకపోవటానికి కారణం మొదటి విషయం. అంటే వర్షాలు లేకపోవటం. ఈ మొదటి విషయం రెండో విషయానికి కారణమౌతూంది. అంటే హేతువు అన్న మాట. ఇలా హేతువు అర్థాన్ని సూచించే వాక్యం హేత్వర్థక వాక్యం.

ఒక పని కావడానికి కారణాన్ని లేదా హేతువును సూచించే అర్థం ఉన్న వాక్యాన్ని హేత్వర్థక వాక్యం అంటాం.

**అభ్యాసాలు:**

**2. కింది వాక్యాలు ఏ అర్థాన్ని సూచించే వాక్యాలో రాయండి.**

అ) ఎవరా పైడిబొమ్మ? ...............................................

ఆ) పంటలు పండలేదు. ...............................................

ఇ) దయచేసి సెలవు ఇవ్వండి. ...............................................

ఈ) కిషన్ చదువుతాడో లేదో! ...............................................

ఉ) మీకు శుభం కలగాలి! ...............................................

ఇలాంటి వాక్యాల్ని మీ పాఠ్యాంశాలలో వెతికి రాయండి.



**నేనివి చేయగలనా?**



| | | |
|---|---|---|
| 1. | కరపత్రాలను ధారాళంగా చదవగలను. అర్థంచేసుకోగలను. | ఔను / కాదు |
| 2. | కరపత్రంలోని సారాంశాన్ని సొంతమాటల్లో చెప్పగలను, రాయగలను. | ఔను / కాదు |
| 3. | ఏదైనా ఒక అంశంపై కరపత్రాన్ని తయారు చేయగలను. | ఔను / కాదు |
| 4. | బాలల హక్కులకు చెందిన నినాదాలు / వార్తలు / అడ్వర్టయిజ్‌మెంట్లు మొదలగు వాటిని విని, చదివి అర్థంచేసుకోగలను. సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు |

సుసంపన్నమైన గ్రామీణ భారతాన్ని ఆవిష్కరించడమే మన కర్తవ్యం. - డా॥ ఎ.పి.జె. అబ్దుల్ కలాం


© SCERT not to be republished

నాలుగో యూనిట్

# 17. ఆడినమాట

-అనంతామాత్యుడు.

ఆలోచించండి - మాట్లాడండి.




ప్రశ్నలు :

1. చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు?
2. చిత్రంలో మాట్లాడుతున్నవారు ఎవరు? ఆయన ఏం అంటున్నారు?
3. ఈ కథ మీకు తెలుసునా ? తెలిస్తే చెప్పండి. లేదంటే తెలుసుకోండి.

నేపథ్యం:

ఈ ఆవు - పులి కథ భోజరాజీయం కావ్యంలోది. సాధువైన ఆవు సత్యసంధత, క్రూరమైన పులి మనస్సును ఎలా మార్చగలిగిందో అనంతామాత్యుడు అత్యంత రమణీయంగా వర్ణించాడు.

ప్రస్తుత పాఠ్యభాగం **'భోజరాజీయము'** లోని షష్ఠాశ్వాసంలోది.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

★ చ. మునుమును బుట్టె నాకు నొక ముద్దులపట్టి, యతండు పుట్టి యే
డెనిమిది నాళ్లపాటి గలఁడింతియ, పూరియు మేయనేరఁ డేఁ
జని, కడుపారఁ జన్గుడిపి చయ్యన వచ్చెద, నన్నుఁ బోయి ర
మ్మని సుకృతంబు గట్టికొనవన్న! దయాగుణ ముల్లసిల్లఁగన్. 1

ఉ. గుమ్మెడు పాల నా సుతునకుం బరితృప్తి జనించుఁగాని, మాం
సమ్ము సమస్తముం గొనక చాలదు నీ యుదరాగ్నికైన, ని
క్కమ్ముగ నిందులోఁబ్రథమ కార్య వినిర్గతి నీ వెఱుంగవే,
పొమ్మన వన్న! వ్యాఘ్రకులభూషణ! చయ్యనఁ బోయి వచ్చెదన్. 2

చ. అనవుడు పుండరీక మపహాస్యముచేసి 'యిదేమి గోవ! యి
ట్లనియెదు, నన్ను బేల్పఱచి యాత్మజుఁ డున్నెడ కేగి సత్వరం
బునఁ జనుదెంతు నంటి, విది పోలునె, చెప్పెడువారు చెప్పినన్
వినియెడువారి కించుక వివేకము పుట్టదె, యింత యేటికిన్. 3

★ ఉ. ప్రల్లదమాడి పెద్దలకు బాధ యొనర్చునతండు, తండ్రికిం
దల్లికి మాఱుపల్కెడు నతండును, నాఁకొని వచ్చి యొడ్లచే
నుల్ల మెలర్ప మేయఁ జనుచున్న వృషంబు నదల్చునాతఁడుం
ద్రెళ్ళెడు నట్టిదుర్గతులఁ ద్రెళ్ళుదు నేనిటు రాక తక్కినన్. 4





©SCERT not to be republished

క.	అని శపథంబులు పలికిన
వినె వ్యాఘ్రము – "నీవు ధర్మవిదురాలవు నీ
కెన యెవ్వరు, ధేనువ! యే
నిను నమ్మితిఁ బోయి రమ్మ" నినఁ బటుబుద్ధిన్, 5




చ.	పులికిఁ బ్రదక్షిణించి తలఁపుంబలుకున్ సదృశంబు గాఁగ, న
స్ఖలిత విలాసయాన మెసఁగం బురికేఁగెఁ జతుస్ స్తనంబులుం
బలసి పొదుంగు ద్రేఁగుపఱుపంగ గభీర రవంబుతోడ వీ
థుల నడయాడు బాలకులు దోరపు బీతిఁ దొలంగి పాఱఁగన్ 6

చ.	కొడుకు చనుగ్రోలుచున్నంత దడవుఁ దల్లి
యడుగు దిరుగక కదలక యన్యచిత్త
గాక పై నీఁగ సోఁకినఁ గదలకుండె
నెమ్మిఁ బాషాణధేనువు నిలిపినట్లు.

వ.	అయ్యవసరంబున 8



★ క.	'నిన్నుఁ గని యిన్ని దినములు
చన్నిచ్చితి నేను ఋణవశంబున. నిఁక నీ
వెన్నఁడు నన్నుఁ దలంపకు
మన్న ! మమత్వంబు విడువు మన్న, మనమునన్' 9



© SCERT not to be republished

క. ఆడకు మసత్యభాషలు
కూడకు గొఱగానివాని గొంకక యొరు లె
గ్గాడిన నెదు రుత్తరమీఁ
జూడకు విని విననివాని చొప్పునఁ జనుమీ. 10

వ. అని గడుపాఱఁ బాలు కుడిచి తనిసిన కొడుకునకుం గడచిన
వృత్తాంతం బంతయు నెఱింగించి, పెద్దగా నేడ్చు కొడుకు నెట్టకేల కోదార్చి,
తగ బుద్ధి చెప్పి యా మొదవు పులియున్న వనంబునకు
మగిడి వచ్చిన ... 11


★ ఉ. ఇట్టి మహానుభావులకు హింస యొనర్చి దురంత దోషముల్
గట్టికొనంగఁజాల, మఱి కల్గవె మాంసము లొండుచోట, నీ
పుట్టువునందు నన్ను మును పుట్టఁగఁ జేసినయట్టి దైవ మీ
పట్టునఁ బూరి మేపెడినె! ప్రాణములింతనె పోవుచున్నవే! 12

★ మ. అని యా ధేనువుఁజూచి – నీ విమల సత్య ప్రౌఢికిన్ మెచ్చు వ
చ్చె, నినుం జంపఁగఁ జాల, నీదు తలగాచెన్ ధర్మ మీ ప్రొద్దు, పొ
మ్ము నిజావాసము చేర, నీ సఖులు సమ్మోదంబునుం బొంద నీ
తనయుం దత్యనురాగముం బొరయఁ జిత్తప్రీతిమై నొందఁగన్ 13

వ. అనిన నప్పులికి న మ్మొదవ విట్లనియె – 14

★ క. 'మెత్తని మనసే నాయది
యొత్తి యిటులు చూడనేల? యో పుణ్యుడ! నే'
నిత్తనువు నీకు మును వా
గ్దత్తము చేసినది కాదె! కథ లేమిటికిన్. 15

వ. కావున పగలించి యుపవాసభారం బంతయుఁ
బోవునట్లు మద్రక్తమాంసములతో సక్తమ్ము సేసి
నాకుఁ బుణ్యమ్ము ప్రసాదింపుము. 16



© SCERT not to be republished

★ క. అని గంగడోలు బిగియఁగఁ
దన మెడ యెత్తుకొని కపిల దగ్గఱఁ జనుదెం
చినఁ జూచి పుండరీకము
వెనువెనుకకె పోవు గాని విఱువదు దానిన్. 17

సీ. 'కుదువంగ ర ' మ్మని తొడరి చుట్టముఁ బిల్వ
నాఁకలి గా దొల్ల ననుచుఁ బెనఁగు
నతఁడును బోలె నాతతశోభనాంగియై
తనరు నా ధేనురత్నంబు దన్ను
భక్షింపు మని పట్టుపఱుప, సద్యోజ్ఞాన
శాలియై పరగు శార్దూలవిభుఁడు
దా నొల్ల నని పల్కఁ దమలోన నొక కొంత
దడవు ముహుర్భాషితంబు లిట్లు

★ ఆ. జరుగుచుండ గోవుసత్యవాక్శుద్ధికిఁ,
బులి కృపాసమగ్రబుద్ధికిని బ్ర
సన్ను లైరి సురలు ; సాధువాదము లుల్ల
సిల్లె గగనవీథి నెల్లయెడల. 18



## కవి పరిచయం

| | | |
|---|---|---|
| కవిపేరు | : | అనంతామాత్యుడు |
| కాలం | : | 15వ శతాబ్దం |
| నివాసం | : | శ్రీకాకుళక్షేత్ర సమీపంలోని పెనుమకూరు. |
| రచనలు | : | భోజరాజీయం, ఛందోదర్పణం, రసాభరణం |

**భావాలు:**

1. అయ్యా! నా తొలి సంతానంగా కలిగిన ముద్దుల కుమారుని వయసు ఏడెనిమిది రోజులు మాత్రమే. వానికింకా గడ్డిమేయడం కూడా రాదు. వానికి కడుపునిండా పాలిచ్చి వెంటనే వస్తాను. దయతో, నేను పోయి రావడానికి అనుమతి ఇచ్చి పుణ్యం గట్టుకో.

2. ఓ పులివంశ శ్రేష్ఠుడా! ముంతెడు పాలతో నా కుమారునికి తృప్తికల్గుతుంది. నా మాంసమంతా తింటేగాని నీ ఆకలిమంట చల్లారదు. అయినా నిజంగా దేనికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలో నీకు మాత్రం తెలియదా? నాకు అనుమతినియ్యి. తొందరగా వెళ్ళి వస్తాను.

3. అనగానే పులి అపహాస్యంచేసి, 'ఓ గోవా! ఇదేమిటి? ఇట్లా మాట్లాడుతున్నావు? నన్ను అమాయికుణ్ణి చేసి, నీ కొడుకుదగ్గరికి వెళ్ళి వస్తానంటున్నావు. ఇది సమంజసమేనా? చెప్పేవాడు చెప్పినా, వినేవాడికి వివేకం ఉండవద్దా? ఇదంతా ఎందుకు?' అన్నది.

4. కఠినమైన మాటలు మాట్లాడి పెద్దలకు బాధ కలిగించేవాడు; తండ్రికి, తల్లికి ఎదురు మాట్లాడేవాడు; ఆకలితో గట్లవెంబడి గడ్డిని మేస్తున్న పశువును వెళ్ళగొట్టేవాడు ఏ నరకాల్లో పడతారో, తిరిగి నీ దగ్గరికి రాకుంటే, నేను ఆ నరకాల్లోనే పడతాను.

5. అని ఆవు పలికిన శపథాలు విన్న పులి, "నువ్వు ధర్మం తెలిసినదానివి. నీకెవ్వరూ సాటి లేరు. నేను నిన్ను నమ్మాను. నీవు వెళ్ళిరా," అని అంది. ఆవు చక్కని బుద్ధితో–

6. పులికి ప్రదక్షిణం చేసి, తన బిడ్డకు సంబంధించిన ఆలోచనలు, మాటలు కనులముందు కనిపించగా గంభీరమైన నడకతో తన బిడ్డకు పాలివ్వటానికి తన పొదుగును చేపేటట్లు చేసుకొని వీధుల్లో ఉన్న బాలురు పక్కకు తొలగేటట్లుగా వేగంగా వెళ్తూ, తన నివాసస్థలానికి వెళ్ళింది.

7. కొడుకు పాలు తాగుతున్నంత సేపూ, ఒక్క అడుగు కూడా కదల్చకుండా, తన ఆలోచనంతా బిడ్డపైనే ఉంచి, తనమీద ఈగ వాలినా కూడా కదలకుండా, శిలాప్రతిమలా ఆవు నిలిచిఉంది.

8. ఆ సమయంలో –

9. "నిన్ను కన్నాను. నీకు, నాకు మధ్య ఉన్న ఋణానుబంధంచేత ఇన్ని రోజులు పాలు ఇచ్చాను. ఇక నువ్వు నన్ను ఎప్పుడూ తలవవద్దు. నీ మనస్సులో ఇకమీద అమ్మ అనే భావాన్ని రానీయకు." (అమ్మను తలచుకోకు)

10. "అసత్యపు మాటలు మాట్లాడకు. అక్కరకు రానివారితో కలసి ఉండకు. ఇతరులెవరైనా నీకు కీడు కలిగించే మాటలు మాట్లాడితే భయపడకు. వినీ విననట్లుగా ఉండి ఎదురు జవాబు చెప్పకుండా అక్కడినుంచి వెళ్ళిపో."

11. అని బుద్ధులు చెప్పి, తనివితీరా పాలుతాగిన కొడుకును చూసి, జరిగిన సంగతి అంతా చెప్పింది ఆవు. అది విని పెద్దగా ఏడుస్తున్న కొడుకును చివరికి ఓదార్చి, తగిన బుద్ధి చెప్పి, ఆవు ఆ పులి ఉన్న వనానికి తిరిగి వచ్చింది... అప్పుడు...

12. "ఇటువంటి మహాత్ములను హింసించి, అంతంలేని పాపం మూటగట్టుకోలేను. కావాలంటే నాకు మాంసం ఎక్కడైనా దొరుకుతుంది. ఈ పులిజాతిలో నన్ను పుట్టించిన ఆ దైవం నాకు గడ్డిని ఎందుకు పెడతాడు? ఇంత మాత్రానికే ప్రాణాలు పోతాయా ఏం?" అని అన్నది పులి.

13. పులి ఆ ఆవును చూసి, "నీది మంచి మనసు. అన్న మాట నిలబెట్టుకున్నందుకు నిన్ను మెచ్చుకుంటున్నాను. నిన్ను చంపలేను. ఇప్పుడు నీ ధర్మమే నిన్ను కాపాడింది. నీ ఇంటికి వెళ్ళిపో! నీ వాళ్ళందరూ సంతోషిస్తారు."

14. అన్న ఆ పులితో ఆవు ఇలా అన్నది –

15. "ఈ కథలన్నీ ఎందుకు? నా మనసు అసలే మెత్తనిది. దాన్నింకా పరీక్షించాలనుకోకు. ఓ పుణ్యాత్ముడా! నే నీ శరీరాన్ని నీకు ఇస్తానని వాగ్దానం చేశాను కదా...

16. "కాబట్టి నన్ను చీల్చి నీ ఉపవాస భారమంతా పోయేటట్లు నా రక్తమాంసాలు ఆరగించి నాకు పుణ్యం ప్రసాదించు,"

17. అని చెప్పి, గంగడోలు బిగించి తన మెడ ఎత్తుకొని పులి దగ్గరకు వెళ్ళగా, ఆ పులి వెనుక వెనుకకే వెళ్తూన్నది కాని ఆవును చంపడానికి ముందుకు రాలేదు.

18. తినరా! అని చుట్టం పిలిచినట్లు పిలవగా, శుభాంగాలున్న ఆ ఆవు తనను తినమని పట్టుపట్టగా ఆవు గొప్పతనాన్ని తెలుసుకొన్న ఆ పులి, 'ఆకలిగా లేదు, వద్దు అంటూ పెనగులాడేవానిలా, నేను నిన్ను తిననన్నది, చాలాసార్లు ఆవు, పులి రెండూ కొంతసేపు వాదులాడగా, ఆవు సత్యవాక్ శుద్ధికి, పులి కరుణరస బుద్ధికి దేవతలందరూ ప్రసన్నులైనారు.' దేవతల పొగడ్తలు ఆకాశంనిండా వ్యాపించాయి.



## ఇవి చేయండి




### I. వినడం-మాట్లాడడం



1. "ఆడిన మాట" అనే పాఠంపేరు విన్నప్పుడు మీకు ఏ ఏ ఆలోచనలు వచ్చాయి.
2. "ఆవు – పులి" కథను ఇంతకు ముందెప్పుడైనా విన్నారా? వింటే ఆ కథకూ పద్యాలలో విన్న ఈ కథకూ మధ్య తేడాలేమిటి? ఏ కథ నచ్చింది? ఎందుకు?
3. పాఠంలో ఆవు మాట్లాడిన విషయాన్నీ పద్యాలనూ రాగయుక్తంగా పాడండి. వాటి భావం చెప్పండి.
4. అట్లాగే పులి మాట్లాడిన విషయాలున్న పద్యాలను రాగంతో పాడండి. వాటి భావం చెప్పండి.
5. కిందివాటిలో ఏదైనా ఒకదాన్ని సమర్థిస్తూ సరైన కారణాలతో మాట్లాడండి.
   (అ) ఆడిన మాట తప్పని ఆవు చాలా గొప్పది ఎందుకంటే ..............................
   (ఆ) స్వభావరీత్యా పులి క్రూరమైన జంతువు. అయినా ఇచ్చిన మాట ప్రకారం వచ్చిన ఆవును చూసి మారిన పులి ఇంకా గొప్పది. ఎందుకంటే ............................
   (ఇ) ఆడిన మాట ప్రకారం వచ్చిన ఆవు, మారిన పులి రెండూ గొప్పవే. ఎందుకంటే .....................

### II. చదవడం - రాయడం



**1. పాఠం చదవండి. కింది భావాలున్న పద్యాలు ఏవో గుర్తించండి. వాటి కింద గీత గీయండి.**
   (అ) ఆవు పులిని ఇంటికి వెళ్ళివస్తానని వేడుకున్న పద్యాలు.
   (ఆ) ఆవు శపథాలు పలికిన పద్యాలు.
   (ఇ) ఆవు తన చిన్ని కుమారునికి బుద్ధులు చెప్పిన పద్యం.
   (ఈ) తల్లి ప్రేమను చూపిన పద్యం.

**2. కింది మాటలు ఎవరు ఎవరితో అన్నారు? పాఠం ఆధారంగా కింది మాటలకు పద్య పాదాలు రాయండి.**
   (అ) చెప్పేవారు చెప్పినా, వినేవారికి వివేకముండాలి.
   (ఆ) నా మనసు అసలే మెత్తనిది. దాన్నింకా పరీక్షించాలనుకోకు.
   (ఇ) నీవు ధర్మం తెలిసినదానివి. నీకెవ్వరూ సాటి లేరు.
   (ఈ) నిన్ను కన్నందుకు ఋణవశాన ఇన్ని రోజులు సాకి పాలు ఇచ్చాను.
   (ఉ) ఇంత మాత్రానికే నా ప్రాణాలు పోతాయా?

**3. కింది పద్యపాదాలకు మీ సొంతమాటల్లో భావం రాయండి.**
   (అ) మునుమును బుట్టె నాకు నొక ముద్దులపట్టి
   (ఆ) యిదేమి, గోవ! యిట్లనియెదు, నన్ను బేల్పఱచి యాత్మజుఁడున్నెడ కేగి సత్వరంబునఁ జనుదెంతు నంటి,
   (ఇ) నీవెన్నఁడు నన్నుఁ దలంపకుమన్న!
   (ఈ) ఆడకు మసత్యభాషలు కూడకు గొఱగానివాని
   (ఉ) గోవు సత్యవాక్శుద్ధికిఁ బులి కృపాసమగ్రబుద్ధికిని బ్రసన్ను లైరి సురలు

©SCERT not to be republished


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

4. **పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

(అ) పులిని ఆవు ఏమని వేడుకొన్నది? ఎందుకు?

(ఆ) ఆవు మాటలు విన్న పులి ఏమన్నది? ఏం చేసింది?

(ఇ) ఆవు తన కొడుకుతో ఏమన్నది?

(ఈ) ఆవు తన కొడుకుకు ఏమని బుద్ధులు చెప్పింది?

(ఉ) తిరిగి వచ్చిన ఆవును చూసి పులి ఏమన్నది?

(ఊ) తినడానికి నిరాకరించిన పులితో ఆవు ఏమన్నది?

## III. స్వీయరచన



1. **ఈ కింది ప్రశ్నలకు ఆలోచించి ఐదారు వాక్యాలలో జవాబులు రాయండి.**

(అ) ఆకలిగొన్న పులి తనను తినడానికి వచ్చినా కూడా ఆవు పులిని "వ్యాఘ్రకుల భూషణ!" అని అన్నది కదా! దీన్ని బట్టి ఆవు మాట్లాడే తీరు ఎలా ఉన్నదని భావిస్తున్నారు?

(ఆ) ఆకలితో ఉన్న పులిని ఆవు తన ఇంటికి వెళ్ళి రావడానికి ఒప్పించింది కదా! పులి ఆవును నమ్మడానికి గల కారణాలు ఏమిటి?

(ఇ) ఆవు తన బిడ్డకు పాలిస్తూ, నిన్ను కన్నందుకు ఇన్ని రోజులు ఋణవశాన పాలు ఇచ్చాను. అని అన్నది కదా! ఈ మాటలకు అర్థమేమిటి?

(ఈ) ఆవు తాను తిరిగి అడవికి వెళ్ళేముందు అబద్ధమాడకు, పనికిరానివాళ్ళతో తిరగకు, అని బుద్ధులు చెప్పింది కదా! ఆవు తన బిడ్డకు ఇంకా ఏమేమి బుద్ధులు చెప్పి ఉండవచ్చు?

(ఉ) ఇతరులు ఎవరైనా కీడును కలిగించే మాటలు మాట్లాడితే భయపడకు. వినీ విననట్లు ఉండి వెళ్ళమని ఆవు తన కొడుకుతో చెప్పింది కదా! ఇలా అనడానికి గల కారణాలు ఏమై ఉంటాయి?

(ఊ) ఆవుతో పులి, "ఈ రోజు నీ ధర్మమే నిన్ను కాపాడింది" అని అన్నది కదా! దీన్ని వివరించండి.

(ఋ) 'ఇటువంటి మహాత్ములను హింసించి, పాపం మూటగట్టుకోలే నని పులి ఎందుకు అన్నది? ఆవు తన కొడుకుతో కొరగానివానితో కలిసి ఉండకు' అని అన్నది కదా! కొరగానివాడంటే ఎవరని అర్థం?

(ౠ) "ఈ కథలన్నీ ఎందుకు?" అని ఆవు అన్నది కదా! ఈ మాటలనే ఇప్పుడు కూడా వాడుతుంటారు. ఏ ఏ సందర్భంలో వాడుతుంటారు?

2. **వ్యాసరూప సమాధాన ప్రశ్నలు:**

**ఈ కింది ప్రశ్నలకు పదేసి వాక్యాలలో జవాబులు రాయండి.**

(అ) సాధారణంగా పులి స్వభావానికి, కథలోని పులి స్వభావానికి తేడా ఏమిటి?

(ఆ) "ఆవు" స్వభావం, గుణగణాల గురించి రాయండి.

(ఇ) కథలో ఆవు గొప్పదనాన్ని తెలిపే సంఘటన ఏది? అట్లాగే పులి గొప్పదనాన్ని తెలిపే సన్నివేశం ఏది?

(ఈ) ఈ కథ ద్వారా అనంతామాత్యుడు (కవి) ఏమి చెప్పాలనుకున్నాడు?

© SCERT not to be republished

## IV. పదజాలం

1. కింది పదాలకు అర్థాలు రాసి, సొంత వాక్యాలను రాయండి.

   అ) కడుపార  ఆ) సుకృతం  ఇ) బడబాగ్ని  ఈ) అపహాస్యం

   ఉ) మెత్తని మనసు  ఊ) ప్రసన్నులైరి  ఎ) గగనవీథి  ఏ) దుర్గతి

2. పాఠంలో పులి, ఆవుకు చెందిన ఏ ఏ పర్యాయపదాలు ఉన్నాయో రాయండి.

   పులి: .................. .................. ..................

   ఆవు: .................. .................. ..................

3. కింది పదాలకు వ్యతిరేక పదాలు రాయండి. అవి వ్యతిరేక పదాలుగా ఎలా మారాయో చెప్పండి. పదానికి, దాని వ్యతిరేకార్థాన్ని ఉపయోగించి సొంతవాక్యాలు రాయండి.

   సత్యం × న్యాయం × హింస ×

   ధర్మం × వివేకం × సంతృప్తి ×

4. **పాఠం ఆధారంగా సరైన పదాలను రాయండి.**

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| అ) | గారాబంతో, ప్రేమగా పెంచుకొనే బిడ్డ | ము | | | | ట్టి | |
| ఆ) | అబద్ధాలు ఆడడం | అ | | | భా | | లు |
| ఇ) | హేళనచేయడం | అ | | | స్యం | | |
| ఈ) | గొప్పవారని అర్థం | మ | | ను | | | లు |
| ఉ) | ఆహారం తీసుకోకుండా ఉండడం | ఉ | | వా | | | |
| ఊ) | పులిని ఇలా కూడా అంటారు | పుం | | | | ము | |
| ఎ) | ఆవుమెడకింద ఉండే మెత్తని తోలు | గం | | | లు | | |
| ఐ) | దేవుని చుట్టూ చేసేవి | ప్ర | | లు | | | |

5. **"ఆవు - పులి" కథలోని భావాలను సరైన పదాలతో పూరించండి.**

   అ) అనగనగా ఒక ................ ఉండేది. అది ఒక రోజు ............... వెళ్ళింది. దీన్ని ఒక ..............చూసింది. ఆ వ్యాఘ్రం చాలా .........................తో నకనకలాడుతున్నది. తన ఉదరాగ్నిని తీర్చుకోడానికి ఆవును తినాలనుకున్నది. అప్పుడు ఆ ధేనువు పులిని ............ . తాను ఇంటికి వెళ్ళి తన ............ కు పాలిచ్చి వస్తానని అన్నది. కాని ఆ పుండరీకం గోవు మాటలను .............. . అప్పుడు ఆ గోమాత ........... చేసింది. అది విన్న పులి ................ను నమ్మి ఇంటికి వెళ్ళిరమ్మన్నది. ఆవు తన నివాసానికి వెళ్ళి ............. పాలు ఇచ్చింది. తన కుమారునికి .................. చెప్పి తిరిగి వచ్చింది. ................. తప్పని ఆవును చూసి పులి నీవంటి .................... తింటే నాకు .................. వస్తుంది. నీవు మీ ఇంటికి తిరిగి వెళ్ళు అన్నది. ఇది చూసి ..................... ప్రసన్నులయ్యారు.

© SCERT not to be republished

## V. సృజనాత్మకత



1. ఆవు – పులి వంటి స్వభావమున్న మనుషులు కూడా మన సమాజంలో ఉంటారు కదా! వీరి స్వభావం ఎలా ఉంటుంది? ఊహించి రాయండి.
2. "ఆవు – పులి" పాత్రల కోసం మాస్కులు తయారుచేయండి. సంభాషణలు రాయండి. నాటకీకరణ చేయండి.
3. "ఆవు – పులి" రెండింటినీ ఒక కుందేలు చూసింది. ఆ కుందేలు వీటిని చూసి గొప్పగా గౌరవభావంతో పొగిడింది. ఆ కుందేలు ఆవును ఏమని పొగిడి ఉంటుంది? అట్లాగే పులిని ఏమని పొగిడి ఉంటుంది? ఊహించి రాయండి.

## VI. ప్రశంస



1. ఆవు తన కొడుక్కు మంచి బుద్ధులు చెప్పింది కదా! అట్లాగే పిల్లలకు తల్లి చెప్పే బుద్ధులు ఏవి? ఉపాధ్యాయుడు చెప్పే మంచి బుద్ధులేవో రాయండి.
2. ఈ కిందివాటిలో మీరు వేటిని ఆచరించాలనుకుంటున్నారు? వాటిని గుర్తించండి. ఒక నెల తరవాత మీరు అనుకున్నవాటిని ఆచరించగలిగారేమో మిమ్మల్ని మీరు పరీక్షించుకోండి.

| ఆచరించాల్సినవి | ఆచరించాలని అనుకొన్నవి | నెల తరవాత |
|---|---|---|
| ఆడిన మాట తప్పకపోవడం | | |
| అబద్ధం ఆడకుండా ఉండడం | | |
| సమయపాలన పాటించడం | | |
| ఎవరైనా మనను సహాయం కోరితే సహాయం చేయడం | | |
| భయపడకుండా ఉండడం | | |
| ఇంకేమైనా | | |

© SCERT not to be republished

## VII. ప్రాజెక్టు పని



1. "ఆడిన మాట తప్పరాదు!" "సత్యవాక్కు"..... ఇలాంటి నీతికథలను మరికొన్నింటిని సేకరించండి. వాటిని రాసి ప్రదర్శించండి.
2. ఈ పాఠ్యపుస్తకంలోని పాఠాలు ఏ ఏ కవులు / ఏ ఏ రచయితలు రాసినవి? వాటి వివరాలు చార్టుమీద రాసి ప్రదర్శించండి.

| కవిపేరు | ఏ కాలంవారు | వారు రాసిన గ్రంథాలు | వారి ఇతర వివరాలు |
|---|---|---|---|
| | | | |

## VIII. భాషగురించి తెలుసుకుందాం



మీరు చదువుకొనే పద్యాలు, గేయాలు, పాటలు ఒక పద్ధతిలో రాగంతో పాడుకోవడానికి వీలుగా ఉంటాయి కదూ! అలా ఎందుకుంటాయంటే వాటిని కొన్ని నియమాలకు లోబడి రాస్తారు. ప్రతి నియమానికి కూడా కొన్ని గుర్తులు ఉంటాయి.

**1. కింది అక్షరాలను పలకండి.**

1) అ, ఇ, ఉ, ఋ, ఎ, ఒ

క, చి, టె, తు, పృ, శె, జొ

ఘు, ఝు, ఢ, ధ, భ, స, హ

- ఇలాంటి అక్షరాలను ఒక్కోటి పలకటానికి ఎంత సమయం పడుతున్నది?

2) ఆ, ఈ, ఊ, ఏ, ఐ, ఓ, ఔ, అం

కా, చీ, టూ, తృా, పే, శై, జో

గౌ, జం, డం, దా

- ఇలాంటివాటిలో ఒక్కో అక్షరాన్ని పలకటానికి ఎంత సమయం పడుతున్నది? గమనించారా!

1.లో సూచించిన అక్షరాలు పలకడానికి 2.లో సూచించిన అక్షరాలు పలకడానికి పట్టే సమయంలో కొంత తేడా కనబడుతున్నది కదూ! కనురెప్పపాటు కాలంలో లేదా చిటికె వేసే కాలంలో ఉచ్చరించే అక్షరాలు 1. లోవి.

అంతకంటె ఎక్కువ సమయం తీసుకునే అక్షరాలు 2లోవి.

- మరి వీటిని గుర్తు పట్టేందుకు మనవారు గుర్తులను ఏర్పాటు చేశారు. ఆ గుర్తులేమిటో చూడండి. రెప్పపాటు కాలంలో పలికే అక్షరాలు – అంటే మనం హ్రస్వాక్షరాలుగా పిలుచుకొనే అక్షరాలను – "I" గుర్తుతో సూచిస్తాం. ఈ గుర్తును లఘువు అని అంటాం.

"I" = లఘువు.

- లఘువు సమయం కంటే ఉచ్చారణకు ఎక్కువ సమయం అవసరమయ్యే అక్షరాలను "U" గుర్తుతో సూచిస్తాం. ఈ గుర్తును గురువు అంటాం.

"U" = గురువు.

లఘువు అంకెల్లోని I ని, గురువు ఆంగ్ల అక్షరాల్లోని U ను పోలి ఉంటాయి.

ఈ పదాలను చూడండి. వీటిలోని అక్షరాలను ఎలా సూచించారో గుర్తించండి.

| | | | | |
|---|---|---|---|---|
| I I I | I I I | I I I | I I I | I I I I |
| కడప; | పలక; | పిరికి; | ముసురు; | మరిమరి |
| U I | U I U | U I U I | U U U | |
| గాలి; | సాగరం; | వేడుకోలు; | ఔనేమో | |



అయితే "I, U" లను గుర్తించటానికి మరిన్ని విషయాల్ని గుర్తుంచుకోవాలి.

© SCERT not to be republished

**కింది పదాలను చదవండి.**

తర్కం ; మెట్ట ; చూడగన్ ; నష్టం వీటిలో

"ర్క" – ఇది సంయుక్తాక్షరం కదూ!

ట్ట – ఇది ద్విత్వాక్షరం కదూ!

గన్ – ఇందులో "గ"న్ అనే పొల్లుతో కూడి ఉంది కదూ!

మరి ఇలాంటప్పుడు లఘుగురువులను ఎలా గుర్తించవచ్చునో చూడండి.

| U I I I | U U U |
|---|---|
| మర్కటము ; | సవ్యంగా ; |

వీటిలో ఏం గమనించారు? సంయుక్తాక్షరాల ముందున్న అక్షరాన్ని గురువుగా గుర్తించాం కదూ!

- అంటే సంయుక్తాక్షరం ముందు అక్షరాన్ని గురువుగా గుర్తించాలి.

ఈ కింది పదాలలో గురులఘువులను ఎలా గుర్తిస్తామో చూడండి.

| U I | U I I | U U I | U U I |
|---|---|---|---|
| అమ్మ ; | వెచ్చని ; | అక్కయ్య ; | చొక్కాట |

వీటిలో ద్విత్వాక్షరం ముందు అక్షరాన్ని గురువుగా గుర్తించాం కదూ!

- అంటే సంయుక్తాక్షరం, ద్విత్వాక్షరాల విషయంలో ఒకే విధానాన్ని పాటిస్తాం.

ఇక –

| I I I U | U I I U | U U U I |
|---|---|---|
| చదువుచున్ ; | కారకముల్ ; | సమ్యక్‌దృష్టి |

- వీటిలో పొల్లు అక్షరానికి ముందున్న అక్షరాలను గురువుగా గుర్తించాం కదూ!

ఇలా లఘుగురువులను గుర్తించడం అనేది పద్యాలు రాయటానికి ఉపయోగపడే నియమాల్లో మొదటిమెట్టు. మిగిలిన విషయాలను పై తరగతుల్లో నేర్చుకొంటారు.

**అభ్యాసాలు :** కింది పదాలకు లఘువు, గురువులను గుర్తించండి.

| | | | |
|---|---|---|---|
| గమ్మెదు; | మునుమును ; | మాంసమ్ము ; | బేల్పులచి ; |
| పుట్టదె ; | తక్కినన్ ; | వాగ్దత్తము ; | పుండరీకము ; |
| మనమున ; | ఉల్లసిల్లగన్ ; | యింత యేటికిన్ ; | వచ్చెదన్ ; |

## అలంకారాలు

కింది తరగతిలో పోలిక చెప్పడంలో అలంకారం ఉన్నదని. అది ఉపమాలంకారం అని తెలుసుకున్నారు కదా!

ఇప్పుడు ఉపమాలంకారం లక్షణాన్ని తెలుసుకోండి.

సోముడు భీముడిలాగ (వలె) బలవంతుడు.

ఈ వాక్యంలో సోముణ్ణి భీముడితో పోల్చారు. ఇలా చెప్పినప్పుడు వాక్యంలో ఉండే పదాలను కొన్ని ప్రత్యేకమైన పేర్లతో పిలుస్తాం.

సోముడు – ఉపమేయం

(అంటే ఎవరిని గురించి చెప్తున్నామో ఆ పదం)

భీముడు – ఉపమానం

(ఎవరితో పోలుస్తున్నామో ఆ పదం)

© SCERT not to be republished

బలవంతుడు – సమాన ధర్మం – పోల్చడానికి వీలయిన సమానగుణం
(ఉపమేయ ఉపమానాలలో ఉన్న ఒకే విధమైన ధర్మం)
లాగ (వలె) – ఉపమావాచకం
(ఉపమానాన్ని సమానధర్మంతో కలపడానికి వాడే పదం)
ఇక్కడ ఉపమాన, ఉపమేయాలకు చక్కని సామ్యం – అంటే పోలిక – చెప్పటం జరిగింది. ఇలా చెప్పటాన్ని ఉపమాలంకారం అంటాం.

**లక్షణం :** ఉపమానోపమేయాలకు చక్కని పోలిక చెప్పడమే ఉపమాలంకారం.

**ఉత్ప్రేక్షాలంకారం**

ఆరో తరగతిలో, ఊహించి చెప్పడంలో ఒక అలంకారం ఉందని తెలుసుకున్నారు కదా! అది ఉత్ప్రేక్షాలంకారం. ఇప్పుడు దీని లక్షణాన్ని తెలుసుకుందాం.
'ఆ ఏనుగు నడిచే కొండా! అన్నట్టు ఉంది.'
ఈ వాక్యాన్ని గమనించండి. ఇందులో కూడా పోలిక కనబడుతున్నదికదూ? ఆ పోలిక అనేది ఊహించి చెప్పినది.
వాక్యంలో
ఉపమేయం – ఏనుగు
ఉపమానం – నడిచే కొండ
అంటే ఏనుగును కొండలా ఊహిస్తున్నా మన్నమాట. దీన్నిబట్టి లక్షణాన్ని కిందివిధంగా చెప్పవచ్చు:

**లక్షణం:** ఉపమేయాన్ని మరొకదానిలా ఊహించి చెప్పడం ఉత్ప్రేక్ష.

**అభ్యాసాలు:** కింది వాక్యాల్లోని అలంకారాలను గుర్తించండి.

1. గోపి సూర్యుడిలాగ ప్రకాశిస్తున్నాడు.
2. మండే ఎండ నిప్పుల కొలిమా! అన్నట్లు ఉంది.

©SCERT not to be republished



## నేనివి చేయగలనా?



| | | |
|---|---|---|
| 1. | పాఠంలోని పద్యాలను రాగంతో, భావంతో చదవగలను. | ఔను / కాదు. |
| 2. | పద్య భావాలను సొంత మాటల్లో చెప్పగలను. | ఔను / కాదు. |
| 3. | పద్యాలను చూడకుండా పాదభంగం లేకుండా, తప్పులు లేకుండా రాయగలను. | ఔను / కాదు. |
| 4. | పాఠం ఆధారంగా కథను, కథలోని ఆవు, పులి స్వభావాలను గురించి సొంతమాటల్లో రాయగలను. | ఔను / కాదు. |
| 5. | పాఠంలోని పదజాలాన్ని వినియోగించి వాక్యాలను రాయగలను. | ఔను / కాదు. |
| 6. | పాఠం ఆధారంగా మాస్కులు తయారు చేసుకొని నాటకీకరణ చేయగలను. | ఔను / కాదు. |

ఒక మంచి తల్లి వందమంది ఉపాధ్యాయులతో సమానం. – రామకృష్ణ పరమహంస

**నాలుగో యూనిట్**


# 18. అసామాన్యులు

**(ఉపవాచకం)**

ప్రతి రోజూ మనం ఎన్నో చూస్తూంటాం. వాటిలో కొన్నింటిని పట్టించుకోం. మరికొన్నింటిని గురించి ఆలోచించం. కానీ కొద్దిగా దృష్టి పెడితే కొన్ని విషయాలలో ఆశ్చర్యం వేస్తుంది. మర్రివిత్తనాన్ని చూశారా? ఎంత చిన్నగా ఉంటుంది! పరిశీలించి చూస్తే తప్ప గుర్తుపట్టలేనంతగా ఉంటుంది. కాని దీనిలో నుంచే పెద్ద మర్రిచెట్టు వస్తుంది. అంటే అంత చిన్న గింజలో ఇంత గొప్ప శక్తి ఉందన్నమాట.ఇలాగే మన మధ్యనే ఉన్నవాళ్ళలో కూడా ఏదో గొప్పతనముంటుంది. సామాన్యులుగా కనిపించేవాళ్ళలో కూడా అసామాన్యమైన ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని గుర్తించాలి. గౌరవించాలి.

“ఆకాశంలో హాయిగా ఎగరగలిగే విమానాన్ని ఎవరు కనుక్కొన్నారు? ప్రపంచంలోని విషయాలను క్షణాలలో ప్రత్యక్షంగా మనకు చూపించే టి.వి. ని కనిపెట్టిందెవరు? సమాచార వ్యవస్థలో సాంకేతిక విప్లవాన్ని తెచ్చిన సెల్‌ఫోన్ రూపశిల్పి ఎవరు?” అని తరచూ ప్రశ్నిస్తుంటాం. కాని ఈ సుఖాలు, విలాసాలకన్నా ముందు జీవిత అవసరాలను తీర్చుకొనే మార్గం చూపిన మహాపురుషుల గురించి ఎప్పుడైనా దృష్టి సారించామా? వాళ్ళ కృషిని, త్యాగాన్ని ఎన్నడైనా తలచుకొంటున్నామా?

“అన్నమయములైన వన్ని జీవమ్ములు - కూడులేక జీవకోటి లేదు.” అన్నారు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామివారు. ఆహారం లేకుంటే ఏ ప్రాణీ బతకదు. ఇంత ప్రాధాన్యమున్న ఆహార విషయాలను గురించి మనకు మొదట తెలిపినవారు ఆదివాసులు. అడవులే అమ్మ ఒడిగా, కొండకోనలే తోడునీడగా జీవిస్తారు.వాళ్ళు రేయింబవళ్ళు ప్రకృతితోనే కలిసి ఉన్నారు. ప్రకృతిని బాగా పరిశీలిస్తారు. ఏవి తినాలో, ఏవి తినగూడదో చెప్పారు. అలా చెప్పడానికి వాళ్ళు ఎన్నో ప్రయోగాలు చేశారు. వాటిని రుచి చూశారు.



© SCERT not to be republished

ఈ ప్రయోగాలలో కొన్ని సందర్భాలలో కొందరు ప్రాణాలు కూడా వదిలారు. జంతువుల మాంసం తినడానికి ముందు ఆయా జంతువులను పరిశీలించారు. ఆ జంతువుల ఆహారపుటలవాట్లపైన దృష్టి పెట్టారు. అప్పుడు ఇది తినవచ్చు, ఇది తినగూడదని చెప్పారు. వాళ్ళ పరిశీలన, శ్రమ, త్యాగం ఎంత గొప్పవో! కోయలు, గోండులు, చెంచులు మొదలైన గిరిజన జాతులకున్న ప్రకృతి విజ్ఞానం ఎంతో గొప్పది. చెట్లను గురించి వాళ్ళకు తెలిసినంతగా ఎవరికీ తెలియదనడం అతిశయోక్తి కాదు. వాళ్ళు శాస్త్రజ్ఞులే. రోగాల బారిన పడినప్పుడు చెట్లమందులతోటే ఆరోగ్యాన్ని తిరిగి పొందారు. ఈ విషయాలలో గురువులై వారు తరవాతి తరాలకు తోవ చూపారు.

ఆదివాసులే కాదు, పల్లెతల్లి ఒడిలో బతికే జానపదుల జ్ఞానం కూడా తక్కువేమీ కాదు. పల్లెవారి పనితనాన్ని తెలిపేలా, వివరించేలా ఎన్నో పాటలు కూడా ప్రాచుర్యంలో ఉన్నాయి. గ్రామంలోని వివిధ పనులు, వృత్తులు చేసేవారు ఒకరిపై ఒకరు ఎలా ఆధారపడతారో వివరించే పల్లె పాటలు మనకు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. నిత్యం మనం వాడుకొనే ఒక వస్తువు అది కంచం కావచ్చు, మంచం కావచ్చు, టేబుల్ కావచ్చు. వీటిని తయారు చేయాలంటే వడ్రంగి, కమ్మరి, ఇతర పనివారు కృషి చేయాల్సి ఉంటుంది.


ఇలా వృత్తులన్నీ ఒకదానిమీద మరొకటి ఆధారపడి ఉంటాయని గుర్తించండి. అట్లే ఒక్క 'సోల' తయారుకావడానికి వెనక ఎందరు వృత్తిపనివాళ్ళ కష్టం దాగుందో ఆలోచించండి. ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటే తప్ప సమాజం సజావుగా సాగదు. ప్రతి వృత్తీ పవిత్రమైనదే. ప్రతి వృత్తిపనిలోనూ ఎంతో కష్టం,నైపుణ్యం, త్యాగం కలగలిసి ఉంటాయి. కాంతిని చూసి మురిసిపోతాం.కానీ ఆ కాంతినివ్వడానికి కరగిపోయే కొవ్వొత్తిని గురించి ఎప్పుడైనా ఆలోచిస్తున్నామా?



ఎండాకాలం వచ్చిందంటే చాలు కుండలకు, కూజాలకు మహా గిరాకీ. అటికెలు, గురుగులు మన అవసరాలను తీరుస్తున్నాయి. భక్తి జీవితంలో భాగమైనవి ప్రమిదలు. ఇవన్నీ చకచకా ఎలా వచ్చేస్తున్నాయి? కుమ్మరి చక్రంనుంచి – బంకమట్టినుంచే. బంకమట్టి ఊరకే తయారవుతుందా? మెత్తటి మట్టి, బూడిద లేదా రంపపు పొట్టు, సన్న ఇసుకను కలిపి దీన్ని తయారుచేస్తారు. ఈ మూడింటిని కలిపి కాళ్ళతో బాగా తొక్కుతారు. చెమటోడ్చి సిద్ధంచేసిన ఈ బంకమట్టిని బండి చక్రంలాంటి సారెమీద పెడతారు. చక్రం మాత్రం ఊరకే తయారైందా? కమ్మరి, వడ్రంగి వాళ్ళ నైపుణ్యం కలగలిసి ఏర్పడింది. ఇందులో ఎంతో ఇంజనీరింగ్ నైపుణ్యం తొంగి చూస్తుంది. చక్రం తిరగడం కాదు. సమాజగతినే తిప్పేసింది. ఇదొక అద్భుత ఆవిష్కరణ.


చక్రం తిప్పుతూ చక్రంమీద పెట్టిన బంకమట్టిని చేతివేళ్ళ కొనలతో చాకచక్యంగా నొక్కుతారు. అత్యంత ఆశ్చర్యకరంగా, అనుకున్నరూపాలు అమాంతంగా వచ్చేస్తూంటాయి. ఆ చేతుల్లో ఇంద్రజాల విద్య ఉందా? అని అనిపించక మానదు. తయారైన మట్టిపాత్రలను ఆరబెడతారు. తరవాత 'కుమ్మర ఆము' లో పెట్టి బురదమట్టితో కప్పేస్తారు. దీనివల్ల కొలిమిని మండిస్తే అన్ని పాత్రలకూ ఆ వేడి అందుతుంది. పాత్రలన్నీ బాగా కాలి గట్టిగా తయారవుతాయి. మనం ఉపయోగించుకొనే మట్టిపాత్రలవెనక ఇంత తతంగముంది.

నగలంటే ఇష్టంలేనివాళ్ళెవరైనా ఉంటారా? మెడలో హారాలు, చేతులకు కడియాలు, గాజులు, చెవిలో కమ్మలు, ముక్కుపుడక, సిగబిళ్ళ, నడుముకు ఒడ్డాణం, కాళ్ళకు కడియాలు, గజ్జెలు, వేళ్ళకు ఉంగరాలు.... ఇలా ఎన్నెన్నో ఆభరణాలు ఆపాదమస్తకం ధరిస్తారు. ఒకప్పుడు ఏడు వారాల సొమ్ములు ధరించేవారట. ఆధునిక కాలంలో మరెన్నో రకాల వస్తువులు అందుబాటులోకి వచ్చాయి. ఒక్కొక్క ఆభరణాన్ని ఎన్నో రకాలుగా తీర్చిదిద్దుతారు. ముద్దగా ఉన్న బంగారాన్ని ముద్దుగా తీర్చిదిద్దడంలో ఎంత శ్రమ దాగి ఉందో తెలిస్తే ముక్కుమీద వేలువేసుకొంటాం. బంగారం అంత సులభంగా కరగదు. బంగారాన్ని మూసలో పెట్టి బొగ్గుల కొలిమిలో ఉంచి కరిగిస్తారు. నిప్పు రాజేయడానికి, నిప్పులు కణ కణలాడేలా మండడానికి బాగా ఊదాలి. బంగారం పనిచేసే వాళ్ళు (స్వర్ణకారులు) ఇలా ఊది ఊది అనారోగ్యపు బారినపడిన సందర్భాలు ఎన్నో.



బంగారమేకాదు మనం నిత్య జీవితంలో వాడే వెండి వస్తువుల తయారీలో కూడా ఎంతో కళాదృష్టి, నైపుణ్యం కనిపిస్తుంది. బంగారాన్ని, వెండిని వివిధ ఆకృతులుగా తీర్చి దిద్దడంలో గానీ, రత్నాలను పొదగడంలో


©SCERT not to be republished



గానీ సున్నితమైన పనితనం కనిపిస్తుంది. సన్నని వస్తువును తయారుచేసేటప్పుడు వాళ్ళ కళ్ళు తీవ్రమైన ఒత్తిడికి లోనవుతాయి. అయినా మన కళ్లకు ఆనందాన్నిచ్చేలా ఆభరణాలను అందించడానికి శ్రమిస్తున్నారు.

ఇనుముతో నిత్యం సహవాసంచేసే కమ్మరులు తమ శ్రమను, నైపుణ్యాన్ని సమాజంకోసం త్యాగం చేస్తున్నారు. ఇనుముతో వాళ్ళు చేసే నాగటి 'కర్రు' భూమిని దున్నడానికి ఉపయోగపడుతుంది. అలాగే పార, గొడ్డలి, గడ్డపార, కొడవలి, సుత్తి మొదలైనవి వ్యవసాయానికి చాలా అవసరమైన పనిముట్లు. వీటిని బండి చక్రపు (గిర్ర) పట్టాను కూడా వాళ్ళే తయారుచేసారు. ఇదొక గొప్ప ఇంజనీరింగ్ ప్రక్రియ. వీటన్నింటికీ ఉత్పత్తి కేంద్రం కమ్మరి కొలిమి. అది నిప్పులతో కణకణ మండుతూ ఉంటుంది. ఆ సెగను భరిస్తూ ఇనుమును కాల్చి సుత్తితో కావలసిన వస్తువుల రూపాలను తీర్చిదిద్దుతారు. ఇలా చేయడానికి చాలా కష్టపడవలసి ఉంటుంది.

ఇక వడ్రంగుల పనితనాన్ని ఒకసారి చూద్దాం. మనకు ఆహారం కావాలంటే భూమిని దున్నాల్సిందే. అందుకు ప్రధాన సాధనం నాగలి. దీన్ని రూపొందించేవాళ్ళు వడ్రంగులు. ఇదే కాదు గుంటక, గొర్రు వంటి పనిముట్లు కూడా వ్యవసాయంలో కీలకమైనవి. వీటిని తయారుచేయాలంటే ఏ చెట్టు కలప సరిపోతుందో పరిశీలిస్తారు. తాత ముత్తాతల కాలంలో వాళ్ళు ఎంతో పరిశోధించారు. కొయ్యను సరైన రూపాలలోకి తీసుకురావడం వెనక ఎంతో శ్రమ ఉంటుంది. చెట్టు కొట్టాలి, కొయ్యాలి, చెక్కాలి, దువ్వోడ(చిత్రిక)పట్టాలి, తొలికొట్టాలి, అందులో బిగించాలి... ఇలా ఎన్నెన్నో దశలు. వడ్రంగులు సమాజానికి అందించిన మరో సౌకర్యం బండి. ఇది వ్యవసాయానికే కాదు, ప్రయాణానికి కూడా పనికి వస్తుంది. అలాగే మొన్నమొన్నటివరకు ఇండ్లను కట్టె (కలప) తోనే నిర్మించేవారు. దూలాలు, వాసాలు, కిటికీలు, తలుపులు ఇవన్నీ వడ్రంగుల పనితనం మూలంగానే అందంగా, ఆకర్షణీయంగా తయారవుతాయి. మనం వాడుకొనే మంచాలు, కుర్చీలు, బెంచీలు, టేబుళ్ళు, అలమారలు....ఇలాంటివెన్నో వడ్రంగుల చేతుల్లో రూపొందినవే! అందుకే వాళ్ళను 'దారుశిల్పుల'ని అని అంటారు. ఇవన్నీ మనం డబ్బుతో కొనుక్కొంటే వస్తున్నాయని అనుకుంటాం ! అయితే వీటిని తయారు చేసినప్పుడే కదా ఎవరైనా



©SCERT not to be republished

కొనుక్కొనేది. ఇంటిసామగ్రి, వస్తుసామగ్రి, వ్యవసాయ సామగ్రి వంటివి చూస్తున్నప్పుడు వడ్రంగులను తలచుకోడం మన ధర్మం. వాళ్ళ నైపుణ్యాన్నీ గొప్పదనాన్నీ గౌరవించడం మన బాధ్యత.

తెల్లవారినప్పటినుంచి అడుగు బయటకు వేయాలంటే చెప్పుల్లో కాళ్లు పెట్టాల్సిందే. చెప్పుల చరిత్రను చెప్పుకొంటే ఆవేదన, ఆశ్చర్యం కలుగుతాయి. ఏదైనా జంతువు చనిపోతే దాన్ని చూసి దూరంగా వెళతాం. కాని తోలు పనివాళ్ళు ఆ జంతువు చర్మాన్ని ఒడుపుగా ఒలుస్తారు. శుభ్రం చేస్తారు. దానితోనే చెప్పులు తయారు చేస్తారు. ఒక వ్యర్థపదార్థంనుంచి అందరికీ ఉపయోగపడే వస్తువును సృష్టించినవారి తెలివి ఎంతో గొప్పది. అందుకు వాళ్ళు పడే శ్రమ ఎంతో విలువైనది. అసలు దీనికి వెల కట్టగలమా? వీరి ఔదార్యాన్ని చాటుతున్న ఈ పద్యం చదవండి.

**"ముప్పు ఘటించి వీని కులమున్, కలిమిన్ కబళించి దేహమున్**
**పిప్పి యొనర్చు నీ భరతవీరుని పాదము కందకుండగా**
**చెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే**
**దెప్పుడు అప్పువడ్డది సుమీ భరతావని వీని సేవకున్."**

అని గుఱ్ఱం జాషువగారు నొక్కి వక్కాణించారు.

జంతుచర్మాన్ని అనేక రకాలుగా మలచడంలో వీరి ప్రతిభ కనిపిస్తుంది. చర్మంతో 'డప్పు' లాంటి వాద్యాలను తయారుచేశారు. ఇప్పటికీ ఊళ్ళలో ఏదైనా విషయం చాటింపు వేయాలంటే డప్పు కొట్టాల్సిందే. చివరకు మనిషిని కాటికి పంపడానికి కూడా డప్పే ముందుంటుంది. ఒకప్పుడు వ్యవసాయ బావిలోని నీటిని పైకి తోడడానికి పెద్ద బొక్కెనలుండేవి. వాటి తొండాలను కూడా చర్మంతో వీరే తయారుచేసేవారు.



సంఘంలో క్షురకుల సేవలు మరవరానివి. (క్షురమంటే కత్తి, తల వెంట్రుకలను కత్తిరించేవాడు క్షురకుడన్నమాట) ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో వారి భాగస్వామ్యం ఉంది. కత్తి, కత్తెరలతో వారు చూపే పనితనం నాణ్యమైనదే కాదు, సున్నితమైనది కూడా. క్షురకులకు తరతరాలుగా తెలిసిన మరొక విద్య దేశీయమైన వైద్యం. చెట్ల వేళ్ళతో, ఆకులతో, చేపలతో చేసే మందులను గురించికూడా వీళ్ళకు చక్కటి అవగాహన ఉంటుంది. పేను కొరకడం,

©SCERT not to be republished


శరీరానికి గాట్లు పడడం వంటి సందర్భాలలో బయటపడే చిట్కాలు వీరి దగ్గర అనేకంగా ఉంటాయి. తైలంతో శరీరమర్దనం (మాలిష్) చేయడంలో గొప్ప నైపుణ్యంఉంటుంది. ఈ సేవలన్నీ చూడడానికి చిన్నవిగా అనిపించినా ఆరోగ్యకర సమాజానికి అవసరమైనవే.

శరీరాన్ని రక్షించుకోవాలంటే బట్టలు కావాలి. వాటిని బజారుకు వెళ్ళి కొని తెచ్చుకుంటున్నాం. కాని అవి తయారుకావడానికి పరిశ్రమిస్తారు నేతపనివారు. వాళ్ళు బట్టలు నేసే మగ్గాన్ని ఎప్పుడైనా చూశారా? దాని వెనుక ఎంతో సాంకేతిక పరిజ్ఞానం ఉంది. మగ్గంలో వాళ్ళు దారాలను ఏర్పరుచుకున్న తీరు, నేసేటప్పుడు వారు చూపే నైపుణ్యం ఇంతంతనరానివి. ఒకప్పుడు మన దేశంలో నేత పనివారు అగ్గిపెట్టెలో పట్టేటంత చీరను నేసినారంటే ఆశ్చర్యం గలగడం లేదూ? ఇదంతా ఆషామాషీ వ్యవహారం కాదు. పత్తినుంచి దారం తీయడం, రంగులద్దడం, అవసరమైన పద్ధతిలో గుడ్డను తయారుచేయడం... ఇదొక సుదీర్ఘ ప్రక్రియ.

గొర్రెల బొచ్చు కత్తిరించి ఉన్నిదారం వడికి దానితో గొంగడి (కంబళి)ని తయారుచేసే కురుమల శ్రమ ఎందరికో వెచ్చదనాన్ని కలిగిస్తున్నది. మురికి బట్టలను శుభ్రంచేసే రజకుల కాయకష్టం మనకు ఆరోగ్యాన్ని అందిస్తున్నది. శుభాశుభ కార్యక్రమాలు వీరి ప్రమేయం లేకుండా జరగవు.

ఈ వృత్తులవారందరూ చూపిన నైపుణ్యం తరవాతి కాలంలో అద్భుతమైన ఆవిష్కరణలకు దారి తీసింది. వీరి ఆలోచన, నైపుణ్యం ఎందరినో కదిలించింది. వీటిని ఆధారంగా చేసుకొని కొత్తవాటిని కనుక్కోవడానికి ప్రేరణ కలిగించింది.

ఒక్కరోజు ఆహారం లేకుంటే తల్లడిల్లుతాం. పిడికెడు మెతుకుల కోసం పడరాని పాట్లు పడేవాళ్ళెందరో





ఉన్నారు. ఎవరేపని చేసినా కడుపునింపుకోడానికే. మనం తినే అన్నం, కూరగాయలు, పండ్లు వంటివేవీ సులువుగా వచ్చిపడేవికావు. చెమటోడ్చి పనిచేసిన రైతుల కృషి ఫలాలవి. ఎండనక, వాననక, రేయింబగళ్ళనక రెక్కలు ముక్కలు చేసుకొని రైతు శ్రమిస్తేనే మనం హాయిగా తినగలుగుతున్నాం. భారత దేశపు మాజీ ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రిగారు 'జై జవాన్, జై కిసాన్' అన్న నినాదమిచ్చారు. సమాజానికి రైతు చేసే సేవ ఎంత గొప్పదో తెలుపుతున్న ఈ గేయాన్ని చదవండి.

రైతే దేశానికి వెన్నెముక
అత దలిగితే లేదు మనకు అన్నమిక

కోటివిద్యలు అన్ని కూటికొరకన్నారు.
కూడుగోడును బాప రైతన్నలున్నారు.
నడుమొంచి కష్టించి పాడిపంటలు పెంచి
పొట్ట చల్లగుండంగ పోషించు అన్నదాత

తానేమొ పస్తులుండి తిండిపెడుతున్నాడు
సమాజ గమనానికి సాయపడుతున్నాడు
రాత్రనక పగలనక ఆత్రంగ పనిచేస్తూ
సోమరితనమొద్దని చాటిచెప్పే ధీరుడు

ఎండకు ఎండినా వానలో దడిసినా
చలిలో వణకినా సమస్యలతో నలిగినా
సడలని స్థైర్యంతో సస్యములనందిస్తూ
జాతిసేవలో పునీతుడై నిలచిన ॥ రైతే ॥



తెలిసిందిగా, రైతుల త్యాగం, కృషి ఎటువంటివో! ఇలా చూస్తూ పోతే ప్రతి ఒక్క వృత్తిలోనూ ఎంతో కొంత శ్రమ, నైపుణ్యం తొంగిచూస్తాయి. ప్రతి వృత్తీ పవిత్రమైనదే. దేన్నీ చిన్నచూపు చూడాల్సిన పని లేదు. ఎవరి ఇంట్లో శుభకార్యం జరగాల్సి ఉన్నా మంగళ వాద్యాలు , కుండలు, ప్రమిదలు, ఆభరణాలు, వస్త్రాలు మొదలయినవన్నీ కావాలి. అంటే ఇన్ని వృత్తులవారూ సహకరిస్తేనే ఏ కార్యాలైనా జరుగుతాయి. ఇలా అందరూ పరస్పరం సహకరించుకొంటేనే సమాజం నడుస్తుంది. అంతే కానీ 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా ఉంటే సమాజ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇందులో ఎక్కువతక్కువ తేడాలు మన మనస్సుల్లో ఉండగూడదు. శరీరంలో కళ్ళు, చెవి, ముక్కు, కాళ్ళు, చేతులు... వీటిలో ఏవి గొప్ప అంటే? అన్నీ కలసి ఉంటేనే శరీరం. అలాగే అందరూ కలసి ఉంటేనే సమాజం. ఒకప్పుడు గ్రామాలు స్వయంసమృద్ధంగా వెలిగాయి. గ్రామజీవనానికి అవసరమైన వస్తువులను అన్ని వృత్తులవారూ కలిసిమెలిసి తయారుచేసుకొనేవారు. ఒకరి అవసరాలకు మరొకరు చేదోడు వాదోడుగా నిలిచేవారు. కులాలను పక్కకు పెట్టి అక్క, బావ, మామ, అత్త, అన్న అని పిలుచుకొనే ఆత్మీయ సంబంధం వాళ్ళది. మానవత్వాన్ని చాటిన మధురజీవనం వాళ్ళది. కలిసి ఉండడం, ఒకరిమీద ఒకరు ఆధారపడడం, ఒకరికొకరు సహకరించుకోవడం, మన సంస్కృతిలోని గొప్ప విలువలు. వీటిని అలవరుచుకోవడం, పాటించడం, కాపాడుకోవడం మనందరి ధర్మం.

మనిషిని మనిషిగా గౌరవిద్దాం. అతనిలో దాగున్న ప్రతిభను అభినందిద్దాం. ఆ గొప్పదనాన్ని మనం అందుకోవడానికి ప్రయత్నిద్దాం.

"శ్రమ" పునాదిపైనే "అభివృద్ధి" భవనం ఆధారపడి ఉంటుంది. శ్రమించడానికి ఎవరూ సిగ్గుపడగూడదు. సోమరితనంతో శ్రమించకపోతేనే సిగ్గుపడాలి. శ్రమైక జీవన సౌందర్యాన్ని చూడగలగాలి. శ్రమను గౌరవంగా భావించడం నేర్చుకోవాలి. శ్రమ సంస్కృతిలో జీవించడం నేర్చుకోవాలి.



## ఇవి చేయండి



1. 'ఆదివాసులు మనందరికీ మార్గదర్శకులు' దీన్ని వివరించండి.
2. కుమ్మరివారి గొప్పతనాన్ని గురించి వివరించండి.
3. "వడ్రంగివారు నేటి ఆధునిక ఇంజనీర్లు" – దీన్ని సమర్థిస్తూ పది వాక్యాలు రాయండి.
4. "రైతులు మన అన్నదాతలు" – వివరించండి.
5. "దేహానికి అవయవాలు ఎంత ముఖ్యమో, సమాజానికి అన్ని వృత్తులవాళ్ళూ అవసరం." దీన్ని సమర్థిస్తూ వ్యాసం రాయండి.
6. "ఒకరిమీద ఒకరు ఆధారపడడం" అనేది మన సంస్కృతిలో చాలా గొప్పది. ఎందుకు? దీన్ని వివరిస్తూ రాయండి.

కష్టించి పనిచేసి జయం పొందినవాడే విజయవంతమైన తన అనుభవ ఫలాలను ప్రపంచానికి అందించి దాన్ని సుసంపన్నం చేయగలడు. – డా॥ జగదీశ్ చంద్ర బోస్

© SCERT not to be republished

## పదాలు - అర్థాలు

### అ

అంఘ్రి - కాలు
అంచిత - ఒప్పిదమైన
అంతరిక్షం - ఆకాశం
అంపశయ్య - బాణాలతో తయారు చేసిన పడక.
అంభోధి - సముద్రం
అక్షౌహిణి - 21,870 రథాలు, 21,870 ఏనుగులు, 65,160 గుఱ్ఱాలు, 1,09,350 సైనికులు ఉన్న సైన్య విభాగం.
అగ్రిమెంటు - ఒప్పందం
అచ్చర - అప్సరస (దేవలోకపు స్త్రీ)
అడకించు (క్రి) - మోసంచేయు
అతిథి - తిథి మొ॥ కాలనియమం లేకుండా ఇంటికి భోజనానికి వచ్చేవాడు
అతృప్త - తృప్తిలేని
అద్రి - కొండ
అధికం - ఎక్కువ
అద్భుతంగా - చాల చక్కగా
అనంతరం - తరవాత
అనురక్తి - ఇష్టం
అపహాస్యం - ఎగతాళి
అప్సరోజనములు- అప్సరసలు
అపార - అంతులేని
అపార్థం - తప్పుడర్థం, మరో అర్థం
అభినందన - ప్రశంస, పొగడ్త
అభినందించు - పొగడు
అబ్ధి - సముద్రం
అభ్యాగతుడు - పిలుపులేకుండా వచ్చినవాడు (పర్వం, ఉత్సవం మొ॥న సమయాల్లో డబ్బు ఆశించి)
అభ్యున్నతి - అభివృద్ధి, మేలు
అమలుచేయు(క్రి) - ఆచరించడం
అమాంతంగా - ఒక్కసారిగా, ఉన్నపళాన
అరయు (క్రి) - చూడడం, వెతకడం, జాగ్రత్తగా గమనించడం
అరసిన - చూసిన
అర్జీ - పై అధికారులకు రాసే లేఖ, విన్నపం
అలమటించు(క్రి)- బాధపడడం
అల్లులు - ఆటలు
అవధానం - ఏకాగ్రత
అవని - భూమి
అవరోధం - అడ్డంకి, ఆటంకం
అవశ్యం - తప్పకుండా, తప్పనిసరిగా
అశ్వత్థామ - కృపి, ద్రోణుల కుమారుడు.
అశ్వమేధయాగం- ఒక రకం యాగం.
అసెంబ్లీ - శాసనసభ

### ఆ

ఆంతర్యం - మనసులోని విషయం
ఆకాంక్ష - కోరిక
ఆకాశవాణి - రేడియో ప్రసారాల సంస్థ
ఆకృతి - ఆకారం
ఆచరణీయం - చేయదగినది
ఆటపట్టు - నిలయం, చోటు
ఆతురత - తొందర
ఆత్మజుడు - కొడుకు
ఆత్రం - ఆతురత, బలీయమైన కోరిక
ఆది - మొదలు
ఆదరం - గౌరవం
ఆదేశం - ఆజ్ఞ
ఆపద - కష్టం
ఆపళంగా - ఉన్నట్టుండి, ఒక్కసారిగా
ఆపాదమస్తకం - తలనుంచి కాళ్లవరకు
ఆప్తులు - ఇష్టమైనవారు
ఆబాలగోపాలం - పిల్లల దగ్గరినుంచి పెద్దల వరకు
ఆర్జన - సంపాదన
ఆర్జించు (క్రి) - సంపాదించడం
ఆలోచనీయం - ఆలోచించాల్సినది
ఆవళి / ఆళి - వరుస, పంక్తి, సమూహం

© SCERT not to be republished

ఆవాసం - ఇల్లు, నివాసం
ఆవిష్కరణ - బయల్పరచడం
ఆస్వాదించు (క్రి) - అనుభవించడం
ఆహ్లాదంగా - ఆనందంగా

**ఇ**

ఇంద్రజాలం - కనుకట్టు విద్య, గారడి
ఇకో- లొకేషన్ శక్తి - ప్రతిధ్వనులు / ప్రకంపనలు గమనించే శక్తి
ఇక్షురసం - చెరుకురసం
ఇగురొత్తు (క్రి) - చిగురించడం
ఇరవు - స్థానం

**ఈ**

ఈడు - వయస్సు

**ఉ**

ఉత్తరాయణం - సూర్యుడు మకరరాశిలో ప్రవేశించిన దగ్గరినుంచి ఆరు నెలల కాలం
ఉదరాగ్ని - కడుపులోని మంట, ఆకలి మంట
ఉల్లము - మనసు
ఉల్లసిల్లు (క్రి) - ప్రకాశించడం, వికసించడం, సంతోషించడం

**ఎ**

ఎడ - చోటు, స్థానం
ఎన - సమానం
ఎరవు - అప్పు
ఎలరుపు - సంతోషం
ఏమఱుచు (క్రి) - వంచించడం, మోసంచేయడం
ఏమఱుపాటు - పరధ్యానం

**ఒ**

ఒండుచోట - వేరొకచోట
ఒడిగట్టు - పూనుకొను
ఒడుపుగా - సున్నితంగా, జాగ్రత్తగా, నేర్పుగా
ఒదరు/ఒదదు (క్రి)- సంభ్రమించడం, తిరగడం, వెళ్ళడం
ఒనర్చు - చేయు
ఒప్పు - ప్రకాశించు
ఒలుకు (క్రి) - చిందడం, కిందపడటం
ఒసగు (క్రి) - ఇవ్వడం
ఓలి - వరుస

**క**

కంకి - వెన్ను
కంబము - స్తంభం
కజ్జము - భక్ష్యం, తినుబండారం
కడు - ఎక్కువ, చాలా
కదనం - యుద్ధం
కనుదోయి - రెండు కళ్ళు
కన్నుమూయు (క్రి)- మరణించడం
కపి - కోతి
కపిల - ఎరుపు కలిసిన గోధుమ వన్నెగల గోవు, ఒక జాతి ఆవు
కబళించు (క్రి) - ఆక్రమించడం
కర్మ - చేసినపని, చేసిన దానికి ఫలితం, పాపం
కలిమి - సంపద
కలుగు - రంధ్రం, బొరియ
కలుషం - మురికి, పాపం
కల్ల - అబద్ధం, అసత్యం
కష్టార్జితం - కష్టపడి సంపాదించినది
కసవు - మేత
కాంతులీను (క్రి) - వెలుగును బయలుపరచడం లేదా వెదజల్లడం
కాంపౌండ్ - ప్రహారీగోడ
కాక - వేడి
కామం - కోరిక
కాయకష్టం - శరీర శ్రమ
కాలక్షేపం - సమయాన్ని (వృథాగా) గడపడం
కికురువొడుచు (క్రి) - వంచించడం, మోసంచేయడం
కీర్తించు (క్రి) - పొగడటం
కుంగదీయు (క్రి) - బాధపెట్టడం
కుజనులు - చెడ్డవాళ్ళు
కుడుచు (క్రి) - తినడం, భుజించడం, (పొదుగు నుంచి) పాలు తాగడం

కురుక్షేత్రం - కౌరవులూ, పాండవులూ యుద్ధం చేసిన ప్రదేశం.
కుఋచ - పొట్టి
కులభూషణుడు - వంశం మొత్తానికి అలంకారం లాంటివాడు, గొప్పవాడు.
కుసుమం - పువ్వు
కూపీ - రహస్యం, గుట్టు
కృతజ్ఞత - చేసిన మేలును మరచిపోకుండా ఉండటం
కృతవర్మ - భోజదేశపు రాజు, దుర్యోధనుని స్నేహితుడు.
కృపి - దయ
కృపుడు - కౌరవ పాండవులకు విలువిద్య నేర్పిన మొదటి గురువు.
కేబుల్ గ్రాం - విదేశాలకు పంపే టెలిగ్రాం
కేశపాశం - తల వెంట్రుకల కొప్పు
కొంకు - సందేహం
కొమరు - అందం
కొరగాని - అక్కరకురాని
కౌతుకం - కుతూహలం
క్రేపు - దూడ
క్రోడీకరించు(క్రి) - ఒకచోటికి చేర్చడం
క్రోధం - కోపం
క్రౌర్యం - క్రూరత్వం, ఇతరులను, బాధపెట్టే గుణం
క్షాత్రం - క్షత్రియధర్మం, వీరత్వం

గ

గంగడోలు - ఆవుమెడకింద వేలాడుతుండే చర్మం
గగనం - ఆకాశం
గర్భం - పొట్ట, కడుపు
గజం - ఏనుగు
గహ్వరం - గుహ
గారవం - గౌరవం
గున్న ఏనుగు - చిన్న / పిల్ల ఏనుగు
గుమ్మ - పాలు పిండేటప్పుడు వచ్చే ధార
గురిగి - మట్టితోచేసిన చిట్టి పాత్ర (కుండ)
గురు - పెద్ద, గొప్ప
గొషన్ (గొచన) - గలీబు; దిండ్లకు బొంతలకు వేసేతొడుగు

ఘ

ఘటించు - కలగజేయు
ఘట్టం - సంఘటన, సన్నివేశం
ఘన - గొప్పదైన
ఘనకార్యం - గొప్ప పని

చ

చండిమ - వాడిమి,
చక్రవర్తి - రాజులకు రాజు
చతురత్వం - చాతుర్యం, నేర్పు
చనుదెంచు - వచ్చు
చయ్యన - వెంటనే
చిందు (క్రి.) - ఒలకడం
చిత్తవిస్ఫూర్తి - మనోవికాసం
చిరజీవత్వం - ఎప్పుడూ ఉండటం
చివురు - లేత
చీటి - ఉత్తరం
చెండాడు (క్రి) - కొట్టడం / బాధించడం
చెంత - దగ్గర
చెర - ఖైదు, జైలు
చెలమ - ఎండిపోయిన వాగు, నది మొదలయినవాటిలో నీటికోసం చేసిన గొయ్యి
చెలువము - అందం
చేతము - మనసు
చేదోడు వాదోడు - చేతిసాయం, మాటసాయం
చేవ - శక్తి / బలం; చెట్టుమాను లో సారవంతమైన పదార్థం
ఛాయ - నీడ
ఛారిటీ షో - ఒక మంచి పనికి సహాయపడటానికి డబ్బుకొరకు ఇచ్చే ప్రదర్శన

జ

జనపదం - పల్లెటూరు
జనిత - పుట్టిన
జాగిలం - వేటకుక్క

© SCERT not to be republished

[illegible]యు (క్రి) - ఇవ్వడం
జాలువారు (క్రి) - ప్రవహించడం, కిందికి జారడం
జీవగడ్డ - చైతన్యంతో తొణికిసలాడుతున్న భూమి
జుంటీగలు - తేనెటీగలు
జ్ఞానేంద్రియాలు - కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం

## ట

టూకీగా - సంగ్రహంగా, సంక్షిప్తంగా

## త

తటాలున - ఒక్కసారిగా
తతంగం - ప్రక్రియ
తద్ద (యు) - అత్యంతం, ఎక్కువగా
తనరు - ఒప్పు, ప్రకాశించు, అతిశయించు, విజృంభించు
తనువు - శరీరం
తరంగం - అల / ధ్వని ప్రయాణం చేసే మార్గం
తరంగితం - అలలతో కూడినది
తలగడ - దిండు, తలకింది మెత్త
తలపు - ఆలోచన
తలము - పైభాగం
తల్లడిల్లు (క్రి) - బాధపడటం
తామసభావం - తమోగుణం; సోమరితనం మొ॥న లక్షణాలు
తార్కాణం - ఉదాహరణం, నిదర్శనం, రుజువు
తాల్మి - ఓర్పు
తిలకించు (క్రి) - చూడటం
తురుము (క్రి) - కొబ్బరి మొ॥న వాటిని సన్నగా గీకడం, పొడిగాచేయడం, తలలో పూలు మొ॥నవి పెట్టుకోడం
తెలిఱాయి - తెల్లరాయి
తెలుగునాడు - తెలుగునేల
తెల్లబోవు (క్రి) - ఆశ్చర్యపోవడం
తేజరిల్లు (క్రి) - ప్రకాశించడం
తోరము - అధికమైన, దట్టమైన, సాంద్రమైన
త్రచ్చు (క్రి) - మథించడం, చిలకడం
[illegible]ళ్ళు (క్రి) - పడటం
త్రోపాడు (క్రి) - తోయడం, తోసుకోడం

## ద

దంపతులు - భార్యాభర్తలు, ఆలుమగలు
దరహాసం - చిరునవ్వు
దారువు - కర్ర
దినకృత్యం - రోజూచేసే పని
దివ్యలోకం - దేవలోకం
దీప్తి - కాంతి
దురంతం - పెద్ద, చేయరాని, చేయకూడని
దురితం - పాపం
దురితదూర! - పాపాలను పోగొట్టేవాడా!
దైత్యులు - రాక్షసులు, దితి కుమారులు
ధరిత్రి - భూమి
ధీ - బుద్ధి
ధీ జడిమ - బుద్ధికున్న మందగొడితనం
ధీరుడు - ధైర్యవంతుడు
ధేనువు - ఆవు, గోవు

## న

నక్కి ఉండు (క్రి) - దాక్కొని ఉండటం
నయనాంచలం - కంటికొన
నల్గడలు - నాలుగు దిక్కులు
నిక్కము - నిజం
నిజావాసం - స్వస్థలం
నిర్విరామంగా - విశ్రాంతి లేకుండా
నిర్జీవంగా - ప్రాణం లేకుండా
నిశితం - చురుకైన
నృపుడు - రాజు
న్యూస్ పేపర్ - వార్తాపత్రిక

## ప

పక్కాగా - కచ్చితంగా
పజ్జ - దగ్గర, వెనక
పట్టాభిషేకం - కొత్తగా రాజును ఎన్నుకొన్నప్పుడు అతనికి ఆనవాయితీగా చేసే ఉత్సవం
పట్టి - సంతానం (కొడుకు / కూతురు)
పడతి, పడంతి - స్త్రీ

© SCERT not to be republished

పథం - మార్గం
పన్నిదము - పందెం
పరబ్రహ్మ - భగవంతుడు, దేవుడు
పరారీ - పారిపోయినవాడు
పరితృప్తి - సంతోషం
పరిమళం - సువాసన
పరిమాణం - కొలత
పరివృద్ధి - అభివృద్ధి
పల్లం - దిగువ ప్రాంతం, ప్రదేశం
పసిగట్టు (క్రి) - వాసనద్వారా గుర్తించడం
పాదపరాగం - కాలిదుమ్ము, పాదధూళి
పాదు - మూలం
పారావారం - సముద్రం
పాఱు (క్రి) - ప్రవహించడం, పరుగెత్తడం.
పాషాణం - రాయి
పుండరీకం - పులి, వ్యాఘ్రం
పుత్తడి - బంగారం
పునీతులు - పవిత్రమైనవాళ్ళు
పూరి - గడ్డి
పుష్కలం - ఎక్కువ
పైడి - బంగారం
పొడుచు (క్రి) - పైకివేయడం
పోలు (క్రి) - ఒప్పడం, తగి ఉండడం.
ప్రకంపన - కదలిక
ప్రజ్ఞ - తెలివి, నేర్పు, ప్రతిభ.
ప్రత్యక్షంగా - కంటికి ఎదురుగా
ప్రతిమ - విగ్రహం
ప్రమేయం - అవసరం
ప్రల్లదము - అబద్ధం
ప్రవేశించు (క్రి) - లోపలికి వెళ్ళడం
ప్రాచీన - పూర్వకాలానికి సంబంధించిన
ప్రాప్తించు (క్రి) - కలగడం, రావడం
ప్రాయశ్చిత్తం - పాపం పోవడంకోసం చేసే పని
ప్లే గ్రౌండ్ - ఆటస్థలం
ఫణి - పాము

**బ**

బంధుర - దట్టమయిన, తగిన
బడబానలం - సముద్రంలోని అగ్ని
బహుళ - అనేక రకాల
బాదరాయణుడు - వ్యాసుడు
బాలభానుడు - ఉదయిస్తున్న సూర్యుడు
బాసాడు (క్రి) - ప్రమాణం చేయడం
బీజం - విత్తనం
బుధులు - పండితులు
బేల్పరచి - మోసంచేసి
బోధించు (క్రి) - చెప్పడం
భంగము - అల, కెరటం
భయద - భయం కలిగించే
భాషణం - మాట
భీతి - భయం, బెదురు
భువి - భూమి, స్థానం
భూతకోటి - ప్రాణికోటి, ప్రాణుల సమూహం
భూప సభ - రాజసభ
భ్రమ - భ్రాంతి; లేనిది ఉన్నట్లుగా తోచడం

**మ**

మంజరి - గుత్తి, సమూహం
మకాం - నివాసం, బస
మగిడివచ్చు (క్రి) - తిరిగిరావడం
మణులు - రత్నాలు
మథనపడు (క్రి) - సతమతం కావడం
మదం - కొవ్వు; ఏనుగు కుంభస్థలం నుండి కారే ద్రవం; గర్వం.
మధురం - తీయనైనది
మధువు - తేనె
మమత్వం - 'నాది' అనే ఆలోచన, మోహం.
మహత్కార్యం - గొప్పపని
మహత్తర - గొప్ప
మహనీయుడు - గొప్పవాడు
మహీజం - చెట్టు
మానం - శీలం, గౌరవం
మార్గం - దారి

©SCERT not to be republished

మిట్టు (క్రి) - ఎగరడం
ముగ్ధులు - సంతోషించినవాళ్ళు
ముచ్చటగా - ముద్దుగా, చక్కగా
మునుపడగా - ముందుగా
ముమ్మరంగా - ఎక్కువగా
మెఱుగు - తళతళలాడే కాంతి
మేలు - మంచి, ఉపకారం
మైత్రి - స్నేహం
మొనయు (క్రి) - పూనడం, చేయడం
మొఱఁగికొని - నక్కి, దాక్కొని.
మొఱయు (క్రి) - మోగడం
మౌఖికం - ముఖం నుంచి వెలువడినది, మాట, పాట వంటివి
మ్యాగజైన్ - నిర్ణీత కాలవ్యవధిలో వచ్చే పత్రిక

**య**

యశము - కీర్తి

**ర**

రవము - అరుపు, ధ్వని.
రసాభాస - రసభంగం
రాజనాలు - ఒక రకమైన మేలిరకపు ధాన్యం
రాజసభావం - రజోగుణం; కోపం మొ॥న లక్షణాలు
ఱాలు - రాళ్ళు
రెమ్మ - పెద్ద కొమ్మకుండే చిన్న కొమ్మ
రేయి - రాత్రి

**ల**

లతిక - తీగ
లవణం - ఉప్పు
లసత్ - ప్రకాశించే
లెస్స - బాగా ఉన్నది
లోభి - పిసినారి

**వ**

వనం - అడవి
వరహా - ఒకప్పటి వాడుకలోని డబ్బు, ఒక నాణెం
వరలుట - వర్ధిల్లుట
వల్లరి - తీగ
వల్లవుఁడు - యాదవుడు, వంటవాడు.
వల్లెవేయించు - మళ్లీ మళ్లీ చెప్పించు
వసుధ - భూమి, అవని
వాంఛ - కోరిక
వాక్కు - మాట
వాటి - తోట
వాటి(క) - ప్రదేశం
వార్త - సమాచారం
వార్తకెక్కు (క్రి) - ప్రచారాన్ని పొందడం
వాస్తవం - నిజం
వికలం - విరగడం, కలత
విమల - స్వచ్ఛమైన
వ్యాఘ్రం - పులి, పుండరీకం.
వ్రాలు - సంతకం
వితరణి - దానశీలి
విత్తం - ధనం
విద్వాంసుడు - పండితుడు
విధాతృడు, విధాత - బ్రహ్మ
వినాశం - నాశనం
వినిర్గతం - బయలు వెడలినది
విపినం - అడవి
విపుల - విస్తరించిన
విప్లవం - విశేషమైన మార్పు
విభిన్న - వేరు వేరు
విమల - పవిత్రమైన, నిర్మలమయిన
విరాళం - చందా
విలసితము - ప్రకాశితం, పెంపొందింపజేసినది,
విలసిల్లు (క్రి) - పెంపొందు, ప్రకాశించు
విశదంచేయు (క్రి) - వివరించడం
విస్తరించు (క్రి) - వ్యాపించడం
వీనులవిందు - చెవులకింపు కలిగించేది
వృద్ధులు - ముసలివారు
వృషము - ఎద్దు, వృషభం
వేదశాఖలు - నాలుగు వేదాలు, వేదాలలోని శాఖలు

© SCERT not to be republished

శ

శపథం - ప్రమాణం, ఒట్టు
శార్దూలం - పులి
శాశ్వతుడు - ఎప్పుడూ ఉండేవాడు
శిలాతటి - పెద్దపెద్ద రాళ్లున్న ప్రదేశం
శిల్పవిద్యానిధి - శిల్పవిద్యలో ఆరితేరినవాడు
శిల్పికంఠీరవా! - శిల్పులలో గొప్పవాడా!
శౌర్యచండిమ - పరాక్రమతీవ్రత
శోకం - ఏడుపు, రోదన
శ్రీలు - సంపదలు
శ్రుతులు - వేదాలు
శ్రేణి - వరస
శ్రేష్ఠం - ఉత్తమం, గొప్పది

ష

షరతు - నియమం, నిబంధన

స

సంక్షేమం - మేలు, మంచికోసం చేసే సహాయం
సంకేతం - గుర్తు, చిహ్నం
సంగ్రామం - యుద్ధం
సంస్తవనీయుడు - పొగడదగినవాడు
సంశయం - సందేహం
సఖులు - స్నేహితులు, చెలికత్తెలు
సజ్జనులు - మంచివారు
సత్యసూక్తి - మంచిమాట
సత్వరం - వెంటనే
సదృశం - సమానం, తగినది.
సదా - ఎప్పుడూ
సమరం - యుద్ధం
సమష్టి - సమస్తం, మొత్తం
సమీపం - దగ్గర
సమృద్ధి - నిండుగా ఉండడం
సమ్మోదము - సంతోషం
సాత్యకి - శ్రీకృష్ణుని స్నేహితుడు, వృష్ణివంశ యోధుడు.
సాధువాదములు - మెచ్చుకోలు మాటలు, ప్రశంసలు
సాయుధ దళాలు - ఆయుధాలు ధరించిన సైనికుల బృందాలు
సావధానంగా - ఏకాగ్రతతో
స్నిగ్ధ - మచ్చలేని, స్వచ్ఛంగా ఉన్న
సీమ - ప్రదేశం, హద్దు, ఎల్ల
స్వీకరించు (క్రి) - తీసుకోవడం
సుగమం - సులభంగా తెలిసేది, లేదా వెళ్ళగలిగినది
సుగుణం - మంచి స్వభావం, లేదా లక్షణం
సునామి - పెద్ద ఉప్పెన
సుభటకోటి - గొప్పసేన
సుభాషిణి - చక్కగా మాట్లాడేది
సుభిక్షం - కరువు కాటకాలు లేకుండా ఉండటం
సురభి - కామధేనువు
సురులు - దేవతలు
సెగ - మంట ఇచ్చే వేడి
సేవించు (క్రి) - సేవచేయడం
సోగకన్నులు - పొడుగాటి కన్నులు
స్థితప్రజ్ఞుడు - స్థిరమైన మంచిబుద్ధి గలవాడు
స్నిగ్ధం - సుకుమారం

హ

హరిత్తు - సింహం
హర్షం - ఆనందం
హాని - కీడు, చెడు
హితైషిణి - మేలుకోరేది / శ్రేయోభిలాషిణి
హేతువు - కారణం

© SCERT not to be republished